SUNDAY Special
ఆదివారం 16-11-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 8.00
సంపుటి: 18
సంచిక: 235

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

శుభం కార్డు నేడే?
కోల్‌కతా టెస్టులో బౌలర్ల హవా కొనసాగింది. రెండో రోజు ఏకంగా 15 వికెట్లు పడ్డాయి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 189 ఆలౌట్. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 93/7. 63 పరుగుల ఆధిక్యంలో దక్షిణాఫ్రికా.
12 లో

ఆట, పాట గెలిచాయి
మాటర్ శ్రేయసి సింగ్, స్టార్ సింగర్ మైథిలీ ఠాకూర్ రాజకీయాల్లోకి అడుగు పెట్టిన కొత్తలో..'ఆడినంత, పాడినంత సులువు కాదు' అన్నారు విమర్శకులు. అయితే వీరిద్దరూ ఆడి, పాడినంత తేలిగ్గా బిహార్ ఎన్నికల్లో విజయం సాధించారు.
11 లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



యోధులను విస్మరించారు
కాంగ్రెస్ మన గిరిజన యోధులను ఏనాడూ పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు.
వివరాలు 6లో ▸

'ఆహారం'పై టారిఫ్‌లు రద్దు
విదేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే పలు ఆహార ఉత్పత్తులపై టారిఫ్‌లు రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.
వివరాలు 6లో ▸

తప్పుకుంటున్నా..
రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు, కుటుంబ సంబంధాలు తెంచుకుంటున్నట్టు లాలు కుమార్తె రోహిణి తెలిపారు.
వివరాలు 6లో ▸

పని చేయకున్నా జీతాలివ్వాలా?
కష్టపడకుండా తెల్ల ఏనుగులా మారితే ఎలా?
విశాఖ ఉక్కు కార్మికులపై రెచ్చిపోయిన సీఎం చంద్రబాబు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీకు ఎన్నిసార్లు డబ్బులివ్వాలి?
పబ్లిక్ సెక్టార్‌లో ఉంటూ బెదిరిస్తారా?
ఒక కెమికల్ కంపెనీలో ఇలానే చేస్తే పీడీ యాక్ట్ పెట్టి దారిలోకి తీసుకొచ్చా.. అన్ని కంపెనీలు లాభాల్లో ఉంటే విశాఖ స్టీల్ ఒక్కటే ఎందుకు నష్టాల్లో ఉంది?
గోల్డ్ మైన్ లాంటి కంపెనీని మీరంతా కలిసి నష్టాల్లోకి నెట్టేశారు.. పక్కనే కొత్త స్టీల్ ప్లాంట్ వస్తోంది.. అది లాభాల్లో నడుస్తుంది చూడండి
2 లో
మిట్టల్ స్టీల్ కోసం ప్రధానిపై ఒత్తిడి చేసి ముడి ఇనుము సరఫరా చేయిస్తున్నా.. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటివి ఎన్నో చూశానని మండిపాటు
ముఖ్యమంత్రి వ్యాఖ్యలు దుర్మార్గం, కుట్రపూరితమంటూ కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం

ఇకపై ఉత్పత్తి లక్ష్యాల ప్రకారమే జీతాలు
2లో
- విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వింత షరతు
- గతంలో ఎన్నడూ సాధించని లక్ష్యాలను ముందుంచి.. వాటికి అనుగుణంగా జీతాలిస్తామంటున్నారని ఉద్యోగుల ఆగ్రహం

ఇవి సీరియస్ ఎంవోయూలు
2లో
- మూడేళ్లలోనే ఈ ఒప్పందాలన్నీ అమల్లోకి వస్తాయి
- రెండు రోజుల సమావేశాల్లో 613 ఎంఓయూల ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు
- 18 నెలల్లో రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం
- మీడియాతో సీఎం చంద్రబాబునాయుడు

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న సీజేఐ
3లో
అనంతరం విజయవాడకు చేరుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

సీఐ సతీష్ మృతిపై వీడని మిస్టరీ!
టీటీడీ మాజీ ఏవీఎస్‌వో సతీష్ మృతి కేసును ప్రత్యేకంగా విచారిస్తున్న సీఐడీ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్

ఘటనా స్థలిలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తున్న రవిశంకర్ అయ్యన్నార్

- గురువారం రాత్రి 11.53కు రైల్వేస్టేషన్‌లో బైక్ పార్క్ చేసిన సతీష్.. సీసీ ఫుటేజీలో రికార్డు
- రైలు డోర్ నుంచి కిందపడినట్లు స్పష్టం చేస్తున్న సీన్
- ఆ తర్వాత తల రాయికి తగిలి దొర్లుకుంటూ వెళ్లినట్లు ఆనవాళ్లు గుర్తించిన పోలీసులు.. ఘటన జరిగిన వెంటనే పోలీసులు ఆయన ఇంటిని ఎందుకు చుట్టుముట్టారు?
- సతీష్ భార్య ఫోన్‌ను ఎందుకు లాక్కున్నారు?
- పోస్టుమార్టం రిపోర్టును ఎందుకు బయట పెట్టలేదు?
- సందేహాలు నివృత్తి కాకుండానే హత్య కేసు ఎలా పెట్టారు?.. హత్య అని చెప్పడానికి ఎందుకంత తాపత్రయం?

10 లో

న్యూస్‌రీల్
కిడ్నీ రాకెట్ ముఠా అరెస్ట్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర చెప్పారు. అరెస్టయిన వారిలో అన్నమయ్య జిల్లా ప్రభుత్వాస్పత్రుల సేవల సమన్వయకర్త కె.ఆంజనేయులు ఉన్నారు.
వివరాలు 5లో ▸

మద్యం అక్రమ కేసులో అనిల్ చోఖ్రాకు రిమాండ్

మద్యం అక్రమ కేసులో ఎ–49గా ఉన్న ముంబైకి చెందిన అనిల్ చోఖ్రాను సిట్ అధికారులు అరెస్టు చేశారు. శనివారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఈనెల 21 వరకు రిమాండ్ విధించడంతో విజయవాడ జైలుకు తరలించారు.
వివరాలు 3లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు
12 గుడ్ల రిటైల్ ధర ₹84
ఫారం వద్ద లైవ్ బర్డ్ 115
డ్రెస్డ్ స్కిన్‌తో 206
రిటైల్ లైవ్ బర్డ్ 142
స్కిన్ లెస్ 234
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీ చేయడమైనది

అమరావతి గురించి అడిగితే హైదరాబాద్‌ను డెవలప్ చేశానని అంటున్నాడ్సార్

నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో పేలుడు దృశ్యాలు

ఠాణాలో పేలుడు
9 మంది దుర్మరణం.. 32 మందికి గాయాలు
జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తూ ఘటన
'ఫరీదాబాద్' పేలుడు పదార్థాల శాంపిళ్లను సేకరించే క్రమంలో దుర్ఘటన
ఇది ఉగ్రదాడి అంటూ వచ్చినవన్నీ వదంతులే: డీజీపీ నళిని ప్రభాత్
6 లో

టీడీపీ గూండాల విధ్వంసకాండ

హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి
ఫర్నిచర్, వైఎస్సార్ విగ్రహం, దేవుళ్ల చిత్రపటాల ధ్వంసం
ఇద్దరికి గాయాలు.. అవినీతిని ప్రశ్నిస్తున్నారని భయోత్పాతం సృష్టించేందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ డైరెక్షన్‌లోనే దాడి?
ఘటనాస్థలంలోనే ఉన్నా అడ్డుకోని పోలీసులు
వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన
5 లో

హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై బండ రాళ్లతో దాడి చేస్తున్న టీడీపీ గూండాలు.. ధ్వంసమైన కార్యాలయం లోపలి భాగం

ఇది ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రతి పౌరుడిపై జరిగిన దాడి
5 లో

- వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి అనాగరిక చర్య
- పోలీసులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- చంద్రబాబు అండతోనే టీడీపీ నేతలు, మూకలకు ధైర్యం
- ప్రత్యర్థి పార్టీల ప్రాథమిక హక్కులను రక్షించలేని సర్కార్‌కు పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం

నెలరోజుల్లో ఐదు శిశు మరణాలు
- అల్లూరి జిల్లా దార్రెల పంచాయతీలో వరుస ఘటనలు.. ఆందోళన చెందుతున్న గిరిజనులు
- చిన్నారుల్లో శ్వాస సంబంధిత సమస్యలు
- పుట్టిన కొద్ది నెలలకే పసికందుల మరణాలపై తల్లిదండ్రుల ఆందోళన

3 లో
దార్రెల పంచాయతీ చీవుకుచింతలో మరణించిన పసికందు

'ఐబొమ్మ' రవి దొరికాడు

ఐబొమ్మ, బప్పం, ఇరాదే పేర్లతో వెబ్‌సైట్లు నిర్వహిస్తూ సినిమాలను పైరసీ చేస్తున్న కూకట్‌పల్లి వాసి ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఐబొమ్మ పేరుతో 70 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.
3 లో

ఓట్లు వచ్చినా సీట్లు రాలే!

6లో
బిహార్ ఎన్నికల్లో 23 శాతం ఓట్లు సాధించిన ఆర్జేడీ
143 స్థానాల్లో పోటీ చేసి 25 సీట్లకు పరిమితం
బీజేపీ, జేడీ(యూ) కంటే తేజస్వీ పార్టీకి ఎక్కువ ఓట్లు

చిన్న అనారోగ్యంతో వెళ్తే ప్రాణాలు పోయాయి
- కాకినాడ జీజీహెచ్‌లో 20 ఏళ్ల యువతి మృతి
- హెర్నియా సర్జరీ చేస్తుండగా సీరియస్
- ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆపరేషన్ టేబుల్ మీదే ఏదో జరిగిందంటూ ఫైర్

కవిత (ఫైల్)
- వివరాలు 14లో

అరకు @7 డిగ్రీలు

చలి తీవ్రత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 3 రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల నుంచి 5 డిగ్రీల మేర పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. అల్లూరి జిల్లా అరకులో శనివారం కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు పడిపోయింది.
14లో

అప్పుడే అమర్చి వెంటనే పేల్చాడా?
ఎర్రకోట పార్కింగ్ స్థలంలో బాంబు తయారుచేశాడా?
3 గంటలు అక్కడే ఉన్నప్పుడు వారిని ఎవరైనా చూశారా?
చుట్టుపక్కల వాహనాల డ్రైవర్లు, యజమానులను ప్రశ్నిస్తున్న అధికారులు... మరో ఇద్దరు వైద్యులుసహా ముగ్గురి అరెస్ట్
6లో

ఉమర్ నబీ

క్లుప్తంగా...

గొప్ప మానవతావాది సూపర్ స్టార్ కృష్ణ

మాజీ సీఎం వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. 'తెలుగు సినీ పరిశ్రమకు నూతన పంథాలు చూపించి, కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ. ఎప్పుడూ కొత్తదనాన్ని అన్వేషించిన ప్రయోగశీలి ఆయన. తెలుగు సినీ పరిశ్రమలో ఎంతోమందిని ఆదుకున్న గొప్ప మానవతావాది. కృష్ణ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అని వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

'పర్యాటకం'లో 104 ఒప్పందాలు

మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

సాక్షి, అమరావతి: సీఐఐ సమ్మిట్‌లో పర్యాటక రంగంలో రూ.17,973 కోట్ల విలువైన 104 ఒప్పందాలు చేసుకున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో 10,690 గదులు ఏర్పాటవుతాయన్నారు. ప్రత్యక్షంగా 34,406, పరోక్షంగా 63,470 కలిపి 97,876 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. తొలిసారిగా రూ.1,860 కోట్ల విలువైన పర్యాటక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయన్నారు. పర్యాటక పెట్టుబడిదారులతో జరిగిన ప్యానల్ సెషన్‌లో పెట్టుబడులపై ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండి ఆమ్రపాలి కాటలతో కలిసి ఇన్వెస్టర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. అంతర్జాతీయంగా రాకపోకలకు వీలుగా రాష్ట్రంలో విమానాశ్రయాలు నెలకొల్పుతుండటంతో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్స్ (మైస్) క్యాపిటల్ ఆఫ్ ది సౌత్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఈ క్రమంలో లాజిస్టిక్ హబ్‌గా విశాఖ నిలవనుందన్నారు. గడిచిన 15 నెలల కాలంలో దాదాపు రూ.12వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు తెలిపారు.

సీఐఐ సదస్సు ప్రాంగణంలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రధాన వేదిక పక్క హాల్‌లో మంటలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో రెండ్రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో అపశృతి చోటుచేసుకుంది. ముగింపు రోజైన శనివారం ఉదయం సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు, పారిశ్రామికవేత్తలు ఉన్న ప్రధాన వేదిక ఏపీ పెవిలియన్ హాల్–5 పక్కనే ఉన్న హాల్–4లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన ఈ మంటలను నిర్వాహకులు వెంటనే గుర్తించారు. అక్కడే ఉన్న అగ్నిమాపక సిబ్బంది, భద్రతా సిబ్బంది కలిసి వెంటనే మంటల్ని అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. పొగలు కమ్ముకోవడంతో.. ప్రతినిధులుగా వచ్చిన విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు.

పవన్ ఎక్కడ?

సీఐఐ సమ్మిట్‌లో కనిపించని ఉప ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో రెండ్రోజులపాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమవుతోంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఎన్నోరోజుల ముందే షెడ్యూల్ తెలిసినా.. పెద్దఎత్తున ప్రచారం చేసినా ఆయన సదస్సుకు గైర్హాజరవడం హాట్‌టాపిక్‌గా మారింది.

బంగారం వ్యాపారిపై టీడీపీ కౌన్సిలర్ దాడి

ప్రొద్దుటూరులో ఘటన

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఒక టీడీపీ కౌన్సిలర్ రౌడీమూకలను వెంటపెట్టుకొని బంగారం వ్యాపారిపై దాడికి పాల్పడ్డ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆస్పత్రి పాలయిన బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కోనేటికాల్వ వీధికి చెందిన షేక్ షర్ఫుద్దిన్‌బాషా మోక్షగుండం వీధిలో బంగారు అంగడి నిర్వహిస్తున్నాడు. దుకాణంలో ఉండగా టీడీపీ కౌన్సిలర్ వైఎస్ మహమ్మద్‌గౌస్ రౌడీ మూకలతో వచ్చి షెట్టర్ మూసేసి దాడికి పాల్పడ్డాడు. డబ్బు బాకీ ఉన్నాడనే కారణంతో ఈ దాడికి పాల్పడినట్లు బాషా పేర్కొన్నారు. అయితే తాను ఎవరికీ బాకీ లేనని కూడా తెలిపారు. తనపై దాడి చేసే దృశ్యాలను స్థానికులు సెల్‌ఫోన్లలో వీడియో తీస్తుంటే అక్కడున్న గౌస్ మనుషులు ఫోన్లను లాక్కొని వారిని బెదిరించారని తెలిపారు. గతంలో ఆర్థిక లావాదేవీల విషయంలో తాను గౌస్ తండ్రి మహమూద్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కారణంగా గౌస్ తనపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇటీవల దాడులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. దీనిపై రెండు నెలల క్రితం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా తగిన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజా ఘటనపై పోలీసు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు.

పని చేయకున్నా జీతాలివ్వాలా?

విశాఖ ఉక్కు కార్మికులపై రెచ్చిపోయిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి/ సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు కార్మికులపై సీఎం చంద్రబాబు నోరు పారేసుకున్నారు. ఏ పనీ చేయకుండా పడుకొని జీతాలు ఇవ్వమంటే ఎలా సాధ్యమవుతుందని మండిపడ్డారు. 'మేం పని చేయం.. అయినా కేంద్రం, రాష్ట్రం డబ్బులు ఇవ్వాలంటే కుదరదు' అంటూ రెచ్చిపోయారు. శనివారం సీఐఐ పెట్టుబడుల సమావేశ వివరాలు తెలియజేయడానికి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓ విలేకరి విశాఖ స్టీల్ పరిశ్రమ పరిస్థితిపై ప్రశ్న అడగ్గానే చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా వస్తున్న ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను మెచ్చుకుంటూ కార్మికుల వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నష్టాలు వస్తున్నాయంటూ శివాలెత్తారు. దేశ వ్యాప్తంగా అన్ని స్టీల్ ప్లాంటులు లాభాల్లో నడుస్తుంటే ఒక్క వైజాగ్ స్టీల్ మాత్రమే ఎందుకు నష్టాల్లో నడుస్తోంది.. ఇందుకు మీరు బాధ్యులు కారా అంటూ నిలదీశారు. 'ఇప్పటికే రూ.12,000 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించాం.. ప్రాపర్టీ ట్యాక్స్ వదులుకున్నాం.. సెక్యూరిటీలిచ్చాం.. ఇలా ప్రతిసారి పని చేయం.. అయినా డబ్బులు ఇవ్వాలంటే ఎలా? ఎన్నిసార్లు డబ్బులివ్వాలి మీకు? ఇది ట్యాక్స్ పేయర్స్ మనీ.. మనం కష్టపడి పని చేయాలి.. పని చేయకుండా తెల్ల ఏనుగులా మారితే ఎలా?' అని అన్నారు.



పక్కనే కొత్తగా మరో స్టీల్ ప్లాంట్ వస్తోందని, అది లాభాల్లో నడుస్తుంది చూడండని చెప్పారు. ' పబ్లిక్ సెక్టార్ కంపెనీలో ఉండి బెదిరిస్తే ఎలా? ఇలాగే ఈ మధ్య ఒక కెమికల్ కంపెనీలో చేస్తే వెంటనే పీడీ యాక్ట్ తీసుకొచ్చి వారిని దారిలోకి తెచ్చా' అని విశాఖ కార్మికులను హెచ్చరించారు. ఇక నుంచి ప్రతి 3 నెలలకోసారి విశాఖ స్టీల్‌పై సమీక్షిస్తానని, 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వాటిని ఎన్నో చూశానన్నారు. విశాఖ స్టీల్ కార్మికులు పద్ధతి మార్చుకోకపోతే కంపెనీ వేరే రాష్ట్రాలకు పోతుందన్నారు.

మిట్టల్ స్టీల్‌పై ప్రేమ

ఒకవైపు విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ప్రశ్న అడిగిన విలేకరిపై నువ్వు చదువుకున్నవాడివేనా అంటూ ఎగతాళి చేస్తూ విశాఖ స్టీల్ కార్మికులపై ఒంటికాలిపై లేచిన చంద్రబాబు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌పై తనకున్న అవ్యాజ ప్రేమను పలుమార్లు వ్యక్తం చేశారు. లోకేశ్ మాట్లాడి ఈ కంపెనీని రాష్ట్రానికి తీసుకొచ్చాడన్నారు. ఈ కంపెనీకి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ముడి ఇనుమును లారీల ద్వారా సరఫరా చేస్తానంటే మిట్టల్ స్టీల్ గొట్టాలు (స్లరీ) ద్వారా సరఫరా చేయాలని కోరిందని చెప్పారు. అయితే దీనిపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో తాను స్వయంగా మాట్లాడినా పనికాకపోతే.. ప్రధాని మోదీని కలిసి ఒకటికి రెండుసార్లు గట్టిగా చెప్పి పనిచేయించానని తెలిపారు. చరిత్రలో ఎక్కడా జరగనంత వేగంగా అన్ని అనుమతులు మంజూరు చేయించామన్నారు. ఈ కంపెనీ త్వరలోనే లాభాల్లోకి వస్తుందంటూ కితాబు ఇచ్చారు.

చంద్రబాబు వ్యాఖ్యల వీడియో కోసం ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చంద్రబాబు బుకాయిస్తున్నారు

స్టీల్ ప్లాంట్ విషయంలో సీఎం చంద్రబాబు బుకాయిస్తున్నారు. ఇది చాలా దుర్మార్గం, కుట్రపూరితం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.12,500 కోట్లలో కార్మికుల సంక్షేమానికి 10 రూపాయలు కూడా ఉపయోగించలేదు. ఆ డబ్బులు మొత్తం బ్యాంకులకు కట్టడానికే సరిపోయాయి. పరిశ్రమ నడుస్తున్నప్పుడు ఎవరూ ప్రశ్నించరు. ప్రభుత్వం చేయకపోతేనే అడుగుతారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులకు జీతాలు ఆగలేదు. ఇప్పుడు నడవడం లేదు కాబట్టి అడుగుతున్నాం. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని ఒక పక్క కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. చంద్రబాబు బుకాయిస్తే ఎలా? ఎంపీలు అడిగితే ప్రైవేటీకరణ చేస్తామని రాత పూర్వకంగా చెబుతోంది. తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ నుంచి తప్పిస్తామని మీరు మా నిరసన టెంట్‌వద్దకు వచ్చి చెప్పలేదా? ఇప్పుడు ఆ హామీని ఎందుకు నిలబెట్టుకోవడం లేదు? ముడిసరుకు పూర్తి స్థాయిలో ఇస్తే ప్రభుత్వాలను డబ్బులు అడగాల్సిన అవసరం లేదు. గనులు లేవు కాబట్టి ఉత్పత్తి తగ్గుతోంది.

– డి.వి.రమణారెడ్డి, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి

కార్మికులపై నెపం నెట్టడం తగదు

స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి రాకపోవడానికి కార్మికులు కారణం కాదు. ప్రభుత్వ, యాజమాన్య విధానాల వల్ల మాత్రమే ఈ పరిస్థితి తలెత్తింది. పరిశ్రమలో 45 రోజులకు సరిపడా ముడి సరుకు నిల్వ ఉండాలి. ఈరోజు లైమ్ లేకపోవడం వల్ల ఉత్పత్తి ఆపుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి కారణం ఎవరన్నది చంద్రబాబే చెప్పాలి. దీనికి నూరు శాతం యాజమాన్యానిదే బాధ్యత. ప్లాంట్‌లో మెషినరీ పాతదైపోయింది. మరమ్మతులకు సంబంధించి స్పేర్ పార్ట్స్ కూడా ఇవ్వడం లేదు. ఉత్పత్తి కోసం యాజమాన్యం, ప్రభుత్వం ప్లానింగ్ చేయాలి. అది మానేసి కార్మికులపై తోసేయడం సరికాదు.

– జె.అయోధ్యరామ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి

వైట్ ఎలిఫెంట్‌తో పోల్చడం తగదు

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను చంద్రబాబు వైట్ ఎలిఫెంట్ (తెల్ల ఏనుగు)తో పోల్చడం ఆయన స్థాయికి తగదు. ఈ పరిశ్రమ లక్ష కోట్ల రూపాయలు ఈ దేశానికి చెల్లించి ఉపయోగపడింది. సొంత గనులు లేకపోయినా లాభాలు సాధించింది. పథకం ప్రకారం ఈ కంపెనీని నీరుగార్చుతున్నారు. ఈ సమయంలో చంద్రబాబు ఈ ప్రకటన చేయడం కార్మికులను కించపరచడమే. దేశంలో నష్టాలు వచ్చిన అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమలకు రూ.వేల కోట్ల సహాయం చేశారు. భద్రావతి, సేలం, బిలాయ్ స్టీల్ ప్లాంట్‌లకు రూ.65 వేల కోట్లు ప్యాకేజీ ఇచ్చారు. సొంత మైన్స్ ఉన్నప్పటికీ అవి 30 ఏళ్ల నుంచి నష్టాల్లోనే ఉన్నాయి. మైన్స్ లేకుండా లాభాల్లో ఉన్న కంపెనీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఒక్కటే. వరుసగా అందరినీ ఇళ్లకు పంపిస్తూ ఇలా మాట్లాడటం భావ్యం కాదు. – డి.ఆదినారాయణ, ఉక్కు గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి

ప్లాంట్‌ను చంపేయాలని చూస్తున్నారు

విశాఖ స్టీల్ ప్లాంట్ 3 మిలియన్ టన్నుల స్థాయి ఉన్నప్పుడు బ్రహ్మాండమైన ఉత్పత్తిని సాధించి రూ.12 వేల కోట్ల రిజర్వ్ ఫండ్ ఉండేది. ఆ తర్వాత విస్తరణకు తీసుకెళ్లాం. కేంద్రానికి రూ.50 వేల కోట్ల పన్నులు చెల్లించాం. ఇంత మొత్తంలో ఏ ప్రైవేట్ సంస్థ కట్టింది? రాష్ట్రానికి, కేంద్రానికి పన్నులు, జీఎస్‌టీలు నిరంతరం వెళ్లాయి. ఈ కంపెనీ ప్రగతిపై, ఉత్పత్తిపై కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రణాళికంటూ లేదు. ఉన్న ప్రణాళికల్లా ఈ కంపెనీని ఎలా చంపేయాలని చూడటమే. కార్మికుల సంఖ్య 20 వేల నుంచి 10 వేలకు తగ్గించారు. కార్మికులు అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారు. ఈ విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన వారెవరో చంద్రబాబు బయట పెట్టాలి. అసలు విశాఖ ప్లాంట్‌కు ఎందుకు మైన్స్ అడగడం లేదు?

– మంత్రి రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ చీఫ్ ప్యాట్రన్

చంద్రబాబు గాలి కబుర్లు మానుకోవాలి



స్టీల్ ప్లాంట్ విషయంలో చంద్రబాబు తప్పుడు మాటలు మానుకోవాలి. కేంద్రం నుంచి రూ.12 వేల కోట్లు తీసుకొచ్చాననడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. రూ.12 వేల కోట్లు ఎవరికిచ్చారు? అలాగైతే స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఎందుకు ఇవ్వలేదు? స్టీల్ ప్లాంటుపై చంద్రబాబు ఇలాంటి గాలి కబుర్లు మానుకోవాలి. చిత్తశుద్ధి ఉంటే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి. – జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ జాతీయ నేత

ఇవి సీరియస్ ఎంఓయూలు

మూడేళ్లలోనే ఈ ఒప్పందాలన్నీ అమల్లోకి వస్తాయి

- రెండ్రోజుల సమావేశాల్లో 613 ఎంఓయూల ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు
- 18 నెలల్లో రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం
- రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చాం
- పరిశ్రమల బకాయిలన్నీ చెల్లించేశాను
- మీడియాతో సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి : సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈసారి చాలా సీరియస్ ఒప్పందాలు కుదుర్చుకున్నామని, వచ్చే మూడేళ్లలో వీటిని అమల్లోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రెండ్రోజుల పాటు విశాఖలో జరిగిన ఈ సదస్సులో 613 ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా రూ.13,25,716 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామన్నారు. వీటి ద్వారా 16,31,188 ఉద్యోగాలు రానున్నాయని శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరించారు. 18 నెలలో కాలంలో రూ.21 లక్షల కోట్లకు పైగా ఒప్పందాలను కుదుర్చుకోవడమే కాక.. ఇందులో ఇప్పటికే రూ.8.8 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులను మంజూరుచేసినట్లు ఆయన చెప్పారు. ఈ సదస్సులో నాలుగు వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారని, ఇందులో 640 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నట్లు తెలిపారు. రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడుల్లో అధిక భాగం ఇంధన రంగం నుంచి వచ్చాయన్నారు. ఈ రంగంలో రూ.5,33,351 కోట్ల పెట్టుబడులు వస్తే పరిశ్రమల రంగానికి రూ.2,80,384 కోట్లు, మౌలిక వసతుల రంగానికి రూ. 2,01,758 కోట్లు వచ్చాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల బకాయిలన్నీ చెల్లించేశామన్నారు. వచ్చే ఏడాది ఇదే తేదీల్లో తిరిగి పెట్టుబడుల సదస్సును నిర్వహించనున్నట్లు చంద్రబాబు తెలిపారు.

మినీ వరల్డ్‌గా శ్రీసిటీ..

అంతకుముందు.. సదస్సు రెండోరోజైన శనివారం వివిధ కార్యక్రమాలతో పాటు ఆ తర్వాత జరిగిన సదస్సు ముగింపు సమావేశంలోనూ చంద్రబాబు మాట్లాడుతూ.. శ్రీసిటీని ఒక మినీ వరల్డ్‌గా తీర్చిదిద్దుతామని, ఇందుకోసం మరో 6,000 ఎకరాల భూమిని కేటాయించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం శ్రీసిటీలో 30కి పైగా వివిధ దేశాల కంపెనీలున్నాయని, వీటిని రెండేళ్లలో 50 దేశాలకు పెంచాలన్నారు. కియా దగ్గర్లోనే రేమాండ్స్ సంస్థ ఆటో కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటును ఏర్పాటుచేయబోతోందన్నారు. ఇక 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని వచ్చే 3–4 ఏళ్లలోనే చేరుకుంటామని సీఎం చెప్పారు. వచ్చే ఏడాది నవంబరులో విశాఖలోనే జరిగే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు వచ్చిన వారికి అరకు, గిరిజన అందాలను చూపిస్తామని ఆయనన్నారు. ఈ సమ్మిట్‌లో ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా నెరవేరుస్తానన్నారు. ఇక రెండ్రోజుల పెట్టుబడుల సమావేశాలు విజయవంతమయ్యాయని.. దావోస్ తరహాలో సీఐఐ ఈ సదస్సును నిర్వహించిందన్నారు. మరోవైపు.. భాగస్వామ్య సదస్సు నుంచి రేమాండ్ ప్రాజెక్టులకు చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే, శ్రీసిటీలో ఏర్పాటైన ఐదు కంపెనీలను ప్రారంభించారు. దీంతోపాటు.. శ్రీసిటీలో కంపెనీల ఏర్పాటు నిమిత్తం వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.



ఎల్జీ కెమ్ ప్రతినిధితో సీఎం చంద్రబాబు

ఏఐ వర్సిటీ ఏర్పాటులో భాగస్వామ్యంకండి!

అబుదాబి తరహాలో రాష్ట్రంలోని కృత్రిమ మేధ (ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని.. ఇందులో భాగస్వామ్యం కావాలని ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబిలిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జొకోను సీఎం చంద్రబాబు కోరారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు శనివారం ముఖ్యమంత్రి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. కాకినాడ, మూలపేటల్లో ఎల్జీ కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకు రావాలని చంద్రబాబు ప్రతిపాదించారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించే అంశాలపై ఇఫ్కో చైర్మన్ దిలీప్ ననూభాయ్ సంఘానీతో చర్చించారు.

రిషికొండలో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్..

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, ప్రీమియం లగ్జరీ హోటల్ పోర్ట్‌ఫోలియో విస్తరణ అంశాలపై గ్లోబల్ హాస్పిటాలిటీ గ్రూప్ అట్మాస్పియర్ కోర్ దక్షిణాసియా ఎండీ సౌవగ్య మహాపాత్ర, గ్రూప్ ఎండీ సలీల్ పాణిగ్రాహితో సీఎం చర్చించారు. తిరుపతి, విశాఖపట్నం, అమరావతిలో అట్మాస్పియర్ కోర్ చేపట్టిన ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తిచేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. గండికోటలో అడ్వెంచర్ రిసార్ట్స్, అరకు–అనంతగిరిలో హిల్ రిసార్ట్స్ ఏర్పాటు, బొబ్బిలి–విజయనగరం కోటలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సీఎం కోరారు. రిషికొండలో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్ నిర్మించేందుకు అట్మాస్పియర్ కోర్ ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. విశాఖ–కాకినాడ–భీమునిపట్నం పోర్టుల నుంచి క్రూయిజ్ టూరిజం సేవలు అందించడంపై కోర్డెలియా క్రూయిజెస్ కలిసి రావాలని ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈఓ జుర్గెన్ బైలామ్‌ను సీఎం కోరారు. క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌పై కోర్డెలియా క్రూయిజెస్ ఆసక్తి కనబరిచింది.

సీఎం వెల్లడించిన వివరాల ప్రకారం...

రంగాల వారీగా పెట్టుబడుల వివరాలు.. (రూ.కోట్లలో)

రంగం	పెట్టుబడులు	ఉద్యోగాలు
విద్యుత్ రంగం	5,33,351	2,66,722
పరిశ్రమలు	2,80,384	5,19,083
మౌలిక వసతులు	2,01,758	3,06,649
ఐటీఈ అండ్ సీ	1,59,467	2,96,315
ఏపీ సీఆర్డీఏ	48,711	41,625
టూరిజం	21,036	1,05,804
ఫుడ్ ప్రాసెసింగ్	13,008	47,390
పట్టణాభివృద్ధి	4,944	12,150
టెక్స్‌టైల్స్	4,490	8,450
వైద్యారోగ్యం	4,208	24,000
విద్యా రంగం	4,359	3,000
ఇతర శాఖలు	50,000	---

ఇంధన రంగంలో సైబర్ రక్షణ

- సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటు
- భద్రత, టెక్నాలజీ వినియోగం కోసం ప్రభుత్వంతో ఒప్పందం

వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

సాక్షి, అమరావతి: సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఇంధన భద్రత, విద్యుత్ రంగంలో అధునాతన టెక్నాలజీ వినియోగం కోసం రాష్ట్ర ప్రభుత్వం వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలను తయారుచేసుకోవాలన్నారు. 160 గిగా వాట్ల గ్రీన్ ఎనర్జీని ఏపీలో ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. అతితక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి చేసి సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఆలోచనని సీఎం వెల్లడించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ..డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్ తయారుచేయడం ఓ సవాలన్నారు. అధిక ధరలకు విద్యుత్ ఉత్పత్తి చేసి డేటా సెంటర్లకు సరఫరాచేస్తే ఖర్చులు పెరిగిపోతాయన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరెమీ జర్గన్స్, సీఎస్ కె. విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

గతంలోవి డొల్ల ఒప్పందాలే!

- ఇవి సీరియస్ ఒప్పందాలనడం ద్వారా పరోక్షంగా అంగీకరించిన చంద్రబాబు
- ఇంత మంది మంత్రులు దేశ విదేశాలు తిరిగినా ఫలితం శూన్యం
- ఒక్క కరణ్ అదానీ తప్ప కానరాని పారిశ్రామిక దిగ్గజాలు
- ఒక గిగావాట్ డేటా సెంటర్ ఒప్పందం ఈడీతో మమ అనిపించిన రిలయన్స్
- పాత ఒప్పందాలనే కొత్త ఒప్పందాలుగా చూపిస్తూ పెట్టుబడుల వెల్లువంటూ ప్రచారం
- చప్పగా సాగిన బీ టు బీ, ప్లీనరీ సెషన్స్.. వెలవెలబోయిన సభా ప్రాంగణం

సాక్షి, అమరావతి: సీఐఐ పార్ట్‌నర్ షిప్ సమ్మిట్ పేరిట 2016, 2017, 2018 సంవత్సరాల్లో కుదుర్చుకున్నది డొల్ల ఒప్పందాలేనని సీఎం చంద్రబాబు నాయుడు పరోక్షంగా అంగీకరించారు. ఈ సంవత్సరం కుదుర్చుకున్నవన్నీ సీరియస్ ఒప్పందాలంటూ వ్యాఖ్యానించడం ద్వారా ఇన్నాళ్లూ పెట్టుబడులు వచ్చేశాయంటూ చేసుకున్నదంతా బూటక ప్రచారమేనని తేల్చేశారు. భారీ హంగామాతో ఈసారి పెట్టుబడుల సమావేశం ఏర్పాటు చేస్తే దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు ముఖం చాటేశారు. విశాఖ సదస్సుకు వచ్చిన వారిలో గౌతమ్ అదాని కుమారుడు కరణ్ అదానీ తప్ప దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఎవ్వరూ సభా వేదికపై కనిపించ లేదు. మన రాష్ట్రానికి చెందిన గ్రంధి మల్లికార్జునరావు, భారత్ బయోటెక్ సుచిత్రా ఎల్లా, అపోలో హాస్పిటల్స్ శోభన కామినేని చంద్రబాబు ఆస్థాన విద్వాంసుడు లులు గ్రూపు చైర్మన్ యూసఫ్ ఆలీ తప్ప ఇతర పారిశ్రామిక దిగ్గజాలు కానరాలేదు. 2023లో వైఎస్ జగన్ హయాంలో నిర్వహించిన సదస్సుకు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, ఆదిత్య మిట్టల్, కరణ్ అదానీ, నవీన్ జిందాల్, బీవీఆర్ మోహన్‌రెడ్డి, భంగర్ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరు కావడం ద్వారా సభా వేదిక కళకళలాడగా, ఈసారి వెలవెలబోయిందని గడిచిన నాలుగు సీఐఐ ఈవెంట్స్ కవర్ చేసిన పాత్రికేయులు వ్యాఖ్యానించారు. చివరికి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒక గిగావాట్ డేటా సెంటర్ ఒప్పందం కుదుర్చుకున్నా, అది కేవలం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా కానిచ్చేసింది.

పాత ఒప్పందాలకే కలరింగ్

పెట్టుబడుల కోసం గత ఆరు నెలలుగా మంత్రులంతా విదేశీ పర్యటనలు చేసినా, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో 2023లో కుదిరిన ఒప్పందాలనే తిరిగి కుదుర్చుకుంటూ రూ.13.21 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. 2018 పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న రెన్యూపవర్, ఏబీసీ పవర్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్, పాల్స్ ప్లస్ టాయ్స్, డైకిన్, ఈ ప్యాక్, యాంబర్ ఎంటర్‌ప్రైజెస్, ఏటీసీ టైర్స్ తదితర పాత ఒప్పందాలతోనే ఇప్పుడూ మమ అనిపించారు. నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ కోసం ఏర్పాటు చేసిన ప్లీనర్ సెషన్స్ కూడా చాలా పేలవంగా సాగాయి. బిజినెస్ టు బిజినెస్ (బీ టు బీ) ద్వైపాక్షిక చర్చల కోసం ఏర్పాటు చేసిన వేదిక అయితే వ్యాపారవేత్తలు లేక వెలవెలబోయింది. ఎంతో అట్టహాసంగా నిర్వహిద్దామనుకున్న సీఐఐ 30వ పార్ట్‌నర్ షిప్ సమ్మిట్ ఇలా పేలవంగా ముగియడం పట్ల ముఖ్యమంత్రిలో అసహనం స్పష్టంగా కనిపించింది. చివరి రోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చంద్రబాబు విలేకరులపై, స్టీల్ ప్లాంట్ కార్మికులపై వేసిన రంకెలే ఇందుకు నిదర్శనం.

ఇకపై ఉత్పత్తి లక్ష్యాల ప్రకారమే జీతాలు

విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం వింత షరతు

సాక్షి, విశాఖపట్నం: ఉద్యోగులు కార్మికుల మెడపై ఎప్పటికప్పుడు కత్తి పెట్టి ప్రైవేటీకరణ దిశగా ప్లాంట్ నడుపుతున్న విశాఖ ఉక్కు యాజమాన్యం మరో వింత షరతు విధించింది. ఇప్పటికే పూర్తిస్థాయి జీతాలు ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం తాజాగా మరో సర్క్యులర్ విడుదల చేసి వారి జీవితాలతో ఆటలాడుకుంటోంది. ఉత్పత్తి లక్ష్యాల శాతాలకు అనుగుణంగా ఇకపై జీతాల పంపిణీ ఉంటుందని, విభాగాల వారీగా ఇచ్చిన టార్గెట్లకి అనుగుణంగా ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రోజు వారీ లక్ష్యాలు ఎంతమేర అందుకోనున్నారనేదానిపై గణించిన అనంతరం జీతం ఎంత ఇవ్వాలనేదానిపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. నవంబర్‌లో ఉత్పత్తి లక్ష్యాల్ని చేరుకోకపోవడం వల్లనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉక్కు యాజమాన్యం స్పష్టం చేసింది. దీనిపై ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ సాధించలేని లక్ష్యాలను ముందుంచి.. దానికనుగుణంగా జీతాలిస్తామని చెప్పడం గర్హనీయమంటూ ఉద్యోగ సంఘాల నాయకుడు అయోధ్యరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

క్లుప్తంగా...

మద్యం అక్రమ కేసులో అనిల్ చోఖ్రాకు రిమాండ్

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో ఎ–49గా ఉన్న ముంబైకి చెందిన అనిల్ చోఖ్రాను సిట్ అధికారులు గురువారం నవీ ముంబైలో అరెస్టుచేసి అక్కడి ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, బేలాపూర్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం.. ట్రాన్సిట్ రిమాండ్ ఆర్డర్స్ పొంది, శుక్రవారం రాత్రి విజయవాడలోని సిట్ కార్యాలయంలో హాజరుపరిచారు. అనిల్‌ను శనివారం ఉదయం సిట్ అధికారులు విచారించిన అనంతరం ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించి, ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. మద్యం అక్రమ కేసులో అనిల్ చోఖ్రా అక్రమ లావాదేవీల ద్వారా రూ.3,500 కోట్లు దుర్వినియోగం చేశాడని, పెద్దమొత్తంలో నగదును అక్రమ మార్గాల ద్వారా మళ్లించాడని, అనేక షెల్ కంపెనీలను సృష్టించి వైట్ మనీని బ్లాక్‌గా మార్చాడని, రకరకాల బ్యాంకు కరెంటు అకౌంట్లను సృష్టించి, క్విడ్ ప్రోకోకు పాల్పడ్డాడని, ఈ తరహా నేరాలకు పదేళ్లకు పైగా శిక్ష ఉంటుందని, అంతేగాక ముంబైలో అతనిపై మూడు కేసులు నమోదైనట్లు రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు పేర్కొని న్యాయమూర్తికి వివరించారు. అనంతరం.. న్యాయమూర్తి ఈనెల 21 వరకు అనిల్ చోఖ్రాకు రిమాండ్ విధించడంతో అతనిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

మీడియా అకాడమీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జర్నలిస్టులందరి సంక్షేమానికి కృషి చేయాల్సిన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అనేక జర్నలిస్టు సంఘాలున్నప్పటికీ మీడియా చైర్మన్ ఏపీయూడబ్ల్యూజేతో మాత్రమే కలిసి పనిచేస్తున్నారని, ఇప్పటికే ఐదు జిల్లాల్లో ఈ సంఘం తరపున శిక్షణ తరగతులు నిర్వహించారన్నారు. మిగిలిన జర్నలిస్టు సంఘాలను కూడా భాగస్వామ్యం చేయాల్సింది పోయి ఒకే సంఘం ద్వారా తరగతులు నిర్వహించడం సరికాదని చెప్పారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ(పొలిటికల్) ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేసినట్టు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బెంగళూరులో కల్తీ నెయ్యి రాకెట్

నందిని లేబుళ్లతో షాపులకు సరఫరా

యశవంతపుర: ఇతర రాష్ట్రాల్లో తయారుచేసి బెంగళూరులో నందిని బ్రాండ్ పేరుతో కల్తీ నెయ్యిని విక్రయిస్తున్న ముఠాను బెంగళూరు సీసీబీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకెళ్తే.. నగరంలోని చామరాజపేట నంజాంబ అగ్రహారంలో కృష్ణ ఎంటర్‌ప్రైజస్ యజమాని, అతని కుటుంబానికి చెందిన గోడౌన్‌లో కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. పెద్ద పెద్ద అట్టపెట్టెల్లో రవాణాకు సిద్ధంగా ఉన్న కల్తీ నెయ్యి ప్యాకెట్లు, బాటిళ్లను సీజ్ చేసి, నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.60 లక్షల విలువగల 4 బొలెరో గూడ్స్ వాహనాలు, రూ.1.20 లక్షల నగదు, రూ.57 లక్షల విలువగల 8,135 లీటర్ల నకిలీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సామగ్రి మొత్తం విలువ రూ.1.26 కోట్లుగా అంచనా వేశారు. తమిళనాడులో నకిలీ నెయ్యిని తయారు చేయిస్తున్నట్లు విచారణలో నిందితులు తెలిపారు. కేఎంఎఫ్ అధీకృత డీలర్ కావడంతో అదే ధీమాతో బెంగళూరు నగరంలో నందిని లేబుళ్లను అతికించి చిల్లర అంగళ్లలో, చివరికి వీధుల్లోని నందిని పార్లర్లకు కూడా కల్తీ నెయ్యిని విక్రయిస్తున్నట్లు పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ చెప్పారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న సీజేఐ

విమానాశ్రయం (గన్నవరం)/లబ్బీపేట(విజయవాడ తూర్పు)/ప్రశాంతి నిలయం/రేణిగుంట: పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సత్యసాయి బాబా మహాసమాధిని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ దర్శించుకున్నారు. తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం గవాయ్ రేణిగుంట నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రశాంతి నిలయానికి వచ్చారు. ఆయనకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి ఈ.భీమారావు, శ్రీ సత్యసాయి జిల్లా జేసీ మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఘన స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ గవాయ్ సత్యసాయి మహాసమాధిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆయన విజయవాడ పర్యటన నిమిత్తం పుట్టపర్తినుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ డి.రమేష్, ఏపీ అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్, కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఘన స్వాగతం పలికారు. అనంతరం గవాయ్ రోడ్డు మార్గంలో విజయవాడ చేరుకున్నారు.

గన్నవరం విమానాశ్రయంలో సీజేఐ జస్టిస్ గవాయ్‌కు స్వాగతం పలుకుతున్న హైకోర్టు సీజే ఠాకూర్

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్‌గా రామారావు

సాక్షి, అమరావతి: ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా కాకినాడకు చెందిన వైడీ రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ రెడ్‌క్రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సొసైటీ రాష్ట్ర నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ ముఖ్య కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఏకే ఫరీడా(రిటైర్డ్ ఐఏఎస్) శనివారం ఒక ప్రకటనలో నూతన పాలకవర్గ వివరాలు తెలిపారు. సొసైటీ వైస్ చైర్మన్‌గా పి.రామచంద్రరాజు(గుంటూరు), కోశాధికారిగా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు(తిరుపతి) ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ మూడేళ్లపాటు పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తుందని తెలిపారు.

పోలీసులకు చిక్కిన 'ఐబొమ్మ' రవి!

కొన్ని ఏళ్లుగా వందల సినిమాల పైరసీ

- దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్‌తో వ్యవహారం
- అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ బృందం

సాక్షి, హైదరాబాద్: ఐబొమ్మ, బప్పం, ఇరాదే పేర్లతో వెబ్‌సైట్లు నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని సినిమాలను పైరసీ చేస్తున్న కూకట్‌పల్లి వాసి ఇమ్మడి రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కొన్నాళ్లుగా వందల చిత్రాలను పైరసీ చేయించిన ఇతడు ఓ దశలో పోలీసులు, సినీ నిర్మాతలకు సవాల్ విసిరాడు. దాదాపు రెండు నెలలుగా ఫ్రాన్స్‌లో తలదాచుకున్న రవి శుక్రవారం హైదరాబాద్ వచ్చినట్లు సైబర్ కాప్స్ గుర్తించారు. రవిని అరెస్టు చేసిన అధికారులు అతడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న దాదాపు రూ.మూడు కోట్లు ఫ్రీజ్ చేశారు. తండేల్ సినిమా పైరసీకి సంబంధించి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదుతో ఈ ఏడాది ఆగస్టు 30న నమోదైన ఈ కేసులో పోలీసులు సెప్టెంబర్‌లో డి.శివాజీ, ఎస్.ప్రశాంత్‌ను అరెస్టు చేశారు. కొన్నేళ్లుగా సినీ పైరసీకి పాల్పడుతూ చిత్ర పరిశ్రమతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు రూ.వేల కోట్ల నష్టం రావడానికి కారణమైన ఇమ్మడి రవికి దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఉంది. ఐబొమ్మ పేరుతో ఇతడు దాదాపు 70 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసులకు సవాల్ విసిరి...

కూకట్‌పల్లి కేంద్రంగానే ఈ కథ నడిపిస్తున్న ఇమ్మడి రవి ఎక్కడా తన ఉనికి బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు. తన అనుచరులు శివాజీ, ప్రశాంత్ అరెస్టుతో ఫ్రాన్స్‌కు పారిపోయాడు. శుక్రవారం తిరిగి వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కాడు.

గతంలో పోలీసులు, సినీ నిర్మాతలకు రవి ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా సవాల్ విసిరాడు. 'ఐబొమ్మ మీద మీరు ఫోకస్ చేస్తే మేము ఎక్కడ చేయాలో అక్కడ చేస్తాం. 'కోల్పోవడానికి ఏమీలేని మనిషికంటే ప్రమాదకరమైనది ఏదీ లేదు' అంటూ వ్యాఖ్యానించాడు. తమను పట్టుకోలేరని, అడ్డుకట్ట వేయలేరనే ధోరణిలో స్పందించాడు. రవిని అరెస్టు చేసిన పోలీసులు అతడి నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో ఉన్నారు.

వెలుగులోకి విశాఖ లింకులు

విశాఖ సిటీ: ఐబొమ్మ నిర్వాహకుడు రవికి విశాఖతో ఉన్న సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. రవి స్వస్థలం విశాఖ అని పోలీసులు గుర్తించారు. విశాఖలోని ఎంవీపీ కాలనీ సెక్టర్–7లో కూడా నివాసమున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇక్కడే ఉంటూ కృష్ణా కాలేజ్‌లో చదివినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి కూకట్‌పల్లిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించి కంప్యూటర్లు, అనేక హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, విశాఖ ఎంవీపీ కాలనీలో రవి ఉన్న నివాసంలో కూడా తనిఖీలు జరిపినట్టు సమాచారం. దీంతోపాటు స్నేహితుల నివాసాల్లో పోలీసులు తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను హైదరాబాద్ నుంచి ప్రత్యేక పోలీస్ బృందం విశాఖకు వచ్చినట్టు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

నెట్‌వర్క్‌కు భారీ చెల్లింపులు

ఇమ్మడి రవి టెలిగ్రాం గ్రూపుల ద్వారా ప్రకటనలు గుప్పిస్తూ పైరసీ చేయడానికి యువతను ఆకర్షించాడు. క్యామ్ కార్డర్‌తో సినిమా థియేటర్లలో రికార్డింగ్ చేయించి, డిజిటల్ మీడియా సంస్థలతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ సర్వర్లు హ్యాక్ చేయించడం ద్వారా హెచ్‌డీ ప్రింట్స్‌ను సిద్ధం చేయిస్తున్నాడు. వీటిని తనకు షేర్ చేయించుకుంటున్న రవి కరేబియన్ దీవుల నుంచి హోస్ట్ చేసిన సర్వర్ ద్వారా పైరసీ వెబ్‌సైట్లలోకి అప్‌లోడ్ చేస్తున్నాడు. సినీ పైరసీలో తనకు సహకరిస్తున్న నెట్‌వర్క్‌కు భారీ మొత్తాలు చెల్లిస్తున్నాడు. విడుదలకు సిద్ధమైన చిత్రాన్ని నిర్మాతలు కొన్ని డిజిటల్ మీడియా సంస్థలకు అందిస్తారు. దాన్ని తమ సర్వర్లలో నిక్షిప్తం చేసుకునే ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఆయా థియేటర్లకు శాటిలైట్ ద్వారా పంపిస్తాయి. ఇలాంటి సర్వర్లను రవి హ్యాక్ చేయించి, విడుదలకు సిద్ధంగా ఉన్న, తాజాగా విడుదలైన చిత్రాలను తస్కరించేలా చేశాడు. క్యామ్ కార్డర్ ద్వారా థియేటర్లలో సినిమాలు రికార్డు చేసేందుకు కొందరిని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ప్రింట్‌ను టెలిగ్రాం ద్వారా లేదా లింకుల రూపంలో తన వద్దకు తెప్పించుకునే రవి తన వెబ్‌సైట్లలో పెట్టి, యాడ్స్ రూపంలో భారీగా ఆర్జిస్తున్నాడు.

యజమాని కారు ఢీకొని యువకుడి మృతి

- మద్యం మత్తులో ఢీకొట్టిన డ్రైవర్
- పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- పోలీసుల అదుపులో నలుగురు

వినీత్‌కుమార్‌రాజు (ఫైల్)

కలికిరి: అప్పటి వరకు తన యజమాని కుమార్తె పుట్టిన రోజు పార్టీలో సరదాగా గడిపిన ఓ యువకుడు.. ఆ తర్వాత కొద్దిసేపటికే తన యజమాని కారు ఢీకొనే చనిపోయాడు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... కలికిరి పంచాయతీ సత్యాపురంలో నివాసముంటున్న ఆర్టీసీ డ్రైవర్ ముంగర రామకృష్ణరాజు, సుకన్య కుమారుడు వినీత్‌కుమార్‌రాజు(25) కలికిరి క్రాస్ రోడ్డులోని అబు మొబైల్స్ దుకాణంలో పని చేస్తున్నాడు. దుకాణం యజమాని అబు కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం రాత్రి రాయచోటిలో పార్టీ ఇచ్చాడు. అబు కారులోనే స్నేహితులైన వినీత్‌కుమార్‌రాజు, నౌషాద్ బాషా (బబ్లూ), అహ్మద్, నరేష్ వెళ్లారు. అక్కడ అందరూ మద్యం తాగి, రాత్రి 11 గంటలకు కలికిరికి బయలుదేరారు. కలికిరి క్రాస్ రోడ్డులోని మొబైల్ దుకాణం వద్ద యజమాని అబు, అహ్మద్ కారు దిగిపోగా, డ్రైవరుగా ఉన్న బబ్లూ అక్కడి నుంచి వినీత్‌కుమార్‌రాజు, టి.మాదిగపల్లికి చెందిన నరేష్‌ను వారి ఇళ్ల వద్ద దింపడానికి బయలుదేరాడు. సత్యాపురంలో వినీత్‌కుమార్‌రాజును దింపేసిన అనంతరం అక్కడి నుంచి కిలో మీటరు దూరంలో ఉన్న టి.మాదిగపల్లిలో నరేష్‌ను దింపాడు. తిరిగి వచ్చేటప్పుడు సత్యాపురంలో రోడ్డు పక్కన ఉన్న వినీత్‌కుమార్‌రాజును కారుతో ఢీకొట్టాడు. ఈ విషయం బబ్లూ తన స్నేహితుడు అహ్మద్‌కు తెలియజేశాడు. వెంటనే అహ్మద్ అక్కడికి చేరుకున్నాడు. కానీ, స్థానికులు రావడంతో బబ్లూ, అహ్మద్ పారిపోయారు. దీంతో స్థానికులు 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే వినీత్‌కుమార్‌రాజు మృతిచెందాడు. శనివారం వేకువజామున మూడు గంటలకు వినీత్ కుమార్‌రాజు కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. ఘటనాస్థలాన్ని సీఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ముందు విలపిస్తున్న మృతుని బంధువులు

పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన

శుక్రవారం అర్ధరాత్రి తమ కుమారుడు చనిపోతే శనివారం ఉదయం నుంచి ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మృతుని తల్లి సుకన్య, బంధువులు శనివారం సాయంత్రం 6 గంటలకు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. అయితే తమకు బాధితులు ఫిర్యాదు ఇవ్వలేదని సీఐ వెల్లడించారు. ఆందోళన అనంతరం రాత్రి మీడియా ముందు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన సీఐ అనిల్‌కుమార్.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మొబైల్ దుకాణం యజమాని అబు, కారుడ్రైవర్ బబ్లూ(నౌషాద్ బాషా), నరేష్, అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మైదాన ప్రాంత గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి

ఆదివాసీ మేధావుల వేదిక డిమాండ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రిజర్వేషన్లలో మైదాన ప్రాంత గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని ఆదివాసీ మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అనుముల వంశీ కోరారు. విజయవాడలో మైదానప్రాంత ఆదివాసీ శంఖారావం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆదివాసీ మేధావుల సదస్సు జరిగింది. బిర్సాముండ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి షెడ్యూల్డ్ ప్రాంతంలోని 8 గిరిజన తెగలే రిజర్వేషన్లు పొందుతున్నాయని, మైదాన ప్రాంత గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 679 మండలాల్లో కేవలం 44 మండలాలే షెడ్యూల్డ్ ప్రాంతంగా ఉన్నాయని, ఆ ప్రాంతాలకు చెందిన వారే రాజకీయ రిజర్వేషన్లు అనుభవిస్తున్నారన్నారు. ఈ వ్యత్యాసాన్ని సరిచేసేందుకు శాసనమండలి, రాజ్యసభలో రిజర్వేషన్లు పెట్టి మైదాన ప్రాంత గిరిజనులకు 4 ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో సమన్యాయం, నామినేటెడ్ పదవులలో సామాజిక న్యాయం చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న అనుముల వంశీ

నెల రోజుల్లో ఐదు శిశు మరణాలు

అల్లూరి జిల్లా దార్రెల పంచాయతీలో వరుస ఘటనలు

- చిన్నారుల్లో శ్వాస సంబంధిత సమస్యలు
- పుట్టిన కొద్ది నెలలకే పసికందుల మరణాలపై తల్లిదండ్రుల ఆవేదన

శనివారం మృతి చెందిన నాలుగు నెలల చిన్నారి వంతాల హర్షశ్రీ

శిశు మరణాలపై గిరిజనుల ఆందోళన వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ముంచంగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దార్రెల పంచాయతీలో వరుస శిశు మరణాలు కలకలం రేపుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో ఐదుగురు పసికందులు అంతుచిక్కని కారణాలతో చనిపోయారు. దీంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. డి.కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన 4 నెలల చిన్నారి హర్షశ్రీ శనివారం మృతి చెందాడు. మూడ్రోజుల నుంచి పాలు తాగకపోవడంతో నీరసించిపోయాడు. దీంతో తల్లిదండ్రులు శుక్రవారం స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పాడేరులోని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం 7 గంటలకు మృతిచెందినట్టు తల్లిదండ్రులు శ్రీకాంత్, రాజేశ్వరి తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన లలితశ్రీ అనే 4 నెలల చిన్నారి కూడా ఈ నెల 11న మృతి చెందింది. అలాగే, చీవుకుచింతలో ఈ నెల 13న రెండు నెలల బాబు.. తలింబ గ్రామంలో ఈ నెల 5న రెండునెలల పాప మృతి చెందగా, ఇదే గ్రామానికి చెందిన నెల రోజుల బాబు గత నెల 29న మృతిచెందాడు.

శ్వాస సంబంధిత సమస్యలతోనే..

ఆరోగ్యంగా ఉండే చిన్నారులు ఇలా ఉన్నట్టుండి శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతూ పాలు తాగడం మానేస్తున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలో మృతి చెందారు. పుట్టిన కొద్దినెలలకే చిన్నారులు ఇలా మృతి చెందుతుండడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి చిన్నారుల మృతికి గల కారణాలు తెలుసుకుని, తదుపరి చర్యలు చేపట్టాలని సర్పంచ్ పాండు, ఆయా గ్రామాల గిరిజనులు కోరారు. ఇదిలా ఉంటే.. చిన్నారుల్లో ఇన్‌ఫెక్షన్ వల్లగానీ, లేదా మెదడు సంబంధిత సమస్యలు ఉన్నప్పుడుగానీ ఇలాంటివి జరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

'నాకు, నా ఆస్తులకు రక్షణ కల్పించాలి'

- దివంగత పారిశ్రామికవేత్త కుమార్తె రాజరాజేశ్వరి విన్నపం
- తన చెల్లెళ్లు ఆస్తులు లాక్కుంటున్నారని ఆవేదన
- వారిలో ఒకరు రామోజీ కోడలు

పెనమలూరు: తనకు, తన ఆస్తులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని దివంగత పారిశ్రామికవేత్త యెర్నేని జానకిరామయ్య పెద్ద కుమార్తె శ్రీరాజరాజేశ్వరి కోరారు. శనివారం కృష్ణా జిల్లా గంగూరులో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి యెర్నేని జానకిరామయ్య నుంచి తనకు గోడౌన్లు, ఇతర ఆస్తులు సంక్రమించాయని చెప్పారు. గంగూరులో 1988 నుంచి ఆస్తులు తన స్వాధీనంలో ఉన్నాయని, ప్లాన్లు, విద్యుత్ బిల్లులు కూడా తన పేరుతోనే ఉన్నాయని తెలిపారు. తన సోదరీమణులు అమరేశ్వరి, విజయేశ్వరి (ఈనాడు రామోజీరావు కోడలు) తన ఆస్తులు కాజేయాలని దౌర్జన్యం చేయిస్తున్నారన్నారు. గోడౌన్లు పగులగొడుతున్నారని తెలియటంతో తాను ఈ నెల 14న వచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశానని, పోలీసులు అసలు పట్టించుకోలేదని తెలిపారు. పైగా తనతో వచ్చిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. బంధువైన బీజేపీ నాయకుడు దిలీప్ కొందరిని తీసుకొచ్చి తన మనుషులపై దాడులు చేయించాడని, తనను బెదిరిస్తున్నాడని అన్నారు. గంగూరులోని స్థలంలో ఈనాడు, ప్రియా ఫుడ్స్ పెట్టడానికి యత్నిస్తున్నారని చెప్పారు. ఫిలింసిటీ నుంచి 70 మందిని తీసుకు వచ్చి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. తాను పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, ప్రభుత్వం తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని శ్రీరాజరాజేశ్వరి కోరారు.

నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన
నిన్ను గూర్చి తన దూతలను ఆజ్ఞాపించును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** బ.ద్వాదశి తె.5.10 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** హస్త రా.3.33 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.10.59 నుండి 12.41 వరకు, **దుర్ముహూర్తం:**సా.3.52 నుండి 4.35 వరకు, **అమృత ఘడియలు:** రా.9.10 నుండి 10.54 వరకు.

సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అంకగణితం ప్లస్ అనైతికత!

జనతంత్రం

వర్ధెల్లి మురళి

సామాజిక సమీకరణాలను పక్కా లెక్కలతో కూర్పు చేసుకున్న ఎన్డీఏ కూటమికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అంగబలం, అర్థబలంతోపాటు ఎన్నికల సంఘం ఆశీస్సులు కూడా పుష్కలంగా ఉన్నాయనేందుకు 'మహిళా రోజ్‌గార్' పథకమే ఉదాహరణ. వారం రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న తరుణంలో ప్రతి ఏటా పదివేల పథకాన్ని ప్రకటించే నైతిక హక్కు ఏవిధంగా ఉంటుంది? దీనికి ఎన్నికల సంఘమే జవాబు చెప్పాలి. ఈ రకమైన అనైతికతకు తోడు అంకగణిత కూర్పులతో బిహార్‌ను ఎన్డీఏ గుప్పెట్లో పెట్టుకున్నది. అంతే తప్ప అక్కడ ఒక మహా ప్రభంజనం వీచి ఆర్జేడీని కూకటివేళ్లతో సహా పెకిలించిందేమీ లేదు. ఆ పార్టీ కొత్త శ్రేణుల్లోకి విస్తరించలేకపోయింది. అంతే తప్ప తన పునాదిని పోగొట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీకి కొత్తగా జరిగిన శృంగభంగం కూడా ఏమీ లేదు. ఆ పార్టీ ముక్కూచెవులను బిహారీలు ఏనాడో కోసిపారేశారు.

ఎన్నికల్లో మూడింట రెండొంతుల సీట్లను గెలుచుకుంటేనే గొప్ప విజయంగా పరిగణించడం మీడియాలో ఒక సంప్రదాయం. ఇక ఆరింట ఐదొంతుల సీట్లు గెలిస్తే చెప్పేదేముంది! బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి సరిగ్గా అటువంటి విజయం లభించింది. భారత జాతీయ బడా మీడియా సంస్థలన్నీ కాషాయ దీక్షను స్వీకరించాయన్న సంగతి జగమెరిగిన సత్యం. మరి కాషాయ పార్టీ నాయకత్వంలోని కూటమి అంతటి భారీ గెలుపును నమోదు చేస్తే భజించకుండా బజ్జోవు కదా! శరభ నాట్యాన్ని ప్రదర్శించాయి. అసోయ్ దూలాకు అసలు తగ్గలేదు. మొత్తం 243 స్థానాలున్న సభలో 202 స్థానాలను కైవసం చేసుకోవడమంటే మాటలు కాదు.

ఈ అంక గణితంలో ఇంకో పార్శ్వాన్ని కూడా గమనించాలి. ప్రతిపక్ష కూటమికి క్యాప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఆర్జేడీ పార్టీకి 23 శాతం ఓట్లు పోలయ్యాయి. ఐదేళ్ల కింద జరిగిన ఎన్నికల్లో కూడా దాదాపు ఇంతే శాతం ఓట్లను ఆ పార్టీ దక్కించుకున్నది. ఈసారి పెద్దగా తగ్గిందేమీ లేదు. బీజేపీకి ఇప్పుడు 20 శాతం ఓట్లు పడ్డాయి. ఐదేళ్ల కింద కూడా అంతే! 19.8 శాతం ఓట్లను సాధించింది. గణనీయమైన పెరుగుదలేమీ కాదు. జేడీ (యు)కు అప్పుడు 16 శాతం, తాజాగా 19 శాతం ఓట్లు లభించాయి. మూడు శాతం పెరుగుదల! మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ) కూటమికి వైస్ క్యాప్టెన్‌గా ఉన్న కాంగ్రెస్ పార్టీ అప్పుడూ ఇప్పుడూ కూడా కూటమికి గుదిబండగానే మారింది. కాకపోతే దాని ఓట్ల శాతంలో పెద్దగా తేడా లేదు. అప్పుడు తెచ్చుకున్న తొమ్మిది శాతం ఓట్లను దాదాపుగా కాపాడుకోగలిగింది.

ఒక కూటమిగా ఎంజీబీకి 2020లో 37.23 శాతం ఓట్లు దక్కాయి. ఈ ఎన్నికల్లో అదే కూటమి సాధించిన ఓట్లు 37.5 శాతం. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం తర్వాత గతంతో పోలిస్తే బిహార్ ఓటర్ల సంఖ్య నికరంగా 47 లక్షలు తగ్గింది. అయినా ఎంజీబీ ఓట్లు తగ్గలేదు. కానీ, సీట్ల లెక్కల్లో దారుణమైన పరాజయాన్ని మూటగట్టుకోవలసి వచ్చింది. ఈ రకమైన ఫలితాల లోగుట్టు పెరిగిన పోలింగ్ శాతంలో ఉన్నది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి తొమ్మిది శాతం పైచిలుకు ఓట్లు అదనంగా పోలయ్యాయి. ఈసారి ఎన్నికల్లో తొమ్మిది శాతానికి చాలా ప్రాధాన్యత ఉన్నది. పురుష ఓటర్ల కంటే తొమ్మిది శాతం అధికంగా మహిళలు ఈసారి ఓటేశారు. గత ఎన్నికల్లో 37.26 శాతం ఓట్లు సాధించిన ఎన్డీఏ ఈసారి తొమ్మిది శాతం అదనంగా 46.7 శాతం ఓట్లను సంపాదించింది.

సాధారణంగా పురుషులు, స్త్రీల పోలింగ్ శాతాల్లో ఒకటి రెండు శాతం కంటే ఎక్కువ తేడాలుండవు. కానీ బిహార్‌లో ఈసారి మహిళల ఓటింగ్ శాతం పురుషులతో పోలిస్తే తొమ్మిది శాతం ఎక్కువగా ఉంది. గతంలో పోలైన ఓట్ల కంటే ఈసారి పెరిగిన ఓట్ల శాతంతో మహిళా ఓట్ల పెరుగుదల సమానంగా ఉండటం ఒక విశేషం. అంతేకాదు. ఎన్డీఏ కూటమి ఓట్ల పెరుగుదల కూడా ఇంతే స్థాయిలో ఉండటం మరో విశేషం. ఇక్కడొక విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. బిహార్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సరిగ్గా వారం రోజుల ముందట నితీశ్ కుమార్ ప్రభుత్వం 'మహిళా రోజ్‌గార్' పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద మహిళలందరికీ ఏటా పదివేల రూపాయలు అందజేస్తారు. కేవలం ప్రకటించడమే కాదు. దాదాపు కోటి యాభై లక్షల మంది మహిళలకు పదివేల రూపాయల చొప్పున నగదు బదిలీ చేశారు. ఈ బదిలీ కార్యక్రమం షెడ్యూల్ విడుదలై ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత కూడా యథేచ్ఛగా కొనసాగిందని ప్రతిపక్షం చేసిన ఫిర్యాదు చెవిటివాని ముందు శంఖం ఊదినట్లయింది.

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికలను ఈ సందర్భంగా ఒకసారి గుర్తు చేసుకోవడం అవసరం. 'వైఎస్సార్ చేయూత' అనే పథకాన్ని అప్పటికి నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం అమలుచేస్తున్నది. ఆ సంవత్సరం గడువు ప్రకారం విడదల చేసిన 4 వేల కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలకు చేరకుండా ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాతనే ఆ నిధులను విడుదల చేశారు. ఈ రెండు ఉదంతాలు ఎన్నికల సంఘం 'నిష్పాక్షికత'కు నిలువెత్తు అద్దాలనుకోవాలి. మహిళల ఓట్లను ఇలా టోకున కొనుగోలు చేయడంతోపాటు మహిళల సాంస్కృతిక విశ్వాసాలను సైతం ఎన్డీఏ కూటమి బాగానే మార్కెటింగ్ చేసుకున్నది. ఛఠ్ పూజ అనేది ఉత్తరాదిన మరీ ముఖ్యంగా బిహార్‌లో మహిళలు చేసుకునే పూజా కార్యక్రమం. తమ భర్తల క్షేమం కోసం, కుటుంబ శ్రేయస్సు కోసం నదీ తీరాల్లో మహిళలు సూర్యదేవుడిని, ఆయన సోదరి ఛఠ్‌దేవిని వేడుకుంటారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పూజ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ఏర్పాట్లు చేశాయి. చిత్తం పూజ మీద, భక్తి ఓట్ల మీద!

ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఒక జాతీయ పార్టీగా తన ఆరోపణలకు తగిన ఆధారాలను సమర్పించవలసిన బాధ్యత కూడా ఆ పార్టీదే! లేకపోతే 'ఆడలేక మద్దెల ఓడు' అనే సామెత చందంగా ఆ పార్టీ పరిస్థితి మారుతుంది. ఆర్జేడీ హుందాగా ప్రజా తీర్పును అంగీకరించింది. ఓటమిలో విచారాన్ని, గెలుపులో గర్వాన్ని చూడబోమని ప్రకటించింది. నిరంతరం జనజీవితంతో మమేకమవుతామని వెల్లడించింది. ఎమ్‌జీబీలో ఆర్జేడీ మినహా మరో బలమైన పార్టీ లేకపోవడం ఆ కూటమికి పెద్ద బలహీనత. తన సంప్రదాయ ఓటు బ్యాంకుల్ని కోల్పోయి కాంగ్రెస్ పార్టీ ఓ కుంటి గుర్రంగా మారింది. అయినా 64 సీట్లకు తగ్గేదే లేదని మొండికేసింది. ఆపైన మరికొన్ని సీట్లలో 'స్నేహపూర్వక పోటీ' పేరుతో కూటమిని ఇబ్బందులకు గురిచేసింది. గత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ 75 సీట్లకు పోటీచేసి కూటమి ఓటమికి కారణమైంది. అప్పుడు దాదాపు విజయ తీరాలకు వచ్చిన తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ) కాంగ్రెస్ కారణంగా అధికారాన్ని కోల్పోయారు. ఇప్పుడు కూడా ఆ పార్టీ వైఖరిలో మార్పు రాలేదు.

కూటమిలో భాగస్వాములైన లెఫ్ట్ పార్టీల పలుకుబడి కేవలం ఓ పాతిక సీట్ల వరకే పరిమితం. వాటిలో ఈసారి సీపీఎమ్ఎల్ (లిబరేషన్) పార్టీ రెండు సీట్లలో, సీపీఎం ఒక్క సీటులో గెలిచాయి. ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ అనే మరో అల్పప్రాణి కూడా ఈ కూటమిలో ఉన్నది. దానికీ ఒక సీటు లభించింది. ఎమ్‌జీబీ అలయెన్స్ కూర్పు ఓ బలహీనత. ఇక తేజస్వీ యాదవ్ తన సాంప్రదాయిక ప్రాబల్యాన్ని దాటి మరింత విస్తరించలేకపోవడం మరో బలహీనతగా మారింది. ముస్లిం – యాదవ్ (ఎమ్‌వై) కాంబినేషన్ ముప్పయ్యేళ్ల క్రితం సత్ఫలితాలను ఇచ్చి ఉండవచ్చు. మిగిలిన బలహీన వర్గాలు కూడా జాగృతమైన ఈ పరిస్థితుల్లో తన పరిధిని విస్తరించుకోకుండా తేజస్వీ తన ఆశయాన్ని నెరవేర్చుకోలేరు. లాలూ రాజకీయ చతురత ఇప్పటి కాలానికి సరిపోకపోవచ్చు. పైగా అనారోగ్యం, వయోభారం. ఆయనిక పొలిటికల్ గేమ్స్ ఆడలేరు. ఆడవలసింది తేజస్వీ యాదవే! కొత్త తరానికి సరిపోయే ఆటను ఆయన నేర్చుకోకపోతే, ప్రత్యామ్నాయ శక్తులు రంగంలోకి రావచ్చు.

ఎమ్‌జీబీ కూటమి కూర్పుకు పూర్తి భిన్నంగా ఎన్డీఏ వ్యవహరించింది. విజయానికి అవసరమైన అంకెలను దృష్టిలో పెట్టుకొని అలయెన్స్‌కు రూపకల్పన జరిగింది. గతంలో ఒంటరిగా 130 సీట్లలో పోటీచేసి, ఐదు శాతానికి పైగా ఓట్లు తెచ్చుకున్న చిరాగ్ పాశ్వాన్ పార్టీని కూటమిలోకి తెచ్చుకున్నారు. 29 స్థానాలు కేటాయిస్తే ఆయన పార్టీ అందులో 19 గెలిచింది. మిగిలిన సీట్లలో బీజేపీ, జేడీయూ అభ్యర్థులకు పాశ్వాన్ పార్టీ ఉపయోగపడింది. దళితుల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు మాజీ ముఖ్యమంత్రి మాంఝీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పార్టీ 'హిందూస్థానీ అవామ్ మోర్చా' కూడా భాగస్వామిగా ఐదు సీట్లు గెలిచి కూటమికి ఉపయోగపడింది. వెనుకబడిన తరగతుల్లో కుష్వాహ వర్గానికి ప్రాతినిధ్యం వహించే ఆర్ఎల్ఎమ్ కూడా ఎన్డీఏకు ప్లస్ పాయింట్‌గా మారింది. ముస్లిం ప్రాబల్యం అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో రంగంలోకి దిగిన ఎమ్ఐఎమ్ ఐదు సీట్లలో గెలవడమే కాక పలుచోట్ల ఎమ్‌జీబీ అభ్యర్థుల ఓటమికి కారణమైంది.

సామాజిక సమీకరణాలను పక్కా లెక్కలతో కూర్పు చేసుకున్న ఎన్డీఏ కూటమికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అంగబలం, అర్థబలంతోపాటు ఎన్నికల సంఘం ఆశీస్సులు కూడా పుష్కలంగా ఉన్నాయనేందుకు 'మహిళా రోజ్‌గార్' పథకమే ఉదాహరణ. వారం రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న తరుణంలో ప్రతి ఏటా పదివేల పథకాన్ని ప్రకటించే నైతిక హక్కు ఏ విధంగా ఉంటుంది? దీనికి ఎన్నికల సంఘమే జవాబు చెప్పాలి. ఈ రకమైన అనైతికతకు తోడు అంకగణిత కూర్పులతో బిహార్‌ను ఎన్డీఏ గుప్పెట్లో పెట్టుకున్నది. అంతే తప్ప అక్కడ ఒక మహా ప్రభంజనం వీచి ఆర్జేడీని కూకటివేళ్లతో సహా పెకిలించిందేమీ లేదు. ఆ పార్టీ కొత్త శ్రేణుల్లోకి విస్తరించలేకపోయింది. అంతే తప్ప తన పునాదిని పోగొట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీకి కొత్తగా జరిగిన శృంగభంగం కూడా ఏమీ లేదు. ఆ పార్టీ ముక్కూచెవులను బిహారీలు ఏనాడో కోసిపారేశారు.

భారతీయ జనతా పార్టీ పచ్చి మితవాద పార్టీ. తన మతవాద ముద్రను కూడా దాచుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆర్థిక, సామాజిక విషయాల్లో పచ్చి సోషలిస్టు వ్యతిరేకి. కానీ తన ప్రాబల్య విస్తరణ కోసం భావజాల సారూప్యత లేని పార్టీలతో సైతం చెలిమికి వెనకాడటం లేదు. నవభారత నిర్మాత పండిత్ జవహర్‌లాల్ నెహ్రూను, ఆయన సోషలిస్టు ఆర్థిక విధానాలను రోజూ విమర్శించే బీజేపీ బిహార్‌లో అంటకాగుతున్నది ఎవరితో? భారతీయ సోషలిస్టు పార్టీ స్థాపకులైన రామ్‌మనోహర్ లోహియా విచారధార లోంచి ప్రవహించినవాడే నితీశ్ కుమార్. దిగ్గజ సోషలిస్టు జార్జి ఫెర్నాండెజ్ అడుగుజాడల్లోనే నితీశ్ కుమార్ రాజకీయ అడుగులు పడ్డాయి. నెహ్రూకూ, లోహియా వాదులకూ విభేదాలుండవచ్చు. అంతిమ లక్ష్యం సామ్యవాదమే కదా! అంతెందుకు బిహార్‌లోని ఆర్జేడీ, జేడీయూ... రెండూ ఒకే తాను ముక్కలు. నితీశ్ పార్టీకి ఆయన తర్వాత వారసత్వ నాయకత్వం లేదు. ఆయన ఆరోగ్యం కూడా అంతంతమాత్రం. ఇప్పుడు పెద్ద పార్టీగా గెలిచిన బీజేపీ నితీశ్‌ను మరికొంతకాలం కొనసాగనిచ్చి తర్వాత తానే పగ్గాలు చేపట్టే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నితీశ్ తదనంతరం ఆయన పార్టీని కూడా బీజేపీ తనలో లీనం చేసుకోవచ్చనే అభిప్రాయం ఉన్నది.

హిందీ మాట్లాడే 'కౌ బెల్ట్' ప్రాంతంలో ఒక్క బిహార్ మాత్రమే పూర్తిస్థాయిలో బీజేపీకి చేజిక్కలేదు. అనతికాలంలోనే ఈ గోక్షేత్రమంతా కాషాయ ఛత్రఛాయలోకి రావడం ఖాయమన్న ఆశాభావం బీజేపీలో ఇప్పుడు బలపడింది. ఇక మిగిలింది ఆర్యావర్త సంపూర్ణ కాషాయీకరణ! త్రివేణుల్లో ఒకటైన సరస్వతీ నది ఒకనాడు అదృశ్యమైనదని భావిస్తున్న నేటి రాజస్థాన్, గుజరాత్ ప్రాంతం నుంచి గంగా ప్రవాహపు ఆఖరి మజిలీ వంగభూమి వరకు విస్తరించిన ఆర్యావర్తంలో బీజేపీకి ఇప్పటిదాకా అందని రాష్ట్రం బెంగాల్ మాత్రమే. నిన్నటి విజయోత్సవ ర్యాలీలో నరేంద్ర మోదీ బెంగాలే తమ తదుపరి లక్ష్యమని ప్రకటించారు. బీజేపీ విజయయాత్రను మమతా దీదీ నిలువరించగలరా... లేదా? ఇంకో ఏడాది వేచి చూడాలి.

vardhelli1959@gmail.com

కాన్యే వెస్ట్ (స్టార్ ర్యాపర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

గడుపుతున్న క్షణం విలువ అది దాటి పోయాక గానీ తెలీదు. నా జీవితంలో అలాంటి ఒక దాటి పోయిన క్షణం... 'కిమ్మీ'!

"నేను నీతో ఉండలేను కాన్యే" అని నాలుగేళ్ల క్రితం ఒక తెల్లవారుజామున, నలుగురు పిల్లల్నీ తీసుకొని వెళ్లిపోయింది కిమ్మీ! తనకు నలుగురే పిల్లలు అనుకుందా?

కోపంలో మాత్రమే తను నన్ను కాన్యే అంటుంది. మిగతా అప్పుడంతా తనకు నేను తన ప్రియమైన 'యే'!

నిద్ర రావటం లేదు, పాటతో నన్ను కమ్మేయ్ 'యే'.

పిల్లలతో పడలేకపోతున్నాను 'యే'. అలసిపోతున్నాను, కాస్త చూసుకోవా ప్లీజ్.

వదులు 'యే', ఇల్లంతా ఇంత పని పెట్టుకుని... వేరే ధ్యాస ఉండదా నీకు!

'యే' నుంచి ఎప్పుడైనా 'కాన్యే' అవటం ఆకస్మిక మరణం నాకు!

ఆ రోజు, ఆ చివరి రోజు, కిమ్మీ నన్ను కాదనుకుని వెళ్లిపోయిన ఆ చీకటి వేకువ రోజు... వీధి చివర కిమ్మీ కారు మలుపు తిరిగే వరకు ఆగి చూసి, ఇంట్లోకి వచ్చాక... 'దేవుడా' అని ఏకధారగా, నా కన్సర్ట్‌లో డెబ్బై వేల మంది ఎదుట దీర్ఘమైన ఒక హృదయరాగం తీసినట్లు ఎంతగా రోదించాను!

"ఏంటి ఆలోచిస్తున్నారు?"... నిశ్శబ్దంగా నా పక్కకు వచ్చి నిలబడి, నా భుజంపై తల ఆన్చింది బియాంక.

"ఏం లేదు, కన్సర్ట్ గురించి"... అబద్ధం చెప్పాను.

కిమ్మీ నన్ను వదిలేసి వెళ్లిన మూడేళ్ల తర్వాత ఇదే నవంబరులో నా జీవితంలోకి ప్రవేశించింది బియాంక. ప్రవేశించటం అన్నది తప్పుడు మాట. నువ్వు రమ్మనకుండానే ఎవరైనా నీ జీవితంలోకి, నీ ఇంట్లోకి ఎలా ప్రవేశిస్తారు?

బియాంక నాకన్నా పద్దెనిమిదేళ్లు చిన్న. "నీ మొహానికి చిన్నపిల్ల కావలసి వచ్చిందా కాన్యే!" అని అడుగుతుందనుకుంటా, కిమ్మీ ఎప్పుడైనా ఎక్కడైనా నాకు ఎదురు పడితే... "ఎలా ఉన్నావ్ 'యే'" అని అడగటం మాని.

తనపై మానసికంగా ఒత్తిడి తెస్తున్నానని నాపైన కిమ్మీ కంప్లైంట్. అదొక్కటే కాదు, ఒళ్లు తెలీకుండా డబ్బు ఖర్చు పెడతానని కూడా!

"నీ కోసం, పిల్లల కోసమే కదా" అంటాను. "నా కోసం, పిల్లల కోసం ఖర్చే ఎందుకు పెట్టాలి? దాచి కూడా పెట్టొచ్చు కదా!" అంటుంది.

"ప్రేమను దాచి ఉంచలేనప్పుడే కదా కిమ్మీ... ఖర్చు పెట్టాలనిపిస్తుంది!" అంటాను. తనకు ఆ మాట నచ్చదు.

"కన్సర్ట్ గురించి ఏం ఆలోచిస్తున్నారు? ఆ పాట గురించేనా?" మళ్లీ అడిగింది బియాంక.

బియాంక చిన్నపిల్ల మాత్రమే కాదు, అబద్ధాలను అనుమానించని పెద్దపిల్ల కూడా!

"అవును" అని మళ్లీ అబద్ధం చెప్పాను.

తను అడుగుతోంది 'హెయిల్ హిట్లర్' సాంగ్ గురించి. బ్రెజిల్ వచ్చినప్పుడు, కన్సర్ట్‌లో ఆ పాటను పాడితే కాన్యేను అరెస్ట్ చేస్తామని సావో పౌలో స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆల్రెడీ నోటీస్ కూడా ఇచ్చేశారు.

'హెయిల్ హిట్లర్' నాకు నచ్చిన పాట. హిట్లర్‌ను కీర్తించే పాట. లోకంలోని దేశాలన్నీ కలిసి నిషేధించిన పాట. 24 ఏళ్ల డేవ్ బ్లంట్స్ చేత నేను రాయించుకున్న పాట.

నవంబర్ 29న బ్రెజిల్‌లో, డిసెంబర్ 13న సౌత్ ఆఫ్రికాలో, జనవరి 30న మెక్సికోలో వరుసగా కన్సర్ట్‌లు ఉన్నాయి. నేను అరెస్ట్ అయినా సరే, ప్రభుత్వాల లాకప్‌లో ఉన్న హిట్లర్ పాటను విడిపించుకుంటాను. 'నిగ్గా హెయిల్ హిట్లర్... నిగ్గా హెయిల్ హిట్లర్' అని నా కంఠ నాళాలను తెంపుకుంటాను.

నా మనసులోని ఆ పాటను వింటున్నట్లుగా మౌనంగా ఉండిపోయింది బియాంక.

కిమ్మీ అలాకాదు. "పిల్లల్ని దింపిరా పో... నేనివాళ త్వరగా స్టూడియోకి వెళ్లాలి" అనేసి, నా వైపన్నా చూడకుండా నా భుజాలకు స్కూల్ బ్యాగులు తగిలిస్తుంది.

బియాంక మౌనరాగమైతే, కిమ్మీ అనురాగ 'బంధనం'... నా జీవితానికి!

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

శత్రువు తెలుసు, మిత్రులెవరో తెలీదు!

అభిప్రాయం

డానీ

వర్తమాన భారత సమాజాన్ని చాలామంది చాలా రకాలుగా వర్ణిస్తున్నారు. కార్పొరేట్ మతతత్త్వ నియంతృత్వం (సీసీడీ) అనే భావన ఇప్పుడు క్రమంగా బలాన్ని పుంజుకుంటోంది. ఈ కార్పొరేట్ మతతత్త్వ నియంతృత్వం తనకు అనుకూలమైన రాజకీయ విభాగానికి పార్లమెంటరీ ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. అదే బీజేపీ నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ).

ఈ వ్యవస్థ మారాలని అత్యధికులు ఆశిస్తుంటారు. వ్యవస్థను మార్చడానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది – ఎన్డీఏను తప్పించడం. ఇది అన్నింటికన్నా ఆదర్శ పరిష్కారం. అయితే, ఆచరణ అంత సులువు కాదు. చాలా కాలం పడుతుంది. సాధారణ ఉద్యమాలు, పోరాటాలు కూడ సరిపోకపోవచ్చు. తీవ్ర పోరాటాలు అవసరం కావచ్చు. తీవ్ర అనే మాటకు అర్థాన్ని ఎవరికి వారు ఎంత వరకైనా అన్వయించుకోవచ్చు.

లేత ఎరుపు నుండి ముదురు ఎరుపు వరకు, లేత నీలం నుండి ముదురు నీలం వరకు గడిచిన వందేళ్ళలో మన దేశంలో సాగిన ఉద్యమాలన్నీ పౌర సమాజం మీద చాలా సానుకూల ప్రభావాన్ని వేశాయి. అయితే దాన్ని రాజకీయ ప్రయోజనంగా మార్చుకోవడంలో అవన్నీ ఘోరంగా విఫలం అయ్యాయి. అలనాడు గొప్పగా వెలిగిన పౌర సమాజాన్ని కూడ ఇప్పుడు సీసీడీ కలుషితం చేసేసింది. సమానత్వ, సహోదర, సామ్యవాద భావాల నుండి సమాజాన్ని తప్పించే పనిలో పడింది. దీనిని శుద్ధి కార్యక్రమం అని కూడ అంటున్నారు.

బహుళ పార్టీల పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మనకు ఇంకో పరిష్కారం ఉంది; ఐదేళ్ళకు ఒకసారి జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మనకు నచ్చని పార్టీనో, కూటమినో ఓడించడం. అది సాయుధ పోరాటాలు చేయాల్సినంత కష్టమైన పని కాదుగానీ, అంత ఈజీ కూడా కాదు. దాదాపు వందకోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉంటారు. వాళ్ళలో ఓ 70 కోట్ల మంది పోలింగులో పాల్గొంటారు. వారిలో సగానికి పైగా, అంటే నలభై కోట్ల మందిని ప్రభావితం చేసే బృహత్తర పథకాన్ని రచించి కచ్చితంగా ఫలితాలను సాధించే కార్యాచరణ ఒకటి ఉండాలి.

అయితే, ప్రజాస్వామ్యం పేదది కాదు; పేదోళ్ళది అంతకన్నా కాదు. రాజకీయ కళలో ప్రావీణ్యం సంపాదించిన కొద్దిమంది కలిసి నడిపే నియంతృత్వంగా ప్రజాస్వామ్యం కుంచించుకుపోయింది. ఇదో రాజకీయ పారడాక్స్! ఈ వాస్తవాన్ని ముందు గుర్తించాలి. సమ్మతి ఉత్పత్తి అన్నమాట! ఉత్పత్తి అంటేనే పెట్టుబడి.

అయితే, సమాజం చాలామంది అనుకుంటున్నంతగా చెడిపోలేదు. సీసీడీ ప్రాయోజితంగా గెలిచినవాళ్ళు తమను

◆ 2014 నుండి 2024 వరకు జరిగిన మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి పడిన ఓట్లు 31, 37.36, 36.56 శాతం మాత్రమే. అంటే, 60 శాతానికి పైగా ఓటర్లు ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఓటు వేస్తున్నారు. దీని అర్థం ఏమిటీ? ఎన్డీఏ కూటమి తన సొంత బలం మీద కాకుండా విపక్షాల అనైక్యత వల్ల మాత్రమే గెలుస్తున్నది.

తాము అప్రతిహత శక్తిగా చెప్పుకుంటున్నారుగానీ, ఓటర్లు వాళ్ళకు అంతగా మద్దతు పలకలేదు. 2014 నుండి 2024 వరకు జరిగిన మూడు లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి పడిన ఓట్లు 31, 37.36, 36.56 శాతం మాత్రమే! అంటే, 60 శాతానికి పైగా ఓటర్లు ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఓటు వేస్తున్నారు. దీని అర్థం ఏమిటీ? ఎన్డీఏ కూటమి తన సొంత బలం మీద కాకుండా విపక్షాల అనైక్యత వల్ల మాత్రమే గెలుస్తున్నది.

విపక్షాలు ఏకం అయితే ఎన్డీఏ కూటమిని ఓడించడం సులువు అని దీన్నిబట్టి అర్థమవుతుంది. ఒక సీటు దగ్గర, ఒక పదం దగ్గర, అప్పుడప్పుడు ఒక అక్షరం దగ్గర కూడ తేడాలొస్తే భూమ్యాకాశాల్ని ఏకంచేస్తూ మన విపక్షాలు కొట్లాడుకుని విడిపోతుంటాయి. మరోవైపు, ఎన్డీఏ కూటమి ఏకశిలా సదృశంగా సమైక్యంగా ఉంటుంది. ఆ కూటమిలో, ఆరెస్సెస్ వంటి మెజారిటీ మతవాదులతోపాటు అథవాలే వంటి అంబేడ్కరిస్టులు, నితీశ్ కుమార్ వంటి సోషలిస్టులు కూడా ఉంటారు. అయినా, అందరూ ఒక్కటై ఉంటారు. అది వాళ్ళ విజయ రహస్యం.

విపక్షాలను ఏకం చేయాలనే ఆలోచన ఓ ఐదారేళ్ళుగా చక్కర్లు కొడుతోంది. కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'ఎద్దేలు కర్ణాటక' (మేలుకో కర్ణాటక) అనే ఒక పౌరసంస్థ ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి నడుం బిగించింది. ఆశించిన ఫలితాలను సాధించడానికి ఆధునిక టెక్నాలజీని కూడ వాడింది. అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ఓటింగ్ శాతం దాదాపు స్థిరంగా ఉన్నాసరే ఎన్నికల్లో ఓడిపోయింది. ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు ఓట్లు పెద్దగా పెరగకపోయినా (4–5 శాతం), సీట్లు మాత్రం భారీగా పెరిగి, అధికారాన్ని చేపట్టింది. రెండు ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నచోటనే 'ఎద్దేలు కర్ణాటక' ప్రత్యేక దృష్టి పెట్టి సానుకూల ఫలితాలను సాధించింది. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ సంస్థ ప్రభావం కనిపించలేదు. మళ్ళీ బీజేపీ తన ఆధిక్యాన్ని చాటుకుంది.

రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని ఓడించడానికి ఆంధ్రప్రదేశ్ పౌరసంఘాలు కొన్ని ఈసారి కొంచెం ముందుగానే సన్నాహాలు మొదలెట్టాయి. ఇదొక సానుకూల సంకేతం. తొలి అడుగులో, వామపక్ష (మార్క్స్), సామాజిక న్యాయ (అంబేడ్కర్) ఆదర్శాలు గల రాజకీయ పార్టీల్ని ఏకం చేయాలనేది ఒక ప్రతిపాదన. ఇది సరిపోదు. సీసీడీ, ఎన్డీఏ కూటమి బాధిత సమూహాలు అనేకం ఉన్నాయి. ఒక్కొక్కరికీ ఒక్కో లక్ష్యం ఉంటుంది. ఉదాహరణకు ముస్లింలు తదితర మైనారిటీలకు మత సామరస్యం ప్రధాన ఆదర్శం. అలాగే బీసీలు, ఆదివాసీలు, మహిళలు, కార్పొరేట్ ప్రాజెక్టుల నిర్వాసితులు. ఆధిపత్య కులాల్లోని పేదలు, ఉదారవాదులకు వారివైన ప్రత్యేక లక్ష్యాలు ఉంటాయి. ఇలా విభిన్న లక్ష్యాలున్న సమూహాలన్నింటినీ మినహాయింపు లేకుండా ఏకం చేయాలి. లోక్ సభ ఎన్నికల్లో ఎవర్ని ఓడించాలో మనకు స్పష్టంగానే తెలుసు. ఎవర్ని బలపరిస్తే ఈ లక్ష్యాన్ని సాధించగలమనే దాని మీదనే ఇప్పుడు మేధామథనం సాగాలి.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు

వ్యతిరేకతకు కారణమిదే!

బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై బీజేపీయేతర రాజకీయ పార్టీల నాయకులు అబద్ధాలు మీద అబద్ధాలు చెప్పి, ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను దెబ్బ తీయాలని చేసే ప్రయత్నాలు గర్హనీయాలు. భారత రాజ్యాంగంలోని 342 నుండి 329 వరకు ఉన్న ఆర్టికల్స్‌లో పేర్కొన్న ఎన్నికల నిర్వహణ, ఓటర్ లిస్టుల తయారీ, అందులో మార్పులు చేర్పులు చేయడంలో ఎన్నికల కమిషన్‌కు సర్వ హక్కులు ఉంటాయి. అందుకే లక్షలాది ఓట్లను కమిషన్ తొలగించింది. చనిపోయిన వారు, రెండుసార్లు పేర్లు నమోదైనవారు, వలస వచ్చిన వారి పేర్లు తొలగింపునకు గురయ్యాయి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ ఆధారాలతో సుప్రీంకోర్టుకు నివేదిక ఇచ్చింది.

మోదీ ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడమే ప్రతిపక్ష నాయకుడి బాధ్యతగా భావించే కాంగ్రెస్ రాకుమారుడు రాహుల్‌గాంధీ 'ఓటు చోరీ' నినాదం నెత్తికెత్తుకుని, కొన్ని వర్గాల ప్రజలను ముఖ్యంగా దళితులను, గిరిజనులను, ముస్లిములను రెచ్చగొట్టి... ఆ వర్గాల ప్రజల్లో ఎన్నికల కమిషన్ పట్ల విశ్వాసం సన్నగిల్లే విధంగా చేయడం శోచనీయం.

అక్రమ చొరబాటుదారులకు భారతదేశం స్వర్గధామం. మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుండి ముస్లింలు అక్రమంగా భారతదేశంలోకి చొరబడి, రేషన్ కార్డులను, ఓటర్ గుర్తింపు కార్డులను సంపాదించి భారత దేశ పౌరులయ్యారు. బంగ్లాదేశ్ సరిహద్దులను దాటుకొని, పశ్చిమ బెంగాల్లో ప్రవేశించి, అస్సాం, బిహార్ ప్రాంతాలలో స్థిరపడుతున్నారు. స్థానికుల సహాయ సహకారాలతో ఈ తతంగం కొనసాగుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ నాయకులు అక్రమ చొరబాటుదారులకు ప్రత్యక్ష, పరోక్ష సహాయ సహకారాలు అందిస్తున్నారు. దేశ సమైక్యత, సమగ్రతలను దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలంటే ఇది పూర్తిగా దేశద్రోహమే. ఇలాంటి పని ప్రపంచంలో ఏ దేశంలో కూడా జరగదు గాక జరుగదు.

ఇదే సందర్భంలో లౌకికవాద రాజకీయ నాయకులం అని చెప్పుకొనేవారు పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ఉద్యమాలనూ గుర్తు చేసుకోవాలి. అక్రమ చొరబాటుదారుల గుట్టు బయటపడుతుందనీ, తమ ఓటు బ్యాంకు దెబ్బతింటుందనే ఉద్దేశాలతోనే ఇదే నాయకులు ఇప్పుడు 'సర్'ను వ్యతిరేకిస్తున్నారనేది పలువురి అభిప్రాయం.

– ఉల్లి బాలరంగయ్య । రాజకీయ విశ్లేషకుడు

భైరవకోనలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలంలోని పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సమేతంగా సందర్శించారు. త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో అభిషేకం, విశిష్ట పూజలు, కుంకుమార్చన చేశారు. ముందుగా జలపాతాన్ని సందర్శించారు. హైకోర్టు జడ్జి వెంట కనిగిరి జడ్జి బి.రూపాశ్రీ, తదితరులు ఉన్నారు. – సీఎస్‌పురం (పామూరు)

జన సంచారంలో మద్యం షాపా... వద్దే వద్దు!

తిరుపతి జిల్లాలోని పుత్తూరు–తిరుపతి రోడ్డులోని జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ప్రారంభోత్సవాన్ని స్థానిక మహిళలు అడ్డుకున్నారు. షాపును ప్రారంభించడానికి వీల్లేదని ధర్నా చేశారు. మరోచోట షాపు ఏర్పాటు చేసుకోవడానికి సమయం పడుతుందని, అప్పటివరకు షాపు నిర్వహణకు అనుమతించాలని మహిళలను ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది కోరగా..దానికి వారు నిరాకరించారు. వీరంతా దుకాణం ఎదుటే కూర్చుండిపోవడంతో షాపు ప్రారంభోత్సవాన్ని నిర్వాహకులు తాత్కాలికంగా నిలిపివేశారు. – పుత్తూరు

క్లుప్తంగా...

బాపట్లకు నేడు గవర్నర్

బాపట్ల: ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం బాపట్ల రానున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై శనివారం అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గవర్నర్ రాజ్ భవన్ నుంచి బయలుదేరి ఉదయం 11.45 గంటలకు గోల్డెన్ శాండ్ సూర్యలంక బీచ్ చేరుకొని విశ్రాంతి తీసుకుంటారని చెప్పారు. అనంతరం రాత్రి 7 .55 గంటలకు శ్రీ భ్రమర అజంతా సూర్యలంక బీచ్ నుంచి బయలుదేరి రాత్రి 10 గంటలకు రాజ్ భవన్ చేరుకుంటారని తెలిపారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి జాయింట్ కలెక్టర్ భావన ఇన్‌చార్జిగా ఉంటారని పేర్కొన్నారు.

ఎన్ని దాడులు చేసినా పోరాటం ఆగదు

ఎమ్మెల్యే బాలకృష్ణకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక హెచ్చరిక

చిలమత్తూరు: టీడీపీ గూండాలు హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై చేసిన దాడిని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక తీవ్రంగా ఖండించారు. ఆమె శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ హిందూపురంలో అరాచకశక్తులను ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. బాలకృష్ణ హిందూపురం పర్యటనలో ఉండగానే వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడి చేశారని చెప్పారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..? సభ్య సమాజం సిగ్గుపడేలా వారి చర్యలున్నాయన్నారు. బండరాళ్లతో కార్యాలయాన్ని ధ్వంసం చేయడాన్ని చూస్తే రక్తం మరుగుతోందన్నారు. అవినీతి అక్రమాలపై వార్తలు రాసిన 'సాక్షి' విలేకరిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇదేనా హిందూపురంలో నేతలకు ఎమ్మెల్యే బాలకృష్ణ నేర్పిస్తున్నదని ప్రశ్నించారు. టీడీపీ నేతలు నిజంగా సిగ్గుపడాల్సిన తరుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని దాడులు చేసినా, దౌర్జన్యాలు చేసినా, అక్రమ కేసులు బనాయించినా ఎమ్మెల్యే బాలకృష్ణ, ఆయన పీఏ చేస్తున్న అక్రమాలపై ప్రశ్నించి తీరుతామని స్పష్టం చేశారు.

శ్రీచరణికి టీటీడీ చైర్మన్ అభినందనలు

తిరుమల: ఇటీవల జరిగిన మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించడంలో కీలకపాత్ర వహించిన వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన భారత మహిళా క్రికెటర్ శ్రీచరణిని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అభినందించారు. శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం శ్రీచరణి తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం

తిరుమల: పుణేకి చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.74.24 లక్షల విలువైన విద్యుత్ బస్సును శనివారం టీటీడీకి విరాళంగా అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ఎదుట బస్సు తాళాలను డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు.

భాస్కర్‌రెడ్డి ఎస్కార్ట్ పోలీసులు సస్పెన్షన్

పెనమలూరు: సోషల్ మీడియా యాక్టివిస్టు, ఎన్నారై మాలపాటి భాస్కర్‌రెడ్డికి ఎస్కార్ట్‌గా ఉన్న ఐదుగురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తండ్రి అంత్యక్రియల నిమిత్తం వచ్చిన భాస్కర్‌రెడ్డిని పోలీసులు ఇటీవల అక్రమ కేసులో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు రిమాండ్ విధించి.. నెల్లూరు జైలుకు తరలించాలని ఆదేశించింది. అలాగే ఆయన తండ్రి పెద్దకర్మకు హాజరయ్యేందుకు కోర్టు ఒక్క రోజు అనుమతి ఇచ్చింది. దీంతో భాస్కర్‌రెడ్డికి పోలీసు ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. మార్గం మధ్యలో భాస్కర్‌రెడ్డి అల్పాహారం కోసం పోలీసులు వాహనాన్ని ఆపినట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో ఎస్కార్ట్ విధుల్లో ఉన్న పెనమలూరు ఎస్‌ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సురేశ్, ఏఆర్ కానిస్టేబుళ్లు ప్రసాద్, శివప్రసాద్, సాయికిరణ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ చర్య పోలీసు వర్గాల్లో కలకలం రేపింది.

హిందూపురంలో టీడీపీ గూండాల విధ్వంసకాండ

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి.. ఇద్దరికి గాయాలు

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోకి పదుల సంఖ్యలో చొరబడుతున్న టీడీపీ గూండాలు

పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉషశ్రీచరణ్, వేణురెడ్డి, మధుమతి తదితరులు

ధ్వంసమైన వినాయకుడి విగ్రహం

ధ్వంసమైన అంబేడ్కర్ ఫొటో

హిందూపురంలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ కార్యాలయం

ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ గూండాలు బరితెగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై శనివారం దాడి చేసి విధ్వంసం సృష్టించారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య 50 మంది వరకు టీడీపీ రౌడీలు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు వచ్చి రాళ్లతో అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కార్యాలయంలోకి రాజకీయ నాయకుల ఫొటోలు బయటకు విసిరేశారు. ఫర్నీచర్‌తోపాటు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దేవతామూర్తుల విగ్రహాలను, చిత్రపటాలను, ఏసీలను బయటపడేశారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనా దాడి చేసి గాయపరిచారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నారనే అక్కసుతోనే ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

భయాందోళన సృష్టించాలనే..

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి హిందూపురం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. భూదందాలు, నెలవారీ మామూళ్లు, ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. ఇటీవల తరచూ టీడీపీ నేతలు, బాలకృష్ణ పీఏల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తమ అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తామని హెచ్చరించాలనే ఉద్దేశంతోనే టీడీపీ రౌడీలు ఏకంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంపైనే దాడికి తెగబడినట్లు స్పష్టమవుతోంది. భయానక వాతావరణం నెలకొల్పితే.. ఎవరూ తమను ప్రశ్నించబోరనే ఉద్దేశంతో టీడీపీ నాయకులు గూండాల్లా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ డైరెక్షన్‌లోనే ఈ దాడి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా చిలమత్తూరు మండలంలోకి అడుగుపెట్టగానే ఈ దాడి జరగడం ఇందుకు బలాన్నిస్తోంది.

కక్షపూరితంగా చేసిన దాడే: ఉషశ్రీ చరణ్

'ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గంలో ఉండగానే వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి జరగడం దుర్మార్గం. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం అరాచకాలు సృష్టిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. టీడీపీ నేతల అవినీతి, అక్రమాలు బయటపెడుతున్నామనే అక్కసుతోనే దాడికి దిగుతున్నారు.' అని ఉషశ్రీ చరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోలీసుల ప్రేక్షకపాత్ర

సుమారు 50 మంది టీడీపీ రౌడీమూకలు రాడ్లు, రాళ్లు పట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, పార్టీ కార్యకర్త దివాకర్‌రెడ్డి గాయపడ్డారు. టీడీపీ మూకల దాడి విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకున్నప్పటికీ టీడీపీ గూండాల దాడి కొనసాగింది. పోలీసులు కనీసం వారిని నిలువరించకుండా ప్రేక్షక పాత్ర పోషించారు. ఈ విషయం తెలుసుకున్న హిందూపురం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక భర్త వేణురెడ్డి కార్యాలయానికి చేరుకుని పరిశీలించారు. దాడికి తెగబడిన వారిలో 50 మంది వరకు ఉన్నట్లు వీడియోల ద్వారా తెలుస్తోంది. టీడీపీ హిందూపురం పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, లేపాక్షి మండల అధ్యక్షుడు అభిషేక్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు యుగంధర్ (చింటు), ప్రవీణ్, హెచ్ఎన్ రాము, అమన్, భాస్కర్, హిదాయతుల్లా, ఆది, ఆజ్మతుల్లా, బాబురెడ్డి, రెహమాన్ తదితరులు దాడికి పాల్పడినవారిలో ఉన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణతో సహా దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూపురం డీఎస్పీ మహేశ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

టీడీపీ గూండాల విధ్వంసకాండ వీడియో కొరకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇది ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రతి పౌరుడిపై జరిగిన దాడి

హిందూపురం ఘటనను తీవ్రంగా ఖండించిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనను ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది వైఎస్సార్‌సీపీపై దాడి మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రతి పౌరుడిపై జరిగిన దాడి అని అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో దాడికి సంబంధించిన వీడియోతో సహా పోస్టు చేశారు. 'హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ నేతలు, బాలకృష్ణ అనుచరులు జరిపిన హింసాత్మక దాడి ప్రజాస్వామ్యంపై నేరుగా జరిగిన దాడి. కార్యాలయాన్ని ధ్వంసం చేయడం, ఫర్నీచర్‌ను పగలగొట్టడం, అద్దాలను విరగ్గొట్టడం, కార్యకర్తలపై దౌర్జన్యం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువల పతనాన్ని సూచిస్తున్నాయి. ఈ దాడిపై పోలీసులు ఎలాంటి చర్య తీసుకోకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థను చంద్రబాబు నాయకత్వంలో దుర్వినియోగం చేస్తున్నారన్న హెచ్చరికగా దీన్ని భావించాలి. చంద్రబాబు నాయకత్వం మద్దతుతో టీడీపీ నేతలు, రౌడీ మూకలు హింసాత్మక చర్యల ద్వారా ప్రత్యర్థులను భయపెట్టి, రాజకీయ వ్యతిరేకతను అణచి వేయాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రత్యర్థి పార్టీల ప్రాథమిక హక్కులను రక్షించలేని ప్రభుత్వానికి పాలన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ స్వేచ్ఛను నమ్మే ప్రతి పౌరుడిపై ఈ దాడి జరిగినట్లే. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

షాడో ఎమ్మెల్యే.. బాలకృష్ణ పీఏ!

హిందూపురం నియోజకవర్గంలో అక్రమాలకు కేరాఫ్
ఆర్థిక లావాదేవీలన్నీ శ్రీనివాసరావు చేతుల్లోనే..
చిలకలూరిపేట నుంచి వచ్చి 'పురం' సొమ్ము స్వాహా

ఎమ్మెల్యే బాలకృష్ణతో పీఏ శ్రీనివాసరావు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ శ్రీనివాసరావు షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతున్నారు. పురంలో టీడీపీ శ్రేణులన్నీ అతని చెప్పుచేతల్లోనే ఉంటున్నాయి. మద్యం దుకాణాల్లో ఇతని భాగస్వామ్యం సింహభాగం. హిందూపురం మండలంలోని తూముకుంట పారిశ్రామికవాడలో ప్రతి పరిశ్రమ నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవికి ఇతను ప్రధాన అనుచరుడు. అందుకే ఇతనికి ఇస్తున్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే షాడో ఎమ్మెల్యే! నియోజకవర్గంలో ఎవరికి ఏ కాంట్రాక్ట్ ఇవ్వాలన్నా, ఎవ్వరికి ఏ అనుమతి కావాలన్నా శ్రీనివాసరావు అనుమతి తప్పనిసరి. పోలీసు వ్యవస్థ మొదలు అన్ని వ్యవస్థలూ ఇతని చెప్పుచేతల్లోనే ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. కప్పం కట్టే వాడిదే పెత్తనం అన్న చందంగా బ్రిటీష్ తరహా పరిపాలన సాగిస్తున్నాడు.

- చిలమత్తూరు మండలం టేకులోడు ప్రాంతంతో భూసేకరణ అంశంలో గ్రామ సభల్లో సైతం అన్నీ తానై వ్యవహరించి తక్కువ ధర నిర్ణయించి రైతులను ముంచాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్ణయించిన ఎకరాకు రూ.25 లక్షలను ఇప్పుడు రూ.12.66 లక్షలకే తగ్గించి భూములను ఏపీఐఐసీ ద్వారా అప్పనంగా తన అనుయాయ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధమయ్యారు.
- హిందూపురం మున్సిపాలిటీలో పనులకు రూ.92 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు కాగా, వాటిలోనూ తనకు అనుకూలురైన ప్రభాకర్, బాలాజీ అనే కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పి మెజారిటీ నిధులు నొక్కేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేశారు.
- చేయని పనులకు బిల్లులు పెట్టుకుని ఎంపీడీవోల సాయంతో ఒక్కో మండలం నుంచి మండల పరిషత్ నిధులు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ మింగేశారన్న ఆరోపణలున్నాయి. వీటిపై విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ కూడా చేసింది.
- భూముల రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు పాల్పడుతున్నారు. వేరేవారి పేర్లతో ఉన్న భూములకు సంబంధించి బినామీల పేరిట 1బీలు చేసి కోట్లాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడన్న ఆరోపణలున్నాయి. తన సామాజిక వర్గానికి చెందిన ఆర్డీవో ఆనంద్‌కుమార్ పదోన్నతిలో సహాయం చేసి భూములు అప్పనంగా కాజేసినట్టు జోరుగా చర్చ సాగుతోంది. అందుకు బలం చేకూర్చేలా సోషల్ మీడియాలో అందుకు సంబంధించిన 1బీలు కూడా వైరల్ అయ్యాయి.
- ఎమ్మెల్యే బాలకృష్ణ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసరావు కనీస విద్యార్హత లేకపోయినప్పటికీ పీఏగా పనిచేస్తూ షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతున్నాడు.
- వచ్చే ఎన్నికల్లో చిలకలూరిపేటలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడతాడన్న ప్రచారం ఉంది. అందుకోసం కావాల్సిన నిధులను హిందూపురం నుంచి పోగు చేసుకుంటున్నాడన్న ఆరోపణలున్నాయి. ఇతను హిందూపురంలో అడుగు పెట్టి రెండేళ్లు కావొస్తుండగా.. సుమారు రూ.100 కోట్లు పోగేసుకున్నట్టు నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది.

శ్రీవారిమెట్టు సమీపంలో ఎర్రచందనం దుంగలు స్వాధీనం

చంద్రగిరి: తిరుమల శ్రీవారి మెట్టు సమీపంలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలు, కారును టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం శుక్రవారం నుంచి శ్రీవారిమెట్టు పరిసరాల్లో కూంబింగ్ చేపట్టింది. శనివారం తెల్లవారుజామున చంద్రగిరి–శ్రీవారి మెట్టు మార్గంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా, వేగంగా వస్తున్న ఒక కారు పోలీసులను చూసి కొద్ది దూరంలోనే ఆగింది. పోలీసులు కారును సమీపించేలోపు అందులోని కొందరు వ్యక్తులు దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్‌ఫోర్స్ బృందం వెంబడించి ఇద్దరిని పట్టుకుంది. వారిని తమిళనాడులోని కృష్ణగిరి, ధర్మపురి జిల్లాలకు చెందిన వారుగా గుర్తించింది. కారు తనిఖీ చేయగా తొమ్మిది ఎర్రచందనం దుంగలు లభించాయి. ఇద్దరు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మదనపల్లె కిడ్నీ రాకెట్ ముఠా అరెస్ట్

నిందితుల్లో అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ ఆంజనేయులు
ఈ కేసుకు పలు రాష్ట్రాలతో లింకులు
మదనపల్లె డీఎస్పీ మహేంద్ర వెల్లడి

అరెస్ట్ చేసిన కిడ్నీ ముఠాతో డీఎస్పీ, సీఐలు

మదనపల్లె: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర చెప్పారు. అరెస్టయిన వారిలో అన్నమయ్య జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) కె.ఆంజనేయులు ఉన్నారు. ఈ కేసు వివరాలను డీఎస్పీ శనివారం మీడియాకు వెల్లడించారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాలెంకు చెందిన సాడి యమున (29) నుంచి ఈ నెల 9న మదనపల్లెలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కిడ్నీని తొలగించగా..ఆ మరుసటి రోజున ఆమె మృతి చెందింది. ఆమె తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి ఆరుగురిని అరెస్ట్ చేశామని, ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన వైద్యుడిని అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ చెప్పారు.

మధ్యవర్తులతో మదనపల్లెకు..

సాడి యమున (29)కు ఆనందపురం మండలానికి చెందిన సూరిబాబు (45)తో సాన్నిహిత్యం ఉంది. యమునకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో కిడ్నీ ఇస్తే కష్టాలు తీరిపోతాయని సూరిబాబు చెప్పాడు. దీంతో మధ్యవర్తులైన విశాఖకు చెందిన కాకర్ల సత్య (43), పిల్లి పద్మ (45)తో ఈ విషయం చెప్పడంతో వీరు సత్యసాయి జిల్లా కదిరి ప్రభుత్వ ఆస్పత్రి డయాలసిస్ మేనేజర్ మెహరాజ్ (37), మదనపల్లె ప్రభుత్వాసుపత్రి డయాలసిస్ మేనేజర్ బాలరంగడు(35) దృష్టికి తీసుకెళ్లారు. వీరు మదనపల్లెలోని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులను కలిసి కిడ్నీ ఇచ్చేవారు, స్వీకరించే వారున్నారని, పెద్ద మొత్తంలో నగదు వస్తుందని చెప్పగా..ఆయన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు నిర్ణయించారు. ఈ ఆపరేషన్ చేసేందుకు బెంగళూరుకు చెందిన డాక్టర్, అతని సహాయకులు ఇద్దరు పాల్గొన్నారని, డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈనెల 9న గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో యమునకు ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించగా యమున మృతి చెందిందని చెప్పారు. తాము జరిపిన దర్యాప్తులో మదనపల్లె గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో యమునతోపాటు మరో మహిళ నుంచి కిడ్నీ తొలగించి మరొకరికి అమర్చినట్లు డీఎస్పీ చెప్పారు. వీరిలో యమున మృతి చెందగా మరో మహిళ కోలుకుందని, యమున కిడ్నీ స్వీకరించిన వ్యక్తి కూడా ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. ఇంకా ఎంతమంది నుంచి కిడ్నీలు తొలగించారు, వాటిని ఎవరికి అమర్చారన్న వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆపరేషన్లు చేసిన బెంగళూరుకు చెందిన వైద్యుడిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ఈ డాక్టర్ మదనపల్లెకు వచ్చి ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌లు చేస్తున్నట్లు చెప్పారు.

నాలుగు రాష్ట్రాల్లో లింకులు...

మదనపల్లె కిడ్నీరాకెట్ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారినట్లు డీఎస్పీ చెప్పారు. కిడ్నీలు స్వీకరించిన వారి నుంచి అందిన మొత్తంలో అందరూ కలిసి వాటాలు వేసుకున్నారని తెలిపారు. ఈ కేసు లింకులు కర్ణాటక, గోవా, తెలంగాణ, ఏపీల్లో ఉన్నాయని, దీనిపై 4 పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కిడ్నీ రాకెట్ కేసులో మరో ఎనిమిది మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ చెప్పారు. అరెస్ట్ చేసిన ఆరుగురు నిందితుల ఫోన్లను, సీసీ కెమెరా సీడీఆర్‌లను స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్ఎల్‌కు పంపినట్లు చెప్పారు.

గిద్దలూరు 'వెంకన్న' ఆభరణాల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెండి ఆభరణాల చోరీ అయిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసులో నిందితులంతా గుంటూరు జిల్లాలోని ఓ టీడీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడి బంధువులే కావడం గమనార్హం. గిద్దలూరులోని రాచర్లరోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెలలో వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. ఆలయ పూజారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గుంటూరు జిల్లా అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వడ్లమాను శివారెడ్డితో పాటుగా అతడికి సహకరించిన పొన్నూరుకు చెందిన జెట్టిబోయిన ప్రవీణ్, జెట్టిబోయిన ప్రదీప్‌లను అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ నాగరాజు శనివారం చెప్పారు. నిందితుల నుంచి 8 కిలోల వెండి ఆభరణాలు, కరిగించిన వెండి ముద్దలు, 3 సెల్‌ఫోన్లు, బైక్, 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గత నెల 23న శివారెడ్డి ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారి శంఖుచక్రాలు, హస్తాలు, కిరీటం 10 కిలోల స్వామివారి వెండి ఆభరణాలు అపహరించాడు. వాటిని పొన్నూరులోని ప్రదీప్, ప్రవీణ్ సహాయంతో కొన్ని వెండి ఆభరణాలను కరిగించారు. ఇందుకు ఆన్‌లైన్‌లో మిషన్‌ను కొనుగోలు చేశారు. శివారెడ్డిపై ప్రకాశం, గుంటూరు, కడప జిల్లాల్లో 50 కేసులు ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. ఆభరణాలను గుర్తించేందుకు ఆలయ నిర్వాహకులను, ఫిర్యాదు చేసిన అర్చకుడిని పిలిచినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా చోరీ చేసిన దానిలో కిలో వెండిని శివారెడ్డి బద్వేల్‌కు చెందిన నాగరాజుకు ఇచ్చినట్లు తెలిసింది. నాగరాజు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పోరాటాలతోనే కార్మికుల జీవితాల్లో మార్పు

ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

ఒంగోలు టౌన్: సమస్యలు పరిష్కారం కావాలన్నా, కార్మికుల జీవితాల్లో మార్పు రావాలన్నా సమర శీల పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభ ఒంగోలులో శనివారం జరిగింది. ఈ సభకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం అధ్యక్షత వహించారు. ఇందులో ఎమ్మెల్సీ బొర్రా గోపి మాట్లాడుతూ..చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తవుతున్నా కార్మికుల సమస్యల పరిష్కారంపై ఎలాంటి చొరవ చూపించడం లేదని విమర్శించారు. అంతకుముందు ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాల నేతలు

ఆర్కే సింగ్‌పై బీజేపీ సస్పెన్షన్ వేటు

పట్నా: బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలతో వార్తల్లోకెక్కిన కేంద్ర మాజీ మంత్రి రాజ్ కుమార్‌సింగ్‌పై బీజేపీ సస్పెన్షన్ వేటు వేసింది. బిహార్ రాష్ట్ర బీజేపీ ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించరాదో తెలపాలంటూ ఆయనకు షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. దీంతో, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆర్కే సింగ్ తెలిపారు. రాజీనామా లేఖను బీజేపీ చీఫ్ జేపీ నడ్డాకు పంపానన్నారు. అవినీతిని, నేరమయమవుతున్న రాజకీయాలను తాను ప్రశ్నించడం కొందరికి ఇబ్బంది కలిగించినట్లు కనిపిస్తోందని ఆయన ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. అదేవిధంగా, పార్టీ ఎమ్మెల్సీ అశోక్ కుమార్, ఆయన భార్య, కటిహార్ నగర మేయర్ ఉషా అగర్వాల్‌ను కూడా కాషాయ దళం సస్పెండ్ చేసింది. వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ టికెట్‌పై వీరి కుమారుడు సౌరభ్ సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం తార్‌కిశోర్ ప్రసాద్‌పై పోటీకి దిగారు. దీంతో, అశోక్ కుమార్, ఉషా అగర్వాల్ దంపతులు కుమారుడి తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ఇలా ఉండగా, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శిగా పనిచేసి రిటైరైన ఆర్కే సింగ్ 2014లో బీజేపీ కండువా కప్పుకున్నారు. రెండుసార్లు ఎంపీ అయ్యారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మూడో విడత పోటీ చేసి, సీటు కోల్పోయారు.

ఎస్ఐఆర్ తుది జాబితాలో 3 లక్షల ఓటర్లు చేరారు

కాంగ్రెస్ ఆరోపణలపై ఈసీ జవాబు

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల సమయంలో 7.42 కోట్లమంది ఓటర్లుండగా, పోలింగ్ నాటికి 7.45 కోట్లకు ఓటర్లు పెరగడంపై కాంగ్రెస్ వ్యక్తం చేసిన అనుమానాలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. అక్టోబర్ 6వ తేదీన విడుదల చేసిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) తుది జాబితాలో 7.42 కోట్ల మంది ఓటర్లుండటం నిజమేనని తెలిపింది. అయితే, రెండు దశల పోలింగ్‌లో నామినేషన్ల దాఖలు తుది గడువుకు 10 రోజుల ముందు వరకు అర్హులైన పౌరులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చనే నిబంధన మేరకు కొత్తగా నమోదు చేసుకోవడం ఓటర్ల సంఖ్య 3 లక్షల మంది ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకున్నారని వివరించింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కారాదనేదే తమ లక్ష్యమని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

ఘోర పరాజయంపై ఖర్గేతో చర్చించిన రాహుల్

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. పార్టీ వైఫల్యానికి దారితీసిన కారణాలపై ఇద్దరు నేతలు చర్చించినట్లు సమాచారం. వీరితోపాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, అజయ్ మాకెన్, కృష్ణ అల్లవారు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. బిహార్‌లోని పోటీ చేసిన 61 సీట్లకు గాను కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరు సీట్లను గెలుచుకోవడం తెల్సిందే. బిహార్ ఫలితాల అనంతరం మహాగఠ్ బంధన్ పార్టీ నేతలతో సమావేశమైన రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. బిహార్ ఫలితాలపై మీడియాతో కేసీ వేణుగోపాల్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)లో పారదర్శకత అనేదే లేకుండా పోయిందని, ఎన్నికల ప్రక్రియ ఆసాంతం అనుమానాస్పదంగా ఉందని ఆరోపించారు.

25 మంది మంత్రుల్లో ఓడింది ఆ ఒక్కరే..!

పట్నా: బిహార్‌లో ఎన్డీయే బంపర్ మెజారిటీ సాధించింది. సీఎం నితీశ్ కేబినెట్‌లో ఒకే ఒక్కరు తప్ప మొత్తం 25 మంది మంత్రులు విజయతీరాలకు చేరారు. డిప్యూటీ సీఎంలు సమ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా గెలిచారు. బీజేపికి చెందిన మొత్తం 15 మంది గెలిచారు. వీరిలో వ్యవసాయ మంత్రి ప్రేమ్ కుమార్ వరుసగా 8వ సారి గెలిచారు. మరి ఓడిందెవరు? సుమిత్ కుమార్ సింగ్. ఈయన 2020లో స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. ఈసారి జేడీయూ టికెట్‌పై జముయి జిల్లా చకాయ్ స్థానంలో పోటీ చేసి, ఓడిపోయారు. సుమారు 13 వేల ఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి, ఆర్జేడీకి చెందిన సావిత్రీ దేవి చేతిలో పరాజయం చవిచూశారు. ఐదేళ్ల క్రితం సుమిత్ ఈమెనే ఓడించారు. దివంగత మాజీ మంత్రి, సీఎం నితీశ్ సన్నిహితుడైన నరేంద్ర సింగ్ కుమారుడే సుమిత్. మొన్నమొన్నటి వరకు సైన్స్, టెక్నాలజీ, సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించారు.

రూ.17.18 కోట్ల విలువైన కొకైన్‌తో పట్టుబడిన మహిళ

ముంబై: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు టాంజానియా నుంచి వచ్చిన ఓ మహిళ నుంచి రూ.17.18 కోట్ల ఖరీదు ఉండే 1.71 కిలోల కొకెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మహిళలను అదుపులోకి తీసుకుని ఆమె లగేజీని క్షుణ్నంగా పరిశీలించారు. రెండు ఆహారం పొట్లాలు, ఒక ప్లాస్టిక్ బాటిల్, ఒక పౌచ్..అన్నిట్లోనూ ఉన్న తెల్లటి పౌడర్ మాదక ద్రవ్యం కొకెయిన్ అని తేల్చారు. ఉగాండాలోని ఎంటెబె ప్రాంతానికి చెందిన ఈమెపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.

గిరిజన యోధులను విస్మరించారు

కొన్ని కుటుంబాలకే ఘనత దక్కాలని ఆరాటపడ్డారు

- కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం
- తాము వచ్చాకే బిర్సా ముండాకు గౌరవం దక్కిందని వెల్లడి

గాంధీనగర్: దేశ స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనులు చిరస్మరణీయమైన పాత్ర పోషించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. కానీ, 60 ఏళ్లపాటు అధికారం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ మన గిరిజన యోధులను ఏనాడూ పట్టించుకోలేదని, పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. గిరిజనుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని తప్పుపట్టారు. స్వాతంత్ర్య పోరాట ఘనత 'కొన్ని కుటుంబాలకే' దక్కాలన్నదే కాంగ్రెస్ అసలు ఉద్దేశమని విమర్శించారు. గిరిజన వీరుడు భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా శనివారం గుజరాత్ రాష్ట్రం నర్మదా జిల్లాలోని దెడియాపాద పట్టణంలో నిర్వహించిన 'జనజాతీయ గౌరవ్ దివస్'లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. రూ.9,700 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.2,320 కోట్లతో నిర్మించే 50 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు కూడా ఉన్నాయి. అలాగే ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తీ–ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద నిర్మించిన లక్ష ఇళ్ల గృహ ప్రవేశాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... దేశ ప్రతిష్ట, ఆత్మగౌరవం, స్వాతంత్ర్యాన్ని కాపాడే విషయంలో ఎల్లప్పుడూ గిరిజన బిడ్డలే ముందంజలో ఉంటున్నారని ప్రశంసించారు. అడవి బిడ్డల నుంచి ఎంతోమంది స్వాతంత్ర్య పోరాట యోధులు ఉద్భవించారని గుర్తుచేశారు. గుజరాత్‌లో గోవింద్ గురు, రూప్‌సింగ్ నాయక్, మోతీలాల్ తేజావత్ వంటి గిరిజనులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. ఈ ఉద్యమంలో లెక్కలేనన్ని అధ్యాయాలు గిరిపుత్రుల ధైర్యసాహసాలతో నిండిపోయాయని అన్నారు.

న్యాయం చేయాలని సంకల్పించాం

''దేశ స్వేచ్ఛ కోసం రక్తం చిందించిన గిరిజనులకు తగిన గుర్తింపు దక్కలేదు. కొందరి కుట్రల కారణంగా వారు తెరవెనుకే ఉండిపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాలకులు గిరిజనుల త్యాగాలను, అంకితభావాన్ని పూర్తిగా విస్మరించారు. 2014 కంటే ముందు భగవాన్ బిర్సా ముండాను ఎవరూ స్మరించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆయనకు గౌరవం దక్కింది. జార్ఖండ్‌లో బిర్సా ముండా ఇంటిని సందర్శించిన మొట్టమొదటి ప్రధానమంత్రిని నేనే. జనజాతీయ గౌరవ్ దివస్ అనేది గిరిపుత్రులకు జరిగిన అన్యాయాన్ని గుర్తుచేసుకోవడానికి దక్కిన అవకాశం. అడవి బిడ్డల పట్ల కాంగ్రెస్ నిర్వాకాలు ఏమిటో ప్రజలు తెలుసుకోవాలి. గిరిజనులకు శ్రీరాముడితో అనుబంధం ఉంది. వారు శ్రీరాముడి కాలానికి చెందినవారు. అయినా ఆ సంగతి కాంగ్రెస్ ప్రభుత్వాలకు పట్టలేదు. వారి జీవితాలను మెరుగుపర్చాలని ఏనాడూ ఆలోచించలేదు. మేయు గిరిజనుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వారికి న్యాయం చేకూర్చాలని సంకల్పించాం. గిరిజనుల కోసం కేంద్రంలో ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత అటల్ బిహారీ వాజ్‌పేయిదే.

నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం

మేరీ కోమ్, దుతీ చంద్, బైచుంగ్ భూటియా వంటి గిరిజన యువతీ యువకులు అంతర్జాతీయ వేదికపై మన దేశ కీర్తి ప్రతిష్టలను పెంచారు. గిరిజన ప్రాంతాల నుంచి ఎంతో మంది క్రీడాకారులు వస్తుండడం సంతోషంగా ఉంది. పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల మహిళల క్రికెట్ ప్రపంచ్ కప్ సాధించిన మన క్రీడాకారుల బృందంలో ఒక గిరిజన బిడ్డ కూడా ఉండడం గర్వకారణం. మన ప్రభుత్వం గిరిజనుల్లో నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహిస్తోంది. అణగారిన వర్గాలకు సైతం అందరితోపాటు సమాన అవకాశాలు దక్కాలి. అందుకోసం నిరంతరం శ్రమిస్తున్నాం. గత ఐదేళ్లలో మోడల్ గిరిజన పాఠశాలల నిర్మాణానికి రూ.18,000 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేశాం. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఫలితంగా గిరిజన పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య ప్రతిఏటా భారీగా పెరుగుతోంది'' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

పండోరి మాత ఆలయంలో పూజలు

నర్మదా జిల్లాలోని దేవమోగ్రా గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం పండోరి మాత ఆలయాన్ని ప్రధానమంత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు సూరత్ నగరంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ పురోగతిని మోదీ సమీక్షించారు.

దెడియాపాద పట్టణంలో బిర్సా ముండాకు నివాళులర్పించాక అభివాదం చేస్తున్న మోదీ

బిర్సా ముండాకు నివాళులు

స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన విప్లవకారుడు భగవాన్ బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా ప్రధాని మోదీ శనివారం ఘనంగా నివాళులర్పించారు. పరాయి పాలకుల దౌర్జన్యాలపై ఆయన సాగించిన పోరాటాలు, చేసిన త్యాగాలు ప్రతి తరానికీ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఉద్ఘాటించారు. బిర్సా ముండా జయంతిని 'జనజాతీయ గౌరవ్ దివస్'గా దేశమంతటా నిర్వహించారు.

ఠాణాలో ప్రమాదవశాత్తు పేలుడు

తొమ్మిది మంది దుర్మరణం
32 మందికి గాయాలు

శ్రీనగర్/న్యూఢిల్లీ

హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్ సభ్యుల స్థావరం నుంచి వందల కేజీల పేలుడు రసాయనాలను స్వాధీనంచేసుకుని అరెస్టుల పర్వానికి తెరలేపి విజయవంతంగా దూసుకుపోతున్న జమ్మూకశ్మీర్ పోలీసులకు ఊహించని చేదు అనుభవం ఎదురైంది. నిబంధనావళి ప్రకారం పేలుడు పదార్థాల నుంచి కొంతమేర శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపేందుకు ప్రయత్నిస్తుండగా అవి ఒక్కసారిగా పేలిపోయి 9 మంది ప్రాణాలను బలిగొంది. మరో 32 మంది సైతం గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని శ్రీనగర్‌లోని శ్రీ మహారాజా హరిసింగ్ ఆస్పత్రిలో చేర్చించి చికిత్సనందిస్తున్నారు. శ్రీనగర్ శివారులోని నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో ఈ ప్రమాదం సంభవించింది. ఈ దాడి చేసింది తామేనని తొలుత ఒక ఉగ్రవాద సంస్థ ప్రకటించుకోగా అసలు దాడే జరగలేదని, అది ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు అని జమ్మూకశ్మీర్ డీజీపీ నళిని ప్రభాత్ శనివారం మధ్యాహ్నం స్పష్టంచేశారు. శుక్రవారం రాత్రి 11.20గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. పేలుడు ధాటికి పోలీస్‌స్టేషన్ భవనం దారుణంగా దెబ్బతింది. సమీప భవనాలు సైతం పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఘటన వివరాలను నళిని ప్రభాత్‌తో పాటు కేంద్రహోంశాఖ కార్యదర్శి(కశ్మీర్) ప్రశాంత్ లోఖండే ఢిల్లీలో మీడియాకు వెల్లడించారు.

అసలేమైంది?

వైద్యుల ముసుగులో డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ షాహీన్, డాక్టర్ ముజామిల్ తదితరులు అక్రమంగా సేకరించిన వందల కేజీల పేలుడు పదార్థాలను నవంబర్ 9, 10 తేదీల్లో జమ్మూకశ్మీర్, హరియాణా, యూపీ పోలీసు బృందం ఫరీదాబాద్‌లో సంయుక్తంగా పట్టుకోవడం తెల్సిందే. వీటిని జాగ్రత్తగా ఒక పికప్ ట్రక్కులో చిన్నచిన్న సంచుల్లో శ్రీనగర్‌కు తీసుకొచ్చి నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌ఏరియాలో పెట్టారు. ఆ పదార్థాన్ని ఎన్ని రకాల పేలుడు రసాయనాల మిశ్రమంగా తయారుచేశారో తేల్చేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఒక బృందం రంగంలోకి దిగి ప్రామాణిక నిర్వహణ విధానం(ఎస్‌ఓపీ) ప్రకారమే శాంపిళ్లను సేకరించడం మొదలెట్టారు. అయితే అవి అత్యంత విస్ఫోటక స్వభావం కల్గిఉండటంతో అనూహ్యంగా పేలుడు సంభవించింది. దీంతో ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ టీమ్‌లోని ముగ్గురు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, మేజిస్ట్రేట్ బృందంలోని ఇద్దరు రెవెన్యూ శాఖ అధికారులు, స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారి, ఒక టైలర్ చనిపోయారు. ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులుసహా 27 మంది గాయపడ్డారు. చాలా సూట్‌కేసుల్లోని పేలుడుపదార్థాల నుంచి శాంపిళ్ల సేకరణ ప్రక్రియ గత రెండ్రోజులుగా కొనసాగుతోందని డీజీపీ తెలిపారు.

రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఏకాకిగా మారిన దర్జీ కుటుంబం

పోలీస్‌స్టేషన్‌లో చిన్న ప్యాకింగ్ పని ఉందని రమ్మంటే వెళ్లిన స్థానిక టైలర్ మొహమ్మద్ షఫీ పారీ మళ్లీ తిరిగిరాలేదు. పేలుడు ఘటనలో ఆయన ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబం అనాథగా మారింది. 47 ఏళ్ల షఫీకి స్థానికంగా ఎంతో మంచి పేరుంది. మసీదులో కార్యక్రమాల కోసం విరాళాలు సేకరిస్తారు. చుట్టుపక్కల వాళ్లను ప్రేమగా పలకరిస్తాడు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాజకీయాలకు గుడ్‌బై!

నా కుటుంబంతో సంబంధాలు తెంచుకుంటున్నా

- లాలూ కుమార్తె రోహిణి ఆచార్య ప్రకటన

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కీలక పరిణామం చోటుచేసుకుంది. క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య ప్రకటించారు. అంతేకాదు, తమ కుటుంబంతో సంబంధాలను తెంచుకుంటున్నట్లు కూడా ఆమె స్పష్టం చేశారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో ఆర్జేడీ ఘోర పరాజయం పాలవడం తెల్సిందే. ఈ నేపథ్యంలో రోహిణి చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. 'నా సోదరుడు తేజస్వీ యాదవ్ సన్నిహితులు సంజయ్ యాదవ్, రమీజ్ ఆలం సలహా మేరకే ఈ నిర్ణయం తీసుకుంటున్నా. తప్పంతా నాపైనే వేసుకుంటున్నా'అని ఆమె శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. వృత్తిరీత్యా వైద్యురాలైన రోహిణి, లాలు సారథ్యంలోని ఆర్జేడీలో గతంలో క్రియాశీలకంగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లోని సరన్ నుంచి పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. ఎన్నికలకు ముందే ఈమె ఎక్స్‌లో తండ్రి లాలూ, సోదరుడు తేజస్వీ యాదవ్‌లను అన్‌ఫాలో చేశారు. మరో సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరించడంతోపాటు, కుటుంబం నుంచి వెలివేస్తున్నట్లు లాలూ ప్రకటించడం తెల్సిందే. భార్యతో విడాకుల వ్యవహారం కోర్టులో ఉండగా ఓ మహిళతో అతడు సంబంధం నడుపుతుండటం లాలూకు నచ్చలేదు. అయితే, ఈ నిర్ణయంపై రోహిణి అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. ఇటీవలి ఎన్నికల్లో సొంతంగా పార్టీ ప్రకటించిన తేజ్ ప్రతాప్.. పార్టీ అభ్యర్థులను కూడా బరిలోకి దించారు. కానీ, స్వయంగా ఓటమి పాలైన తేజ్ ప్రతాప్, ఏ ఒక్క సీటునూ గెలుచుకోలేకపోయారు. ఈ పరిణామాల నడుమ శనివారం ఆమె ఈ మేరకు ఎక్స్‌లో పోస్టులు పెట్టినట్లుగా భావిస్తున్నారు. కుటుంబంలో ఎప్పటి నుంచో కొనసాగుతున్న విభేదాలు ఒక్కసారిగా రచ్చకెక్కినట్లుగా చెబుతున్నారు. తండ్రి లాలూకు రోహిణి 2022లో తన కిడ్నీని దానం చేశారు. రోహిణి వాస్తవానికి కిడ్నీ దానం చేయలేదనే పుకార్లు, ఆరోపణలే ఈ మొత్తం వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నట్లు చెబుతున్నారు.

అప్పుడే అమర్చి పేల్చాడా?

న్యూఢిల్లీ: యావత్ భారతావని ఉలిక్కిపడేలా చేసిన ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో డాక్టర్ ఉమర్ నబీ ఒక్కడే ఇంతటి మారణహోమం సృష్టించాడా? లేదంటే మరికొందరు ఆరోజు అదే కారులో వచ్చి పరారయ్యారా? అనే అనుమానాలు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)లో ఎక్కువయ్యాయి. దీంతో కేసు దర్యాప్తును మెరుపువేగంతో ముందుకు తీసుకెళ్తున్నారు. నవంబర్ పదో తేదీ మధ్యాహ్నం నుంచి సాయంత్రందాకా మూడు గంటలపాటు కారులో నబీ ఏంచేశాడు? అతని వెంట ఇంకా ఎంత మంది ఉన్నారు? ఉంటే వాళ్లు ఆ తర్వాత ఏమయ్యారు? అనే ప్రశ్నలకు సమాధానాలకు వెతికేపనిలో అధికారులు తలమునకలయ్యారు. కారు మూడు గంటలపాటు పార్కింగ్‌లోనే ఉండగా చుట్టూ వాహనాలు పార్కింగ్‌లోకి వస్తూ పోతూ ఉన్నట్లు తేలడంతో ఆయా వాహనాల డ్రైవర్లు, యజమానులను అధికారులు ప్రశ్నించడం మొదలెట్టారు. సమీప వాహనాలను స్వాధీనంచేసుకున్నారు. కారులో ఉమర్ ఏంచేశాడు? ఏదైనా బాంబులాంటిది బిగించడం చూశారా? కారులో ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది ఉన్నారా? అనే ప్రశ్నలను అడిగినట్లు సమాచారం.

బాంబుల తయారీలో ఉమర్‌కు నైపుణ్యం

పేలుడుపదార్థాలతో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్(ఐఈడీ) తయారుచేయడంలో డాక్టర్ ఉమర్ నైపుణ్యం సాధించాడని దర్యాప్తు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. విదేశీ హ్యాండ్లర్ నుంచి అందుకున్న బాంబు తయారీ విధాన పీడీఎఫ్ ఫైళ్లు, ఓపెన్ ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న అక్రమ సమాచారంతో బాంబుల తయారీలో ఉమర్ నిపుణుడిగా మారాడని తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, పెట్రోలియం, డిటోనేట్ ఉపకరణాలతో వీటిని తయారుచేసి ఉండొచ్చని చెబుతున్నారు. వీటి సాయంతో ఐఈడీని కేవలం 5–10 నిమిషాల్లో తయారుచేయొచ్చు. ఎర్రకోట పార్కింగ్ స్థలంలోనే ముడిపదార్థాలతో అప్పటికప్పుడు బాంబు తయారుచేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రతను బట్టి ఆరోజు రెండు కేజీల అమ్మోనియం నైట్రేట్, పెట్రోలియం ఉపయోగించి ఉంటారని ఫోరెన్సిక్ నిపుణులు అంచనావేస్తున్నారు. ఆదివారం తోటి డాక్టర్లు అరెస్ట్ కావడంతో హడావిడిగా ముందస్తు ప్లాన్‌లేకుండా ఉమర్ సోమవారం ఎర్రకోటకు వచ్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సాధారణంగా ఎర్రకోట సందర్శనలకు సోమవారం సెలవు. ఆరోజు పర్యాటకులు రద్దీ ఉండదు. రద్దీ లేనప్పుడు బాంబు పేల్చినా తీవ్రత పెద్దగా ఉండదని ఉమర్ భావించి ఉండొచ్చు. సాయంత్రం వేళ అయినా కనీసం ఛాందినిచౌక్ ప్రాంత కొనుగోలుదారులు, స్థానికులతో ఆ ప్రాంతం కిటకిటలాడితే అప్పుడు బాంబు పేలుద్దామనే ఆ 3 గంటలు ఉమర్ పార్కింగ్ ఏరియాలోనే వేచి చూశాడని పోలీసులు ఓ అంచనాకొచ్చారు.

డాక్టర్ ఉమర్ నబీ

'ఆహారం'పై టారిఫ్‌లు రద్దు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- పశుమాంసం, కాఫీ, పండ్లు సహా 100కుపైగా ఉత్పత్తులు ఇక చౌక

వాషింగ్టన్: విదేశీ ఉత్పత్తులపై టారిఫ్‌లతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్తంత కరుణ చూపారు. విదేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతి అయ్యే పశుమాంసం(బీఫ్), కాఫీ, ఉష్ణమండల పండ్లతోపాటు ఇతర ఉత్పత్తులపై టారిఫ్‌లు రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. అమెరికాలో ఆహార పదార్థాలు, నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోవడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ట్రంప్ కఠిన విధానాలపై వారు దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రజాగ్రహం నానాటికీ తీవ్రమవుతోంది. ఆ ఒత్తిళ్లు తట్టుకోలేక ట్రంప్ దిగివచ్చినట్లు తెలుస్తోంది. అందుకే టారిఫ్‌ల రద్దు ప్రకటన చేసినట్లు సమాచారం. దీనివల్ల స్వదేశంలో ధరలు తగ్గుతాయి. అమెరికన్లకు ఊరట లభించనుంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే టారిఫ్‌ల కొరడా అందుకున్న సంగతి తెలిసిందే.

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం

బీఫ్, కాఫీ, అరటి పండ్లు, అవకాడో, టమాటాలు, కొబ్బరి కాయలు, మామిడికాయలు, కోకోవా, బ్లాక్ టీ, గ్రీన్ టీ, వెనిల్లా బీన్స్, జామకాయలు, నిమ్మకాయలు, నారింజ, పైనాపిల్, జీడిపప్పు, గసగసాలు సహా 100కిపైగా ఉత్పత్తులపై సుంకాలు రద్దు చేస్తూ సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వుపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ టారిఫ్‌ల రద్దు ఆదేశాలు గురువారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చినట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది.

ఓట్లు వచ్చినా సీట్లు రాలే!

- బిహార్ ఎన్నికల్లో 23 శాతం ఓట్లు సాధించిన ఆర్జేడీ
- 143 స్థానాల్లో పోటీ చేసి 25 సీట్లకు పరిమితం
- బీజేపీ, జేడీ(యూ) కంటే ఎక్కువ ఓట్లు దక్కించుకున్న తేజస్వీ పార్టీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్–రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) కూటమి ఘోరంగా పరాజయం పాలయ్యింది. మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. విపక్ష కూటమి తరపున అంతా తానై వ్యవహరించారు. రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించారు. ప్రచారంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. పలు హామీలు ఇస్తూ ప్రజలను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. తేజస్వీ సభలకు జనం పోటెత్తారు. తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ నీడ నుంచి ఆయన బయటకు వచ్చినట్లే కనిపించింది. ఎన్నికల్లో కష్టపడి పనిచేసినప్పటికీ ఓటమి తప్పకపోవడం ఆర్జేడీ శ్రేణులను నిరాశకు గురిచేసింది. ఈ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాలకు గాను పొత్తులో భాగంగా 143 స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీ కేవలం 25 స్థానాలు గెల్చుకుంది. అయితే, మిగతా పార్టీల కంటే ఆర్జేడీకే అత్యధికంగా ఓట్లు రావడం గమనార్హం. పోలైన మొత్తం ఓట్లలో ఆ పార్టీకి ఏకంగా 23 శాతం ఓట్లు లభించాయి. బీజేపీ, జేడీ(యూ)లకు ఇన్ని ఓట్లు రాలేదు. ఓట్ల శాతం పరంగా చూస్తే ఏకైక అతిపెద్ద పార్టీగా ఆర్జేడీ అవతరించింది. ఆ పార్టీ 2020 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో 75 సీట్లు గెల్చుకొని, 23.11 శాతం ఓట్లు దక్కించుకుంది. అంటే ఈసారి సీట్ల సంఖ్య తగ్గినా, ఓట్ల శాతం స్వల్పంగా మాత్రమే తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఆర్జేడీ పట్ల జనాదరణలో మార్పు రాలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

తేజస్వీ యాదవ్ పార్టీకి 1.15 కోట్ల ఓట్లు

ఆర్జేడీ ఓట్ల పరంగా కరోడ్‌పతిగా నిలిచింది. ఈ ఎన్నికల్లో 1,15,46,055 ఓట్లు సాధించింది. 101 సీట్లలో పోటీ చేసి, 89 సీట్లు కైవసం చేసుకొని ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీకి దక్కిన ఓట్లు కేవలం 20.08 శాతం. 2020లో 19.46 శాతం ఓట్లు లభించగా, ఈసారి స్వల్పంగా పెరిగాయి. బీజేపీకి మొత్తం 1,00,81,143 ఓట్లు దక్కాయి. బీజేపీ మిత్రపక్షం, సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్(యునైటెడ్) 101 సీట్లలో పోటీ చేసి, 85 సీట్లు తన ఖాతాలో వేసుకుంది. ఆ పార్టీకి 19.25 శాతం ఓట్లు(96,67,118) వచ్చాయి. 2020లో 15.39 శాతం ఓట్లు రాగా, ఇప్పుడు 3.86 శాతం పెరిగాయి. నితీశ్ కుమార్ ప్రజా వ్యతిరేకతను అధిగమించడంతోపాటు ఓట్ల శాతాన్ని మెరుగుపర్చుకోవడం విశేషం. చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్ జనశక్తి పార్టీ(రామ్‌విలాస్), హిందుస్తానీ అవామీ మోర్చా(సెక్యులర్), రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలకు వచ్చిన ఓట్లు కూడా కలిపితే జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే)కు దక్కిన మొత్తం ఓట్లు దాదాపు 47 శాతం. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాగఠ్‌బంధన్‌కు దక్కిన మొత్తం ఓట్లు 35.89 శాతం. రెండు కూటముల మధ్య ఓట్ల తేడా 11.11 శాతంగా తెలుస్తోంది.

ఎక్కువ సీట్లలో పోటీ చేయడం వల్లే..

ఆర్జేడీ ఓట్ల శాతం భారీగా ఉన్నప్పటికీ సీట్లు పెరగలేదు. ఎన్నికల్లో ఒక పార్టీ లేదా ఒక అభ్యర్థికి మొత్తం ఎన్ని ఓట్లు వచ్చాయో ఓట్ల శాతాన్ని బట్టి నిర్ధారించవచ్చు. ప్రజాదరణ ఏ స్థాయిలో ఉందో అంచనా వేయడానికి ఓట్ల శాతం తోడ్పడుతుంది. ఆర్జేడీ పాలన జంగిల్‌రాజ్ అంటూ ప్రత్యర్థులు పదే పదే నిందలు వేసినప్పటికీ ఆ పార్టీ పట్ల ప్రజాభిమానం చెక్కుచెదరలేదు. ఆర్జేడీ తాను పోటీ చేసిన చాలా నియోజకవర్గాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఎన్డీయేకు గట్టి పోటీ ఇచ్చింది. ఆ పార్టీ ఓట్ల శాతం మెరుగ్గా కనిపించడానికి మరో కారణం కూడా చెప్పుకోవచ్చు. 143 స్థానాల్లో ఆర్జేడీ బరిలోకి దిగింది. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా ఇన్ని స్థానాల్లో పోటీ చేయలేదు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలైన బీజేపీ 101, జేడీ(యూ) 101 సీట్లలో పోటీకి దిగాయి. బీజేపీ కంటే 42, జేడీ(యూ) కంటే 42 ఎక్కువ సీట్లలో ఆర్జేడీ పోటీ చేసింది. ఎక్కువ సీట్లలో పోటీపడింది కాబట్టే ఎక్కువ ఓట్లశాతం కనిపిస్తోందని, ఇందులో ఆర్జేడీ కొత్తగా బలం చాటింది ఏమీ లేదని కొందరు విశ్లేషకులు అంటున్నారు. గెలిచిన, ఓడిపోయిన నియోజకవర్గాల్లో పార్టీకి పోలైన మొత్తం ఓట్లను కలిపితే ఆర్జేడీకి 23 శాతం ఓట్లు పడినట్లు చెబుతున్నారు. ఆర్జేడీకి 2010 ఎన్నికల్లో 22 సీట్లు లభించాయి. ఆ తర్వాత అతి తక్కువ సీట్లు దక్కింది మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం.

- సాక్షి, నేషనల్ డెస్క్

తేజస్వీ

పార్టీలకు లభించిన సీట్లు, ఓట్ల శాతం

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	89	20.08
జేడీ(యూ)	85	19.25
కాంగ్రెస్	6	8.71
ఆర్జేడీ	25	23
ఎల్జేపీ(రామ్‌విలాస్)	19	4.97
ఎంఐఎం	5	1.85

నరేంద్ర స్వామికి అన్నాభిషేకం

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులో శనివారం ఏకాదశి సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రాజరాజ నరేంద్ర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు.

అమ్మవారికి బంగారు హారం

కొల్లూరు: కొల్లూరుకు చెందిన బలిజేపల్లి విష్ణుమూర్తి, రామలక్ష్మిల కుమారుడు, కోడలు గోపీ కృష్ణ, సత్యశ్రీలు పార్వతీ అమ్మవారికి రూ. 1.75 లక్షలు విలువైన బంగారు హారం సమర్పించారు.

వెంకయ్య స్వామి ఆరాధన

వేమూరు(చుండూరు): చుండూరులో భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం నిర్వహించినట్టు ఆశ్రమ నిర్వాహకులు పులి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

అగస్త్యేశ్వరాలయంలో ఏకాదశి పూజలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వరాలయంలో శనివారం కార్తిక బహుళ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, హోమాలు, నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ మాట్లాడుతూ ఆలయంలో ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగించుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మెగా జాబ్ మేళా

తెనాలి అర్బన్: అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో వినరాపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. మేళాలో 250 మంది విద్యార్థులు పాల్గొనగా 108 మంది వివిధ కంపెనీల్లో ఎంపికైనట్లు ఆయన తెలిపారు. మొత్తం 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారని చెప్పారు. వీరిలో మొదటి విడత కింద 30 మందికి నియామక పత్రాలు అందజేశారు. మిగిలిన వారికి త్వరలో నియామక పత్రాలు అందజేయనున్నట్టు వివరించారు.

రాష్ట్ర రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా గుంటూరు నగరానికి చెందిన పి.రామచంద్రరాజు బాధ్యతలు స్వీకరించారు. శనివారం విజయవాడలోని రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో భాగంగా సభ్యులు రామచంద్రరాజును వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా, భారతీయ విద్యాభవన్ కార్యదర్శిగా, శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం ట్రస్ట్ కార్యదర్శిగా వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు.

దీపాలతో శోభాయాత్ర

తెనాలిటౌన్: చీకటి నుంచి వెలుగుకు మనలోని జ్ఞాన జ్యోతిని వెలిగించేందుకు దీపారాధన దోహదపడుతుందని శరణాగతి గోష్ఠి స్వామి త్రిదండి రామానుజ దాస స్వామిజీ పేర్కొన్నారు. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో తెనాలిలో శనివారం హిందూ మహిళ దీపోత్సవ కార్యక్రమంగా 1008 మహిళలతో శోభాయాత్ర నిర్వహించారు. పీఠాధిపతి నరేంద్ర రామానుజ దాస స్వామి పాల్గొని కార్తికమాసం విశిష్టతను తెలియజేశారు. ఎం.శ్రీనివాసరెడ్డి, అంబటి మారుతీరామ్, ఎస్వీ కనకదుర్గ, కె.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై కార్తిక దీపాలు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు శనివారం దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీ భూ వరాహస్వామికి అభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

అటకెక్కిన డెత్ ఆడిట్

- జీజీహెచ్ వైద్యాధికారుల నిర్లక్ష్యం
- సమావేశాలు నిర్వహించని ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ

గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: పేదల పెద్దాసుపత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కీలకమైన సమీక్షలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ఏడు జిల్లాల నుంచి రోగులు జీజీహెచ్‌కు వస్తుంటారు. చికిత్స పొందుతూ ఎవరైనా చనిపోతే వారు ఎందుకు చనిపోయారో కారణాలు తెలియక బంధువులు ఆస్పత్రిపై నెగెటివ్ ఆలోచనతో ఉంటారు. డెత్ ఆడిట్ నిర్వహించి మృతికి కారణాలను ఆస్పత్రి అధికారులు తెలియజేయాలి. మృతుడి బంధువులకు వాటిని తెలియజేయడం వల్ల ఆస్పత్రిపై పాజిటివ్ ఆలోచనతోపాటుగా అధికారులపై కూడా గౌరవం పెరుగుతుంది. దీనికి మంగళం పాడేశారు. గతంలో ప్రతి నెలా డెత్ ఆడిట్ చేసేవారు. సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయా వైద్య విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు, వైద్యాధికారులు ఈ సమీక్షలో పాల్గొనేవారు. రోగికి అందించిన చికిత్స, వైద్య సౌకర్యాల గురించి వివరించేవారు.

ఆస్పత్రి అధికారుల ఉదాసీనత

గుంటూరు జీజీహెచ్‌లో పలు స్పెషాలిటీ వైద్య విభాగాలు ఉన్నాయి. వ్యాధుల నిర్ధారణలో ఎంతో కీలకమైన బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫిజియాలజీ వంటి వైద్య విభాగాలు సైతం గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. అత్యంత అరుదైన సర్జరీలు చేస్తూ ప్రాణాలు కాపాడుతున్న పేరు గాంచిన సర్జన్లు, సూపర్ స్పెషలిస్టులు, క్లిష్టమైన కాన్పులు చేస్తూ తల్లీబిడ్డలకు నూతన జీవితాలను ఇస్తున్న వైద్యులు పలువురు ఇక్కడ ఉన్నారు. ఆస్పత్రిపై నమ్మకంతో ప్రతి రోజూ పెద్దసంఖ్యలో రోగులు వస్తుంటారు. ఒక్కోసారి కొంత మంది వైద్యులు చేసే తప్పిదాలు, వైద్య సౌకర్యాల కొరత వల్ల, వైద్య పరికరాలు పనిచేయకపోవటం వల్ల, మందులు, సర్జికల్ వస్తువులు సకాలంలో అందుబాటులో లేకపోవటం వల్ల చికిత్స పొందుతూ కొంత మంది మరణిస్తుంటారు. వీటిపై డెత్ ఆడిట్ నిర్వహిస్తే భవిష్యత్తులో మరలా అలాంటి సమస్యలు, కారణాలతో మరణాలు జరగకుండా నివారించే అవకాశాలు ఉన్నాయి. కాని ఆస్పత్రి అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యధోరణితో డెత్ ఆడిట్ అటకెక్కింది.

ప్రతిరోజూ 20కి పైగా మరణాలు

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ చికిత్స పొందుతూ 20 మందికి పైగా రోగులు చనిపోతున్నారు. కొంత మంది వైద్యుల నిర్లక్ష్యంతో మొక్కుబడిగా వార్డుల్లో డెత్ ఆడిట్ చేస్తున్నామంటూ సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. మరణాలు తగ్గింపులో కీలకమైన ఇన్‌ఫెక్షన్ కంట్రోల్. గతంలో ప్రతినెలా కమిటీ సమావేశాలు నిర్వహించి తగ్గించేందుకు ప్రణాళిక సిద్ధం చేసేది. ఐసీయూ, ఎన్‌ఐసీయూ వంటి కీలక వైద్య విభాగాల్లో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ లో ఉండడం ద్వారా మరణాలు చాలా వరకు తగ్గించవచ్చు. ఆసుపత్రి అధికారులు ఇప్పటికైనా స్పందించి డెత్ ఆడిట్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సమావేశాలు నిర్వహించి మరణాల తగ్గింపునకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డెత్ ఆడిట్ ఎంతో కీలకం

డెత్ ఆడిట్‌తో మరోసారి అలాంటి మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఆస్పత్రితో పాటు వైద్యులు, సిబ్బంది లోపాలను చెక్ చేసుకుని వాటిని సరిచేసి, మరో మరణం సంభవించకుండా నివారించవచ్చు. రోగి బంధువులకు కూడా సందేహాలు తొలగిపోతాయి. నెగెటివ్ ఆలోచన లేకుండా మరణం పై ఆందోళనలు చేయకుండా ఇళ్లకు వెళ్లారు. ఇంత కీలకమైన డెత్ ఆడిట్‌ను ఆస్పత్రి అధికారులు చేయకుండా మిన్నకుండి పోతున్నారు.

మార్కెట్ కమిటీలు డీలా..

- ఫీజు వసూలులో వెనుకంజ
- తెనాలి, దుగ్గిరాల, గుంటూరు, పొన్నూరు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డుల పరిస్థితి కొంత మెరుగు
- మిగిలిన తాడికొండ, ఫిరంగిపురం, మంగళగిరి మార్కెట్ కమిటీలలో తగ్గిన వసూళ్లు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఫీజులు, అద్దెలు, సంతల ద్వారా రూ.146.31 కోట్లు వసూలు చేయాలని దిశానిర్దేశం

గుంటూరు మార్కెట్ యార్డు

కొరిటెపాడు(గుంటూరు): వివిధ రకాల ఫీజుల వసూలులో మార్కెట్ కమిటీలు డీలా పడ్డాయి. జిల్లాలోని తెనాలి, దుగ్గిరాల, గుంటూరు, పొన్నూరు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డుల పరిస్థితి కొంత మేర మెరుగ్గానే ఉన్నా.. మిగిలిన తాడికొండ, ఫిరంగిపురం, మంగళగిరి మార్కెట్ కమిటీలు బాగా వెనకబడ్డాయి..

- గుంటూరు జిల్లాలో ఉన్న 8 మార్కెట్ కమిటీలు, వాటి పరిధిలో ఉన్న 15 చెక్ పోస్టుల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల ఫీజులు, అద్దెలు, సంతల ద్వారా రూ.146.31 కోట్లు వసూలు చేయాలని దిశానిర్దేశం చేశారు.
- అక్టోబర్ నెల చివరి నాటికి అంటే ఏడు నెలల కాలానికి 37.38 శాతంతో రూ.54.69 కోట్లు వసూలయ్యాయి.
- రూ.42.91 కోట్లు గుంటూరు మార్కెట్ కమిటీ నుంచి వసూలు కాగా, మిగిలిన ఏడు మార్కెట్ కమిటీల ద్వారా కేవలం రూ.11.78 కోట్లు వసూలు కావడం పరిశీలించదగిన అంశం.
- గుంటూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.115 కోట్లు కాగా ఇప్పటి వరకు 37.31 శాతంతో రూ.42.91 కోట్లు సాధించారు.
- తెనాలి లక్ష్యం 7.65 కోట్లు కాగా 47.45 శాతంతో రూ.3.63 కోట్లు వసూలు చేసి అగ్రస్థానంలో కొనసాగుతోంది.
- దుగ్గిరాల లక్ష్యం 3.75 కోట్లు కాగా 42.72 శాతంతో రూ.1.60 కోట్లు, పొన్నూరు లక్ష్యం రూ.8.38 కోట్లు కాగా 40.13 శాతంతో రూ.3.36 కోట్లు వసూలు చేసింది.
- ప్రత్తిపాడు లక్ష్యం రూ.4.45 కోట్లు కాగా 37.82 శాతంతో రూ.1.68 కోట్లు, ఫిరంగిపురం లక్ష్యం రూ.1.88 కోట్లు కాగా 19.53 శాతంతో రూ.0.37 కోట్లు మాత్రమే వసూలు చేశాయి.
- మంగళగిరి లక్ష్యం రూ.3.03 కోట్లు కాగా 33.96 శాతంతో రూ.1.03 కోట్లు, తాడికొండ లక్ష్యం రూ.2.17 కోట్లు కాగా 5 శాతంతో రూ.0.11 కోట్లు మాత్రమే వసూలు చేశాయి.
- గత ఏడాది ఇదే సమయానికి రూ.65.94 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు చేయగా, ఈ ఏడాది రూ.54.69 కోట్లు మాత్రమే వసూలు చేయడం గమనార్హం.
- గత ఆర్థిక సంవత్సరం కన్నా ఈ ఏడాది మార్కెట్ ఫీజు వసూలు రూ.11.25 కోట్లు తగ్గడం విశేషం.
- లక్ష్య సాధన దిశగా నడిపించడంలో ఆర్జేడీ, డీడీఎం, ఏడీఎంలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సాగర్ నీటి మట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 586.80 అడుగులకు చేరింది. ఇది 304.4680 టీఎంసీలకు సమానం. కుడి కాలువకు 10,000, ఎడమ కాలువకు 3,374, ఎస్‌ఎల్‌బీసీకి 600, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదల వుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 14,274 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 14,274 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

మాట్లాడుతున్న అన్నాబత్తుని శివకుమార్ వేదికపై నూరిఫాతిమా, అంబటి మురళీకృష్ణ, బాలవజ్రబాబు, అబ్దుల్లాఖాన్ తదితరులు

- మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పాత గుంటూరులో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ ఈసారి అధికారంలోకి రాగానే కార్యకర్తల ద్వారానే ప్రతి గడపకు సంక్షేమం, ప్రతి గ్రామాన అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన పఠాన్ అబ్దుల్లా ఖాన్ ఆధ్వర్యంలో శనివారం పాతగుంటూరులోని అంజుమన్ షాదీఖానాలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం, సత్కార సభ నిర్వహించారు. సమావేశానికి పార్టీ మైనార్టీ విభాగం తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు లియాఖత్ అలీ అధ్యక్షత వహించారు.

అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ పార్టీలో క్యాడర్‌కు ఎలాంటి కష్టం వచ్చినా, ఎంత వరకు వచ్చేందుకైనా నా వెనుకాడేది లేదని చెప్పారు. గతంలో జరిగిన ప్రతి తప్పును సరిదిద్దుకుని ముందుకు వెళుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి అందజేయని సంక్షేమాన్ని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అందజేశారన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరూ ఈరోజున మరోసారి మోసపోయామని అర్థం చేసుకున్నారన్నారు.

వై.ఎస్.జగన్ 2.0 కార్యకర్తలకు ధైర్యం నింపుతోంది

వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వై.ఎస్.జగన్ 2.0 పాలన భవిష్యత్తులో కార్యకర్తలకు ఎనలేని ధైర్యాన్ని నింపుతున్నదన్నారు. కంటికి రెప్పలా ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని, కాపాడాల్సిన బాధ్యత మనపైనే ఉందని వైయస్ జగనన్న ప్రతిరోజూ జగనన్న చెప్తారన్నారు. రాష్ట్రంలో ఒక నియంతృత్వ పాలన కొనసాగుతోందని, కేవలం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేసుకుని చంద్రబాబు ప్రభుత్వం పాలనను సాగిస్తున్నదన్నారు.

చంద్రబాబు ప్రభుత్వం ఉనికి కోల్పోతోంది

తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజల్లో ఉనికి కోల్పోతుందని చెప్పారు. ఈరోజున ప్రతిపక్షంలో ఉన్న మనం పేదల పక్షాన పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పదవులు తీసుకున్న ప్రతి ఒక్కరూ వారి బాధ్యతలు గుర్తెరిగి గత ప్రభుత్వంలో మేమేమున్నాము, వారి సమస్యలు నాయకుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరికి రుణ పడి ఉంటా

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి పఠాన్ అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని బాధ్యతగా ముందుకు తీసుకెళతానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మమేకమై పాటుపడతానన్నారు. జిల్లాలోని సమస్యలు తెలుసుకుని ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుండి నడుస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదా ఖాన్, పార్టీ ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరి ఉత్తేజ్‌రెడ్డి, అఖిల భారతీయ వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్, పార్టీ నేతలు సలీం, జాఫర్, రామయ్య, సత్యం, శివనారాయణ, సర్దార్, శ్రీకాంత్‌రెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ఇచ్చే భరోసా ఎనలేనిది

వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కార్యకర్తలు ఇచ్చే భరోసా నాయకులు వేసే ప్రతి అడుగులోనూ ఎంతో ధైర్యాన్ని కల్పిస్తుందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తే, వై.ఎస్.జగనన్న మరో రెండు అడుగులు ముందుకు వేసి మైనార్టీలకు ఎనలేని సంక్షేమాన్ని అందజేశారన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

- కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా
- లాలుపురంలో 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు రూరల్: వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని లాలుపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వివిధ పాఠశాల విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–2047 లక్ష్యంగా అందరూ కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలని, పెద్దలకు కూడా దీనిపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛ రథం పరిశీలించారు. గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ ప్రసంగించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కళ్యాణచక్రవర్తి, ఆర్డీవో కే శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, గుంటూరు రూరల్ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, రూరల్ ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాని, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత కనీస బాధ్యత

గుంటూరు వెస్ట్: మనం నివసిస్తున్న ప్రాంతాల్లో కనీస పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత మనపైనే ఉందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జేసీతోపాటు డీఆర్వో షేక్ ఖాజావలి, డీపీఓ నాగసాయి కుమార్, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు అధికారులు పరిసరాలను శుభ్రపరిచారు. జేసీ మాట్లాడుతూ పరిశుభ్రంగా ఉండటానికి పెద్దగా ఖర్చుచేయనవసరం లేదన్నారు. దీనిని మన ఇంటి నుంచే ప్రారంభించాలన్నారు. పెద్దలు ఇది పాటిస్తే పిల్లలు కూడా వారిని చూసి నేర్చుకుంటారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా చెత్తను సేకరించేందుకు అనేక మార్గాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రజలు కొంచెం బాధ్యత వహిస్తే ఆహ్లాదకరమైన సమాజ ఏర్పాటుకు సహకరించిన వారవుతారన్నారు. దీంతోపాటు ఇళ్ల పరిసర ప్రాంతాల్లోనూ, పార్కుల్లోనూ చెట్లను పెంచాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

వాగులోకి బోల్తా పడిన ట్రాక్టర్

ప్రత్తిపాడు: ట్రాక్టర్ బోల్తా పడి రైతు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన ఈదర శంకర్ రెడ్డి (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని పొలంలో వంట సాగు చేసే నిమిత్తం శనగలు వెద పెట్టాడు. అనంతరం మరొక పొలంలో శనగలు వెద పెట్టేందుకు కోల్డ్ స్టోరేజ్ నుంచి శనగలు బస్తాలను ట్రాక్టర్‌పై తీసుకుని సాయంత్రం సమయంలో ఇంటికి వెళుతున్నాడు. మార్గంమధ్యలో గ్రామంలోని వాగు పైనున్న బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న శంకర్‌రెడ్డి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూమి కావలెను
1. ఎకరం లేదా పై బడినవి ఏవైనా సరే
క్లియర్ టైటిల్ గలిగిన రోడ్ సౌకర్యం గల స్థలం, మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఉండాలి, 40 అడుగుల అప్రోచ్ రోడ్డు కలిగిన, ఇబ్బంది లేనివి, వ్యవసాయ భూములు అయినా, సంబంధిత పత్రాలతో క్రింది ప్రాంతాలలో
10 కిలోమీటర్ల లోపు మాత్రమే కావలెను.
1. పెదకాకాని-మంగళగిరి-ఉప్పల్ ప్రాంతాలలో
2. ఇనుకుర్ రింగ్ రోడ్-బుడంపాడు ప్రాంతాలలో
3. నల్లపాడు-రెడ్డిపాలెం ప్రాంతాలలో
4. గుంటూరు-అమరావతి రోడ్
5. తెనాలి-పొన్నూరు-ప్రత్తిపాడు ప్రాంతాలలో
ఆసక్తి గలవారు
98488 24184
నంబరులో సంప్రదించగలరు.
Mail Id: apparao@a-mix.in

స్పెషల్ డ్రైవ్ చేపడతాం

- విద్యార్థుల సంఖ్యను పెంచుతాం
- జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ.రేణుక

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: ఉర్దూ బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడతామని జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ.రేణుక అన్నారు. ప్రత్తిపాడు ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఏడాదికి ఏడాది తగ్గుముఖం పడుతుండటం, ఈ ఏడాది ముగ్గురు విద్యార్థులే మిగలడం, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదంటూ శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఉర్దూ బడి.. చతికిల పడి' కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. పాఠశాల పరిస్థితిపై డీఈవో ఆరా తీశారు. పూర్తిస్థాయి నివేదికను అందించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి భాషిం, మండల విద్యాశాఖాధికారులు ప్రాథమిక విచారణ నిర్వహించి నివేదికను డీఈవోకి అందించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. గుంటూరు జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి, మండల విద్యాశాఖాధికారులు సంయుక్తంగా పాఠశాల పరిధిలోని క్యాచ్ మెంట్ ఏరియాలో పర్యటించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 600 గరిష్టం : రూ. 800

మోడల్ ధర రూ. 700

క్లుప్తంగా

10న బాలల లలిత కళా ఉత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న బాలల లలిత కళా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్. మంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల వ్యవస్థాపకురాల్లో ఒకరైన గుడిసె ప్రభావతి స్మృతి దినోత్సవం సందర్భంగా గత 30 ఏళ్లుగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వివిధ లలిత కళల్లో ప్రతిభావంతులైన బాలలకు ప్రతిభా పల్లవం పురస్కారంతో పాటు బాల సాహితీ సృజనకర్తలకు మంగాదేవి పురస్కారం, సాహిత్య రంగానికి సేవలందిస్తున్న మహిళలకు మాలతీ ప్రమదా పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. విద్యార్థులకు గాత్ర, వాద్య సంగీతంలో వర్ణిక, బృందగానాలతో పాటు చిత్రలేఖన, కథా, లేఖారచనలో పోటీలు నిర్వహించి సర్వోత్తమ, విశిష్టోత్తమ, ఉత్తమ స్థానాల్లో నిలిచిన బాలలకు బహుమతులు కింద రూ.పది వేలు, రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు. గురువులకు రూ.నాలుగు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండువేలు చొప్పున బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీలకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలని ఆమె తెలిపారు. ఈనెల 25న, డిసెంబర్ 10న నిర్వహించనున్న పోటీల వివరాలను పాఠశాల ఫోన్ నంబర్లు 0863-2232405, 9390115480, 7729967489, 8886447837 ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఇతర వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌వీబీకేటీ.ఇన్ సైట్ నుంచి పొందాలని తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

ముగ్గురిపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అరుణ శనివారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ ఎన్ కాశాల పక్కవీధిలోని ఓ గృహంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ ఒక మహిళ, ఇద్దరు పురుషులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయాలు

విజ్ఞాన భాండాగారాలు

జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులతో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, సుబ్బరత్నమ్మ

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జేసీ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. శనివారం 58వ జాతీయ వారోత్సవాల్లో భాగంగా అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదవాలని సూచించారు. విజ్ఞానాన్ని పెంపొందించుకుని, విలువలు గల భావి భారత పౌరులుగా ఎదగాలని ఉద్బోధించారు. గ్రంథాలయాలు, పుస్తక పఠనం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాలు అంటే తనకు ఎంతో ఇష్టమని విద్యార్థులకు ఏ అవసరమైన తప్పకుండా సహకారం అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, డిప్యూటీ లైబ్రేరియన్ కందుల ఝాన్సీలక్ష్మి, డాక్టర్ ఉప్పల శ్రీనివాస్ ప్రసాద్, విశ్రాంత ఉద్యోగి ఎంఎస్ సుభానీ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్డెన్స్ గ్రంథాలయంలో

బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను వయోజన విద్య విశ్రాంత డైరెక్టర్ చావా బోసు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.శకుంతల, పాఠకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీపై ముస్లింల ఆగ్రహం

- తాడికొండలో మసీదు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వచ్చిన అధికారులు
- విరుచుకుపడిన ముస్లిం నాయకులు

ఈవోఆర్డీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ముస్లింలు, టీడీపీ నాయకులు

తాడికొండ: ''ఇక్కడ కార్యదర్శిగా పనిచేస్తూ నువ్వు రూ. 3 లక్షలు తీసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేయించి, నాలుగు సంవత్సరాలుగా నమాజ్ చేసుకుంటున్న మసీదు నిర్మాణాన్ని కూలగొట్టేందుకు ఇప్పుడు వచ్చావా ?'' అంటూ తాడికొండలో ముస్లింలు ఈవోఆర్డీ రమణయ్యపై మండిపడ్డారు. శనివారం తాడికొండ చెరువుపై నిర్మాణం చేపట్టిన ప్రాంతాన్ని పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. అక్రమ నిర్మాణం తొలగించాలని కోరగా, టీడీపీ నాయకులతో పాటు ముస్లింలు విరుచుకుపడ్డారు.చెరువు పోరంబోకులో నిర్మాణం చట్టరీత్యా నేరమని తొలగిస్తామని అధికారులు తెలపడంతో వారు మండిపడ్డారు. ''నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేసి ఉందని.. అసలు ఎలాంటి అనుమతులు లేకుండా పంచాయతీ కార్యాలయం కళ్లెదుటే భారీగా అక్రమ నిర్మాణం చేస్తుంటే చూస్తూ ఊరుకొని వదం వెనుక నువ్వు డబ్బులు తీసుకోవడం కాదా ?'' అని ప్రశ్నించారు. అధికారులతో ఏం మాట్లాడావో అన్నీ ఆధారాలు ఉన్నాయంటూ టీడీపీ నాయకుడు ఇస్మాయిల్ ఆరోపించడంతో ఆయన ఆక్రోశ్యారు. నిర్మాణం బేస్‌మెంట్ లెవల్‌కు చేరిందని, ఆపేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు సైతం తొలగించాలని సూచించినా ముస్లింలు ససేమిరా అనడంతో అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో కార్యదర్శి రెహమాన్, ఎస్ఐ జోజి, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు స్టార్ ఎక్సలెన్స్ అవార్డు

అవార్డు అందుకుంటున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్టు, గుంటూరు గైనకాలజీ వైద్యుల సంఘం సెక్రటరీ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు స్టార్ సంపూర్ణ రెసిడెన్షియల్ ఎక్సెలెన్స్ అవార్డు లభించింది. పూణెలో స్టార్ సంపూర్ణ ఫాగ్సి రెసిడెన్షియల్ కాన్ఫరెన్స్ శనివారం జరిగింది. డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నుకున్న ఏకైక వ్యక్తిగా రికార్డు సృష్టించారు. గైనకాలజీ వైద్యుల సంఘం ద్వారా మహిళల ఆరోగ్యం కోసం ఆయన చేస్తున్న వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు, గైనకాలజీ వైద్యుల్లో నైపుణ్యం పెంపొందించడానికి నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు, వర్క్‌షాపులు, కాన్ఫరెన్స్‌లకు ఈ అవార్డును డాక్టర్ ఉమాశంకర్‌కు అందజేశారు. వర్క్‌షాపు నిర్వాహకులు డాక్టర్ సునీత టెండూల్కర్ చేతుల మీదుగా డాక్టర్ ఉమాశంకర్ అవార్డు అందుకున్నారు.

మైనర్‌ను మోసం చేసిన ముగ్గురిపై పోక్సో కేసు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు రూరల్: మైనర్‌ను ప్రేమ పేరుతో మోసం చేసి అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడికి, సహకరించిన అమ్మ, అమ్మమ్మని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పదహార్‌ళ్ల మైనర్‌కు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుని, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన 20 సంవత్సరాలు వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమగ్ర దర్యాప్తు చేశామన్నారు. నెల్లూరు జిల్లా విడవలూరు మండలం అన్నారెడ్డిపాలెం గ్రామానికి చెందిన గంగపతి బన్నీ స్నేహితుని సహాయంతో వెంగళాయపాలెం బాలికను బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని నెల్లూరు జిల్లాలోని సొంత గ్రామానికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.దీనికి అతని అమ్మ, అమ్మమ్మలు కూడా సహకరించినట్లు తెలియడంతో శనివారం అరెస్ట్ చేసి, పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

షార్ట్ వీడియోస్ కాంటెస్ట్‌లో నందిగామ యువకుడి ప్రతిభ

డీజీపీ శివధర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ నుంచి బహుమతి అందుకుంటున్న నాగండ్ల

సత్తెనపల్లి: బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ పోలీస్ శాఖ నిర్వహించిన అర్వైవ్ అండ్ అల్వైవ్ షార్ట్ వీడియోస్ కాంటెస్ట్‌లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన నాగండ్ల వాసు గోవర్ధన చారి అలియాస్ వాసు వన్స్ మోర్ ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వీసి సజ్జన్నార్ చేతుల మీదుగా వాసు గోవర్ధనచారి బహుమతి, రూ. 25 వేలు నగదు ప్రోత్సాహకం శనివారం అందుకున్నాడు. పలువురు సినీ ప్రముఖులు కమెడియన్ బాబు మోహన్, హీరో శర్వానంద్, హీరో ఆది సాయికుమార్, సింగర్ మను, సింగర్ మోహనా భోగరాజు, యాంకర్ సుమ తదితరులు వాసు గోవర్ధన చారిని ప్రత్యేకంగా అభినందించారు.

పొలం వివాదంలో గొడ్డలితో దాడి

అద్దంకి రూరల్: పొలం హద్దుల విషయంలో తమ్ముడు కొడుకు.. పెదనాన్నపై గొడ్డలితో దాడి చేసిన ఘటన శనివారం సాయంత్రం మండలంలోని శంఖవరప్పాడు గ్రామంలో చోటు చేసుకుంది. క్షతగాత్రుడి కుమారుడు తెలియజేసిన వివరాల మేరకు... శంఖవరప్పాడులో నివాసం ఉంటున్న కైపు శ్రీరాములకు, తమ్ముడు నాగేశ్వరరావుకు తండ్రి నుంచి కొంత పొలం వచ్చింది. ఈనేపథ్యంలో గత కొన్ని నెలలుగా ఇంకా తన తండ్రి వాటా కింద ఎక్కువ పొలం వచ్చేదని తరచూ నాగేశ్వరరావు కుమారుడు సుధాకర్‌రెడ్డి.. శ్రీరాములుపై గొడవ పడతుండేవాడు ఈ క్రమంలో సుధాకరరెడ్డి సోమవారం శ్రీరాములు ఇంటికి వచ్చి గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. శ్రీరాములు మెడపై తీవ్ర గాయాలవడంతో క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలు తరలించారు.

మాయమాటలు చెప్పి మైనర్ బాలిక కిడ్నాప్

నాదెండ్ల: మాయమాటలు చెప్పి ఓ మైనర్ బాలికను యువకుడు కిడ్నాప్ చేసిన సంఘటన వెలుగులోకొచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కనపర్రు గ్రామానికి చెందిన బాలిక నరసరావుపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రతి రోజూ ఇంటి నుంచి స్కూలు బస్సులో వెళ్ళి వస్తుంటుంది. గత నెల 7న ఇంట్లో ఉన్న మైనర్ బాలికను నరసరావుపేటకు చెందిన బాలు అనే యువకుడు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు చేయటంతో యువకుడిపై పోక్సో కేసు నమో దు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.19 లక్షల అధిక చెల్లింపులు

- తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిర్వాకం
- వార్షిక తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
- తిరిగి కొంత సేకరించామంటున్న అధికారులు

తెనాలి సబ్‌ట్రెజరీ కార్యాలయం

తెనాలి రూరల్: తెనాలి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం వెలుగు చూసింది. వార్షిక తనిఖీల్లో భాగంగా గుంటూరు నుంచి వచ్చిన బృందం కార్యాలయంలో చేపట్టిన తనిఖీల్లో రూ.19 లక్షలు అధికంగా చెల్లించిన విషయం బహిర్గతమైంది. కొన్ని బిల్లుల్లో తేడాలు ఉండడం, రికార్డులు సరిగా లేకపోవడాన్ని బృందం గుర్తించి నివేదిక సమర్పించాలని సిబ్బందిని ఆదేశించింది. తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయలలో నిధులు గోల్‌మాల్ అవడం ఇప్పుడు కొత్తేమీ కాదు. ఇదే కార్యాలయం ఉద్యోగి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తమ సొంత ఖాతాల్లోకి నిధులు మళ్లించాడు. గతంలో వేతనాలకు సంబంధించి బిల్లులు చేసి, వాటిని సబ్‌ట్రెజరీ ఉద్యోగులు బ్యాంకులకు పంపేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ జరుగుతోంది. నగదు లావాదేవీలను కంప్యూటరీకరించి, సునాయాసంగా నగదు బదిలీ కోసం కార్పొరేట్ ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ అకౌంట్ పేరిట ప్రభుత్వం సబ్ ట్రెజరీలకు అకౌంట్లు తెరిచింది. వీటికి సంబంధించిన పాస్‌వర్డ్‌లు సంబంధిత ఉద్యోగికి, కార్యాలయ అధికారికి మాత్రమే తెలిసే అవకాశం ఉంది. ఈ పాస్‌వర్డ్ తెలుసుక్ను ఉద్యోగి సుమారు రూ.కోటి వరకు దారి మళ్లించాడు. ప్రభుత్వోద్యోగుల వేతనాలకు సంబంధించి సబ్‌ట్రెజరీల్లో టోకెన్‌లు కేటాయిస్తారు. ఆ టోకెన్ సంఖ్య ప్రకారం బ్యాంకులు వేతనాలను ఖాతాల్లోకి జమచేస్తాయి. ఈ విధానంలో టోకెన్ నంబర్లను నకిలీ చెక్కులకు జోడించి బ్యాంకులకు పంపి, సదరు ఖాతాల్లోని నిధులను ఆ ఉద్యోగి తన, తన తమ్ముడి ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఇప్పుడు ఇదే తరహాలో రూ.19 లక్షలు అధిక చెల్లింపులు జరిగినట్టు తనిఖీల్లో బయటపడింది. దీనిపై సమగ్ర విచారణ కొనసాగుతోంది. విశ్రాంత ఉద్యోగుల ఖాతాలకు ఈ చెల్లింపులు మళ్లాయని ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై తెనాలి ఉప ఖజానా అధికారి శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఆరుగురు పెన్షనర్ల ఖాతాల్లోకి నగదు జమ అయినట్టు గుర్తించామని చెప్పారు. ఇప్పటికే కొంత తిరిగి వసూలు చేశామని తెలిపారు. గతంలో టోకెన్లు ఇచ్చే విధానానికి బదులు ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ విధానంలో ఆటోమేటిక్‌గా చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతున్న నేపథ్యంలో చెల్లింపులు జరిగి ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



రేపల్లె: బడుగు వర్గాల రక్షణ కోసం ప్రభుత్వం చట్టాలు చేసి రక్షణ కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రామలక్ష్మి కోరారు. అత్యాచార నిరోధక చట్టం, మాన్యువల్ స్కావెంజర్స్‌లపై స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, నేరాలు, వేధింపులను నిరోధించేందుకు రాజ్యాంగం చట్టాలను చేసిందన్నారు. పౌరహక్కుల పరిరక్షణ, సమసమాజ స్థాపనకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టమన్నారు. బాధితులు రక్షణ కోసం కేసులు పెడితే అధికారులు అన్నివిధాలుగా దర్యాప్తు చేసి రక్షణ కల్పిస్తారని పేర్కొన్నారు. సమాజంలో ఎవరైనా ఇబ్బందులకు గురైతే నిర్భయంగా అధికారులను ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. బలహీన వర్గాల రక్షణకు ఏర్పాటు చేసిన కమిటీలో డీఎస్పీ, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, డీఎల్‌పీఓలు, ఎన్జీవోలు ఉంటారని పేర్కొన్నారు. కమిటీలో సభ్యులు చట్టాల అమలులో నిర్వహించాల్సిన విధానాలపై చర్చించారు. డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

- Spot Admissions by 20/11: B.Sc AI / CSc -5k, B.Com CA, BA Hist/Sp Eng - 4k, PLNM Degree College, Opp: ANU. 9177408565

REAL ESTATE

- అమరావతి ధరణికోట పంచాయితీలో 2 ఎకరముల బిట్లు 4, 6సెంట్లు, 4సెంట్లు ఇళ్ళ స్థలములు అమ్మకమునకు కలవు. సంప్రదించండి. 9177546316
- గుంటూరుసిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర: జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. 9492770739
- గుంటూరు మిర్చి యార్డ్ ప్రక్కన చిలకలూరిపేట రోడ్డు నందు 1530 గజాలు, ఆర్.సి.సి. గోడౌన్ అమ్మకానికి కలదు. ✆ 9848752471

FLAT FOR SALE

- తాడేపల్లి ఆశ్రమం రోడ్డు గేటెడ్ కమ్యూనిటీ 2BHK, 1233Sft కార్ పార్కింగ్, స్విమ్మింగ్ పూల్, ఫంక్షన్ హాల్‌తో సేల్‌కి కలదు. 7995996624
- గుంటూరు గుజ్జనగుండ్ల కరెంట్ ఆఫీస్ దగ్గరలో బంతి చామంతి షాపు ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో 2BHK ఫ్లాట్ E/F, W/F Ready to Occupy ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. 9000054902
- రాజమండ్రి హుకుంపేట రైల్వే స్టేషన్ రోడ్, సావిత్రి నగర్‌లో సువిధ ఎన్‌క్లేవ్ నందు 2BHK, E/F, 970Sft గల ఫ్లాట్ అమ్మబడును, నో బ్రోకర్స్ ✆ 8790261100

HOUSE FOR SALE

- తెనాలి ఐతానగర్ గోలి టౌంక వాటర్ ప్లాంట్ రోడ్డు ఉత్తరం ఫేసు పూర్తి వాస్తు ఇండిపెండెంట్ హౌస్ అమ్మకం. రాఘవ: 91333 91224
- పొన్నూరు రోడ్ పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌కు 200 మీ.ల దూరంలో తూర్పు ఫేస్ గల 272 చ॥ గ॥ ల 2 అంతస్తుల ఇల్లు అమ్మకానికి కలదు. అద్దె 45,000 వచ్చును. ఇంటిముందు 100 అ॥ల రోడ్ ఉంది. సంప్ర: 6302727534

LAND FOR SALE

- పొన్నూరు జీబీసీ రోడ్ వినాయకుడిగుడి రామా రైస్ మిల్ సమీపంలో ఒక ఎకరం పొలం అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించండి. 9441548434

OLD BUILDINGS

- పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 97032 90782, 9700442419

TOLET COMMERCIAL

- గుంటూరు అమరావతిరోడ్ హోసన్న మందిర్ ఎదురు పెట్రోలు బంక్ ప్రక్కన మెయిన్ రోడ్ ఫేస్ 100వ॥ స్థలము షాపులకు కమర్షియల్ పర్పస్‌కు అద్దెకు కలదు. సంప్ర॥ 91337 20722

SERVICES

- ప్రముఖ బ్యాంకుల నందు గల హౌసింగ్ లోన్‌లు మా యొక్క బ్యాంకుకు టేక్ ఓవర్ చేయబడును & కొత్త లోనులు చేయబడును కమీషన్ అవసరం లేదు. & DSAలు కావలెను. కమీషన్ వెంటనే ఇవ్వబడును. సంప్ర: 8121847536, 9966617161

BOREWELLS

- విజయ బోర్‌వెల్స్: 4-1/2, 6-1/2, 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్ర॥ 9866222717, 9848183887

WANTED

- మార్టూరు పరిసర ప్రాంతాల్లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శ్రీ రూము సబ్సిడీ మీల్స్. 8897169133, 9515524430
- గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383
- గుంటూరు సిటీలో తెలుగు ఇంగ్లీషు టైపు ఫాస్ట్ గా చేయగలిగిన లేడీ టైపిస్ట్ కావలెను. 9666933337.
- గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (పగలు డ్యూటీ) మంచి జీతం. ఫోన్ నెంబర్ : 9959106355
- గుంటూరు సిటీలోని సత్యదయ అసోసియేట్స్ నందు జాబ్ చేయుటకు మండలాల వారీగా స్త్రీ/ పు కావలెను. 9912059165
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌చార్జీస్, క్లాసు ఇన్‌చార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000 నుండి 21000 వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429
- రామకృష్ణ గ్రూప్ (AP No-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ16-18వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 9603203355, 8247500574.
- రామకృష్ణ గ్రూప్ (AP No-1), HYD, VJA, Delhiకు టెలీకాలర్స్, కస్టమర్‌కేర్, అన్ని రకాల ఆఫీస్ స్టాఫ్ (స్త్రీ/పు) కావలెను. భో+వ+జీతం. ఇంటర్వ్యూ VJA. ✆ 9502501122, 9676901122
- కేర్ టేకర్స్ (జీతం: మగ 20 వేలు; ఆడ 18 వేలు), నర్సులు (25 వేలు). పేషంట్ ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కావలెను. Eminence హోమ్ కేర్ విజయవాడ. ✆ 97018 57559, 78158 35561
- 10th చదివిన షాప్‌లో డెలివరీ బాయ్స్ మరియు Tally అనుభవం కలిగి సేల్ డేటా ఎంట్రీతో పాటు గుమస్తా వర్క్ చేయుటకు కావలెను. 8142842888, 8639348560
- విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671
- ఎలక్ట్రికల్ ఆటోలు & ట్రాక్టర్లకు గుంటూరు జిల్లాలో బ్రాంచిల కొరకు 1.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ Q:ఏదైనాడిగ్రీ (ఫ్రెషర్స్ / అనుభవం ఉన్న వారు) 2. సర్వీస్ టెక్నీషియన్స్ ITI/ ఎలక్ట్రికల్ బ్యాక్‌గ్రౌండ్ (ఫ్రెషర్స్/ అనుభవం ఉన్న వారు) కావలెను. సం. 80089 31038, 91338 65966, hr.shreelakshmi infraequipments@gmail.com
- గుంటూరు పరిసర ప్రాంతాలలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో మా సంస్థ తరుపున పని చేయుటకు అనుభవము కలిగిన సెక్యూరిటీ సూపర్ వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు:30-45సం,ఇంటర్/ డిగ్రీ, ఎత్తు: 05'-06" పైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు: వయస్సు:23-45 సం, 10th,ఎత్తు: 05'-05"పైన లేబర్ యాక్ట్ ప్రకారం జీతం ఉదయం 11 గం.నుండి మీఒరిజినల్ సర్టిఫికెట్లతో సం: సత్యా ఇన్వెస్టిగేషన్&సెక్యూరిటీ సర్వీసెస్,బృందావన్ గార్డెన్స్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2951838
- ప్రముఖ హాస్పిటల్‌లో పని చేయుటకు MBBS డాక్టర్స్ M/F కావలెను. వర్క్ టైం: 10.00AM - 12PM, 2PM-6PM. 9381443438
- Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 year experience in tally. Cont: 91333 99257
- Wanted MBA Marketing / Business Development / supply chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257
- పెద్దకాకానిలో వికలాంగుల ఆశ్రమంలో పనిచేయుటకు 10th ఇంటర్ చదివిన యువతి యువకులు & వంటవారు కావలెను. 95500 29851
- గుంటూరు బ్యాంక్ వాలూర్స్ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు డిప్లొమో సివిల్ ఇంజనీర్ కావలెను. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. ఫోన్ : 99899 76995
- త్రివేణీహోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి భోజనం జీ. 18K-20K . Ph: 9640400073, 9160900024
- షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమం హైదరాబాద్‌లో లేడీ వంట మనుషులు,లేడీసూపర్ వైజర్స్, లేడీకేర్ టేకర్స్, నర్సులు,కాంపౌండర్స్, ఆయాలు, వాచ్‌మెన్స్ భార్యా భర్తలు కావలెను. 8985114453, 9391096931

FACULTY / TEACHERS

- ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌కి VI to X ఇంగ్లీష్ టీచర్స్ కావలెను. ఫోన్: 7799988938

సాక్షి క్లాసిఫైడ్స్

గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (ప్లస్)

ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

మీ సెల్‌ఫోన్ ప్రకటనల కొరకు సంప్రదించండి

గుంటూరు

7075167663

7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్లేషించిన తరువాతే పాఠకులు స్పందించాల్సిందిగా మా కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda

లక్ష్మీపురం బ్రాంచి, డోర్ నెం.5-87-6, లక్ష్మీపురం మెయిన్ రోడ్, గుంటూరు-522007. ఫోన్ : 0863-2272003, Mail: lakshmi@bankofbaroda.com

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయడమైనది.

[illegible]

ఇ.నెం. ... తేది. 17-03-2025 ... తేది. 11-03-2025 నాటికి రూ.44,03,702.48 ... తేది. 12-03-2025 ...

... 13(4) ... తేది 24-06-2025 ... తేది. 26-06-2025 ...

... తేది. 17-03-2025 ... 30 రోజులలోగా ...

ఆస్తి వివరములు :

[illegible]

స్థలం : గుంటూరు, తేది : 10-11-2025 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank (భారత ప్రభుత్వరంగ సంస్థ)

అసెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్ డి నెం.9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, వీఐపీ రోడ్డు విశాఖపట్నం-530003. ఫోన్ : 96409 33383, 98312 00669

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 9(1) తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా/లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన దిగువ తెలిపిన పట్టికలోని తేదిలో విక్రయించబడునని ప్రజానీకానికి, ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. రిజర్వు ధర, జమ చేయవలిసిన ధరావత్తు సొమ్ము వివరములు దిగువ పట్టికలోని సంబంధిత ఆస్తుల వద్ద తెలియజేయడమైనది.

బ్రాంచ్ పేరు : స్టేషన్ రోడ్డు, గుంటూరు (019500)

ఇ-వేలం తేది & సమయం: 05-12-2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 05-12-2025, మ॥ 3.00 గం.ల వరకు

ఋణగ్రహీత/హామీదారుల పేర్లు & చిరునామా : M/s. సాయి బాలాజీ కాటన్ ట్రేడర్స్ (ఖాతా నెం.0195008700011534, 019500EC00000106 & 019500IL00000206), ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ : కె. నరసింహారావు, రిజిస్టర్డ్ కార్యాలయం : C/o R K జిన్నింగ్ మిల్, NH-5 బైపాస్ రోడ్, ఏటుకూరు బైపాస్ రోడ్, గుంటూరు-522003. ఫ్యాక్టరీ చిరునామా : డి నెం.79/1, వాలియన్ కాటన్ ఇండస్ట్రీస్, ఏటుకూరు రోడ్, కమ్మ శేషయ్య గ్రౌండ్, గుంటూరు-522003. హామీదారు-1 : శ్రీ పి. వెంకటేశ్వరరావు, తండ్రి : నరసింహారావు, డోర్ నెం.5-139/1, తురకపాలెం, పెదపలకలూరు, గుంటూరు, ఆం.ప్ర-522005. హామీదారు-2 : శ్రీ కామిశెట్టి సాంబశివరావు, తండ్రి : సత్యనారాయణ, డోర్ నెం.61-11-865, అలీ నగర్ 1వ లైన్, పాత గుంటూరు, చిన్న రామాలయం గుడి దగ్గర, ఆం.ప్ర-522001. ప్రొప్రయిటర్ : శ్రీ కె నరసింహారావు, తండ్రి : సత్యనారాయణ, డోర్ నెం.16-16-253, మొదటి లైన్, అలీ నగర్, పాత గుంటూరు, ఆం.ప్ర-522001. మిరియాల రాంబాబు, తండ్రి : వర ప్రసాద రావు యొక్క తెలియని చట్టపరమైన వారసులు, డి నెం.16-13-42, పాత రామ మందిరం వీధి, పాత గుంటూరు, ఆం.ప్ర-522001. డిమాండ్ నోటీసు తేది : 01.08.2023, మొత్తం బకాయి : తేది.31.12.2024 నాటికి బకాయి రూ.84,01,015.86/- (అక్షరాల ఎనభై నాలుగు లక్షల ఒక వెయ్యి పదిహేను రూపాయల ఎనభై ఆరు పైసలు మాత్రమే) + వడ్డీ, మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను. స్వాధీనత నోటీసు తేది : 05.10.2023, స్వాధీనత యొక్క స్వభావం : లాంఛనాత్మక స్వాధీనం.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరాలు మరియు ఆస్తి యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు

ఐటమ్ నెం.1 : డాక్యుమెంట్ నెం.6593/2006 ప్రకారం పసుపులేటి వెంకటేశ్వర రావు (తండ్రి : నరసింహా రావు) గారి పేరున ఉన్న ఆస్తి : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, నల్లపాడు ఎక్స్‌టెన్షన్, తురకపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, నల్లపాడు గ్రామం, డి నెం.709/B నందు విస్తీర్ణం ఎకరా 2.59 సెంట్లు భూమి, ఇందులో విస్తీర్ణం ఎకరా 0.45 సెంట్లు భూమి, ఇందులో విస్తీర్ణం ఎకరా 0.32 సెంట్లు భూమిలోని విస్తీర్ణం 173.94 చ॥గ॥లు స్థలం కలదు. హద్దులు : తూర్పు : రావిపాటి ఆది శేషయ్య గారికి చెందిన ఆస్తి, 31'-0", దక్షిణం : తొండెపు సాంబ శివ రావు గారికి చెందిన ఆస్తి, 50'-6", పడమర : అంగిరేకుల సుబ్బారావు గారికి చెందిన ఆస్తి, 31'-0", ఉత్తరం : పసుపులేటి వెంకటేశ్వర రావు గారికి చెందిన ఆస్తి, 50'-6".

ఈ హద్దుల యందు విస్తీర్ణం 173.94 చ॥గ॥లు లేదా 145.44 చ॥మీ॥లు లోని స్థలం.

ఐటమ్ నెం.2 : డాక్యుమెంట్ నెం.6588/2006 ప్రకారం పసుపులేటి వెంకటేశ్వర రావు (తండ్రి : నరసింహా రావు) గారి పేరున ఉన్న ఆస్తి : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-జిల్లా, నల్లపాడు ఎక్స్‌టెన్షన్, తురకపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, నల్లపాడు గ్రామం, డి నెం.709/B నందు విస్తీర్ణం ఎకరా 2.59 సెంట్లు భూమి, ఇందులో విస్తీర్ణం ఎకరా 0.90 సెంట్లు భూమి, ఇందులో విస్తీర్ణం ఎకరా 0.28 సెంట్లు భూమిలోని విస్తీర్ణం 196.38 చ॥గ॥లు స్థలం కలదు. హద్దులు : తూర్పు : రావూరి వెంకట సుబ్బారావు గారికి చెందిన ఆస్తి, 35'-0", దక్షిణం : పసుపులేటి వెంకటేశ్వర రావు గారికి చెందిన ఆస్తి, 50'-6", పడమర : ప్రసాద రావు మరియు సుబ్బారావు గార్లకు చెందిన ఆస్తి, ఉత్తరం : అమ్మకందారునిచే వదిలిన 20 అ॥ల వెడల్పు రోడ్డు, 50'-6".

ఈ హద్దుల యందు విస్తీర్ణం 196.38 చ॥గ॥లు లేదా 164.20 చ॥మీ॥లు లోని స్థలం.

రిజర్వు ధర : రూ.31.50 లక్షలు ధరావత్తు : రూ.3.15 లక్షలు బిడ్ పెంపుదల మొత్తం: రూ. 0.10 లక్షలు

సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి తెలిసినంత వరకు ఉన్న ఎన్‌కంబరెన్స్ వివరములు : బ్యాంక్ రికార్డ్స్ ప్రకారం ఏవిధమైన ఎన్‌కంబరెన్స్ లేవు

ఇ-వేలం నియమ నిబంధనలు : (1). సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును. (2). ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి. (3). అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు. (4). అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది. 05.12.2025 న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును. 5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్ సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది: 14.11.2025, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

క్లుప్తంగా

రేపు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఫిరంగిపురం: మండల పరిధిలోని బేతపూడి, నుదురుపాడు, వేములూరిపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ఫిరంగిపురంలో సెయింట్ ఆన్స్ బాలికల హైస్కూలులో 17నుండి 26 వరకు, బేతపూడిలోని జెడ్పీ పాఠశాలలో 17నుంచి 20 వరకు, నుదురుపాడు జెడ్పీ పాఠశాలలో 22 నుంచి 26 వరకు, వేములూరిపాడు జెడ్పీ పాఠశాలలో 17 నుంచి 26 వరకు పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. పిల్లల ఆధార్ వేగవంతానికి నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు.

జూదరుల అరెస్టు

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న వారిపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఇందులో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి తొమ్మిది సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.6,250తో పాటు పందెం కాయడానికి ఉపయోగించే కాయన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా భగవాన్ బిర్సా జయంతి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో శనివారం ఆదివాసీ గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కార్తిక శ్రీనివాస్ మాట్లాడుతూ జార్ఖండ్ ప్రాంతం ముండా తెగ నాయకుడు బిర్సా జయంతిని జాతీయ గౌరవ దినోత్సవంగా నిర్వహించుకోవడం గౌరవనీయమని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శౌరి జోజి, ఉపాధ్యాయుడు కమల్ మోహన్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలువురికి శనివారం సీఎం సహాయ నిధి చెక్కులను టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ వార్డుకి చెందిన వల్ల హుస్సేన్ పీరాకు రూ. 1,50,906, 17వ వార్డుకి చెందిన కోరుకొండ చైతన్య పాత్రోకు రూ.40,360, 18వ వార్డుకి చెందిన మోకా దుర్గాప్రసాద్‌కు రూ.31,759 చొప్పున చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. వాటిని బాధితుల నివాసాలకు వెళ్లి అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన అటల్ జాతీయ ఉపాధ్యాయ శిక్షణ

తాడికొండ: మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్, రెజిలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే అంశంపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఏఐసీటీఈ అటల్ జాతీయ ఉపాధ్యాయ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వి. ఆంజనేయులు, కార్యదర్శి వై. సుజిత్ మాట్లాడుతూ కొత్త ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇలాంటి శిక్షణలు, నిరంతర అభ్యాసం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. నాగశ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాల మురళీకృష్ణ, ఎన్ఐడీఎం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సూర్య ప్రకాష్, బీఎన్‌సీఏ పూణే వసుధ, ప్రసాద్ బిట్స్ మిశ్రా, ఐఐటీ రూర్కి పి.సి. అశ్విన్ కుమార్, జపాన్‌కు చెందిన క్యోటో యూనివర్సిటీకి చెందిన గౌతమ్ పద్మనాభం, యుఎస్‌ఏకు చెందిన మిచిగాన్ టెక్నాలజీస్ యూనివర్సిటీ డాక్టర్ శివ ఇక్కుర్తి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మధుమేహం నియంత్రణకు ఆధునిక మందులు

గుంటూరు మెడికల్: మధుమేహం నియంత్రణకు కొత్తగా వస్తున్న మందులతో అద్భుత ఫలితాలు వస్తున్నాయని ఎండ్రోక్రైనాలజిస్ట్ డాక్టర్ కొంగర శ్రీకాంత్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో జీఎంఏ హాలులో మధుమేహం నియంత్రణలో నూతన మందుల ఆవిష్కరణ- లాభ నష్టాలు అనే అంశంపై వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన డీఎల్‌పీ, డ్యూఎల్, ట్రిపుల్ అన్‌లాగ్స్ మందుల వలన భవిష్యత్‌లో బేరియాట్రిక్ సర్జరీలు తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఖరీదుగా ఉన్న ఈ మందులు సామాన్యులకు అందుబాటులోకి రావడానికి కొంత సమయం పడుతుందని వివరించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులకు చికిత్స చేయడంతోపాటు, మధుమేహ నిరోధక చర్యలపై ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. కార్యదర్శి డాక్టర్ బాలినేని సాయికృష్ణ మాట్లాడారు. ఐఎంఏ ఉపాధ్యక్షుడు మోపర్తి శివప్రసాద్, వైద్యులు సి.హెచ్.విశ్వేశ్వరరావు, మాధవరావు, బాబూరావు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం !

ఆత్మకూరులో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిడమర్రులో..

చినకాకానిలో ..

- వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం
- గ్రామాల్లో సంతకాల సేకరణకు స్పందన

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ కానివ్వబోమని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. == ఆత్మకూరులో గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సెంటర్ నుంచి గడపగడపకు వెళ్లి నాయకులు సంతకాలు సేకరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జరిగితే పేద వైద్య విద్యార్థులు ఎంత నష్టపోతారనేది క్షుణ్ణంగా వివరించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సంతకాల సేకరణకు స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి, కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలియజేశారు. సమస్యలను పట్టించుకోని చంద్రబాబు సర్కార్‌పై ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను గడపగడపకు వెళ్లి వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్ కుమార్, సాంబశివరావు, కిషోర్ రెడ్డి, ప్రేమ్‌చంద్, యేసుబాబు, రత్నకోట, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి మండల పరిధిలోని నిడమర్రులో శనివారం రాత్రి గ్రామ అధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ నేతలు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండేపూడి రాజారత్నం, పరమేశ్వరరావు, భాస్కర్, సురేష్, వెంకటేశ్వరరావు, నాగరాజు, శేఖర్, మహేష్, శ్రీను, సతీష్, రమేష్, రజనీకాంత్, సాయిరెడ్డి, మస్తాన్ రావు, నాగేశ్వరరావు, శరత్ పాల్గొన్నారు. మంగళగిరి మండల పరిధిలోని చినకాకానిలో శనివారం గ్రామ అధ్యక్షులు మల్లవరపు కాంతారావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నూతక్కి జోష్, రామకృష్ణారెడ్డి, రామనాగు, చిన్న, గోపి, గోపీకృష్ణ, నరేంద్ర, వెంకటేశ్వరరావు, రమేష్, చిన్నోడు, కాటంరాజు, రామ్మోహనరావు, ప్రసాద్, సాంబశివరావు, నాగేశ్వరరావు, శ్యామ్, సంగేశ్వరరావు, షిర్డి సాయి, జలసూత్రం నాగరాజు, హేమ్‌కుమార్, నాగలక్ష్మి, వెంకయ్య, సీతారామరెడ్డి, బాల నాగయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్లకు అడ్డుకట్ట

పెదపరిమి(తాడికొండ): ట్రికోడెర్మావిరిడీ, రైజోబియంతో మినుము, శెనగలో విత్తన శుద్ధి చేయడం ద్వారా నేలలో సంక్రమించే తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చని డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ తెలిపారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో శనివారం ఆత్మా సౌజన్యంతో రబీ పంటలో సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. జీవన ఎరువుల వాడకం వల్ల భూసార సాంద్రత పెరుగుతుందని తెలిపారు. పత్తి రైతులకు సీఎం యాప్, కిసాన్ వికాస్ యాప్‌లపై మంగళగిరి ఏడీఏ టి. శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు డ్రోన్ ద్వారా పంటలపై పురుగు ముందుల పిచికారీ విధానంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో పి. సంధ్యారాణి పలువురు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

ఫిరంగిపురంలో ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

తాడికొండలో పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న గ్రామస్తులు

మేడికొండూరు లైబ్రరీలో వేడుకలు

తాడికొండ: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని తాడికొండ శాఖా గ్రంథాలయాధికారి కె. చిన్నప్పరెడ్డి అన్నారు. వారోత్సవాలలో భాగంగా తాడికొండ శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నప్పరెడ్డి విద్యార్థులంతా గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ. నాగమల్లేశ్వరి, చింతల భాస్కరరావు పాల్గొన్నారు. తుళ్లూరు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి. భాగ్యలత ఆధ్వర్యంలో చిన్నారులకు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వారితో పుస్తక పఠనం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించి, కథలు చెప్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం వై. నాగమణి, ఎస్‌జీటీ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

గాలి బాలి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. గ్రంథాలయాధికారి ఐవీ దుర్గారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే పలు పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మనం- మన ఆరోగ్యం అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ భగవాన్, రవీంద్ర భారతి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు 'విద్యార్థులు- గ్రంథాలయాలు' అనే అంశంపై జూనియర్స్ విభాగంలో వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి నాగుల్ మీరా తెలియజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు ఎం. జ్యోతి, డి. సునీత, టి. జయశారద, ఆర్. శ్రీలత వ్యవహరించారు.

దుగ్గిరాలలో..

పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు పరిపూర్ణ జ్ఞానం కలుగుతుందని, పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. దుగ్గిరాల గ్రంథాలయ ఇన్‌చార్జి బి.జ్యోతి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జబీన్ మాట్లాడుతూ విద్యార్థులంతా విధిగా పుస్తకాలు చదవాలని, సెల్‌ఫోన్‌తో అనవసరంగా సమయం వృథా చేసుకోకుండా, గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకుని పుస్తకాలు చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మేడికొండూరులో..

స్థానిక గ్రంథాలయంలో శనివారం పండుగ వాతావరణాన్ని నెలకొంది. ఆవరణలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ అంశాలకు సంబంధించిన అరుదైన పుస్తకాలు, జ్ఞాన సంపదను పెంపొందించే విలువైన గ్రంథాలు ప్రదర్శించారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించి, వాటిలోని విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం కేసీ వర్క్స్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్ విద్య మాట్లాడుతూ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఆలోచనలకు, ప్రతిభకు, భవిష్యత్తుకి పునాదులు వేస్తూ ప్రతి విద్యార్థిలో ఉన్న సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికితీయడం పాఠశాల ప్రధాన బాధ్యతని తెలిపారు. ప్రతి నెలా బాలల పార్లమెంట్ ఏర్పాటు చేసి ఆటపాటల ద్వారా పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది, కోఆర్డినేటర్ కె. అనూష, పి. అనిల్ కుమార్, పోతురాజు, నాగమణి, సచివాలయ ఎడ్యుకేషనల్ సెక్రటరీ శ్యామల, మహిళా పోలీస్ లావణ్య పాల్గొన్నారు.

కార్మికులకు మరణ శాసనం రాస్తున్న ప్రభుత్వాలు

కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ కార్మికులకు ప్రభుత్వాలు మరణ శాసనం రాస్తున్నాయని యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ మండిపడ్డారు. కార్మికుల దీక్ష శిబిరాన్ని శనివారం నాయకులు సుభాని, అంకయ్య, పెద్ద సుబ్బారావు, ఆశీర్వాదంలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ గత 374 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. రెండు రోజుల క్రితం పట్నాల నరసింహులు అనే కార్మికుడు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. నరసింహులు 25 సంవత్సరాలు ఫ్యాక్టరీలో పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కార్మికులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షల్లో దామవరపు నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, బుట్టి ఏసోబు, ఏనుగుల సాంబశివరావు, కందుకూరు హగ్గయ్య, ఎం. శారద, రిబ్కా, శారమ్మ, సువర్ణ, దుర్గాభవాని, బేబమ్మ, డి. నాగమల్లేశ్వరి, వి.లక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అవగాహన కల్పిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్ : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యాలు దరిచేరవని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ ప్రైమరీ హైస్కూల్‌లో 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో శానిటరీ ప్యాడ్స్ బర్నింగ్ మిషన్‌ను ఆవిష్కరించారు. మంగళగిరిలోని విజిటబుల్ మార్కెట్ సెంటర్‌లో, నిడమర్రు రోడ్డులో వున్న రైతు బజారులో ఎనీ టైమ్ బ్యాగ్ మిషన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్‌ను నిషేధించడంలో భాగంగా వినూతన్నంగా ప్రజలకు క్లాత్ బ్యాగ్స్ అందుబాటులోకి తెచ్చామని, ఎనీ టైమ్ బ్యాగ్ మిషన్లను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు పురస్కారాలు

తాడేపల్లి రూరల్: కేఎల్ యూనివర్సిటీలో పూర్వ విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ కె.సిహెచ్. శ్రీకావ్య మాట్లాడుతూ వివిధ రంగాల్లో, పలు సంస్థల్లో హోదాల్లో ఉన్న వారికి, వారు సాధించిన విజయాలకు గుర్తుగా ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీసీ జి. పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు మాట్లాడుతూ వివిధ హోదాల్లో, దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను చూస్తుంటే తమకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. అనంతరం అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమను కేఎల్‌యూ ఎంతగానో ప్రోత్సహిస్తోందని, వర్సిటీకి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రో వీసీలు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, కె. రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ ఎ. శ్రీనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ కె. సోని పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాల పెంపునకు ఎన్ఎస్ఎస్ దోహదం

వలంటీర్లకు సూచనలు చేస్తున్న రాజశేఖర్

మంగళగిరి టౌన్: విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ నైపుణ్యాల పెంపులో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని వీజే కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడే ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు. సమష్టిగా పనిచేసి శిబిరాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా తొలిరోజు హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహన దారులను ఆపి హెల్మెట్ ధారణ అవసరాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనతోనే బీసీలకు న్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

మంగళగిరి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్ అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషనర్ ద్వారా సమగ్ర కులగణన జరిపించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షులు పారేపల్లి మహేష్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకైనా బీసీలకు చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు. 139 బీసీ కులాల్లో ఎంత శాతం జనాభా ఉన్నారో తెలియకుండా రిజర్వేషన్లు ఎలా అమలు జరుపుతారని ఆయన ప్రశ్నించారు. బీసీ కులాల్లోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం దక్కాలంటే విద్య, ఉద్యోగాల్లో ఏ విధంగా ఎ,బి,సి,డి వర్గీకరణ జరిగిందో అదేవిధంగా స్థానిక సంస్థల రిజర్వేషన్లు కూడా వర్గీకరించి మాత్రమే అమలు జరపాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల గడువు ఆరు నెలల్లో ముగియనుందని, 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేసి చట్టబద్ధ బీసీ రిజర్వేషన్ అమలు జరపాలని విన్నవించారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు వరప్రసాద్, ధనుంజయరావు, జయలక్ష్మి, దాన గౌడ్ పాల్గొన్నారు.

బంగారం తీసుకుని తిరిగి ఇవ్వలేదంటూ ఫిర్యాదు

మంగళగిరి టౌన్: బంగారం తీసుకుని తిరిగి ఇవ్వలేదంటూ మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలువురు బంగారం వ్యాపారస్తులు శనివారం ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి నగర పరిధిలో షరాఫ్ బజారులోని దామర్ల సతీష్ తీగల మిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పలువురు బంగారు వ్యాపారస్తుల వద్ద సుద్ద రూపంలో బంగారం తీసుకుని వాటిని తీగలుగా మార్చి ఇస్తూ ఉంటాడు. ఈ క్రమంలో మంగళగిరి పట్టణానికి చెందిన గడ్డం చంద్రశేఖర్ 200 గ్రాములు, వీరాస్వామి 35 గ్రాములు, వాసు 150 గ్రాములు, పూర్ణ 65 గ్రాములు సుద్ద రూపంలో తీగలుగా మార్చి ఇవ్వమని కొన్ని రోజుల క్రితం సతీష్‌కు ఇచ్చారు. తిరిగి అడుగుతున్న క్రమంలో జాగు చేస్తుండడంతో వ్యాపారస్తులు ఆరా తీశారు. కొన్ని రోజుల క్రితం ఉన్న ఇల్లు మారి వేరే ఇంటికి అద్దెకు వెళ్లినట్లు తెలుసుకున్నారు. మోసపోతామే మోసన్న భయంతో అడిగిన బంగారం ఇవ్వకుండా ఆలస్యం చేస్తుండడంతో అనుమానం వచ్చి మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరే కాక పలువురు వ్యాపారస్తులు కూడా కొంత బంగారం ఇచ్చారని సమాచారం. అయితే, సతీష్ మాత్రం తనకు మోసం చేసే ఉద్దేశం లేదని పలువురికి బంగారం తిరిగి ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి

కృష్ణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

దుగ్గిరాల: స్థానిక ముర్తుజానగర్‌లో సూపర్ స్టార్ కృష్ణ 3వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ తెలుగు సినీ చరిత్రను తిరగ రాశారని తెలిపారు. సినిమా స్కోప్, 70 ఎం.ఎం, డాల్బీ సౌండ్ సిస్టమ్ వంటి సాంకేతికతలను అందించిన ఘనత ఆయనదేనని చెప్పారు. మంచితనానికి మారు పేరుగా నిలిచి 350పైగా సినిమాల్లో నటించడమే కాకుండా, పార్లమెంటు సభ్యునిగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు జిలాని, కౌనేన్, సుభాని, బాజీ, కరీం, కె.వెంకటేశ్వర్లు, ఎం .శ్రీనివాసరావు, బి.ఏల్లేశ్వరరావు, కె.రంగారావు, బి.నరసింహారావు పాల్గొన్నారు.

ఈనెల 18న వ్యాసరచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు 'భవిష్యత్‌లో కృత్రిమ మేధ పాత్ర', 'ప్రకృతి ఉత్తమ గురువు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని, వివరాలకు డిగ్రీ, పీజీ గ్రంథాలయాధికారులు కె.పద్మజ (99593 35914), బి.సాయికళ (93472 47009) ను సంప్రదించాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుపై నిర్లక్ష్యం

నెహ్రూనగర్: రాష్ట్ర రాజధాని పరిధిలోని గుంటూరు జిల్లాలోనూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు కావడం లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గుంటూరు నగరంలోని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ యాక్ట్ అమలుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన దగ్గర నుంచి, కోర్టుల్లో జడ్జిమెంట్ వచ్చే వరకు ప్రతి దశలోనూ జాప్యం జరుగుతుందని ఆరోపించారు. గుంటూరు జిల్లాలో 4 వేలకు పైగా కేసుల్లో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 6 వందల కేసుల్లో చార్జి షీటు దాఖలు చేయలేదన్నారు. పరిష్కారానికి కనీసం ఐదుగురు ఎస్సీ ఎస్టీ డీఎస్పీలను ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. చట్టం అమలు కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విన్నవించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు సునీల్, సీనియర్ న్యాయవాది కె.రాజేష్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, ఐలా మాణిక్యాల రావు, రావినూతల కమల కుమారి, పొందుగల ప్రకాష్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.చంద్ర నాయక్, దళిత నాయకులు కాకుమాను రవి పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram finance ltd, ... [illegible] ... డాక్యుమెంట్ నెం. 7446/2014లో 242 చ.గ.ల స్థలము ... [illegible] ...

రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12620

తేది: 15-11-2025

క్లుప్తంగా...

పేదల భూములు కొట్టేయడానికే అసైన్డ్ చట్టానికి సవరణ

దీనిని వ్యతిరేకిస్తూ 27న సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట ధర్నా

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల్లో దాదాపు 3 లక్షల ఎకరాలను వ్యవసాయ కార్మికులు, దళితుల నుంచి బలవంతంగా లాక్కుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆరోపించారు. లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటికీ వెయ్యి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. అసైన్డ్ భూముల చట్ట సవరణపై కేబినెట్ తీర్మానాన్ని నిరసిస్తూ ఆదివారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో రాష్ట్రస్థాయి చర్చా వేదిక జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చట్టసవరణ అమలులోకి వస్తే రాష్ట్రంలో దళితుల చేతిలో ఒక సెంటు భూమి కూడా ఉండదన్నారు. దళితులు, పేదలకు ఇచ్చిన 18 లక్షల ఎకరాల భూములను అభివృద్ధి పేరుతో మోసపూరితంగా పెట్టుబడిదారులకు కట్టబెట్టడానికే దొడ్డిదారిన 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరించారన్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేసీఆర్, వివిధ సంఘాల నేతలు జడాల సుబ్బారావు, కోటేశ్వరరావు, హరిబాబు, ప్రసన్న, రామన్న తదితరులు పాల్గొన్నారు.

సతీష్ మృతిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: టీటీడీ పరకామణి వ్యవహారంలో ఫిర్యాదు చేసిన నాటి ఏవీఎస్‌ఓ సతీష్ కుమార్ రైలు పట్టాలపై శవమై తేలడం ఆందోళన కలిగిస్తోందని, దీనిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ పరకామణి వ్యవహారంలోనూ హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో అన్ని కోణాల్లో విచారణ జరిపి వాస్తవాలను భక్తులకు వెల్లడించాలని కోరారు.

వైఎస్సార్‌టీఎఫ్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ద్వారకనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌టీఎఫ్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన డాక్టర్ చింతల ద్వారకనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. జోన్–4లోని ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఈయన వైఎస్సార్‌టీఎఫ్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

రూ.12,771 కోట్ల ట్రూ అప్ చార్జీల్ని విరమించుకోండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలపై మరోమారు మోపనున్న రూ.12,771 కోట్ల విద్యుత్ ట్రూఅప్ చార్జీలను విరమించుకోవాలని, గతంలో మోపిన పలు రకాల విద్యుత్ చార్జీల పెనుభారాలను రద్దు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శనివారం మీడియాకు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం గత 17 నెలల కాలంలో రూ.18,243 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఇప్పుడు మరోమారు రూ.12,771 కోట్ల భారాన్ని మోపడానికి సిద్ధమవడం దారుణమన్నారు. ప్రజలపై ఇబ్బడిముబ్బడిగా మోపిన విద్యుత్ పెనుభారాలను రద్దు చేయాలని ఆ లేఖలో కోరారు.

మండల స్థాయిలో కాంప్లెక్స్‌లు నిర్వహించాలని డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలకు మండల స్థాయిలోనే స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహించాలని ఏపీ పీఎస్ హెచ్‌ఎం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు విద్యా శాఖను డిమాండ్ చేశారు. బోధనాంశాలు, పరిపాలన విషయాలను ప్రాతిపదికగా తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు. పాఠశాలల్లో జరిగే వివిధ అంశాలను పంచుకునేలా కాంప్లెక్స్‌లను తీర్చిదిద్దాలన్నారు.

బిర్సా ముండా స్ఫూర్తితో పోరాటం

సాక్షి, అమరావతి: దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో సహజ వనరులను కార్పొరేట్లు దోపిడీ చేస్తున్నారని, ఆదివాసీ సమరయోధుడు బిర్సా ముండా స్ఫూర్తితో దీనికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బిర్సాముండా 150వ జయంతి కార్యక్రమం విజయవాడలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్లకు భూములు కట్టబెడుతున్నారని, ఆస్తులు, భూములు, నేల, నీరు అన్నిటినీ పెట్టుబడుల కోసం దురాక్రమణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో బిర్సాముండా లాంటి యోధుల స్ఫూర్తితో పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఐ సతీష్ మృతిపై వీడని మిస్టరీ!

టీటీడీ మాజీ ఏవీఎస్‌వో మృతి కేసును ప్రత్యేకంగా విచారిస్తున్న సీఐడీ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్

పరిశోధన పూర్తవకుండా, అనుమానాస్పద మృతిగా కాకుండా హత్యగా పేర్కొనడంపై సందేహాలు

- దీనివెనుక ప్రభుత్వంలోని కొందరు పెద్దల కీలక ఆదేశాలు
- వారు అనుకున్న వ్యక్తులను ఈ కేసులో ఇరికించే ప్రయత్నం?
- సతీశ్‌ది హత్యే అయితే బోగీలో వేరే వ్యక్తులు ఎవరు?
- ఇది సాధ్యమా? అని తెలియకుండా హత్య కేసు నమోదు
- సతీశ్‌ను ఎవరైనా వెంటాడినట్లుగా సీసీ ఫుటేజీ లేదు
- ఈ కీలక అంశాలపై దృష్టిసారించని పోలీసులు
- టీడీపీ అధికారిక వెబ్‌సైట్, ఎల్లో మీడియాకు లీకులు
- ఎఫ్ఐఆర్‌లో శనివారం హత్యగా పేర్కొన్న వైనం
- పరకామణి అపోనెంట్స్‌ను ఏ1గా చేర్చడంపై దురుద్దేశాలు
- ఎవరిని కాపాడేందుకు? ఎవరిపై బురద జల్లేందుకు కుతంత్రం?

అనంతపురం జిల్లా కోమలి సమీపంలో సతీష్‌కుమార్ మృతిచెందిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐడీ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, పోలీసు ఉన్నతాధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన టీటీడీ మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్‌వో), ప్రస్తుత గుంతకల్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై మిస్టరీ వీడలేదు. ఆయనను పరకామణి కేసులో ఉన్న తిరుపతికి చెందిన వ్యక్తులు హత్య చేసి ఉంటారని, వారిని ఏ1గా పేర్కొంటూ గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, సతీష్‌ది హత్యే అని కుటుంబసభ్యులు, ఆత్మహత్య అని విపక్ష నేతలు, ప్రమాదం అని ఇంకొందరు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సతీష్ రైలు నుంచి కింద పడిపోయి ఉంటారా? లేదా ఎవరైనా తోసి ఉంటారా? అనే విచారణ క్రమంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు.

సీసీ ఫుటేజీ ఏమైంది?

పోలీసులు, రైల్వే వర్గాలు, విశ్వసనీయ సమాచారం ప్రకారం... తిరుమల పరకామణి కేసులో విచారణకు వెళ్లేందుకు గురువారం అర్ధరాత్రి 11.53 గంటలకు సతీష్ గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. బైక్ పార్క్ చేసి లోపలకు వెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ 12.55 గంటలకు వచ్చింది. అంటే, దాదాపు గంటసేపు సతీష్ రైల్వే స్టేషన్‌లో ఉన్నారు. కానీ, ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదు. స్టేషన్‌లో కొత్తగా 82 సీసీ కెమెరాలు అమర్చారు. వాటిలోని ఫుటేజీ బ్యాకప్ డేటా లేదని రైల్వే అధికారులు పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది.

ఆ గంటలో ఏం జరిగింది?!

గుంతకల్లు నుంచి సతీష్ మృతదేహం లభ్యమైన కోమలిలోని ఘటనా స్థలానికి గంట ప్రయాణం మాత్రమే. ఈ వ్యవధిలోనే సతీష్ గుడ్ నైట్ అని ఒకటి, ఊపిరి ఆడడం లేదని మరోటి మెసేజ్ పెట్టారు. ఆయన బోగీ డోర్ వద్ద మెట్లపై కూర్చుని ఉండగా కిందపడి ఉంటే రౌండ్‌గా తిరుగుతూ పడిపోతారని రైల్వే పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కింద పడినప్పుడు రాళ్లు బలంగా తగిలితే తల పగిలే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి. సతీష్ మృతదేహం దొరికిన స్థలంలో చెప్పులు ఒకచోట పడిఉన్నాయి. ఆయన కింద పడిపోయి దొర్లుకుంటూ వచ్చి ఉన్నట్టు రక్తపు మరకలు, ఇతర ఆనవాళ్లు పోలీసులకు దొరికాయి. ఆయన పక్కటెముకలు, ఒక కాలు విరగడం చూస్తే వేగంగా వెళ్తున్న రైలు నుంచి పడిపోయినప్పుడు ఇలా జరుగుతుందని పోలీసులు భావిస్తున్నారు. ఇవన్నీ చూస్తే సతీష్ ప్రమాదవశాత్తు మృతి చెంది ఉండొచ్చనే భావన కలుగుతోంది. ఇక్కడ గతంలో ఇలా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన, గాయపడినవారు కూడా ఉన్నారు. తాడిపత్రి పుట్లూరు రోడ్డులో ఉండే గుప్తా 2022లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ బోగీ డోర్ వద్ద నిల్చుని కిందపడి చనిపోయాడు.

సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన సీఐడీ అడిషనల్ డీజీ

సతీష్ మృతి కేసును సీఐడీ అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ప్రత్యేకంగా విచారిస్తున్నారు. శుక్రవారం రాత్రి అనంతపురం చేరుకున్న ఆయన... డీఐజీ షిమోషీ, ఎస్పీ జగదీశ్‌తో సమావేశమయ్యారు. గెస్ట్‌హౌస్‌లో సమీక్ష నిర్వహించి కేసు దర్యాప్తునకు 10 బృందాలను నియమించారు. శనివారం కూడా సమీక్ష చేశారు. వైద్యులతో పాటు ఫోరెన్సిక్ డాక్టర్లతో మాట్లాడారు. ఘటనా స్థలిలో తీసిన ఫొటోలు, వీడియోలు, పోస్టుమార్టం నివేదికలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వీక్షించారు. అనంతపురం నుంచి కోమలికి చేరుకుని సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఒక మనిషి బొమ్మను తీసుకుని వేగంగా వెళ్తున్న రైలు నుంచి కిందకు తోశారు. మరో రైలులో బొమ్మ తోయకుండా కిందపడేలా చేశారు. ఈ రెండు బొమ్మలు ఎలా వెళ్లాయి? గాయాలు ఎలా తగిలే అవకాశం ఉంది? తదితర అంశాలను శోధించారు. దీన్నంతటినీ వీడియో తీశారు. సతీష్ మృతదేహం దొరికిన ప్రాంతంలో రాళ్లు, ఇతర వస్తువులపై ఉన్న రక్తపు మరకలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. సతీష్ మొబైల్ ఫోన్ ఎక్కడ దొరికిందనే అంశంతో పాటు అందులో ఫోన్ కాల్స్‌ను కూడా పరిశీలిస్తున్నారు.

సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

తన సోదరుడిది హత్యే అని సతీష్ సోదరుడు హరి పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ సెక్షన్ 103 (1) ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏ1గా 'పరకామణి వ్యవహారంలో అపోనెంట్స్' అని రాశారు. ఇందులో ఎవరి పేర్లూ రాయకపోవడం గమనార్హం. కాగా, అసలు ఘటన ఎలా జరిగింది? ప్రమాదమా? హత్యా? లేక ఆత్మహత్యనా? అన్నది ఏదీ తేలకుండా పోలీసులు పరకామణి వ్యవహారంలో అపోనెంట్స్‌ను దోషులుగా చేర్చడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సతీష్‌ది హత్యే అయితే, రైలులో అందుకు పాల్పడింది ఎవరు? వారు టికెట్‌తో ప్రయాణించారా? టికెట్ లేకుండా వచ్చారా? సతీష్ కిందపడిన కోమలి ప్రాంతం వద్ద ఎవరు వేచి ఉండి హత్య చేశారు? ఆ సమయంలో సెల్ టవర్ సిగ్నల్స్‌లో ఎవరెవరు ఉన్నారు? అనే అంశాలన్నీ లోతుగా పరిశీలించి, వారిని విచారించి ఆపై హత్యగా నిర్ధారించాల్సి ఉంది. కానీ, కేసులో పరిశోధన పూర్తి కాకుండా, అనుమానాస్పద మృతి అనికాకుండా ఎఫ్ఐఆర్‌లో హత్యగా పేర్కొనడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంలోని కొందరు పెద్దల కీలక ఆదేశాలతో దీన్ని హత్యగా ధ్రువీకరించి, వారు అనుకున్న వ్యక్తులను కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- సతీష్ మృతిపై తిరుపతి రైల్వే పోలీసులు కూడా విచారణ చేపట్టారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ఆయన ప్రయాణించిన బోగీకి టీటీ (టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్)గా శోభారాణి విధుల్లో ఉన్నారు. మరో టీటీగా అప్పారావు ఉన్నారు. వీరికి చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ నాయుడు డ్యూటీలు వేశారు. ఈ ముగ్గురితో పాటు లోకో పైలట్, గార్డ్, స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగిని చిత్తూరు రైల్వే డీఎస్పీ హర్షిణి శనివారం విచారించారు. శుక్రవారం ఉదయం 6.26కు తిరుపతి చేరుకున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను ప్రత్యేక బృందం పరిశీలించింది.
- ఏ–1 కోచ్‌లో ప్రయాణించిన సతీష్‌కు లగేజీ అప్పగించిన బెడ్ రోల్ అటెండర్ రాజీవ్ రతన్, ఏ–2 కోచ్‌కు చెందిన కృష్ణయ్యను రైల్వే పోలీసులు ప్రశ్నించారు. సతీష్ సీటు 29 కాగా, ఆయన బ్యాగ్ 11వ నంబరు సీటులో లభించింది. రైలు యార్డ్‌లోకి వచ్చిన వెంటనే శాంపిళ్లు తీసుకున్నారా లేదా అనేదానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

ఎల్లో మీడియాకు లీకులతో...

సతీష్ మృతి విషయంలో కీలక అంశాలపై పోలీసులు దృష్టిపెట్టలేదనే ఆరోపణలుండగా.. మరోవైపు ప్రభుత్వం టీడీపీ అధికారిక వెబ్‌సైట్‌కు, ఎల్లో మీడియాకు శుక్రవారం సాయంత్రమే లీకులిచ్చింది. తీరా ఎఫ్ఐఆర్‌లో హత్యగా శనివారం పేర్కొన్నారు. పైగా ఎవరి పేర్లూ లేకుండా ఏ–1గా 'పరకామణి వ్యవహారంలో అపోనెంట్స్'ను చేర్చడం గమనార్హం. దీనివెనుక ఉద్దేశాలు ఏమిటి? అన్నది దీంతోనే తెలిసిపోతోంది. ఇదంతా చూస్తుంటే... ఎవరిని కాపాడేందుకు కుతంత్రం పన్నుతున్నారు? అని ప్రశ్నలు వస్తున్నాయి. ఎవరిపై బురదజల్లేందుకు కుట్ర వ్యూహాలు రచిస్తున్నారు? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

సతీష్‌కుమార్ కేసు తాడిపత్రికి బదిలీ

గుత్తి: అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని కోమలి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గుంతకల్లు జీఆర్‌పీ సీఐ, పరకామణి కేసులో ఫిర్యాదుదారుడైన సతీష్ కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై గుత్తి జీఆర్‌పీ ఇన్‌చార్జ్ సీఐ అజయ్‌కుమార్ బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద హత్య కేసుగా నమోదు చేశారు. ఈ కేసును శనివారం తాడిపత్రి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేసినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

ఈ ప్రశ్నలకు సమాధానాలేవి..?

పోలీసులు కేసు నమోదు చేసినట్లు హత్య జరిగిందా?!

సతీష్‌కు చాలా సౌమ్యుడిగా పేరుంది. ఆయన సివిల్ విభాగంలో కాకుండా ఏఆర్‌లో ఉండడంతో అందరితో సన్నిహిత సంబంధాలే ఉన్నాయి. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్టు హత్యకు గురైతే, నిందితులు సతీష్‌తో పాటు ప్రయాణం చేయాలి. ఆ ఇతర వ్యక్తులు ఎవరు? ఇక రెండు డోర్ల వద్ద ఇద్దరు వ్యక్తులు సతీష్ కోసం ఎదురుచూడాలి. ఆయన వాష్ రూంకు వచ్చే వరకు వేచి చూసి దాడి చేసి ఉండాలి. కాగా, సతీష్ ప్రయాణించిన బోగీ ఏ–1 కోచ్ ఏసీ. నిశ్శబ్దంగా ఉంటుంది. ఒకవేళ తనపై ఎవరు దాడికి యత్నించినా పోలీస్ అయినందున కచ్చితంగా ప్రతిఘటించే తత్వం, శక్తి ఉంటాయి. తోసేసినా సతీష్ కిందపడిన ప్రాంతంలో నిందితులు ప్రత్యేకంగా మనుషులను పెట్టి ఉండాలి. ఇలా ఉండి ఫోన్లో సమాచారం ఇచ్చినా సెల్ సిగ్నల్ ఆధారంగా నిందితులు దొరికిపోతారు. వాహనాలు వచ్చి ఉంటే టైర్ల గుర్తులు, రైల్లో ఫింగర్ ప్రింట్స్, ఫుట్ ప్రింట్స్ పడతాయి. దాడిలో రైలు డోర్ వద్ద రక్తపు మరకలు ఉండే అవకాశం ఉంది. పైగా హత్య చేసినవారు శవాన్ని రైలు పట్టాలపై పడేసి ఆనవాళ్లు దొరకకుండా చేసే అవకాశం ఉంది. కానీ, ఇక్కడ అలా జరగలేదు. పైగా సతీష్‌ను ఎవరైనా వెంటాడినట్లుగా సీసీ ఫుటేజీ లేదు. ఈ కీలక అంశాలపై పోలీసులు దృష్టిసారించలేదు. ఇదంతా చూస్తే రైలు ప్రయాణంలో ఉన్నప్పుడు ఇంత రిస్క్ తీసుకుని హత్య చేసే అవకాశం ఉండదని తెలుస్తోంది. అయినా హత్య కేసు నమోదు చేయడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బోగీలోని ప్రయాణికులను పోలీసులు విచారించాల్సి ఉంది. ఆ క్రమంలో వాస్తవాలు వెల్లడి కావాల్సి ఉంది.

సతీశ్‌కుమార్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- పరకామణి కేసులో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించే కుట్ర
- సతీష్‌కుమార్ మృతిపై సీబీఐ లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి
- హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలపై దాడి దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్

సాక్షి, అమరావతి: టీటీడీ మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్‌వో) సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ చంద్రబాబు ప్రభుత్వ హత్య అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపడ్డారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసును సీబీఐ లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. 'పరకామణిలో చోరీ కేసులో సిట్ విచారణలో ఉన్న సీఐ సతీష్‌కుమార్ మరణం అత్యంత విచారకరం. చంద్రబాబు ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. ఈ మరణంపై ప్రజల్లో తీవ్రమైన చర్చ నడుస్తోంది. సతీష్‌కుమార్ మృతి విషయం తెలియగానే.. టీడీపీ నాయకులు చాలా వేగంగా స్పందించారు. ప్రాథమిక దర్యాప్తు, పోస్ట్‌మార్టం కూడా పూర్తి కాకుండానే వైఎస్సార్‌సీపీపై నిందలు వేస్తూ ఆయనను మా పార్టీ నాయకులే హత్య చేశారని నిరాధార పిచ్చి ఆరోపణలు చేశారు. ఆ విధంగా ప్రభుత్వం ఈ కేసులో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించే కుట్ర చేస్తోంది. మరోవైపు దర్యాప్తు సంస్థలను ప్రభావితం చేసేలా టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారు. ఇది అత్యంత హేయం' అని శైలజానాథ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ అధికారులకూ వేధింపులు

'పరకామణిలో చోరీని గుర్తించి ఫిర్యాదు చేసిన సతీష్‌నే పలు దఫాలుగా విచారణ పేరుతో పిలవటం ఏమిటి? బాబు సర్కారు వచ్చాక ఎవరో ఒకరితో ఫిర్యాదు చేయించి.. సాక్ష్యాలు లేకున్నా ఇలా విచారణ పేరుతో కోర్టుకు తీసుకెళ్లడం, రిమాండ్‌కి పంపించడం పరిపాటిగా మారింది. ఆ తర్వాత తీరిగ్గా కేసు గురించి ఆలోచిస్తున్నారు. పోలీసులే విచారణ పేరుతో తిరిగి పోలీసులనే వేధించడం తొలిసారిగా చంద్రబాబు పాలనలోనే చూస్తున్నాం. వందల సంఖ్యలో ఇలాంటి ఉదంతాలు కనిపిస్తున్నాయి. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గున్నీ, సునీల్‌కుమార్, మార్గదర్శి కేసుపై విచారణ చేశారని సంజయ్‌ను, విజయ్‌పాల్, చెవిరెడ్డి గన్‌మెన్‌గా పనిచేసిన చిన్న ఉద్యోగిని శారీరకంగా వేధించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వివిధ స్థాయిల్లో వందలాది ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నారు. వ్యవస్థలను భయపెట్టి.. తమకు అనుకూలంగా పనిచేయకపోతే వీఆర్ పేరుతో రివార్డు ఇస్తామని చెబుతున్నారు. ఇంకా కక్ష ఉంటే అధికారులను జైల్లో కూడా వేస్తున్నారు' అని శైలజానాథ్ గుర్తు చేశారు.

హిందూపురం కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

'హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురానికి ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తున్నారని ఆరోపిస్తే దాడి చేస్తారా. ఇది అత్యంత అప్రజాస్వామికం. ఎవరూ ఏం చేయలేరనే ఉద్దేశంతో టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారు. ఇలాంటి దాడులకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలెవరూ భయపడరు. అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తించుకోవాలి. ఈ దాడులు చూస్తుంటే నాగరిక సమాజంలో ఉన్నామా అనిపిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వ్యక్తులు, పార్టీ కార్యాలయాలపై కూడా దాడి చేస్తున్నారు. చివరకు మీ వల్ల నష్టపోయామని ఎవరైనా ఆవేదన వ్యక్తం చేస్తే.. వారి మీద కూడా దాడికి దిగుతున్నారు. ప్రజలు మీ అరాచకాలను గమనిస్తున్నారన్న విషయం మర్చిపోవద్దు' అని శైలజానాథ్ అన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి

అరాచక పాలనకు పరాకాష్ట

- చంద్రబాబు పాలనలో వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ కార్యాలయాలపై దాడులు పెరిగిపోయాయి
- అనంతపురం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి



అనంతపురం: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి చంద్రబాబు ప్రభుత్వ అరాచక పాలనకు పరాకాష్ట అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ కార్యాలయాలపై దాడులు అధికమయ్యాయన్నారు. శనివారం అనంతపురంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచి 2024 వరకు ప్రజాస్వామ్య పద్ధతిలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు భద్రత కరువైందన్నారు. మనం ఏ విత్తనం నాటుతున్నామో.. భవిష్యత్‌లో అది మహావృక్షం అవుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేయడం చేతగాక.. అవినీతిని ప్రశ్నిస్తే పార్టీ కార్యాలయంపై దాడి చేయడం, సిబ్బందిని విచక్షణారహితంగా కొట్టడం హేయమైన చర్య అన్నారు. అధికారం ఉందన్న అహంకారంతో రెచ్చిపోతున్న టీడీపీ నాయకులకు భవిష్యత్‌లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నారా లోకేశ్ అరాచక శక్తులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే దాడులా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బీసీ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన ప్రశ్నిస్తే దాడులకు పాల్పడతారా అని నిలదీశారు. అధికారం శాశ్వతం కాదని, భవిష్యత్‌లో ఈ ఘటనకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో విపక్ష వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. ఇలాంటి విష సంస్కృతిని పెంచి పోషించడం మంచి సంప్రదాయం కాదని హితవు చెప్పారు. మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జానీ తదితరులు పాల్గొన్నారు.

రైల్లో గంజాయి చాక్లెట్స్ పట్టివేత

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో 45 ప్యాకెట్స్‌లో 1,920 చాక్లెట్స్ గుర్తింపు

స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

నరసరావుపేట టౌన్: రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి చాక్లెట్లను ఈగల్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల బృందం శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకుంది. ముందస్తు సమాచారం మేరకు భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో నరసరావుపేట వద్ద తనిఖీలు చేశారు. ఎస్–4 కంపార్ట్‌మెంట్‌లో 45 చాక్లెట్స్ బ్యాగ్‌ను గుర్తించారు. వాటిలో మొత్తం 1,920 గంజాయి చాక్లెట్స్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న నిందితుల కోసం గాలించారు. అనుమానితులు కనిపించక పోవడంతో కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఇది రెండోసారి..

గంజాయి కలిగిన చాక్లెట్స్ రాష్ట్రంలో మొట్టమొదటిసారి నరసరావుపేట మండలం కోటప్పకొండలో పట్టుబడ్డాయి. ఆరునెలల క్రితం ఒడిశాకు చెందిన వ్యక్తి అక్కడి నుంచి మత్తు చాక్లెట్స్ తీసుకొచ్చి రాష్ట్రంలో విక్రయిస్తుండగా గుర్తించిన ఎక్సైజ్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తాజాగా రైల్లో అక్రమంగా తరలిస్తూ గంజాయి చాక్లెట్స్ పట్టుబడ్డాయి. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్రంగా చేసుకొని గంజాయి, గంజాయి కలిగిన చాక్లెట్స్‌ను అక్రమార్కులు తరలిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

పోలీస్ వ్యవస్థకు 'చంద్ర' గ్రహణం

- గోరంట్ల మాధవ్ విమర్శ
- రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన

అనంతపురం: చంద్రబాబు ప్రభుత్వం పుణ్యమా అని రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు చంద్ర గ్రహణం .. ప్రజలకు శనిగ్రహణం పట్టిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ విమర్శించారు. రాష్ట్రంలో నిజాయితీగా, నిక్కచ్చిగా విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారులను వేధించడమే పనిగా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఫ్యాక్షన్‌ను, రౌడీయిజాన్ని కూకటి వేళ్లతో పెకలించిన నిఖార్సైన పోలీసు ఉన్నతాధికారి టీఎస్ఆర్ సీతారామాంజనేయులను జైలు పాలు చేశారని, అడిషనల్ డీజీ సంజయ్‌ని జైలుకు పంపారని పేర్కొన్నారు. ఇక డీజీ స్థాయి అధికారి సునీల్ కుమార్, ఐజీ కాంతి రాణా టాటా, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ సస్పెన్షన్‌లోనే ఉన్నారని అన్నారు. నిజాయితీగా, అంకితభావంతో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారులు ఈ రాష్ట్రం వదిలి వేరే రాష్ట్రాలకు పారిపోతున్నారన్నారు.

సతీష్‌కుమార్ మృతిపై 'పట్టాభిరాం' విచారణా?

పరకామణి కేసులో ఫిర్యాదుదారు సతీష్ కుమార్ మృతికి సంబంధించి దర్యాప్తు జరుగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, టీడీపీకి చెందిన పట్టాభిరాం ఈ కేసు విచారణను 'తన చేతుల్లోకి తీసుకున్న రీతిలో' మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కేసులో పోలీసు అధికారి సతీష్‌కుమార్‌ను ఇబ్బంది పెట్టారని అన్నారు. సతీష్‌కుమార్‌ను పదేపదే విచారణకు రమ్మని వేధింపులకు గురిచేశారన్నారు. మరోవైపు నిందితుడు రవికుమార్‌కు పోలీసు భద్రత కల్పించారన్నారు. నకిలీ మద్యం కేసులో సూత్రధారులు, పాత్రధారులు టీడీపీకి చెందిన వారే అయినప్పటికీ వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్‌ను అన్యాయంగా జైలుకు పంపారన్నారు. సతీష్‌కుమార్ మృతి కేసులో కూడా ఇలాంటి కుట్రలు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం పన్నాగం పన్నుతోందనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ కేసుపై పోలీసులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు.

రాయల్టీ సీనరేజ్ కలెక్షన్ కార్యాలయంపై దాడి

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మనుషులమంటూ ఇరువురు దౌర్జన్యం

కడప తాలూకా పోలీస్ స్టేషన్ సమీపంలో మాట్లాడుతున్న బాధిత ఉద్యోగులు

సాక్షి,టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మనిషినని, తనకు రాయల్టీ సీనరేజ్ పర్మిట్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎం.ఎస్. ప్రసాదరెడ్డి అనే వ్యక్తి శనివారం కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాయల్టీ సీనరేజ్ కలెక్షన్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డాడు. ఉద్యోగులు సతీష్, వంశీ, కృష్ణ, మల్లికార్జున తెలిపిన వివరాల ప్రకారం రామరాజుపల్లి కొత్తకొట్టాలు ప్రాంతంలోని లేబాకు ఎన్‌క్లేవ్‌లో 2023 మార్చి నుంచి 'హిల్‌సైడ్ ఎస్టేట్స్ ఎల్ఎల్‌పి' అనే పేరుతో రాయల్టీ సీనరేజ్ కలెక్షన్ కార్యాలయం నడుపుతున్నారు. కాగా, ప్రొద్దుటూరుకు చెందిన ప్రసాద్‌రెడ్డి 'టెస్మా' అనే కన్‌స్ట్రక్షన్ ప్రతినిధిగా శనివారం కడపలోని ఈ కార్యాలయానికి మరో వ్యక్తితో కలిసి వచ్చాడు. తమ సంస్థకు సంబంధించి 100 శాతం పర్మిట్ అనుమతుల కోసం కూపన్‌లను ఇచ్చేయాలని ఉద్యోగులతో వాగ్వాదానికి దిగాడు. ఈ సందర్భంలో ఇరువురు కలిసి ఇన్వర్టర్‌ను ధ్వంసం చేశారు. సీసీ కెమెరాల యూనిట్‌ను పగులగొట్టేందుకు ప్రయత్నించారు. కంప్యూటర్ సిస్టంను కిందకు తోసేశారు. ఈ క్రమంలో ఒక ఉద్యోగికి సంబంధించిన సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. ఎమ్మెల్యే దగ్గరికి వచ్చి సెల్‌ఫోన్‌ను తీసుకుని వెళ్లాలని చెప్పి వెళ్లారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని కడప తాలూకా సీఐ రెడ్డెప్ప తెలిపారు.

నివాళి

చెట్ల అవ్వ వెళ్లిపోయింది

వృక్షో రక్షతి రక్షితః... ఇది కొందరికి ఒట్టి వేదవాక్కు. కాని 'సాలుమరద' తిమ్మక్కకు అది జీవనవేదం. చెట్లను తన బిడ్డలుగా భావించి, వాటిని పెంచి పోషించిన ఆ చెట్ల అవ్వ ఇక లేరు. సాలుమరద అంటే చెట్ల వరుస అని కన్నడంలో అర్థం. ప్రజలు ఇచ్చిన ఇంటి పేరును తన పేరులో కలుపుకున్న కర్ణాటకకు చెందిన సాలుమరద తిమ్మక్క శుక్రవారం కన్నుమూశారు. అల్లారుముద్దుగా తమను పెంచిన ఆ తల్లి తరలిపోగా వృక్షాలన్నీ మౌనంగా దుఃఖిస్తున్నాయి.

చెట్టు అంటే ఏమిటి?
అది ప్రాణవాయువు.
అది ఆకు కొమ్మ ఫలం.
అది పువ్వు. అది నీడ.
అది గూడు. అది గుర్తు.
చెట్టు బతికితే మనిషి బతుకుతాడు.
జీవితాంతం చెట్లు నాటుతూ బతికిన
సాలుమరద తిమ్మక్క
114 ఏళ్ల వయసులో కన్ను మూశారు.
పచ్చటి సందేశమై ఆమె
మనకు కర్తవ్యాన్ని
బోధపరుస్తూనే ఉంటారు.

ఆ వనంలాంటి రోడ్డు

కర్ణాటక రాష్ట్రం రామనగర జిల్లాలోని కూడూర్–హలికల్ మధ్య నున్న స్టేట్ హైవే నం.94లో ఉన్న మర్రిచెట్లను ఓమారు పలకరించండి. 4.5 కిలోమీటర్ల దూరం వరకూ ఆ రోడ్డుకు అటూ ఇటూ భారీగా ఎదిగిన ప్రతిచెట్టు తమ బతుకు వెనుక తిమ్మక్క ఉందని చెప్తుంది. ఎన్నో విషయాలు వివరిస్తుంది. నీరు దొరకడమే గగనమైన ఆనాటి రోజుల్లో ఒక్కో మొక్కకు నీరు పోసి, పెంచి, బాగోగులు చూసి వాటిని కంటికి రెప్పలా కాపాడిన తిమ్మక్క, చిక్కయ్య దంపతుల గొప్పతనం అక్కడున్న ప్రతి చెట్టు తెలియజేస్తుంది. మొత్తం 385 మర్రిచెట్లను నాటి, వాటిని పెంచి, ఆ ప్రాంతంలో పచ్చదనం నెలకొల్పిన ఘనత తిమ్మక్కదే. బిడ్డలులేని ఆమె చెట్టునే బిడ్డ అనుకుంది. అయితే ఒకరిద్దరితో ఆ సంతానాన్ని నియంత్రించలేదు. మొక్కలు నాటడాన్ని ఆపలేదు. తాను జీవించి ఉన్నంత కాలం మొక్కలు నాటుతూ పంచుతూ పెంచుతూ ఉండిపోయింది. అందుకే 2019లో అప్పటి ప్రభుత్వం రోడ్డు విస్తరణలో భాగంగా ఆ చెట్లను కొట్టేయాలని యోచించినప్పుడు ముఖ్యమంత్రి కుమారస్వామికి తిమ్మక్క లేఖ రాశారు. 70 ఏళ్ల వయసున్న ఆ వృక్షాలను రక్షించాలని కోరారు. ఆమె మాటతో ముఖ్యమంత్రి ఆ చెట్ల కొట్టివేతను ఆపి, ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని అధికారులను ఆదేశించారు. ఇదంతా తిమ్మక్క వల్లే సాధ్యమైంది.



'పద్మశ్రీ' అందుకుంటున్న సమయంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆశీర్వదిస్తున్న తిమ్మక్క

ప్రపంచమంతా మెచ్చుకోలు

తిమ్మక్క దశాబ్దాలుగా మొక్కలు నాటే కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నా దేశవిదేశాల్లో అనేకమంది ఆమె కృషిని గుర్తించినా 2016లో ప్రపంచంలో అత్యంత ప్రభావవంత మహిళల జాబితాలో బీబీసీ ఆమె పేరును పేర్కొన్నా మన దేశం మాత్రం తిమ్మక్కను గుర్తించడంలో చాలా ఆలస్యం చేసిందని ఆమె గురించి తెలిసినవారు అంటారు. 108 ఏళ్ల వయసులో ఆమెకు కేంద్రం 'పద్మశ్రీ' ప్రకటించింది. అది చాలా ఆలస్యమని, అయినా ఆమెకు తన పని మీద తప్ప ఇటువంటి వాటి మీద ఆసక్తి లేదని ఆమె అభిమానుల మాట. ఆ తర్వాతే దేశంలోని అనేకమందికి తిమ్మక్క గురించి తెలిసింది. ఆమె వివరాలు, ఆమె చేస్తున్న పని ప్రాచుర్యం పొందాయి. కాలిఫోర్నియాలో పర్యావరణం మీద పని చేసే ఒక ఎన్.జి.ఓ తన సెంటర్‌కు సాలుమరద తిమ్మక్క పేరు పెట్టింది.

చెట్లే ఆరోగ్యం

తిమ్మక్క జీవితం చూస్తే చెట్లే ఆమెకు ఆరోగ్యాన్ని ఇచ్చాయా అనిపిస్తుంది. సగటు మనుషులు 50 దాటక ముందే అనారోగ్యం బారిన పడుతున్న వేళ తిమ్మక్క వందేళ్లు దాటాక కూడా చాలా ఆరోగ్యంగా ఉండేవారు. తన పనులు తానే చేసుకునేవారు. ఖాళీగా కూర్చోవడం, దిగులుతో బాధపడటం ఆమెకు తెలియదు. 1991లో భర్త మరణించిన తర్వాత అన్ని పనులూ భుజాన వేసుకున్నారు. చెట్లు నాటడమే కాకుండా, ఇతర సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనేవారు. 2020లో నడుముకు సంబంధించి ఆమెకు శస్త్రచికిత్స చేశారు. అది విజయవంతంగా జరిగిందని, తాను బాగానే ఉన్నానని ఆమె తెలిపారు.

కొద్దికాలంగా అనారోగ్యం బారిన పడ్డ ఆమె మునుపటిలా ఉత్సాహంగా ఉండలేకపోయారు. ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఇతర ఆరోగ్య సమస్యలతో నవంబర్ 14న కన్నుమూశారు. ఆమెకు ఒక పెంపుడు కొడుకు ఉన్నాడు.

తిమ్మక్క శివైక్యం చెందారు. ఆమె నాటిన చెట్లు కలకాలం పచ్చగా ఆమెను గుర్తు చేస్తుంటాయి.

ఉమెన్ పవర్

చాంపియన్ స్పోర్ట్ షూటర్ శ్రేయసి సింగ్, స్టార్ సింగర్ మైథిలీ ఠాకూర్‌లు రాజకీయాల్లోకి అడుగు పెట్టిన కొత్తలో.... 'ఆడినంత సులువు కాదు' 'పాడినంత సులువు కాదు' అన్నారు విమర్శకులు.
అయితే ఈ ఇద్దరూ ఆడినంత తేలిగ్గానే, పాడినంత సులువుగానే బిహార్ తాజా ఎన్నికలలో విజయం సాధించారు.
భిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన ఈ యువ మహిళా నాయకుల గురించి...

ఆట, పాట గెలిచాయి

ఈసారి కూడా గురి తప్పలేదు!

శ్రేయసి సింగ్

బిహార్‌లోని జముయి నియోజక వర్గం నుంచి శాసనసభ్యురాలిగా గెలిచిన శ్రేయసి సింగ్ ఒకప్పుడు చాంపియన్ స్పోర్ట్ షూటర్. శాసనసభ్యురాలిగా ఇది ఆమె రెండో విజయం.

బిహార్ జముయి జిల్లాలోని గిదౌర్‌కు చెందిన శ్రేయసి సింగ్‌కు ఘనమైన క్రీడా, రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. తాత సెరేందర్‌సింగ్, తండ్రి దిగ్విజయ్ సింగ్ ఇద్దరూ 'నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'కు అధ్యక్షులుగా పనిచేశారు. తండ్రి కూడా రాజకీయాల్లో ఉన్నారు. కేంద్ర మంత్రిగా పనిచేశారు. తల్లి పుతుల్ కుమారి మాజీ ఎంపీ.

దిల్లీలోని హన్స్‌రాజ్ కాలేజీలో చదువుకున్న శ్రేయసి ఫరిదాబాద్‌లోని మానవ్ రచనా ఇంటర్నేషల్ యూనివర్శిటీలో ఎంబీఏ పూర్తి చేసింది. చిన్నప్పటి నుంచి షూటింగ్ చూస్తూ పెరగడం వల్ల సహజంగానే ఆ క్రీడపై ఆమెకు ఆసక్తి ఏర్పడింది. ఆ ఆసక్తికి నైపుణ్యం తోడు కావడంతో షూటింగ్‌లో గురి తప్పకుండా దూసుకుపోయింది. 61వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో బిహార్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ బంగారు పతకాన్ని గెలుచుకుంది.

చిన్న వయసులోనే రాజకీయాల్లోకి అడుగు పెట్టిన శ్రేయసి సింగ్ భారతీయ జనతా పార్టీలో చేరి 2020 బిహార్ శాసన సభ ఎన్నికల్లో జముయి నియోజక వర్గం నుంచి గెలిచింది. యువత, మహిళ ఓటర్లను ఆకర్షించగల చరిష్మా, కుటుంబ రాజకీయ నేపథ్యం వల్ల బీజేపీ శ్రేయసీకి సీటు ఇచ్చింది. పురుషాధిపత్యం కనిపించే బిహార్ రాజకీయ రణక్షేత్రంలో నిలదొక్కుకోవడం, విజయం సాధించడం అంత తేలికైన విషయమేమీ కాదు. అయితే క్షేత్రస్థాయి నుంచి బిహార్ రాజకీయాలపై లోతైన అవగాహన ఉన్న శ్రేయసి ఎప్పుడూ తడబడలేదు. వెనకబడిన రాష్ట్రమైన బిహార్‌లో మహిళల రాజకీయ భాగస్వామ్యానికి శ్రేయసి సింగ్ రోల్‌మోడల్‌గా మారింది. స్త్రీ విద్య, ఉపాధి కోసం రాజకీయ వేదికగా క్రియాశీలంగా పనిచేస్తోంది.

చారిత్రక విజయ గీతం

'సంగీతంలో పుట్టింది. సంగీతంతో పెరిగింది' అనే మాట మైథిలి ఠాకూర్‌కు సరిపోతుంది. బాల్యం నుంచి ఆమెకు శాస్త్రీయ, జానపద సంగీతంతో అనుబంధం ఉంది. 'లిటిల్ చాంప్స్' 'ఇండియన్ ఐడల్ జూనియర్' లాంటి రియాలిటీ షోల ద్వారా చిన్న వయసులోనే సెలబ్రిటీగా మారింది. 'జీనియస్ యంగ్ సింగింగ్ స్టార్' పోటీలో విజేతగా నిలిచింది. తొలి ఆల్బమ్ 'యా రబ్బా'తో సంగీత అభిమానుల ప్రశంసలు అందుకుంది. మరుసటి సంవత్సరం 'రైజింగ్ స్టార్'లో రన్నరప్‌గా నిలిచింది.

ఆలీనగర్ నియోజక వర్గ బీజేపీ అభ్యర్థిగా ఆర్జేడీ అభ్యర్థిపై విజయం సాధించిన మైథిలీ ఠాకూర్ బిహార్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ సీటును గెల్చుకోవడం బీజేపికి ఇది మొదటిసారి. దీనిని చారిత్రక విజయంగా చెప్పుకోవచ్చు. బిహార్ అసెంబ్లీకి ఎంపికైన అతి పిన్న వయస్కురాలైన శాసనసభ్యురాలిగా సంచలనం సృష్టించి దేశమంతటి దృష్టిని ఆకర్షిస్తోంది 25 సంవత్సరాల మైథిలీ ఠాకూర్. ఎన్నికల ప్రచార యాత్రలలో జానపద, భక్తిగీతాలు ఆలపిస్తూ జనాలను ఆకట్టుకుంది. ఇతరుల కంటే భిన్నంగా సామాజిక సంస్కరణకు, సాంస్కృతిక పునర్జీవనాన్ని మిళితం చేసి తనదైన ఎజెండాను రూపొందించింది ఠాకూర్. మిథిల చిత్రకళను పాఠశాలల్లో పాఠ్యేతర అంశం (ఎక్స్‌ట్రా–కరికులర్ కంపోనెంట్)గా ప్రవేశపెడతామని, బాలికల కోసం బలమైన విద్యాకార్యక్రమాలు, స్థానిక యువత కోసం ఉపాధి–కేంద్రీకృత కార్యక్రమాలు, మిథిల చిత్రకళ సాంస్కృతిక వారసత్వాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించింది మైథిలీ ఠాకూర్.

● బ్యూటిప్స్

టేబుల్ స్పూన్ శనగపిండిలో, టేబుల్ స్పూన్ పెరుగు, టేబుల్ స్పూన్ పచ్చి పాలు, టీ స్పూన్ నిమ్మరసం కలిపి జుట్టుకు అప్లై చేయాలి. 15 నిమిషాల తరవాత గోరువెచ్చటి నీటితో తలస్నానం చేయాలి. ప్రతి వారం క్రమం తప్పకుండా జుట్టుకి ఈ ప్యాక్ వేయడం వల్ల జుట్టు నల్లగా నిగనిగలాడుతుంది.

ఆరు టీ స్పూన్ల వైట్ పెట్రోలియమ్ జెల్లీలో రెండు టీ స్పూన్ల గ్లిజరిన్, రెండు టీ స్పూన్ల నిమ్మరసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకోబోయే ముందు చర్మం మీద అప్లై చేయాలి. ఈ విధంగా చేస్తే పొడిబారిన చర్మం మృదువవుతుంది.

హెల్త్

● బొల్లికి మంచి చికిత్స

మచ్చలిక మాయం!

ఒంటిపైన తెల్లటి మచ్చలతో కనిపించే బొల్లి వల్ల ప్రాణహాని ఉండదు. కానీ ఒంటిపై తెల్లటి పొడలు మచ్చలు మచ్చలుగా కనిపిస్తుండటం వల్ల బాధితులు నలుగురిలోకి రావడానికి సామాజికంగా ఇబ్బంది పడతారు. అది అంటువ్యాధి కాదని తెలియక చాలామంది వాళ్ల పట్ల వివక్ష చూపుతారు. ఒక రకంగా చూస్తే మన సొంత వ్యాధి నిరోధకత (ఇమ్యూనిటీ) అన్నది మన సొంతకణాలపైనే దాడి చేసే ఆటో ఇమ్యూన్ సమస్య కూడా ఒక అంశం కావడంతో ఒకప్పుడు దీనికి అంతగా చికిత్స ఉండేది కాదు. అయితే ఇటీవల దీనికి మంచి మంచి చికిత్స ప్రక్రియలే అందుబాటులో ఉన్నాయి. ఇంగ్లిష్‌లో విటిలిగో అని పిలిచే ఈ బొల్లి వ్యాధిపై అవగాహన కోసం ఈ కథనం.

ప్రాణహాని కలిగించకపోయినా వివక్షకు కారణమయ్యే ఈ వ్యాధి విస్తృతి మన జనాభాలోని దాదాపు 0.5 శాతం మందిలో కనిపిస్తోంది. ఇటీవల దీని విస్తృతి పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది.

బొల్లి వ్యాధి కారణాలు ఏమిటంటే...

మానవ చర్మంలోని మెలనోసైట్స్ అనే కణాల్లో రంగును ఇచ్చే పిగ్మెంట్‌ను కలిగి ఉంటాయి. ఈ రంగునిచ్చే పిగ్మెంట్ వల్లనే పదార్థం వల్ల మేనికి రంగు సమకూరుతుంది. ఉదాహరణకు ఒకరి చర్మంలో మెలనోసైట్స్‌లో పిగ్మెంట్ మోతాదులు ఎక్కువగా ఉంటే వాళ్ల చర్మం నలుపు మొదలుకొని, తక్కువగా ఉన్నవారి చర్మం తెల్ల రంగు (ఫెయిర్) వరకు రకరకాల షేడ్స్‌లో మేని రంగు ఉంటుంది. ఈ మెలనోసైట్స్ అన్నీ ఒకేచోట కుప్పగా ఉన్నప్పుడు అక్కడ నల్లటిరంగు పుట్టుమచ్చ వస్తుంది.

ఏదైనా కారణాల వల్ల ఒకరి చర్మంలో ఈ మెలనోసైట్స్ దెబ్బతినడం వల్ల అక్కడి పిగ్మెంట్ లోపించినప్పుడు అక్కడి చర్మం తన సహజమైన రంగును కోల్పోయి తెల్లగా కనిపిస్తుంది. ఇలా చర్మపు రంగు లోపించడానికి... రంగును ఇచ్చే పదార్థమైన పిగ్మెంట్‌లోని కణాలను సొంత వ్యాధి నిరోధకత దెబ్బతీయడం (ఆటోఇమ్యూన్ అంశం) కూడా ఒక కారణం కావచ్చు.

ఈ వ్యాధిగ్రస్తుల్లోని చాలామందిలో ఇది జన్యుపరంగా వచ్చే అవకాశాలెక్కువ. ఇక మరికొందరిలో ఏ కారణమూ లేకుండానే ఇది కనిపించవచ్చు. కారణం ఏదైనా బొల్లి వచ్చిన వారిలో శరీరంపై తెల్లటి మచ్చలు ప్యాచులు ప్యాచులుగా కనిపిస్తాయి. ఇంగ్లిష్‌లో దీన్ని విటిలిగో అని పిలుస్తారు. వైద్య పరిభాషలో దీన్ని 'ల్యూకోడెర్మా' అంటారు.

ఈ మచ్చలు హాని కలిగించవు కానీ...

ఈ విటిలిగో మచ్చల్లో ఎలాంటి నొప్పీ ఉండదు. వీటి కారణంగా ఆరోగ్యానికి సైతం హాని కూడా ఏదీ ఉండదు. కానీ చూడటానికి (లుక్స్ పరంగా) ఇది ఏమాత్రం బాగుండదు. కాబట్టి ఎంతగా హానికరం కాకపోయినప్పటికీ ఈ వ్యాధి కారణంగా బాధితులు వివక్షకు ఆత్మన్యూనతకూ లోనయ్యే అవకాశాలూ ఎక్కువే.

మచ్చలు... పాటర్న్స్ బట్టి వాటిల్లో రకాలు...

ఈ బొల్లి మచ్చలు రకరకాల పాటర్న్స్‌లో కనిపిస్తాయి. ఉదాహరణకు కొందరిలో ఈ తెల్లమచ్చలు కొద్దిపాటి పొడల్లాగా వస్తాయి. అయితే వాటి సైజు పెరగదు. ఎప్పటికీ అవి చిన్నవిగానే కనిపిస్తుంటాయి. మరికొందరిలో మాత్రం ఇవి పెద్దవిగా విస్తరిస్తూ ఒక తెల్లమచ్చతో మరొకటి కలిసిపోవడం వల్ల శరీరమంతా తెల్లబారిపోతుంది. ఆ పాటర్న్స్ కనిపించే తీరును బట్టి వీటిని మూడు రకాలుగా వర్ణించవచ్చు.

● **ఫోకల్ పాటర్న్...** ఈ తెల్లని మచ్చలు చర్మంలో ఏదో ఒక చోటికి మాత్రమే పరిమితం అవుతాయి.

● **సెగ్మెంటల్ పాటర్న్...** ఈ మచ్చలు శరీరమంతటా కాకుండా ఏదో ఒక వైపునకే... అంటే ముందువైపునకు గానీ లేదా వెనకవైపునకే పరిమితం కావడం.

● **జనరలైజ్‌డ్ పాటర్న్...** ఒక చోటికి మాత్రమే పరిమితం కాకుండా చర్మంపై అనేక ప్రాంతాలకు విస్తరించడం. అలాగే ఏదో ఒక వైపునకు మాత్రమే ఉండకుండా శరీరమంతటా కనిపించడం.



ఈ తెల్లటి మచ్చలు సాధారణంగా చేతులు, వేళ్ల చివరలు, పాదాలు, భుజాలు, ముఖం, పెదవులు లాంటి చోట్ల ఎక్కువగా ఉంటాయి. కొందరిలో బాహుమూలాలు, పొత్తికడుపు కింది భాగం, నోటి చుట్టూ, కంటి చుట్టూ, మర్మావయవాల ప్రాంతంలో ఉంటాయి. ఈ మచ్చలకు తోడు... విటిలిగో ఉన్నవారిలో ఆ తెల్ల మచ్చలు విస్తరించిన ప్రాంతంలో ఉండే వెంట్రుకలు (ఉదాహరణకు మాడు, కనురెప్పలు, కనుబొమలు, గడ్డంలోని ప్రాంతాల్లోనివి) తెల్లగా మారిపోతాయి. నల్లటి మేనిఛాయ ఉండే వారిలో ఈ తెల్లమచ్చలు / రంగు కోల్పోయిన ప్రాంతాలు మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటుంది.

అందుబాటులో ఉన్న చికిత్స ప్రక్రియలు...

శరీరంపై ఉండే ఆ మచ్చల పరిమాణం, అవి వచ్చిన చోటు, అక్కడ అవి ఎంతమేర విస్తరించాయి... లాంటి అనేక అంశాలపై చికిత్స ఆధారపడి ఉంటుంది. అలాగే చికిత్స ప్రక్రియలు కూడా వేర్వేరు వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి. ఇక చికిత్సా ఫలితాలు కూడా ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటాయి. కొందరిలో ఫలితం చాలా వేగంగా కనిపిస్తే, మరికొందరిలో చాలా ఆలస్యంగా కనిపిస్తుంది. ఇప్పుడు అందుబాటులో ఉన్న చికిత్స ప్రక్రియలివి...

● **మెలనిన్ కణాలు మరింత నాశనం కాకుండా చూడటం :** ఈ ప్రక్రియలో చర్మానికి రంగును ఇచ్చే మెలనిన్ కణాలు మరింతగా నాశనమైపోకుండా చేస్తారు. అంతేకాదు... రంగు కోల్పోయిన శరీర భాగానికి మునుపటి రంగు వచ్చేలా చేస్తారు.

● **స్టెరాయిడ్ క్రీములు :** కొన్ని రకాల స్టెరాయిడ్ క్రీముల్ని పైపూతగా (టాపికల్ మెడిసిన్స్‌గా) వాడాల్సి ఉంటుంది. అవి చర్మానికి సాధారణ రంగు వచ్చేలా చేయడంతో పాటు మచ్చలు మరింత విస్తరించకుండా సహాయపడతాయి. అయితే అవి స్టెరాయిడ్స్ అయినందున వచ్చే సైడ్ ఎఫెక్ట్స్‌ను దృష్టిలో పెట్టుకుని వాటిని కచ్చితంగా డాక్టర్ పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉంటుంది. లేదంటే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ.

● **ఫొటో థెరపీ :** ట్యాబ్లెట్లు, లోషన్ రూపంలోని సోరాలెన్స్ అనేవి ఈ తరహా చికిత్సలో ఉపయోగపడతాయి. అయితే ఈ ట్యాబ్లెట్‌లు లేదా క్రీములను సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ అవుతూ వాడాలి. అయితే సూర్యరశ్మికి బదులుగా హానికరం కాని మోతాదులో అల్ట్రావయొలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ అయ్యేలా కూడా చేయవచ్చు. దీన్ని 'పూవా' థెరపీ అంటారు. మరికొంత మందికి న్యారో బ్యాండ్ అల్ట్రా వయొలెట్ – బి కిరణాలతోనూ, ఎక్సైమర్ లేజర్ అనే ఫొటో థెరపీ ప్రత్యామ్నాయాలూ అందుబాటులో ఉన్నాయి. ఈ ఎక్సైమర్ లేజర్‌ను కొన్ని నిర్దిష్టమైన ప్యాచ్‌ల దగ్గరే ఉపయోగించడానికి వీలుంది. ఈ ఫొటో థెరపీ ప్రక్రియల కోసం హాస్పిటల్‌కు రాలేని వారికి ఇంట్లోనే ఉపయోగించుకునేలా హోమ్ బేస్‌డ్ ఫొటో థెరపీ పరికరాలూ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాకపోతే వీటిని డాక్టర్ చెప్పిన విధంగా మాత్రమే వాడాల్సి ఉంటుంది.

● **డి-పిగ్మెంటేషన్ ట్రీట్‌మెంట్ :** కొంతమందిలో దాదాపు 80 శాతం పైగా శరీరం తెల్లబడి పోతుంది. ఇలాంటివారిలో నల్లగా ఉన్న మిగతా ప్రాంతాన్ని కూడా తెల్లగా చేస్తారు.

● **ఇతర ప్రక్రియలు :** జింక్‌గో బైలోబా, లీవామీసోల్... లాంటివి ఇమ్యూన్ మాడ్యులేటర్స్. అంటే ఇవి బాధితుల్లో ఇమ్యూనిటీని పెంచడం ద్వారా విటిలిగోతో పోరాడతాయి. ఇవి టాబ్లెట్ల రూపంలోనూ లభ్యమవుతాయి.

● **శస్త్రచికిత్స (సర్జికల్ ట్రీట్‌మెంట్):** వీటిల్లో పంచ్ గ్రాఫ్టింగ్, స్ప్లిట్ స్కిన్ గ్రాఫ్టింగ్ వంటి రకరకాల సర్జరీ ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ఆధునిక శస్త్రచికిత్స ద్వారా చర్మంపై ఇతర చోట్లలో ఉన్న రంగునిచ్చే పిగ్మెంట్ కణాలను (మెలనోసైట్స్‌ను)... అవి కోల్పోయిన ప్రాంతంల్లోకి బదిలీ చేసేందుకు అవకాశం ఉంది. అయితే ఇతరత్రా సాధారణ చికిత్సల వల్ల ఎలాంటి ఫలితాలూ రాని సందర్భాల్లో మాత్రమే ఈ శస్త్రచికిత్స పద్ధతిని అవలంబిస్తారు. శరీరంలోని కొన్ని భాగాల్లో (అంటే... పెదవులు, చేతుల వేళ్ల చివరి భాగాలు, కాళ్ల చివరన ఉండే భాగాలకు) వచ్చిన మచ్చల విషయంలో సాధారణ చికిత్స ప్రక్రియలు అంతగా సత్ఫలితాలు ఇవ్వకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో ఈ శస్త్రచికిత్స ప్రక్రియలు అవసరం కావచ్చు. అయితే పక్కలకు విస్తరించని విటిలిగో మచ్చలతో బాధపడే పేషెంట్ల విషయంలోనే ఈ శస్త్రచికిత్స విధానాన్ని ఆలోచిస్తారు. వ్యాప్తి చెందకపోవడం అంటే... ఒక ఏడాది వ్యవధిలో మచ్చ సైజు విస్తరించకపోవడం, కొత్త ప్రాంతాల్లో మచ్చలు రాకపోవడాన్ని మచ్చలు వ్యాప్తిచెందని పేషంట్లుగా పరిగణిస్తారు. ఈ సర్జికల్ ప్రక్రియలో ఇతర చోట్ల నుంచి చర్మాన్ని తీసుకుని గ్రాఫ్ట్ చేస్తారు.

ఇప్పుడు అభివృద్ధి చెందిన ఆధునిక శాస్త్రవిజ్ఞాన ప్రక్రియల వల్ల మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంది. సర్జరీ తర్వాత మళ్లీ అక్కడ సాధారణ పిగ్మెంట్ వచ్చేందుకు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టవచ్చు. అయితే ఒక్కోసారి అనుకున్న ఫలితాలు వచ్చేందుకుగాను... సర్జరీ తర్వాత సాధారణ వైద్యచికిత్స కూడా అవసరం కావచ్చు.

చివరగా... ఇప్పుడు అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య చికిత్స ప్రక్రియల వల్ల విటిలిగో రోగులు మునుపటిలా ఆత్మన్యూనతకు గురికావాల్సిన అవసరంగాని, బాధపడాల్సిన పరిస్థితిగాని లేదు. అనేక వినూత్న చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వచ్చినందున వాటి సాయంతో మళ్లీ మేని రంగును మామూలుగా మార్చుకునేందుకు చాలా అవకాశాలున్నాయి.

డా॥ స్వప్నప్రియ, సీనియర్ డర్మటాలజిస్ట్

నిర్వహణ: యాసిన్

గుండె ఆరోగ్యం కోసం సులువైన సూచనలు!

సాధారణంగా ఆరోగ్య సూత్రాలంటే ఆచరించడానికి కాస్తంత కఠినంగానే ఉంటాయి. పొద్దున్నే లేవాలి. ఒళ్లంతా హూనమయ్యేలా వ్యాయామం చేయాలి. నోరుకట్టుకోవాలి. అందుకే క్రమశిక్షణను కఠినంగా పాటించే కొద్ది మంది వాటిని ఆచరిస్తుంటారు. కానీ ఒకవేళ అవే చాలా సులువుగా పాటించేలా ఉంటే ఎంత బాగుంటుంది. అందుకే గుండె ఆరోగ్యాన్ని పదికాలాల పాటు పదిలంగా కాపాడుకోడానికి వీలైన అతి సులువైన ఆరోగ్య సూచనలు ఇవి. వీటిని పాటిస్తే... గుండె ఆరోగ్యంతో పాటూ మిగతా దేహ ఆరోగ్యమూ బాగుంటుంది. ఇమ్యూనిటీ కూడా మెరుగుపడుతుంది.

● ఆకలిగా ఉన్నప్పుడు మాత్రమే తినాలి. ఆకలిగా లేనప్పుడు తినడం సరికాదు. ● తినేదేదో హడావుడిగా కాకుండా.... నెమ్మదిగా, నిదానంగా, నింపాదిగా తినాలి. ● మనం ఇష్టపడే ఆహారపదార్థాలు ఏవైనా వాటిని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అసలు మానేయాలనే భావనే ఒత్తిడిని పెంచుతుంది. రేపు తినవచ్చులే అన్న భావన ఉంటే ఎలాంటి ఆహారాన్నైనా ఆ టైమ్‌లో తినకుండా నియంత్రించుకోవచ్చు. అలా మనకు సరిపడని ఆహారం మీద అదుపు సాధించవచ్చు.

● డైటింగ్ అనే భావనతో నోరు కట్టేసుకోవడం అంత మంచిదికాదు. తక్కువ తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినడం మేలు.

● ఆహారంలో రాత్రి భోజనం మితంగా ఉండేలా చూసుకోవడం మంచిది. ● అధిక కొవ్వులు ఉండే మాంసాహారాలు మానేయాలనే భావన చాలామందికి రుచించకపోవచ్చు. కానీ చేపలు చాలా మంచి ప్రత్యామ్నాయాలు. వాటిల్లో ఉండే ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు మేలు చేస్తాయి. కాబట్టి మాంసాహారం తినాలనిపించినప్పుడు చేపలు అనే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోండి.

● ఫ్రిజ్‌లో నిల్వ ఉండే ఆకుకూరలు, కూరగాయల కంటే ఎప్పటికప్పుడు తాజా వండుకోవడమే మంచిది. ఎందుకంటే ఫ్రిజ్‌లో పెట్టిన వాటిల్లో 50 నుంచి 60 శాతం పోషకాలు నశించిపోతాయి. ● కూరల్లో వెల్లుల్లి ఉండేలా జాగ్రత్తపడండి. దీంతో ఆహారం రుచికరమవుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులూ తగ్గుతాయి.

● రాత్రి కంటినిండా నిద్రపోవాలి. వీలైతే మధ్యానం పూట కాసేపు ఓ కునుకు (పవర్‌న్యాప్) తీయడం మంచిదే. మధ్యానం నిద్ర కాసేపు మాత్రమే. ● పొగతాగే అలవాటు ఉంటే పూర్తిగా మానేయాలి. పొగాకు ఏ రూపంలో వాడుతున్నా అది గుండెకే కాదు... అన్ని అవయవాలకూ, పూర్తి ఆరోగ్యానికీ చేటు. ● రెడ్ వైన్ గుండెకు మంచిదని కొందరు అంటుంటారు గానీ అది నిజం కాదు. ఆల్కహాల్ పరిమితంగా తీసుకోవడం గుండెకు మేలు చేస్తుందంటారు. అది కూడా వాస్తవం కాదు. ఆల్కహాల్ ఏ రూపంలో ఉన్నా, ఎంత తక్కువ మోతాదులో అయినప్పటికీ అది శరీర ఆరోగ్యానికీ అందునా గుండెకు మంచిది కాదు. ఆల్కహాల్ మానేయాలనే ఈ నిబంధనను మాత్రం తప్పక పాటించాల్సిందే.

పోరాడి ఓడిన లక్ష్య సేన్

ఈ ఏడాది రెండో టోర్నమెంట్‌లో ఫైనల్ చేరాలని ఆశించిన భారత నంబర్‌వన్ లక్ష్య సేన్‌కు నిరాశ ఎదురైంది. జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ పోరాటం ముగిసింది. కుమామోటో నగరంలో శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో లక్ష్య సేన్ 19-21, 21-14, 12-21తో ప్రపంచ 13వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు. నిషిమోటోతో గతంలో ఐదుసార్లు తలపడి మూడుసార్లు గెలిచి, రెండు సార్లు ఓడిపోయిన లక్ష్య సేన్ ఆరో ముఖాముఖి పోరులో తీవ్రంగా పోరాడినా గట్టెక్కలేకపోయాడు. 77 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో లక్ష్య సేన్ తొలి గేమ్ కోల్పోయినా, రెండో గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచాడు. అయితే మూడో గేమ్‌లో నిషిమోటో పూర్తి ఆధిపత్యం చలాయించి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. సెమీఫైనల్లో ఓడిన లక్ష్య సేన్‌కు 6,887 డాలర్ల (రూ. 6 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 6420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది మొత్తం 20 టోర్నీల్లో ఆడిన లక్ష్య సేన్ హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. మకావు ఓపెన్‌లో, జపాన్ ఓపెన్‌లో సెమీఫైనల్లో నిష్క్రమించాడు.

క్వార్టర్స్‌లో అర్జున్

టైబ్రేక్ పోరుకు హరికృష్ణ

అర్జున్

పనాజీ: ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రెండుసార్లు ప్రపంచకప్ విజేత, అమెరికా గ్రాండ్‌మాస్టర్ లెవోన్ అరోనియన్‌తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ పోరులో అర్జున్ 1.5–0.5తో గెలుపొందాడు. ప్రపంచ 23వ ర్యాంకర్ అరోనియన్‌తో శుక్రవారం జరిగిన తొలి గేమ్‌ను ‘డ్రా’ చేసుకున్న ప్రపంచ ఆరో ర్యాంకర్ అర్జున్... శనివారం జరిగిన ఏడో గేమ్‌లో నల్లపావులతో ఆడుతూ అర్జున్ 38 ఎత్తుల్లో విజయం సాధించి ముందంజ వేశాడు. మరోవైపు భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ భవితవ్యం టైబ్రేక్‌లో తేలనుంది. హరికృష్ణ, జోస్ ఎడువార్డో మార్టినెజ్ అల్కంటారా (రొమేనియా) మధ్య జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ 1–1తో సమంగా ముగిసింది. వీరిద్దరి మధ్య రెండో గేమ్ కూడా 35 ఎత్తుల్లో ‘డ్రా’ అయింది. దాంతో విజేతను నిర్ణయించేందుకు ఆదివారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు. సిందరోవ్ జవోఖిర్ (ఉజ్బెకిస్తాన్), నొదిర్‌బెక్ యాకుబొయెవ్ (ఉజ్బెకిస్తాన్), వె యి (చైనా) కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

భారత్ ‘ఎ’ X పాక్ ‘ఎ’

- నేడు రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టి20 టోర్నీలో ‘ఢీ’
- రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

దోహా: భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మరోసారి పోరుకు రంగం సిద్ధమైంది. రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా నేడు భారత్ ‘ఎ’, పాకిస్తాన్ ‘ఎ’ జట్ల మధ్య లీగ్ మ్యాచ్ జరగనుంది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 42 బంతుల్లో 11 ఫోర్లు, 15 సిక్స్‌లతో 144 పరుగులు చేసిన భారత టీనేజ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే అందరి దృష్టి ఉంది. సెప్టెంబర్‌లో యూఏఈలో జరిగిన ఆసియా కప్ టి20 టోర్నీలో పాకిస్తాన్, భారత ఆటగాళ్లు పరస్పరం కరచాలనం చేసుకోలేదు. మరి ఈ మ్యాచ్‌లో జితేశ్ శర్మ నాయకత్వంలోని భారత ‘ఎ’ జట్టు సభ్యులు కూడా పాకిస్తాన్ ‘ఎ’ ఆటగాళ్లతో కరచాలనం చేసే అవకాశం కనిపించడంలేదు.

ఐపీఎల్-2026 రిటెన్షన్ వివరాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత జట్టుకు నిరాశ

బెంగళూరు: బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ వరల్డ్ క్వాలిఫయర్స్‌కు అర్హత పొందాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు ఓడిపోయింది. గ్రూప్ ‘జి’లో భాగంగా స్లొవేనియా జట్టుతో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–2 తేడాతో ఓటమి పాలైంది. శుక్రవారం నెదర్లాండ్స్ జట్టును 2–1తో ఓడించిన స్లొవేనియా... వరుసగా రెండో గెలుపుతో వచ్చే ఏడాది క్వాలిఫయర్స్ బెర్త్‌ను దక్కించుకుంది. స్లొవేనియాతో జరిగిన తొలి సింగిల్స్‌లో భారత రెండో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక 3–6, 6–4, 1–6తో 162వ ర్యాంకర్ తమారా జిదాన్‌సెక్ చేతిలో పోరాడి ఓడింది. 2 గంటల 19 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో రష్మిక ఆరు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి 4–6, 2–6తో 98వ ర్యాంకర్ కాజా యువాన్ చేతిలో ఓడిపోయింది. నామమాత్రమైన డబుల్స్ మ్యాచ్‌లో అంకిత రైనా–ప్రార్థన (భారత్) ద్వయం 1–6, 6–3, 10–7తో ‘సూపర్ టైబ్రేక్’లో దాలియా జకుపోవిచ్–నికా రాడిసిక్ జంటపై గెలిచింది. నేడు జరిగే నామమాత్రమైన మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది.

రష్మిక

ఔరా... క్రికెట్! ఇదేం వికెట్! బ్యాటింగ్ ఫ్రెండ్లీ క్రికెట్‌లో గేమ్ ఛేంజర్లంతా బ్యాటర్లే! మెరుపులైనా, సునామీలైనా బ్యాట్లతోనే చూశాం. కానీ ఈడెన్ గార్డెన్స్ టెస్టు చూస్తే మాత్రం ‘ఇది గతం... బౌలర్ల ఘనం’ అనక తప్పదు! ఎందుకంటే బౌలింగ్ జోరు ఒక సెషన్‌కే సరిపెట్టుకోలేదు... ఓ రోజుకే పరిమితం కాలేదు. వరుసగా ఆరు సెషన్లు బ్యాట్లు డీలా... బ్యాటర్లు విలవిలలాడేలా బౌలర్లు భళా అనిపించారు. సంప్రదాయ క్రికెట్‌కే కొత్త ఉత్తేజాన్నిచ్చేలా... మూడు రోజుల్లోనే ఫలితం వచ్చేలా ఇరు జట్ల బౌలర్లు గ్రే‘టెస్టు’ క్రికెట్ ఆడుతున్నారు.

శుభం కార్డు నేడే?

రెండో రోజూ బౌలర్ల హవా

- నేలకూలిన 15 వికెట్లు
- 189కే ఆలౌటైన భారత్
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 93/7
- జడేజా ఖాతాలో 4 వికెట్లు
- 63 పరుగుల ఆధిక్యంలో బవుమా బృందం

జడేజాకు సహచరుల అభినందన

కోల్‌కతా: మార్క్‌రమ్ 31... కేఎల్ రాహుల్ 39... తొలి రెండు రోజుల్లో దక్షిణాఫ్రికా, భారత్ ఓపెనర్లు చేసిన పరుగులివి! రెండు జట్ల ఇన్నింగ్స్‌ల్లో టాప్ స్కోర్లు కూడా ఇవే! టెస్టులో రెండు సెషన్లు ఆడితే సెంచరీ... రెండో రోజు నిలబడితే డబుల్ సెంచరీ, ఆ రోజంతా అజేయంగా నిలిస్తే ట్రిపుల్ సెంచరీ... జెంటిల్మెన్ క్రికెట్‌లో సర్వసాధారణమిది. కానీ రెండు రోజుల్లో మూడో ఇన్నింగ్స్ (ఒక జట్టు రెండో ఇన్నింగ్స్)లైనా కూడా ఫిఫ్టీ కాదు కదా కనీసం 40 పరుగులైనా చేయకపోతే అది ముమ్మాటికీ బౌలింగ్ సత్తానే కాక మరేమిటి! ధనాధన్ షో చూసిన వారికి ఫటాఫట్ వికెట్లు, ఆలౌట్ మీద ఆలౌట్‌లు కనబడుతున్నాయి. ఎంత పటిష్ట బ్యాటింగ్ లైనప్‌లతో దిగినా... స్పిన్ బౌలింగ్-బ్యాటింగ్ ఆల్‌రౌండర్లను మోహరించినా... బంతి శాసిస్తోంది ఈ టెస్టుని! క్రీజులోని బ్యాటర్లకు ప్రతీ బంతికి పెడుతోంది అగ్నిపరీక్షని!

రెండో సెషన్లోనే భారత్ కూలింది!

భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఈడెన్‌గార్డెన్స్‌లో మొదలైన మొదటి టెస్టులో బంతి సవాల్ విసురుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 37/1తో శనివారం రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో సెషన్ అయినా పూర్తిగా ఆడలేక 62.2 ఓవర్లలోనే తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులకే కుప్పకూలింది. దీంతో మొదటి రోజే టెస్టుపై పట్టుబిగించిందనుకున్న ఆతిథ్య జట్టుకు... పట్టుబిగించింది మన జట్టు కాదు... బౌలర్లు అన్న విషయం రెండో రోజు రెండో సెషన్‌లోనే అర్థమైంది. రాహుల్ (39; 4 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) ఈ ఓవర్‌నైట్ బ్యాటింగ్ జోడీ చేసిన 57 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యమే అతి పెద్ద పార్ట్‌నర్‌షిప్! రిషభ్ పంత్ (27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జడేజా (27; 3 ఫోర్లు)లు రెండు పదుల స్కోర్లు దాటారు. ఇక పర్యాటక బౌలర్లలో హార్మర్ 4, యాన్సెన్ 3 వికెట్లు తీశారు.

జడేజా ఉచ్చులో పడి...

భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యం లభించగా... రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా మెడకు జడేజా స్పిన్ ఉచ్చు బిగించాడు. తొలిరోజు బుమ్రా, సిరాజ్‌ల పేస్ అదిరిపోవడంతో వెనుకబడిన జడేజా... స్పిన్, తన విశేషానుభవాన్ని వినియోగించి సఫారీ బ్యాటర్లను క్రీజులో నిలువనీయలేదు. దీంతో ఆట నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 93/7 స్కోరు చేసిన దక్షిణాఫ్రికా ఆలౌటయ్యేందుకు సిద్ధమైపోయింది. కెప్టెన్ బవుమా (29 బ్యాటింగ్, 3 ఫోర్లు) తప్ప ఇంకెవరూ 20 పరుగులైనా చేయలేకపోయారు. కెప్టెన్‌తో పాటు బాష్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. జడేజా 4 వికెట్లు పడగొట్టగా, కుల్దీప్‌కు 2, అక్షర్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్రస్తుతం దక్షిణాఫ్రికా 63 పరుగుల ఆధిక్యంలో ఉంది.

92 టెస్టుల్లో రిషభ్ పంత్ కొట్టిన సిక్స్‌లు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన భారతీయ బ్యాటర్‌గా రిషభ్ పంత్ గుర్తింపు పొందాడు. 91 సిక్స్‌లతో వీరేంద్ర సెహ్వాగ్ (103 టెస్టుల్లో) పేరిట ఉన్న రికార్డును పంత్ బద్దలు కొట్టాడు. పంత్ 48 టెస్టుల్లోనే సెహ్వాగ్‌ను దాటేశాడు.

2 తొలి ఇన్నింగ్స్‌లో 27 పరుగులు చేసిన క్రమంలో రవీంద్ర జడేజా టెస్టుల్లో 4000 పరుగుల మైలురాయిని దాటాడు. తద్వారా కపిల్ దేవ్ తర్వాత టెస్టుల్లో 4000 పరుగులు చేయడంతో పాటు 300 వికెట్లు పడగొట్టిన రెండో భారతీయ క్రికెటర్‌గా, ఓవరాల్‌గా నాలుగో క్రికెటర్‌గా జడేజా గుర్తింపు పొందాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) యాన్సెన్ 12; రాహుల్ (సి) మార్క్‌రమ్ (బి) కేశవ్ 39; సుందర్ (సి) మార్క్‌రమ్ (బి) హార్మర్ 29; గిల్ (రిటైర్డ్‌హర్ట్) 4; పంత్ (సి) వెరీన్ (బి) బాష్ 27; జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) హార్మర్ 27; ధ్రువ్ జురేల్ (సి అండ్ బి) హార్మర్ 14; అక్షర్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 16; కుల్దీప్ యాదవ్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సిరాజ్ (బి) యాన్సెన్ 1; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (62.2 ఓవర్లలో ఆలౌట్) 189. వికెట్ల పతనం:** 1-18, 2-75, 3-109, 4-132, 5-153, 6-171, 7-172, 8-187, 9-189. **బౌలింగ్:** యాన్సెన్ 15-4-35-3, ముల్డర్ 5-1-15-0, కేశవ్ మహరాజ్ 16-1-66-1, కార్బిన్ బాష్ 11-4-32-1, సైమన్ హార్మర్ 15.2-4-30-4.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 11; మార్క్‌రమ్ (సి) జురేల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; తెంబా బవుమా (బ్యాటింగ్) 29; డి జోర్జి (సి) జురేల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; కైల్ వెరీన్ (బి) అక్షర్ పటేల్ 9; మార్కో యాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 13; కార్బిన్ బాష్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (35 ఓవర్లలో 7 వికెట్లకు) 93. వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60-, 6-75, 7-91. **బౌలింగ్:** బుమ్రా 6-1-14-0, అక్షర్ 11-0-30-1, కుల్దీప్ 5-1-12-2, రవీంద్ర జడేజా 13-3-29-4.

ఆరాధన గుర్తుండిపోతుంది

''మంచి గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘12ఏ రైల్వే కాలనీ’. తర్వాత ఏం జరగబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఉంటుంది. ఈ సినిమాలో ‘అల్లరి’ నరేశ్‌గారికి జోడీగా ఆరాధన అనే పాత్ర చేశాను. నా పాత్ర ఎక్కడ నుంచి వచ్చింది? ఏం చేస్తుంది? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఈ క్యారెక్టర్ లేకపోతే ఈ చిత్రకథ లేదు. సినిమా చూసిన తర్వాత ఆరాధన అందరికీ గుర్తుండిపోతుంది'' అని కామాక్షీ భాస్కర్ల తెలిపారు. - కామాక్షీ భాస్కర్ల

‘అల్లరి’ నరేశ్, కామాక్షీ భాస్కర్ల జోడీగా నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన చిత్రం ‘12ఏ రైల్వే కాలనీ’. ‘పొలిమేర’ మూవీ ఫేమ్ డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు షో రన్నర్‌గా వ్యవహరించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో కామాక్షీ భాస్కర్ల విలేకరులతో మాట్లాడుతూ– ''‘పొలిమేర’ తర్వాత అనిల్ విశ్వనాథ్‌గారు కొన్ని ప్రాజెక్ట్స్ ఒప్పుకున్నారు. అందుకే ‘12ఏ రైల్వే కాలనీ’కి దర్శకత్వం వహించకుండా తన పర్యవేక్షణలో నానిగారితో దర్శకత్వం చేయించారు. నానిగారు అద్భుతంగా తీశారు. నేను జనరల్ ఫిజీషియన్‌ని. నేను పని చేస్తున్న సినిమా సెట్‌లో నన్ను డాక్టర్‌గానూ యూజ్ చేస్తుంటారు (నవ్వుతూ). ఇండియన్ సినిమాలో పారామెడికల్ కల్చర్ తక్కువ... ఈ సంస్కృతిని తెలుగు సినిమాలోనూ తీసుకురావాలనే ఆలోచన ఉంది. శ్రీవిష్ణు, సుహాస్, విజయ్ సేతుపతిగార్లు హీరోలుగా, అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు. అయితే ఫీమేల్ యాక్ట్రెస్‌కి ఆ యాక్సెప్టెన్సీ లేదు. అలా ఎందుకు ఉండకూడదని సవాల్‌గా తీసుకుని హీరోయిన్‌గా చేస్తూనే కీలక పాత్రలు చేస్తున్నాను. ప్రస్తుతం ‘డెకాయిట్’ సినిమా చేస్తున్నాను. ‘పొలిమేర 3’ షూటింగ్ ఆరంభం కావాలి. మరో పెద్ద సినిమా కూడా ఒప్పుకున్నాను'' అని చెప్పారు.

మాస్ డ్యాన్స్‌కి రెడీ

వెంకటేశ్, చిరంజీవి

మాస్ డ్యాన్స్ చేయడానికి రెడీ అవుతున్నారట చిరంజీవి, వెంకటేశ్. ఈ స్టార్స్ ఇద్దరితో ఓ సెలబ్రేషన్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట అనిల్ రావిపూడి. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘మన శంకర వరప్రసాద్‌గారు’. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా, ముఖ్య పాత్రల్లో వెంకటేశ్, క్యాథరీన్, వీటీవీ గణేశ్ నటిస్తున్నారు. ఆల్రెడీ చిరంజీవి, వెంకటేశ్ కాంబినేషన్‌లో గత నెలాఖర్లో ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. కాగా ఈ చిత్రంలో ఓ సెలబ్రేషన్ సాంగ్ ఉందని, ఈ పాటలో చిరంజీవి, వెంకటేశ్‌తో పాటు నయనతార, క్యాథరీన్ కూడా డ్యాన్స్ చేస్తారని టాక్. ఈ పాటను ఈ నెలాఖరున చిత్రీకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారట. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

సరికొత్త ప్రేమకథ



సూర్య ప్రతాప్, సంగీత్ శోభన్

‘మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్’ చిత్రాలతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న సంగీత్ శోభన్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభమైంది. పల్నాటి సూర్యప్రతాప్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, గిరిబాబు వల్లభనేని నిర్మిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమాని ఆరంభించారు. నిర్మాత ఎస్‌కేఎన్ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. ''సరికొత్త ట్రెండీ లవ్‌స్టోరీతో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల్ రైటర్. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

ఈ రోజు నా మాటలను నాన్న వింటుంటారు – మహేశ్‌బాబు

‘వారణాసి’లో మహేశ్‌బాబు

''నాన్నగారంటే (సూపర్‌స్టార్ కృష్ణ) నాకు చాలా ఇష్టం. ఆయన చెప్పిన ప్రతి మాటని గౌరవించాను, పాటించాను. కానీ ఒక్కటి మాత్రం చేయలేదు. ఆయన నన్నెప్పుడూ పౌరాణికం సినిమా చేయమని అడిగేవారు. ఆ మాట నేను వినలేదు. ఈ రోజు నా మాటల్ని ఆయన వింటుంటారు (‘వారణాసి’లో మహేశ్ చేసిన రుద్ర పాత్రకు పౌరాణికం టచ్ ఉంది). నాన్న ఆశీస్సులు ఎప్పుడూ మనతో ఉంటాయి. ‘వారణాసి’ నా డ్రీమ్ ప్రాజెక్ట్. దీనికి ఎంత కష్టపడాలో అంతా పడతాను. ఈ సినిమా విడుదలైనప్పుడు దేశమంతా గర్వపడుతుంది'' అని భావోద్వేగంగా మాట్లాడారు మహేశ్‌బాబు.

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్న చిత్రానికి ‘వారణాసి’ టైటిల్ ఖరారైంది. శనివారం హైదరాబాద్‌లో ‘గ్లోబ్‌ట్రోటర్’ ఈవెంట్ పేరిట చిత్రయూనిట్ నిర్వహించిన కార్యక్రమంలో ‘వారణాసి’ టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజయేంద్రప్రసాద్, కంచి కథ అందించారు. ఈ చిత్రం 2027 వేసవిలో విడుదల కానుంది.

ఈ వేడుకలో **మహేశ్‌బాబు మాట్లాడుతూ–** ''ఈ వేదికపైకి సింపుల్‌గా నడిచొస్తానంటే రాజమౌళిగారు కుదరదన్నారు... చూశారుగా ఎంట్రీ ఎలా ప్లాన్ చేశారో (బొమ్మ నందిపైన కూర్చుని వస్తున్నట్లుగా). ఇదంతా మీకోసమే (అభిమానులు). మీరంతా మమ్మల్ని సపోర్ట్ చేసినందుకు థ్యాంక్స్. అప్‌డేట్స్... అప్‌డేట్స్ అన్నారు. అవి ఎలా ఉన్నాయో మీరే చెప్పాలి. అవి చూస్తుంటే నాకే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అయింది. ముందు ముందు ఎలా ఉంటుందో మీ ఊహకే వదిలేస్తున్నా. మీరంతా ఎంతో కష్టపడి ఇక్కడికి వచ్చినందుకు ధన్యవాదాలు. అభిమానులందరూ క్షేమంగా ఇంటికి చేరుకుంటే మేమంతా చాలా సంతోషంగా ఉంటాం'' అని తెలిపారు.

రాజమౌళి మాట్లాడుతూ– ''నాకు చిన్నప్పుడు కృష్ణగారి గొప్పదనం తెలియదు. చిన్నప్పుడు ఎన్టీఆర్‌గారి అభిమానిని. కానీ ఇండస్ట్రీకి వచ్చాక... సినిమా ఏంటో అర్థమయ్యాక కృష్ణగారి గొప్పదనం తెలిసింది. ఒక కొత్త టెక్నాలజీని ఇంట్రడ్యూస్ చేయాలంటే ఎన్నో దారులను బ్రేక్ చేసుకుంటూ, ఎన్నో దారులు వేసుకుంటూ వెళ్లాలి. ఇక నిన్న (శుక్రవారం) రాత్రి మా సినిమా వీడియోను టెస్ట్ చేయాలనుకున్నాం. లీక్ కాకూడదని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ డ్రోన్స్‌తో వీడియోలు తీసి, నెట్‌లో పెట్టడం మొదలుపెట్టారు. ఈ వీడియోను ఎంతో దూరం నుంచి వచ్చిన ఆడియన్స్ కోసం ఈ రోజు మేం ప్లే చేద్దామనుకున్నాం. ఇక మహేశ్‌బాబు నుంచి మనందరం నేర్చుకునే ఒక గుణం ఉంది. మనందరికీ సెల్‌ఫోన్ ఎడిక్షన్ ఉంది. ఆఫీసుకు వచ్చినా, షూటింగ్‌కు వచ్చినా సెల్‌ఫోన్ పట్టుకోడు. 8 గంటలైనా, 10 గంటలైనా తన సెల్‌ఫోన్ కారులోనే ఉంటుంది. మళ్లీ కారు ఎక్కితేనే మహేశ్ తన ఫోన్ టచ్ చేస్తాడు. మనందరం ఇది నేర్చుకోవాలి. మహాభారతం, రామాయణం అంటే నాకు చాలా ఇష్టమని చాలాసార్లు చెప్పాను. మహాభారతం నా డ్రీమ్ ప్రాజెక్ట్ అని కూడా చెప్పాను. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు కూడా రామాయణంలోని ఓ ముఖ్యమైన ఘట్టం తీస్తానని అనుకోలేదు. ఫస్ట్ డే మహేశ్‌కి రాముడి వేషం వేసి, ఫొటోషూట్ చేస్తుంటే గూస్‌బంప్స్ వచ్చాయి. సినిమాలోని ఆ ఎపిసోడ్‌ను 60 రోజులు షూట్ చేశాం. నా సినిమాల్లో మోస్ట్ మెమొరబుల్ సీక్వెన్స్‌గా అది ఉండబోతోంది. మీరు ఊహించనంత అందంగా, పరాక్రమంగా, కోపంగా, దయార్ద్ర హృదయంతో ఉంటాడు మహేశ్. ఈ ఎపిసోడ్ షూట్ చేసినందుకు నేను చాలా లక్కీ'' అన్నారు.

ప్రియాంకా చోప్రా మాట్లాడుతూ– ''కొంత గ్యాప్ తర్వాత ఇండియన్ సినిమా చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాలో మందాకిని పాత్రకు నన్ను ఎంపిక చేసుకున్న రాజమౌళిగారికి థ్యాంక్స్. మహేశ్‌బాబుగారు, ఆయన ఫ్యామిలీ... నేను హైదరాబాద్‌ని మరో ఇల్లుగా భావించేలా చేశారు'' అని అన్నారు.

పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ– ''రెండేళ్ల క్రితం రాజమౌళిగారి నుంచి నాకో మెసేజ్ వచ్చింది. ఆయన చెప్పిన ఐదు నిమిషాల నరేషన్ విని మైండ్ బ్లో అయ్యింది. ఇండియన్ సినిమా లిమిట్స్ దాటేలా ఈ చిత్రకథ, రాజమౌళి విజన్ ఉంటాయి'' అని చెప్పారు.

ఎమ్ఎమ్ కీరవాణి మాట్లాడుతూ– ''కీరవాణిగారు మెలోడీ బాగా కొడతారు. కానీ బీట్ కాస్త స్లోగా ఉంటుందన్న పేరు నాకు ఎందుకు వచ్చిందో నాకు తెలియదు. ఈసారి మెలోడీ నాదే. బీటూ నాదే'' అని చెప్పారు.

కథా రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఓ 30 నిమిషాల యాక్షన్ సీక్వెన్స్ ఉంది. మహేశ్‌బాబు విశ్వరూపాన్ని చూస్తూ నేనలా ఉండిపోయాను. డబ్బింగ్ లేదు... సిజీ లేదు... రీ రికార్డింగ్ లేదు... అయినా నన్ను మంత్రముగ్ధుడ్ని చేసింది ఆ సీన్... మర్చిపోలేను. మీరు (ఆడియన్స్) కూడా చక్కని అనుభూతి చెందుతారు. కొన్ని కొన్ని సినిమాలు మనుషులు చేస్తారు. కొన్ని కొన్ని సినిమాలు దేవతలు చేయించుకుంటారు. అనుక్షణం రాజమౌళి గుండెలపై హనుమ ఉన్నాడు'' అని చెప్పారు

కార్తికేయ మాట్లాడుతూ– ''నిర్మాతగా గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై నా తొలి స్పీచ్ ఇది. చాలా గౌరవంగా ఉంది. మన ఇండియా వైపు గ్లోబల్ ఆడియన్స్ చూసేలా, మన ఇండియన్ సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్లేలా ప్రయత్నాలు చేస్తున్నాం'' అని చెప్పారు.

కేఎల్ నారాయణ మాట్లాడుతూ– ''పదిహేనేళ్ల క్రితం మహేశ్‌బాబు, రాజమౌళిగార్లతో సినిమా చేయాలనుకుని, వారిని అడిగితే వెంటనే ఒప్పుకున్నారు. కానీ ఇంత టైమ్ పడుతుందని రాజమౌళిగారు, నేనూ ఊహించలేదు. ఇప్పుడు నా కల నిజమైంది'' అన్నారు.

ఈ వేడుకలో నమ్రత, సితార, రమా రాజమౌళి, సుప్రియ, కంచి, దేవ కట్టా, ఫైట్ మాస్టర్ సాల్మన్‌లతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ళు ధర్మంగా...



సాహితి, త్రినాథ్

త్రినాథ్ కఠారి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన సినిమా ‘ఇట్లు మీ ఎదవ’. ‘వెయ్యేళ్ళు ధర్మంగా వర్ధిల్లు’ అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో సాహితీ అవంచ హీరోయిన్‌గా నటించగా, బళ్లారి శంకర్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న రిలీజ్ కానుంది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పీ, ఆంధ్రా–సీడెడ్ ఏరియాల్లో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లుగా యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్ .

చిన్నప్పుడు విన్న కథతో తీశా!

''2004లో జరిగిన ఓ వాస్తవ ఘటన గురించి నా చిన్నప్పుడు విన్నాను. ఆ నేపథ్యంలో ‘రాజు వెడ్స్ రాంబాయి’ కథ రాసుకున్నాను. ఇది పరువు హత్యకు సంబంధించిన కథ కాదు... కానీ, అలాంటిదే. ప్రేమికులకు ఏం జరిగింది? అనేది మాత్రం తెరపైనే చూడాలి'' అని డైరెక్టర్ సాయిలు కంపాటి తెలిపారు. - సాయిలు కంపాటి

అఖిల్ ఉడ్డెమారి, తేజస్విని జంటగా నటించిన చిత్రం ‘రాజు వెడ్స్ రాంబాయి’. డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్, డోలాముఖి సుబల్టర్న్ ఫిలిమ్స్, మాన్‌సూన్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ నెల 21న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు సాయిలు కంపాటి విలేకరులతో మాట్లాడుతూ– ''డైరెక్టర్స్ వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాలగార్ల దగ్గర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేశాను. వేణు ఊడుగుల అన్నకు నేను చెప్పిన ‘రాజు వెడ్స్ రాంబాయి’ కథ నచ్చడంతో దర్శకుడిగా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఈటీవీ విన్ వాళ్లు కూడా మా ప్రాజెక్ట్‌లో జాయిన్ అయ్యారు. ఈ సినిమా ఔట్‌పుట్ చూసి వేణు అన్న, బన్నీ వాసు, వంశీ నందిపాటిగార్లు సంతోషించారు. మా కంటెంట్ మీద మాకు నమ్మకం ఉంది. అందుకే ఈ నెల 21న ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నా ఒత్తిడిగా భావించడం లేదు. నా తదుపరి సినిమాకి చర్చలు జరుగుతున్నాయి. వేణు అన్న ఓ నిర్మాతగా ఉంటారు. ఆ ప్రాజెక్ట్‌ని త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

రెడ్డి మరియు NRI/27Yrs, 5'9"/29Yrs, 6'/ 31Yrs 5'8" / బీటెక్ / సాఫ్ట్‌వేర్ జాబ్ /వెల్ సెటిల్డ్ గల వరులకు వధువులు కావలెను. Ph: 6303580419 [H-801302]

పద్మశాలి/ M.Tech / Govt. Exq. టెక్నికల్ / SSDC / 70,000/-PM / 6' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16140]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు / M.Tech/ Govt. గెజిటెడ్ ఆఫీసర్/ఫారెస్ట్ Dept / 80,000/-PM/5'11"ఎత్తు / 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16140]

SC హిందూ మాల/కట్నం ప్రసక్తి లేదు/ BE/ Govt. Asst. ఇంజినీర్ / ట్రాన్స్‌కో / 20 Lakhs. PA/5'11" ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16140]

క్రిస్టియన్ మాల/ 32 / 5'10" / B.Tech, MBA / SWE / 30 Lakhs PA / అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-16140]

మాల/B.Tech / Govt. బ్యాంక్ మేనేజర్ /SBI / 80,000/-PM / 5'8"ఎత్తు/30 సం॥ల వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-16140]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, మత భేదము లేకుండా అన్ని వయస్సుల వారికి సంబంధాలు మా వద్ద కలవు/ A: 33, Q: Degree/Govt.Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము OK). Ph: 9063558878 [H-801302]

రెడ్డి/2nd (కుల, ఆస్తి) పట్టింపు లేదు, Age: 31 Q: Pharmcy, Own Business & Well Property's గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK). అన్ని వయస్సుల వారికి 1st & 2nd సంబంధాలు కలవు. Ph: 9100147176 [H-801302]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 33/Qly: Degree. Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) Ph: 8074131208 [H-801302]

రెడ్డి మరియు NRI/25Yrs, 5'5"/28yrs/ 5'3" / 30Yrs 5'6" / బీటెక్ / సాఫ్ట్‌వేర్ జాబ్/వెల్ సెటిల్డ్ గల వధువులకు వరులు కావలెను. Ph: 6303580419 [H-801302]

వైశ్య/50y/విడో/అగ్రికల్చర్ ఆఫీసర్/సూపర్ మార్కెట్ /30 Acres Land / 20 Lac Income / కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. 6304494883 [H-821219]

వైశ్య/ 50y / విడో / 5'4" / సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/1L/- PM ఎవరూలేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9100867741 [H-821219]

రెడ్డి/ విడో/5'3"/Pvt Employee / 5 ఎకరాల పొలం/సొంత ఇల్లు రెంట్స్/ గల వధువుకు వరుడు కావలెను. 9618752560 [H-821219]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel - kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ B.Tech/ M.Tech /Business/ Hyd / 1995 / 5'10" / 300Cr / 50L/M-Rental Income. * Cont: K.C.Reddy-Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/Business/ B.Tech/1997 /6'/ 100Cr - (Industry). *Cont: K.C. Reddy - Mar-Bureau - Pvt - Ltd-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ BE - BITS / MS / H1/USA/ 1993/ 5'11"/240K/50Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Pvt- Ltd-Hyd. Ph:9347807015 /9849321309

Reddy/ B.Tech / Working / 1994/ 5'11"/25L/yr/100Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Pvt- Ltd-Hyd. Ph : 9849321309 / 9347807015

Reddy/ MS / H1 / USA / 1990 /5'7"/ 140K/20Cr. *Cont:K.C. Reddy-Mar-Bureau-Pvt- Ltd-Hyd. Ph : 9849321309 / 9347807015

Reddy/IIT/B.Tech/1994/5'9"/1Cr/yr /30Cr/SWE/Bangalore. *Cont: K.C. Reddy- Mar-Bureau-Pvt. Ltd- Hyd. Ph:9347807015/ 9849321309

Reddy/Catholic/1994/5'8"/B.Tech/MS /H1/USA/1994/100K/5Cr- *USA-Citizen / B.Tech / MS/1986 / 5'7" / 200K. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1995/ 5'10" / 170K / 20Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Pvt. Ltd- Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/Divorcee/MBBS/MD/1994/ 5'9"/100Cr *B.Tech/MS/ Business -Hyd-1994/ 5'11"/ 300Cr/ 50L/M-Rental Income/ Ph: 9347807015

Reddy/MBBS / MD / 1996/6' / 50Cr / * Cont: K.C. Reddy - Mar - Bureau - Pvt. Ltd-Hyd- Ph: 9849321309 / 9347807015

వరుడు కావలెను

Reddy/ B.Tech/ (CBIT)/ Merit/ MS/ USA/2000/5'3"/Rich-Family. *Cont: K.C.Reddy-Mar - Bureau - Pvt - Ltd-Hyd.Ph:9347807015 /9849321309

Reddy/ MBBS / MD / Most Beautiful / 1998/5'5" / 80Cr- * Cont : K.C.Reddy-Mar - Bureau - Pvt - Ltd-Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech/MBA(IIM) Beautiful/ 1997/5'4"/35L/yr/6Cr. * Cont: K.C. Reddy-Mar - Bureau - Pvt-Ltd-Hyd. Ph: 9347807015 / 9849321309

Reddy/B.Tech / MBA / Most Beautiful / 1995/5'4" / 20Cr. * Cont: K.C. Reddy-Mar - Bureau - Pvt-Ltd-Hyd. Ph : 9849321309 / 9347807015

Reddy/Divorcee / USA - Green Card/B.Tech/MS/1991/5'3"/140K/ 25Cr. *Cont: K.C. Reddy - Hyd. Ph:9347807015 /9849321309

Reddy/B.Tech (CBIT) / Working/ Hyd / Most Beautiful/ 1999/ 5'7"/ 100Cr. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ NewZeland/PR/2000/ 5'3"/ BS/NZ/30Cr. * Cont: K.C. Reddy-Mar - Bureau - Pvt-Ltd- Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/IIIT/Most Beautiful/ 2000/5'7"/45L/yr/10Cr. * Cont: K.C. Reddy- Mar - Bureau - Pvt-Ltd-Hyd. Ph: 9849321309/9347807015

Reddy / B.Tech / MS / USA / Most Beautiful/1998/5'4"/10Cr.*Cont:K.C . Reddy -Mar - Bureau - Pvt-Ltd-Hyd - Ph: 9347807015 / 9849321309

Reddy/BBA/MBA-Most Beautiful /1997 / 5'4' / 150Cr. * Cont: K.C. Reddy -Mar-Bureau-Pvt-Ltd-Hyd- Ph: 9849321309/9347807015

[D-582]

రెండో పెళ్ళి/విడో/50y/ కరీంనగర్ / Govt. టీచర్ /Own House (Rents)పిల్లలు లేని ఏ బాధరబందీ లేని వధువుకు FC/BC వరుడు కావలెను (సపోర్ట్ ఉండును) Ph: 8519803423 [H-821219]

రెడ్డి/విడో / 49y / 5'5" / V.Fair / Govt.Bank Manager/ సొంత అపార్ట్‌మెంట్ / 26 ఎకరాల పొలం /రైస్ ఫ్యాక్టరీ/5L/-PM/ గల పిల్లలు లేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. CNB. 9030200295 [H-821219]

గౌడ/ M.Sc Agri / Govt. AEO/ అగ్రికల్చర్ Dept / 52000/-PM / 5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 9550166072 [HA-16140]

క్రిస్టియన్ మాల/5Cr. ఆస్తి /M.Tech, MS/ Chip Design ఇంజినీర్/27 Lakhs PA/ 5'5"ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16140]

రెండో పెళ్లి/ 24y & 25y & 26y & 27y&28y& 29y&30y&31y&33y&34y&35y&36y&37y&39y & 40y&41y&42y&43y&44y&45y&47y&48y&49y& 50y/"మా సేవ" (Since: 1998) Ph: 9291503949 [HA-16140]

35 సం॥ల వధువుకు ప్రాపర్టీ, రెంట్స్. వరుడు కావలెను. (ఇల్లరికం OK) ఆల్ టైప్స్. Govt. పెన్షనర్స్, 1వ, 2వ, మ్యాచులు కలవు. లేడీస్‌కి ఫ్రీ సర్వీస్, ఫాస్ట్ సెటిల్‌మెంట్. Ph: 6281147818 [HA-16140]

రజక/B.Tech/C.Govt. Asst. మేనేజర్ /కెనరా బ్యాంక్ / 55000/-PM / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16140]

★★

రెల్లి క్రిస్టియన్స్, విజయవాడ Age 34, 5'4 H, Failr, B.Tech., కంప్యూటర్స్, వధువుకి వరుడు కావలెను. డైరెక్ట్ ✆ : 95429 35625 [R-1256844]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి Business, BE, MS, 27, 6' 1", Very Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), 27, 6', Product Engineer, 24 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 6' 1", Software, 180 K, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 8", Sr. SWE, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Singapore BE, MS, 28, 5' 7", Data Analyst, 120 K, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 8", Sr. SWE, 25 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIIT), MSc, 29, 5' 10", 50 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 29, 5' 6", Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 30, 5' 10", Doctor, 70 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 33, 5' 8", Engineer, 6 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 24, 5' 3", 40 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 3", Engineer, 250 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 27, 5' 3", Doctor, 50 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBA (ISB), 31, 5' 4", Very Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో (Since 25 Years)

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో గత 25 సంవత్సరాలుగా అన్ని ప్రాంతాలవారికి కేవలం రెడ్డి సంబంధాలు మాత్రమే చూస్తూ 4 బ్రాంచీలు కలిగి ఉన్నటువంటి ఏకైక అగ్రగామి సంస్థ మీ నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో Timings 10.30 AM to 6.30 PM

వధువు కావలెను

రెడ్డి / 1997 / 5'10" / IIT Madras / Software Developer / 72 L PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1995 / 5' 11" / B.Tech / MS Canada / Canada PR / 120 KCAD. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1991 / 5'9" / B.Tech / MS USA / 130K / I-140 Approved. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1996 / 5'11"/ B.Tech / MD / Own Business / Very Rich. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1996 / 5'10" / B.Tech / IIT / MS USA / 180 K PA/ H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1994 / 5'11" / B.Tech BITS Pilani / Business / 600Cr/ Very Rich. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1997 / 5'11" / B.Tech / MS USA / 150 K PA / H1B / I-140 Process. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1991 / 5'8" / B.Tech/ MS Australia / Business. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1995 / 5'9" / B.Tech/ Construction Business / 50 Cr. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి /1991 / 5'11" / B.Tech / MS Canada / Canada Citizen / 120 K PA/ Divorcee. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

వరుడు కావలెను

రెడ్డి / 1999 / 5'3" / B.Tech / MS USA / OPT. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1999 / 5'3" / B.Tech / MS USA / 80K PA/ H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1998 / 5'2" / B.Tech / MS USA / 100K PA / OPT. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1997 / 5'5" / B.Tech / MS USA / SWE / 15 L PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1997 / 5'5" / MBBS / Veterinary Doctor. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1999 / 5'1" / B.Tech / MS USA / 120 K PA / H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1991 / 5'3" / B.Tech / MS USA / 150K PA/ H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1999 / 5'6" / B.Tech / MS USA / Amazon / OPT. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1997 / 5'2" / B.Tech / MS USA / 100 K PA / H1B. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1998 / 5'4" / B.Tech / MS USA / OPT / Very Rich. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

LETTER

శ్రీ శ్రీరస్తు శుభమస్తు మాట్రిమోని

రెడ్డీస్ : The Ultimate Reddy's [VIPS & ELITE Matches] గజ్జల ప్రభాకర్ రెడ్డి : 9966808059, 9059189869 – ఓన్లీ రెడ్డీస్–

వధువు కావలెను

రెడ్డి/1999 / 6'1" / MS Engg / USA / 1000Crs / 4Cr Rental PM / Own Construction's గల వరుడుకు తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1997 / 5'10" / M.Sc UK / 500 Crs / Own Construction's గల వరుడుకు Business or Doctor వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1997 / 5'11" / DM Cardiology / 200Crs / Own Hospital's గల వరుడుకు Doctor వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1995 / 5'11" / B.Tech / 200 Crs / 30 Lakhs Rental PM / Own Business Banglore లో ఉన్న వరుడుకు తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1990 / 6 feet / M.Sc Chemistry / 500 Crs / Own Pharma Company గల వరుడుకు Well Settled నుండి వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1997 / 5'11" / MS General Surgery / 500 Crs / Own Colleges గల వరుడుకు Well Settled Doctors or Business వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1996 / 5'8" / B.Tech / 300Crs / 30L Rental PM / Own Business గల వరుడుకు తగిన వధువు కావలెను. 9059189869.

రెడ్డి/1991 / 5'11" / MS Engg / 500 Crs/ 20 L Rental PM / Own Business గల వరుడుకు Good Family నుండి వధువు కావలెను. 9059189869.

రెడ్డి/డైవర్సీ: 1995 / 6 feet / B.Tech (VIT) & MS (NJIT) USA / 30 Crs / USD 360K P/A గల వరుడుకు 1వ, 2వ వధువు కావలెను. 9059189869.

రెడ్డి/డైవర్సీ: 1993 / 6 feet /BE Computer Science / MBA/ 50 Crs /40 L P/A/ Pvt Job గల వరుడుకు తగిన వధువు కావలెను. 9059189869.

వరుడు కావలెను

రెడ్డి/2002 / 5'5" / MBA / 300 Crs / Business Family గల వధువుకు Well Settled Business వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/1995 / 5'6" / B.Arch / 500 Crs Only Daughter గల వధువుకు Business, IAS & IPS నుండి వరుడు కావలెను. 9059189869.

రెడ్డి /1999 / 5'3"/ B.Tech MBA / 300Crs Job చేస్తున్న వధువుకు Job or Business వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/1997 / 5'4" / MBBS / 250 Crs / Own Industries గల వధువుకు Own Industries గల వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/1997 / 5'5" / MS USA / USD 150 / 50Crs ప్రాపర్టీ గల వధువుకు India or USA వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/1993 / 5'5" / MS USA / 50 Crs ప్రాపర్టీ గల వధువుకు Well Settled నుండి Indiaలో ఉన్న వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/1995 / 5'5" / M.Tech / 50 Crs Own Business గల వధువుకు తగిన Software or Business వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/1994 / MS Engg USA / USA 150 K / 200 Crs గల వధువుకు India or USA వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/డైవర్సీ: 1990 / 5'5" / B.Tech MBA / 30Crs / Own Business చేస్తున్న వధువుకి Software or Business వరుడు కావలెను. 9059189869.

రెడ్డి/డైవర్సీ/ 1994 / 5'4" / MBBS MS ENT / 40Crs డాక్టర్ వధువుకి డాక్టర్ Or Business వరుడు కావలెను. 9059189869.

[D-000]

వేదికలు

కాకతీయ మ్యారేజెస్ వారి అన్ని బ్రాంచెస్ లో పేదలకు ఫీజు లేకుండా అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9391 999 999 / 709 3200 333 [H-821108]

బ్రాహ్మణ, పద్మశాలి పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16141]

Divorcee & Widowed పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16141]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. * Shyam. Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16141]

కమ్మ, కాపు, రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16141]

మాదిగ–మాల పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. * Srinivas. Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16141]

Cast No BAr, SWE / Govt / Business/ 25 to 37y, 1st, 2nd Match, Free Service & Registration for Ladies. 9030832815 [HA-2062]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు

3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

AP+TS+Metros: (Chennia + Bengaluru + Delhi + Mumbai)	1800/- for 4 Lines, 485/- Extra Line
Telangana: (Incl. Hyd)	1100/- for 4 Lines, 300/- Extra Line
Andhra Pradesh: (Incl. Hyd)	1350/- for 4 Lines, 375/- Extra Line

* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం

అనంతపూర్-9912220718	గుంటూరు - 9912220356
కర్నూలు - 9010825556	విజయవాడ - 7995554534
YSR కడప - 9951602932	తాడేపల్లిగూడెం-9912220558
తిరుపతి - 9912220586	రాజమండ్రి - 9912220358
నెల్లూరు - 9951602861	విశాఖపట్నం - 9912220550
ఒంగోలు - 9912225431	శ్రీకాకుళం - 9912220343

సాక్షి కార్యాలయంలో లేదా ఫోన్ ద్వారా సంప్రదించగలరు 9912225442

బ్రాండిక్స్ వంటి పరిశ్రమలు అధికంగా ఏర్పాటు కావాలి

కేంద్ర మంత్రి పియూష్ గోయల్

సాక్షి, అనకాపల్లి: దేశంలోని గ్రామీణ ప్రాంతాల పురోగతికి బ్రాండిక్స్ వంటి పరిశ్రమలు అధిక సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఆయన శనివారం రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర తదితరులతో కలిసి అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీని సందర్శించారు. అక్కడ వస్త్ర పరిశ్రమల్లో దుస్తుల తయారీ విధానాన్ని పరిశీలించారు. సంస్థలోని మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. ఈ పరిశ్రమల్లో ఉత్పత్తులు ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలతో ఉన్నాయని కేంద్ర మంత్రి అభినందించారు. గ్రామీణ మహిళలకు ఆసరాగా, అండగా నిలిచి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న బ్రాండిక్స్ యాజమాన్యం పనితీరు, సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై థర్మల్ డ్రోన్లతో నిఘా

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

సాక్షి,అమరావతి: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి అందుబాటులో ఉన్న సాంకేతిక వినియోగంతో పాటు సిబ్బంది కృషి చాలా అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగే అవకాశం ఉన్న ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ల వద్ద థర్మల్ డ్రోన్లతో నిఘా పెంచాలని పోలీసు–అటవీ అధికారులకు సూచించారు. అటవీ చెక్ పోస్టులను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలు అమర్చి బేస్ క్యాంపులు, వాచ్ టవర్లలో గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధంపై శనివారం అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. శేషాచలం అడవుల నుంచి ఒక్క ఎర్రచందనం దుంగ కూడా అక్రమంగా బయటకు వెళ్లకూడదని, దీని కోసం ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు.

ఒక్క సోడా కూడా ప్రమాదమే..

- డైట్ సోడా సైతం సురక్షితం కాదు
- కాలేయ సమస్యలకు దారి తీస్తోంది
- తాజా అధ్యయనంలో వెల్లడైన వాస్తవం

భోజనం, స్నాక్స్ సమయంలో సోడా ఒక ప్రధాన ఆహారంగా మారింది. మితంగా సోడా తీసుకోవడం కూడా కాలేయ ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలను కలిగిస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. రోజూ డైట్ సోడా లేదా చక్కెరతో తయారైన పానీయాలు తాగడం వల్ల నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఏఎఫ్ఎల్‌డీ) ప్రమాదం పొంచి ఉందని తేలింది. చక్కెరతో తయారైన తీపి పానీయాలు (ఎస్ఎస్‌బీలు), తక్కువ చక్కెర లేదా చక్కెరరహిత తీపి పానీయాలు (ఎల్ఎన్ఎస్ఎస్‌బీ) రెండూ కూడా జీవక్రియను దెబ్బతీస్తాయి. తద్వారా మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఏఎస్ఎల్‌డీ) అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉందని అధ్యయనంలో వెల్లడైంది. ఎంఏఎస్ఎల్‌డీని గతంలో వైద్యులు ఎన్ఏఎఫ్ఎల్‌డీ అని పిలిచేవారు. రోజూ ఒక బాటిల్ డైట్ సోడా/కృత్రిమ చక్కెరతో తయారైన పానీయాలు తాగడం వల్ల ఎంఏఎస్ఎల్‌డీ ప్రమాదం 60% పెరుగుతుంది. అలాగే చక్కెర పానీయాల విషయంలో ఈ వ్యాధి ముప్పు 50% అధికం అవుతుందని అధ్యయనంలో తేలింది.

– సాక్షి, స్పెషల్ డెస్క్

లక్ష మందికిపైగా..

జీవ సంబంధమైన, ఆరోగ్యం, జీవనశైలి సమాచారాన్ని సేకరిస్తున్న యూకే బయోబ్యాంక్ డేటా ఆధారంగా... దశాబ్ద కాలంలో 1,23,788 మందిపై ఈ పరిశోధన సాగించారు. పరిశోధన ప్రారంభంలో ఎవరికీ కాలేయ వ్యాధి లేదు. సమగ్ర ఆహార సంబంధ ప్రశ్నావళి ఉపయోగించి పరిశోధకులు పానీయాల వినియోగంతో మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ స్టీటోటిక్ లివర్ డిసీజ్‌కు ఉన్న సంబంధాన్ని పరిశీలించారు. నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌ను మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ అని కూడా పిలుస్తారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోయినప్పుడు ఇది సంభవిస్తుంది. సిర్రోసిస్ లేదా కాలేయ కేన్సర్‌కు కూడా కారణమవుతుంది. అధికంగా ఆల్కహాల్ తాగేవారిలో ఎంఏఎస్ఎల్‌డీ సాధారణంగా వచ్చే సమస్య. అమెరికాలో గత 30 సంవత్సరాల్లో ఎన్ఏఎఫ్ఎల్‌డీ బాధితుల సంఖ్య దాదాపు 50% పెరిగింది. ప్రస్తుతం అక్కడి జనాభాలో దాదాపు 38% మంది ఈ వ్యాధిబారిన పడ్డట్టు పరిశోధనలు చెబుతున్నాయి.

అపోహ వీడండి..

చైనా సుజోలోని సూచో విశ్వవిద్యాలయానికి చెందిన అనుబంధ ఆసుపత్రి గ్రాడ్యుయేట్ విద్యార్థి, ప్రధాన అధ్యయన రచయిత లిహే లియు ఆశ్చర్యకరమైన ఫలితాలను వివరించారు. 'చక్కెర ఆధారిత తీపి పానీయాలపై చాలాకాలంగా అధ్యయనం జరుగుతోంది. అయితే డైట్ పానీయాలు ఆరోగ్యకరమైనవిగా జనం పరిగణిస్తున్నారు. ఇవి ఎంత మాత్రమూ సురక్షితం కాదు. మా అధ్యయనం ప్రకారం తక్కువ లేదా చక్కెర రహిత తీపి పానీయాలు రోజుకు ఒకే డబ్బా తీసుకున్నప్పటికీ మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ ప్రమాదం ఎక్కువగా పొంచి ఉందని తేలింది. డైట్ సోడాలు తీసుకోవడం వల్ల కాలేయ వ్యాధితో చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంది'అని అన్నారు.

నీటిని స్వీకరించడం వల్ల..

చక్కెర లేదా డైట్ సోడాలకు బదులుగా మంచి నీటిని స్వీకరించడం వల్ల ఫలితాలు మారిపోయాయి. సోడాలకు బదులుగా నీరు తీసుకోవడం వల్ల వ్యాధి వచ్చే అవకాశం దాదాపు 13% తగ్గింది. డైట్ పానీయాల విషయంలో 15% కంటే ఎక్కువ తగ్గింది. అయితే చక్కెర పానీయాలకు బదులుగా డైట్ పానీయాలు, అలాగే డైట్ పానీయాలకు బదులుగా చక్కెర పానీయాలు తీసుకోవడం వల్ల వ్యాధి వచ్చే ప్రమాదాన్ని తగ్గించలేదని పరిశోధనలో తేలింది. 'నీరు శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొత్తం జీవక్రియ పనితీరుకు సాయపడుతుంది. అందుకే నీరు ఆరోగ్యకరమైన పానీయం'అని లియు తెలిపారు.

కాలేయంలో కొవ్వు

'చక్కెర పానీయాలు రక్తంలో చక్కెర పెరుగుదలను ప్రేరేపించడం, ఇన్సులిన్ స్థాయిలను పెంచడం, కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహించడం ద్వారా కాలేయానికి హాని కలిగిస్తాయి. చక్కెర పానీయాల్లో అధిక చక్కెర రక్తంలో గ్లూకోజ్, ఇన్సులిన్ వేగంగా పెరుగుదలకు కారణమవుతుంది. ఇది బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. అధిక చక్కెరతో కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. డైట్ సోడాలు తక్కువ కేలరీలు కలిగి ఉన్నప్పటికీ ప్రతికూల ప్రభావాలను కలిగి ఉండవచ్చు'అని లియు వివరించారు. చక్కెరతో తయారైన, తక్కువ లేదా చక్కెర రహిత తీపి పానీయాలు పేగుల్లోని సూక్ష్మజీవుల సమూహాన్ని (గట్ మైక్రోబయోమ్) మార్చగలవు. కడుపు నిండిన భావనకు అంతరాయం కలిగిస్తాయి. తీపి ఆహారాల పట్ల ఆసక్తి పెంచుతాయి. ఇన్సులిన్ స్రావాన్ని కూడా ప్రేరేపిస్తాయని నివేదిక వివరించింది.

తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

డాక్యుమెంట్ల కోసం క్లిక్ చేస్తే గేమింగ్ సైట్‌కు..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేశారు. అందులో ఉండాల్సిన పీడీఎఫ్ ఫైల్స్ స్థానంలో గేమింగ్ వెబ్‌సైట్ లింకులు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని సోమవారం గుర్తించిన రిజిస్ట్రార్ ప్రాథమిక విచారణ అనంతరం బుధవారం సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎన్.దిలీప్ కుమార్ బాధ్యుల్ని గుర్తించడానికి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో కేసులకు సంబంధించిన సమాచారంతో పాటు పరిపాలన పరమైన అంశాలను పొందుపరుస్తారు. ఆయా వివరాలతో కూడిన పీడీఎఫ్ ఫైల్స్ కూడా అందుబాటులో ఉంటాయి. ఎవరైనా వెబ్‌సైట్‌లోకి ప్రవేశించి ఆయా ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు పీడీఎఫ్ ఫైళ్లు ఉండాల్సిన స్థానంలో 'బీడీజీ స్లాట్' అనే గేమింగ్ యాప్/సైట్ లింకును ఉంచారు. ఫైల్స్ డౌన్‌లోడ్ చేయడానికి క్లిక్ చేస్తే హైకోర్టు వెబ్‌సైట్ ఆ గేమింగ్ సైట్‌కు రీడైరెక్ట్ అయ్యేలా ప్రోగ్రామ్ చేశారు. ఈ వెబ్‌సైట్‌ను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) నిర్వహిస్తోంది. హ్యాకింగ్ విషయం గుర్తించిన రిజిస్ట్రార్ ఆ విషయాన్ని ఎన్ఐసీతో పాటు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైట్‌ను పునరుద్ధరించడంతో పాటు హ్యాకింగ్ మూలాలు కనిపెట్టడానికి ఈ రెండు విభాగాలూ సాంకేతికంగా ముందుకు వెళ్తున్నాయి.

దోచుకో.. దాచుకో అనే విధంగా బాబు ప్రభుత్వ పాలన

జడ శ్రావణ్‌కుమార్

ఏలూరు(టూటౌన్): రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ పరిపాలనంతా దోచుకో.. దాచుకో అన్న చందంగానే ఉందని జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్ అన్నారు. క్యాలెండర్ ఇయర్ మారకుండానే చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వెనక్కి తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ ఏలూరులో శనివారం జరిగిన మేధోమథన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పీపీపీ విధానంపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించానని చెప్పారు. అలాగే, ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటో పెట్టడంపైనా సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశానని, త్వరలోనే పవన్‌కు సుప్రీంకోర్టు నుంచి నోటీసులు అందుతాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే చంద్రబాబు ప్రభుత్వానికి 50 సీట్లు దాటవని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

సింగపూర్‌-విజయవాడ విమాన సేవలు పునఃప్రారంభం

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) నుంచి సింగపూర్‌కు ఇండిగో ఎయిర్‌లైన్స్‌ సంస్థ శనివారం నుంచి విమాన సేవలను పునఃప్రారంభించింది. సింగపూర్‌ నుంచి విమానం 151 మంది ప్రయాణికులతో ఉదయం 7.45 గంటలకు ఇక్కడికి చేరుకుంది. అనంతరం 10 గంటలకు 119 మంది ప్రయాణికులతో సింగపూర్‌ బయలుదేరి వెళ్లింది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఈ విమానాలు నడుస్తాయని ఎయిర్‌పోర్ట్‌ డైరెక్టర్‌ ఎం.లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ సర్వీసుల వల్ల సింగపూర్‌తో పాటు ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా దేశాలు వెళ్లేందుకు సులభమవుతుందన్నారు.

ఇంటర్‌ ఫీజు చెల్లింపునకు 25 వరకు గడువు

- రూ.2,000 ఆలస్య రుసుంతో మరో అవకాశం
- ఫిబ్రవరి 23 నుంచి పరీక్షలు

సాక్షి, అమరావతి: ఇంటర్‌ పబ్లిక్‌ పరీక్షల ఫీజు చెల్లింపునకు బోర్డు మరో అవకాశం కల్పించింది. ఇప్పటి దాకా ఫీజు చెల్లించని రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు రూ.2,000 ఆలస్య రుసుంతో ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్‌ విద్యా మండలి కార్యదర్శి రంజిత్‌ బాషా తెలిపారు. జనరల్, ఒకేషనల్‌ గ్రూపుల విద్యార్థులకు ఈ అవకాశం వర్తిస్తుందన్నారు. కాగా, ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌ ఫస్టియర్‌ విద్యార్థులకు కొత్త సిలబస్, సీబీఎస్‌ఈ విధానాన్ని అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. కొందరు విద్యార్థులు సెకండ్‌ లాంగ్వేజ్‌గా ఆర్ట్స్‌ సబ్జెక్టులను, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో బయాలజీ, గణితం సబ్జెక్టులను ఆరో పేపర్‌గా ఎంచుకున్నారు. దీంతో 'ఒకరోజు ఒక పేపర్‌' విధానంలో పరీక్షలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే, గతేడాది ఫెయిలైన విద్యార్థులకు బ్యాక్‌లాగ్‌ పేపర్లు పూర్తిచేసేలా షెడ్యూల్‌ రూపొందించారు. ఇంటర్‌ ఫస్టియర్‌ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి, సెకండియర్‌కి 24 నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్‌ పరీక్షలు ఒకేషనల్‌ విద్యార్థులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, జనరల్‌ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరుగుతాయి. సమగ్ర శిక్ష ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తోన్న ఒకేషనల్‌ ట్రేడ్స్‌కు ఫిబ్రవరి 13న ప్రాక్టికల్స్‌ ఉంటాయి. ఎథిక్స్‌ అండ్‌ హ్యూమన్‌ వేల్యూస్‌ పరీక్ష జనవరి 21న, పర్యావరణ విద్యపై 23న పరీక్ష నిర్వహిస్తారు.

స్పోర్ట్స్‌ కోడ్‌ ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలి

నేషనల్‌ కబడ్డీ మాజీ ప్లేయర్, కోచ్‌ పోతినేని పద్మజా బాల

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌లో జరుగుతున్న స్పోర్ట్స్‌ కోడ్‌ ఉల్లంఘనుల గురించి స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్‌ ఫెడరేషన్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి, నేషనల్‌ కబడ్డీ మాజీ ప్లేయర్, కోచ్‌ పోతినేని పద్మజా బాల ఆరోపించారు. విజయవాడలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్‌ను ఒక వ్యక్తి కబ్జా చేసి క్రీడాకారులకు చేస్తున్న అన్యాయాల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పోర్ట్స్‌ అథారిటీల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదన్నారు. సబ్‌ జూనియర్, జూనియర్‌ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు ఫేక్‌ డేట్‌ ఆఫ్‌ బర్త్‌ సర్టిఫికెట్లను ఇచ్చి ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం నకిలీ సర్టిఫికెట్లు పొందిన క్రీడాకారుల జనన సర్టిఫికెట్లు, క్రీడాకారుల పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇండియన్‌ ప్రాబబుల్స్‌ టీమ్‌కు ఆడిన ముగ్గురు క్రీడాకారులు నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు అందచేసి జూనియర్స్‌ విభాగంలో ఆడారని ఆమె చెప్పారు. తాను పదేళ్లపాటు జాతీయ స్థాయి పోటీల్లో కబడ్డీ ప్లేయర్‌గా పాల్గొన్నానని, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు కోచ్‌గా కూడా వ్యవహరించానన్నారు. కబడ్డీ ఆడుతున్న నిజమైన క్రీడాకారులకు అన్యాయం జరుగుతోందని, ఫేక్‌ సర్టిఫికెట్లతో ఆడుతున్న క్రీడాకారులపై చర్యలు తీసుకుంటే ప్రతిభ కలిగిన క్రీడాకారులకు న్యాయం జరుగుతుందన్నారు. ఫేక్‌ డేట్‌ ఆఫ్‌ బర్త్‌ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై శాప్‌ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోకపోతే ఆమరణ దీక్ష చేయడానికి కూడా తాను సిద్ధమేనని పద్మజా బాల స్పష్టం చేశారు. మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పత్రాలను ఆమె చూపించారు.

ఈ ఎన్నికలు అందరికీ గుణపాఠం

బిహార్‌ ఎన్నికలపై సీఎం స్టాలిన్‌



సాక్షి, చెన్నై : బిహార్‌ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్‌ ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ఈ ఎన్నికలు అందరికీ ఓ గుణపాఠం అని వ్యాఖ్యానించారు. అలాగే, ఎన్నికల కమిషన్‌పై గౌరవం కనిష్ట స్థాయికి పడి పోయిందని విమర్శించారు. బిహార్‌లో మళ్లీ సీఎం పగ్గాలు చేపట్టనున్న నితీష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. తుది ఓటు వరకు అంకిత భావంతో పనిచేసే కార్యకర్తల శ్రమ.. ఫలితం రూపంలో ప్రతిబింబిస్తుందంటూ డీఎంకే కేడర్‌కు సూచించారు.



కృత్రిమ మేధతో.. కొలువుల కోత

- టెక్‌ సంస్థల్లోనే ఎక్కువగా ఉద్యోగుల తొలగింపు
- పరోక్షంగా కారణమవుతున్న కొత్త టెక్నాలజీ
- వ్యాపార విధానాన్ని మారుస్తున్న కంపెనీలు

ప్రపంచ వ్యాప్తంగా టెక్‌ రంగంలో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి.. కంపెనీలు కృత్రిమ మేధ వినియోగాన్ని వేగవంతం చేయడం. ఏఐలో పెట్టుబడులు పెట్టడం, పెరుగుతున్న వ్యయాలను కట్టడి చేయడంలో భాగంగా కంపెనీలు తమ వ్యాపార విధానాన్ని మార్చుకోవడం కూడా కొలువుల కోతకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

– సాక్షి, స్పెషల్‌ డెస్క్‌

ఏఐ అధిక వినియోగం ఉద్యోగుల తీసివేతలకు కారణం అవుతుందని అమెజాన్‌ సీఈవో ఆండీ జెస్సీ ఈ ఏడాది జూన్‌లో జోస్యం చెప్పారు. ఆయన జోస్యం ఆయన కంపెనీ విషయంలో నిజమైంది. సుమారు 14,000 మందికి ఉద్వాసన పలకనున్నట్టు ఇటీవలే అమెజాన్‌ ప్రకటించింది. ఏఐలో పెట్టుబడులు పెడుతున్నాం కాబట్టి, ఖర్చులు తగ్గించుకునేందుకు మొత్తం ఉద్యోగుల్లో 4 శాతం వరకు తొలగించనున్నట్టు మైక్రోసాఫ్ట్‌ కంపెనీ కూడా ప్రకటించింది. మెటా, టీసీఎస్‌.. ఇలా కంపెనీలు ఒకదాని వెంట ఒకటి ఉద్యోగుల కోతకు శ్రీకారం చుట్టాయి.

వారికంటే ఎక్కువ జీతాలు

ఏఐ నైపుణ్యాలున్న కార్మికుల సగటు వేతనాలు.. సంబంధిత రంగంలోని ఇతర ఉద్యోగుల సగటు జీతం కంటే 56% అధికంగా ఉండడం విశేషం. ప్రధానంగా హోల్‌సేల్‌–రిటైల్, ఇంధనం, సమాచారం, రవాణా – నిల్వ, రియల్టీ, తయారీ, ప్రొఫెషనల్‌ సర్వీసెస్‌ రంగాల్లో ఈ వ్యత్యాసం ప్రధానంగా కనిపిస్తోంది. ఏఐ రంగంలో నిపుణుల కొరత వల్లే.. ఈ నైపుణ్యాలకు కంపెనీలు ఎక్కువ విలువ ఇస్తున్నాయని పరిశ్రమ చెబుతోంది. ఈ సంవత్సరం మొత్తం లేఆఫ్‌లలో ఇంటెల్, లెనోవో వంటి హార్డ్‌వేర్‌ కంపెనీల వాటా సుమారు 28%. అమెజాన్, ఈబే తదితర కంపెనీలు 14%, సేల్స్‌ (సేల్స్‌ఫోర్స్‌) 9%, కంజ్యూమర్‌ టెక్‌ (మెటా, గూగుల్‌) సంస్థలు 7% వాటాతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఏటా లక్షల్లో!

అంతర్జాతీయంగా ఉద్యోగుల తొలగింపు ఇలా..

సంవత్సరం	ఉద్యోగుల సంఖ్య
2022	1,65,269
2023	2,64,220
2024	1,52,922
2025	1,12,732

హార్డ్‌వేర్, రిటైల్‌పై ప్రభావం

2025లో ఇప్పటివరకు తొలగింపునకు గురైన ఉద్యోగుల్లో 40 శాతానికిపైగా హార్డ్‌వేర్, రిటైల్‌ రంగాల్లోనే ఉన్నారు.

రంగం	శాతం
హార్డ్‌వేర్‌	28.08
రిటైల్‌	13.96
సేల్స్, మార్కెటింగ్‌	8.64
కంజ్యూమర్‌	7.38
హెచ్‌ఆర్‌	3.58
రవాణా	3.15

భారత్‌లోనే అధిక నియామకాలు

2023తో పోలిస్తే గతేడాది ఏఐ నియామకాలు పెరిగాయి. అత్యధిక వృద్ధి మనదేశంలోనే నమోదవడం విశేషం.

దేశం..	వృద్ధి శాతం
భారత్‌	33
బ్రెజిల్‌	30.5
సౌదీ అరేబియా	28.5
ఫిన్లాండ్‌	27
కెనడా	26
సింగపూర్‌	25
యూఎస్‌	24.5

వేతనాల్లో ఎంత తేడా!

సాధారణ ఉద్యోగులతో పోలిస్తే.. ఏఐ నిపుణుల సగటు వేతనం ఎక్కువగా ఉంది.

వివిధ రంగాల్లో వ్యత్యాసం (శాతాల్లో)

రంగం	శాతం
రిటైల్‌	123
ఎనర్జీ	103
ఇన్ఫర్మేషన్‌	96
రవాణా	77
రియల్టీ	66
తయారీ	65
ప్రొఫెషనల్‌ సర్వీసెస్‌	64
ఆర్ట్స్‌	60
ఫైనాన్స్‌	60

పెట్టుబడులు ఇంతింతై..

ప్రపంచవ్యాప్తంగా 2013లో ఏఐ రంగంలో పెట్టుబడులు సుమారు 15 బిలియన్‌ డాలర్లు కాగా.. 2019 నాటికి 103 బిలియన్‌ డాలర్లకి, 2024కి 252 బిలియన్‌ డాలర్లకి పెరిగాయి.

సంవత్సరం	2020	2021	2022	2023	2024
పెట్టుబడులు (బిలియన్‌ డాలర్లలో)	222	361	253	201	252

ఆధారం: స్టాన్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ఏఐ ఇండెక్స్‌ 2025, లేఆఫ్స్‌.ఎఫ్‌వైఐ, పీడబ్ల్యూసీ 2025 గ్లోబల్‌ ఏఐ జాబ్స్‌ బారోమీటర్‌

వేల వక్ఫ్‌ ఆస్తుల భవిష్యత్తు ప్రశ్నార్థకం!

ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియలో అడ్డంకులు

- పొరుగు రాష్ట్ర సహాయ నిరాకరణ కూడా ఇబ్బందిగా మారిన పరిస్థితి
- ఇప్పటికీ రికార్డులు తెలంగాణలోనే
- 20 రోజుల్లో ముగియనున్న నమోదు గడువు
- రాష్ట్రంలో మొత్తం 4,748 వక్ఫ్‌ ఆస్తులు
- ఐదు నెలల్లో ఆన్‌లైన్‌ అయినవి 1,809 మాత్రమే
- గడువులోపు మిగిలిన 2,939 ఆస్తుల ఆన్‌లైన్‌ కష్టమని అంచనా
- దీంతో వక్ఫ్‌ ఆస్తులు కోల్పోతామని ముస్లిం సమాజంలో ఆందోళన
- గడువు పొడిగింపునకు కేంద్రానికి చంద్రబాబు లేఖ రాయాలని డిమాండ్‌

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల వక్ఫ్‌ ఆస్తుల భవిష్యత్తుపై ముస్లిం సమాజంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఒకపక్క ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియలో అడ్డంకులు, మరోపక్క నమోదుకు గడువు కేవలం 20 రోజులు మాత్రమే ఉండడం దీనికి కారణం. ఈ ప్రక్రియ పూర్తికాకుంటే, వక్ఫ్‌ ఆస్తులు వివాదాస్పదమయ్యే ప్రమాదం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సమాజం నమోదు గడువు పెంపు కోసం ఎదురుచూస్తోంది. గడువు పొడిగించాలని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌ షేక్‌ మునీర్‌ అహ్మద్‌ నేతృత్వంలోని బృందం ఇప్పటికే వక్ఫ్‌ బోర్డు అధికారులను కోరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయాలని ముస్లిం సంఘాల నేతలు డిమాండ్‌ చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 4,748 వక్ఫ్‌ ఆస్తులు ఉండగా, గడచిన ఐదు నెలల్లో ఆన్‌లైన్‌ అయినవి 1,809 మాత్రమే. డిసెంబర్‌ 5వ తేదీలోపు 2,939 ఆస్తుల ఆన్‌లైన్‌ కష్టమని అంచనా.

నమోదు అవసరం ఏమిటి?

కేంద్రం ఉమీద్‌–2025 (యూనిఫైడ్‌ వక్ఫ్‌ మేనేజ్‌మెంట్‌ ఎఫిషియన్సీ అండ్‌ డెవలప్‌మెంట్‌ యాక్ట్‌) తెచ్చిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న వక్ఫ్‌ ఆస్తులను మరోసారి నమోదు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఉమీద్‌–2025 సెక్షన్‌ 3బి ప్రకారం వక్ఫ్‌ వివరాలను దాఖలు చేయడం, సెక్షన్‌ 5 ప్రకారం ఆ జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేయడం, సెక్షన్‌ 36 కింద కొత్తగా వక్ఫ్‌ నమోదు చేయటం వంటి ప్రక్రియకు ఆరు నెలల గడువును విధించారు. నమోదు ప్రక్రియలో 'మేకర్‌–చెకర్‌–అప్రూవర్‌' విధానాన్ని అనుసరిస్తున్నారు. సంబంధిత వక్ఫ్‌ ఆస్తులను ఆన్‌లైన్‌ చేయడంలో రాష్ట్ర వక్ఫ్‌ బోర్డు ద్వారా నియమితులైన ముతవల్లి, ఏదైనా అధికారి మేకర్‌గా వ్యవహరిస్తారు. ఆ ఆస్తులను కరెక్ట్‌గా అప్‌లోడ్‌ చేశారా? లేదా? తదితర అంశాలను జిల్లా స్థాయి అధికారి, రాష్ట్ర వక్ఫ్‌ బోర్డు ద్వారా అధికారం పొందిన అధికారి తనిఖీ(చెకర్‌) చేస్తారు. ఆన్‌లైన్‌ చేసిన ఆస్తులను తుది పరిశీలన చేసి తర్వాతే రాష్ట్ర వక్ఫ్‌ బోర్డు ద్వారా అధికారం పొందిన ఏదైనా అధికారి ఆమోదముద్ర (అప్రూవర్‌) వేస్తారు.

నమోదుకు అడ్డంకులు ఇవీ..

- ఉమీద్‌ వెబ్‌సైట్‌లో వక్ఫ్‌ ఆస్తుల ఆన్‌లైన్‌ నమోదుకు సర్వర్‌ డౌన్‌ సమస్యతోపాటు పలు సాంకేతిక ఇబ్బందులు పెను సవాలు విసురుతున్నాయి.
- సైట్‌ నిరంతరం 'నిర్వహణలో ఉంది' అనే సమాచారం చూపిస్తోంది.
- తరచూ ఓటీపీ, లాగిన్‌ విఫలమవుతున్నాయి.
- వెబ్‌సైట్‌లో ఒక్కో ఆస్తి నమోదుకు 13 కాలమ్స్‌లో 56 పేజీలను అప్‌లోడ్‌ చేయడం ఆలస్యం అవుతోంది.
- పలు సందర్భాల్లో డాక్యుమెంట్‌ అప్‌లోడ్‌ తిరస్కరణకు గురవుతోంది.
- జీఐఎస్‌ మ్యాపింగ్‌ టూల్‌ పనిచేయడంలేదు.
- పరిశీలించి ఆమోదించాల్సిన కలెక్టర్‌ లాగిన్‌ యాక్టివ్‌గా ఉండటంలేదు.
- దీనికి సంబంధించిన ప్రక్రియ వేగవంతం అయ్యేలా చూడాల్సిన హెల్ప్‌డెస్క్‌ అసలు రెస్పాండ్‌ కావడంలేదు.
- ప్రతి రోజు రాష్ట్ర వక్ఫ్‌బోర్డుతోపాటు కేంద్ర పోర్టల్‌కు సంబంధించిన వాట్సాప్‌ గ్రూప్‌లో సైతం ఆన్‌లైన్‌ సమస్యలు ప్రస్తావిస్తున్నా పరిష్కారానికి నోచుకోవడంలేదు.
- రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్లు కావస్తున్నా తెలంగాణలోనే ఏపీ వక్ఫ్‌ రికార్డులు ఉండిపోవడంతో ఆ రాష్ట్ర సహాయ నిరాకరణ కూడా అవరోధం కలిగిస్తోంది.
- పలు అంశాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అవగాహన లోపం కూడా శాపంగా మారింది.

కంటి ఆపరేషన్‌ చేయించుకుంటే చూపే పోయింది

బాధితుడు ఎర్రయ్య ఫిర్యాదు

టెక్కలి రూరల్‌: కళ్లు సరిగా కనిపించడం లేదంటూ ఆపరేషన్‌ చేయించుకుంటే ఉన్న చూపు పోయిందని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జర్జంగి గ్రామానికి చెందిన బాధితుడు జీరు ఎర్రయ్య, అతని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్‌ వికటించడం వల్లే తన చూపు పోయిందని ఆరోపిస్తూ టెక్కలి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌ బొడ్డేపల్లి సూర్యారావుకి ఫిర్యాదు చేశారు. బాధితుడు ఎర్రయ్య తెలిపిన వివరాలు ప్రకారం... కంటి చూపు సరిగా లేదని సెప్టెంబర్‌ 16న టెక్కలి జిల్లా ఆస్పత్రికి ఎర్రయ్య వచ్చారు. వైద్యుల సూచనలతో ఆపరేషన్‌ చేయించుకుని నాలుగు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉన్నాడు. అనంతరం ఇంటికి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కంటి నొప్పితో పాటు నీరు కావడం వంటి సమస్యలు తలెత్తడంతో మళ్లీ అదే నెల 22న వైద్యుడిని కలిశారు. అయితే ఆపరేషన్‌ ఫెయిలైందని, మళ్లీ శస్త్రచికిత్స చేయాలని చెప్పి 25న మళ్లీ ఆపరేషన్‌ చేసి ఇంటికి పంపించారు. ఇంటికి వెళ్లాక కన్ను పూర్తిగా కనిపించకపోవడంతో మరోసారి డాక్టర్‌ను కలవగా కంటి లోపలి కుట్లు విప్పాలని, లోపల రక్తం గడ్డ కట్టిందని చెప్పి కుట్లు విప్పారు. అయినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. చూపు పోవడంతో శనివారం ఆస్పత్రిలో ఎర్రయ్య కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఈ విషయమై ఆపరేషన్‌ చేసిన వైద్యుడు శ్రీకాంత్‌ని వివరణ కోరగా ఎర్రయ్యకు కంటి నరాలు పూర్తిగా కనిపించకపోవడంతో శస్త్ర చికిత్స చేశామని, కన్ను సైజు చిన్నదిగా ఉండడంతో లెన్స్‌ అమర్చలేదన్నారు. కంటికి ఏదో గుచ్చుకుంటుందని చెప్పడంతో కుట్లు తీయడం మంచిది కాదని చెప్పామని, అయినా కుట్లు విప్పేయాలని కోరడంతో ఆ కుట్లు విప్పే క్రమంలో రక్తస్రావం జరిగిందని, అందుకే సమస్య వచ్చిందని చెప్పారు. సీనియర్‌ వైద్యులు సెలవులో ఉండటం వల్ల ఆయన వచ్చాక మరోసారి కంటి నరం పరీక్షించి సరిచేస్తామన్నారు. ఇదే విషయమై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఆస్పత్రిలో ఆపరేషన్‌ జరిగిన విషయం వాస్తవమేనని, ఆపరేషన్‌ చేసిన వైద్యుడిని వివరణ అడిగామని ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చిన్న అనారోగ్యంతో వెళ్తే ప్రాణాలు పోయాయి

కాకినాడ జీజీహెచ్‌లో 20 ఏళ్ల యువతి మృతి

- హెర్నియా సర్జరీ చేస్తుండగా సీరియస్‌
- ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆపరేషన్‌ టేబుల్‌ మీదే ఏదో జరిగిందంటూ ఫైర్‌
- జీజీహెచ్‌లో తరచూ మరణాలపై విమర్శల వెల్లువ

కాకినాడ క్రైం :కాకినాడ జీజీహెచ్‌లో 20 ఏళ్ల యువతి మరణం శనివారం వివాదాస్పదమైంది. చిన్న ఆరోగ్య సమస్యతో ఆసుపత్రిలో చేరిన ఆమె ప్రాణాలు కోల్పోయిందని, ఆరోగ్యంగా ఉన్నప్పుడు సర్జరీకి తీసుకెళ్లి అపస్మారక స్థితిలో తీసుకొచ్చి ఐసీయూలో చేర్చారని, ఆపరేషన్‌ టేబుల్‌ మీదే ఏదో తేడా జరిగిందని కుటుంబీకులు అనుమానాలు వ్యక్తంచేశారు. ఠాగూర్‌ సినిమా తరహాలో మూడున్నర గంటల పాటు ఏవేవో చేస్తున్నామని చెప్పి, విగతజీవిగా తమకు అప్పగించారని ఆవేదన చెందారు. బాధితుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురం రథాలపేటకు చెందిన రాయుడు కవితకు కృష్ణ అనే వ్యక్తితో వివాహమైంది. పొత్తికడుపు భాగంలో కొద్దిరోజులుగా వాపు ఉంటోంది. వైద్య పరిభాషలో ఈ స్థితిని 'ఇంగ్వినల్‌ హెర్నియా' అంటారు. ఇది వైద్యపరంగా అత్యంత సాధారణ స్థితి అని, చిన్న శస్త్రచికిత్సతో నయమవుతుందని పిఠాపురం వైద్యులు చెప్పడంతో ఈనెల 10న కవిత కాకినాడ జీజీహెచ్‌లో చేరింది. వైద్యులు పరీక్షించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. సాధారణ వార్డులో ఉంచి, ఆమెకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. సానుకూల ఫలితాలు రావడంతో కవిత ఆరోగ్యంగానే ఉందని నిర్ధారించుకుని శనివారం శస్త్రచికిత్సకు సిద్ధంచేశారు. అప్పటివరకూ ఆమె అందరితోనూ కులాసాగానే మాట్లాడింది. సర్జరీ నిమిత్తం మ.12 గంటల సమయంలో వార్డు నుంచి ఆపరేషన్‌ థియేటర్‌కు తీసుకెళ్లారు. అనంతరం.. మ.2 గంటల సమయంలో కొందరు వైద్యులు కంగారుగా ఎంఎన్‌ఓల సాయంతో కవితను ఆర్‌ఐసీయూ–1కి తరలించారు. అప్పటి నుంచి పీజీల నుంచి హెచ్‌ఓడీల వరకూ ఒక్కొక్కరిగా వచ్చి చూస్తున్నారు. ఇదంతా చూసిన కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి ప్రశ్నిస్తే కండిషన్‌ సీరియస్‌ అని చెప్పారు. చివరికి.. సా.5.40కి కవిత చనిపోయినట్లు వెల్లడించారు.

మృతదేహం తీసుకెళ్లేందుకు ససేమిరా..

దీంతో.. జీజీహెచ్‌కు నడిచొచ్చిన యువతి ఐదు రోజుల్లో విగత జీవిగా మారిందని సహ రోగులు, కుటుంబీకులు ఆవేదన వ్యక్తంచేశారు. మృతదేహాన్ని తరలించేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. స్వగ్రామం నుంచి తమ వారు వస్తేనే కానీ మృతదేహాన్ని కదిపేది లేదని తెగేసి చెప్పారు. ఓ దశలో పరిస్థితి చేయి దాటిపోతున్న తరుణంలో పోలీసులు జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి సర్దిచెప్పడంతో వారు రోదిస్తూ, వైద్యుల్ని తిట్టుకుంటూ అక్కడి నుంచి నిష్క్రమించారు. వివాదం చేస్తే పోస్టుమార్టం చేయాల్సి వస్తుందని వైద్యులు బెదిరించడంతో నిస్సహాయంగా వెళ్లిపోయారని సహ రోగులు చెప్పారు. ఇదిలా ఉంటే.. ఈనెల 1న 20 ఏళ్లు పూర్తిచేసుకుని 21వ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్న కవితకు ఇంతలోనే మరణించిందని కుటుంబీకులు ఆవేదన చెందారు.

సాక్షి SAKSHI.COM
సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం..
చట్టరీత్యా నేరం...
సాక్షి టీవీ ప్రసారాలు మీ హక్కు..
ప్రసారాలను అడ్డుకోవడం చట్టవిరుద్ధం...
ప్రజల కోసమే మా పోరాటం ప్రజా గొంతుకై నినదిస్తాం
వార్తల వెనుక వాస్తవాలు తెలియాలంటే
సాక్షి టీవీ చూడండి
సాక్షి టీవీ ప్రసారాల కోసం...
మీ స్థానిక కేబుల్‌ ఆపరేటర్‌ను వెంటనే సంప్రదించండి.
డీటీహెచ్‌లో సాక్షి ప్రసారాల కోసం: 1456 | 2449 | airtel 907 | SUN 184
ఇంటర్నెట్‌లో సాక్షి ప్రసారాల కోసం: youtube.com/SakshiNews | Jio Fiber | xstream
సత్యమేవ జయతే

అరకు@7 డిగ్రీలు

రాష్ట్ర వ్యాప్తంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. 15 రోజుల ముందు నుంచే చలి గాలులు తీవ్రమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 3 రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల నుంచి 5 డిగ్రీల మేర పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్యం వైపు నుంచి శీతల గాలులు వీస్తుండడం వల్లే చలి పెరిగినట్లు వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా ఈ సమయంలో పగటి ఉష్ణోగ్రతలు 32–35, రాత్రి ఉష్ణోగ్రతలు 26–28 డిగ్రీలు నమోదవుతుంటాయి. కానీ ఇప్పుడు చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 28–30, రాత్రి ఉష్ణోగ్రతలు 20–25 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అయితే 7–14 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు తగ్గాయి. అల్లూరి జిల్లా అరకులో శనివారం కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు పడిపోయింది. దళపతిగూడ, డుంబ్రిగూడ, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, హుకుంపేట, గంపరాయి, చింతపల్లి తదితర ప్రాంతాల్లో 7–10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎన్టీఆర్‌ జిల్లాలోని చిల్లకల్లు, తిరువూరు, నవాబుపేట, చందాపురం, మొగులూరు తదితర ప్రాంతాల్లో 15–20 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బంగాళాఖాతంలో అల్పపీడనం

రాష్ట్రంలో వచ్చే రెండు రోజులు మోస్తరు వర్షాలు

సాక్షి, అమరావతి: నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరప్రాంతంలో శనివారం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ శనివారం తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం నెమ్మదిగా కదులుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే రెండు రోజులు మోస్తరు వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. సోమవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, వైఎస్సార్‌ కడప జిల్లాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 21 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

బుడితి సీహెచ్‌సీలో బాలింత మృతి

గతంలోనూ ఈ ఆస్పత్రిలో ఇద్దరు బాలింతలు మృతి



సారవకోట: శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలంలోని బుడితి సీహెచ్‌సీలో మంగళవారం సిజేరియన్‌ జరిగిన శిమ్మ శ్రీవాణి (25) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందడం కలకలం రేపుతోంది. కుటుంబీకుల కథనం మేరకు.. ఈనెల 11న రెండో కాన్పు కోసం శ్రీవాణి సీహెచ్‌సీలో చేరగా వైద్యులు మెండ ప్రతిభా చైతన్య ప్రసవ ఆపరేషన్‌ చేశారు. మగ బిడ్డ పుట్టాడు. అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా శనివారం ఉదయం ఒక్కసారిగా రక్తం తగ్గిపోయింది. దీంతో వైద్యులు, సిబ్బంది నరసన్నపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో స్థానికంగా ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి ఆమె మృతి చెందింది. దీనిపై డాక్టర్‌ చైతన్యను వివరణ కోరగా శుక్రవారం ఉదయం రక్తం ఎక్కించిన కాసేపటికే ఆమె శరీరంలో సమస్యలు ఉత్పన్నం అయ్యాయన్నారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు. అయితే కార్డియాక్‌ అరెస్టు కారణంగా ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని వైద్యులు చెబుతున్నారు. ఇదే ఆస్పత్రిలో ఈ ఏడాది ఆపరేషన్‌ వికటించి ఇద్దరు బాలింతలు మృతి చెందారు. ఇప్పుడు మరో బాలింత మృతి చెందడంతో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

దుంగలేనా.. ఎర్రదొంగలేరీ?

ఎర్రచందనం.. ప్రకృతి ప్రసాదితం.. అరుదైన వృక్షం.. ఈ చెట్టుకు శేషాచలం నిలయం.. ఈ ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రస్తుతం పలమనేరు హైవే రాజమార్గం.. ఈ ప్రాంతం మూడు రాష్ట్రాల కూడలి కావడం.. శేషాచలం నుంచి దుంగలు తరలించే వాహనాలు కౌండిన్య అడవుల మీదుగా తమిళనాడు, కర్ణాటకకు సులువుగా తరలివెళ్లేందుకు అవకాశం. ఫలితం నిత్యం ఈ మార్గంలో యథేచ్ఛగా ఎర్రచందనం అక్రమ రవాణా.. అయితే పలమనేరు అటవీశాఖాధికారులు ఈ మార్గంలో తరలే ఎర్రచందనం దుంగలను మాత్రమే పట్టుకుంటున్నారు. మరి దొంగలు ఏమవుతున్నారన్న అంశం శేష ప్రశ్నగా మిగులుతోంది.



- ఇప్పటివరకు వందలాది ఎర్రచందనం దుంగల స్వాధీనం
- ఒక్క నిందితుడూ దొరకని వైనం
- పలమనేరు మీదుగా కర్ణాటకకు సాగుతున్న స్మగ్లింగ్
- తూతూమంత్రంగా విధులు నిర్వహిస్తున్న అటవీశాఖాధికారులు

పలమనేరు: కొన్నాళ్లుగా చిత్తూరు జిల్లా పలమనేరు నియోజవర్గంలో ఎర్రచందనం అక్రమరవాణా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. శేషాచలం అడవుల నుంచి రకరకాల మార్గాల ద్వారా పలు వాహనాల్లో పలమనేరు మీదుగానే పొరుగునే ఉన్న కర్నాటక, తమిళనాడు చేరుతోంది. కానీ ఈ ప్రాంతంలో ఎర్రచందనం వాహనాలు వెళుతున్న విషయం ఇక్కడి అటవీశాఖాధికారులకు మాత్రం తెలియదు. బయట నుంచి వచ్చే ఫారెస్ట్ అధికారులో లేదా ఫ్లయింగ్‌స్క్వాడ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నుంచి పలమనేరు ప్రాంతంలో దుంగల వాహనం వెళతుందనే సమాచారం వస్తే అప్పుడు ఇక్కడి ఫారెస్ట్ అధికారులు వారిని పట్టుకునేలోపే స్మగర్లు వెళ్లిపోతుంటారు. ఆపై ఇక్కడి నుంచి పలు మార్గాల్లో ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో వాహనాలను వదిలి నిందితులు తప్పించుకుంటున్నారు. ఇటీవల కాలంలో స్థానిక ఫారెస్ట్ అధికారులు దుంగలను వాహనాలను పట్టుకుంటున్నా ఓ నిందుతుడినైనా పట్టుకున్నా రా? అనే మాట స్థానికుల నుంచి వినిపిస్తోంది.

హైవేలో యథేచ్ఛగా దుంగల అక్రమ రవాణా

శేషాచలం అడవుల నుంచి కర్ణాటకకు వెళుతున్న ఎర్రచందనం ఖరీదైన కార్లు, కూరగాయల టెంపోలు, ప్రైవేటు అంబులెన్సులు, కొన్ని ఇతర పదార్థాలతోపాటు, మరికొన్ని ఇసుక టిప్పర్లలో కింద దుంగలతో ఇదే మార్గంలో ఎలాంటి సమస్య లేకుండా వెళుతుంటాయి. ఇక్కడి అధికారులకు వీటిపై ఎలాంటి సమాచారం ఉండదు. ఎప్పుడైనా పైనుంచి ఫలానా మార్గంలో ఫలానా వాహనం దుంగలతో వెళుతోందని పట్టుకోమన్నా దొంగ టైం బాగోలేకుంటే తప్ప, వీరు పట్టుకున్న సందర్భాలు చాల తక్కువే.

బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లి సమీపంలో పలమనేరు ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న ఎర్రదుంగలు (ఫైల్)

తప్పించుకోనేందుకు అడవులే దిక్కు..

పలమనేరు ప్రాంతం రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. దీంతో హైవే నుంచి పలు గ్రామీణ మార్గాల మీదుగా బైరెడ్డిపల్లి మండలంలో ప్రవేశించి కర్ణాటకలోకి సులభంగా దుంగలను తరలించవచ్చు. అలాగే ఇదే మండలంలోని నెల్లిపట్ల నుంచి అడవిలో తమిళనాడుకు వెళ్లే మార్గాలున్నాయి. ఇటు కర్ణాటక గ్రామాలకు అడ్డదారుల ద్వారా సులభంగా వెళ్లవచ్చు. ఓ వేళ ఎవరైనా వాహనాలను పట్టుకోవాలని వస్తే వాటిని వదిలి రోడ్డు పక్కనే ఉన్న అడవుల్లోకి వెళితే చాలు. వీరు ఇటు తమిళనాడు, అటు కర్ణాటక రాష్ట్రాల్లోని బోర్డర్ గ్రామాల్లోకి సులభంగా చేరుకోవచ్చు. అందుకే ఈ సరిహద్దులను స్మగ్లర్లకు ఎంచుకుంటున్నట్టు సమాచారం.

ఇటీవల జరిగిన ఘటనలివీ..

- రెండు నెలల కిందట బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లి కొత్తూరు సమీపంలోని దండుకుంట వద్ద పొలాల్లోని ఓ ఇంట్లో 144 ఎర్రచందనం దుంగలను పలమనేరు ఫారెస్ట్ అధికారులు, లా అండ్ ఆర్డర్ పోలీసుల సాయం తీసుకోకుండా పట్టుకుని సంచలనం సృష్టించారు. పదిమందికి పైగా ఉన్న ఫారెస్ట్ సిబ్బంది కళ్లుగప్పి అక్కడే ఉన్న ప్రధాన స్మగ్లర్ తన స్నేహితురాలితో కలిసి కారులో ఉడాయించాడు. ఇప్పటిదాకా నిందితున్ని పట్టుకున్న పాపాన పోలేదు. దీనిపై పోలీసులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎందుకంటే ఫారెస్ట్‌శాఖే ఈ కేసును ఛేజ్ చేయనీ అని వదిలేసినట్టు సమాచారం.
- అదే మండలం నెల్లిపట్ల ప్రాంతంలో ఆరునెలల క్రితం శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలున్న కారు పలుచోట్ల అధికారులను తప్పించుకుని నెల్లిపట్ల మార్గంలోకి వచ్చింది. అక్కడి నుంచి పూర్తిగా అడవి కావడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితిలో కారులోని వ్యక్తులు కారును వదిలిపెట్టి అడవిలోకి పారిపోయారు. ఆపై దుంగలున్న కారును పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు రెండ్రోజుల పాటు నెల్లిపట్ల, చింతలగుంట అడవుల్లో గాలించి ఎవరి ఆచూకీ లేదని మిన్నకుండిపోయారు.
- గతంలో ఓ దుంగలున్న ఖరీదైన కారు పలమనేరు మీదుగా వస్తోందనే సమాచారంలో స్థానిక అటవీశాఖ పట్టణ సమీపంలోని బైపాస్ వద్ద మాటు వేసింది. వారిముందే ఆ కారు వేగంగా వెళ్లిపోయింది. ఆ కారును వెంబడించలేని ఫారెస్ట్ వాహనం చేసేది లేక హైవేలోని టోల్‌గేట్ వారికి సమాచారాన్ని అందించారు. దీన్ని ముందుగానే పసిగట్టిన స్మగ్లర్ పలమనేరు బైపాస్‌లోని ఓ పొలం వద్ద కారును ఆపి సమీపంలోని ఓ దాబాలో మద్యం సేవించి, భోజనం చేసి ఆపై రాత్రయ్యాక ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇదే హైవేలో కర్ణాటకకు వెళ్లిపోయాడు.
- ఇదే మండలంలోని నెల్లిపట్ల అడవిలో తమిళనాడు సరిహద్దులోని అరట్ల అటవీ మార్గంలో కొన్ని ఎర్రచందనం దుంగలను ఫారెస్ట్ అధికారులు గతనెలలో పట్టుకున్నారు. కానీ దుంగలు మాత్రం దొరికాయి. వీటిని తరలిస్తున్న స్మగర్లు మాత్రం అడవిలోకి పారిపోయారని అధికారులు చెప్పారు.
- తాజాగా పులిచెర్ల నుంచి దుంగలతో వచ్చిన కారు పలమనేరు మీదుగా వస్తోందని స్థానిక ఫారెస్ట్ అధికారులకు ముందుగానే సమాచారం అందింది. కానీ పట్టణానికి సమీపంలో కాపుగాచిన వీరు ఆ కారును పట్టుకోలేకపోయారు. దీంతో స్మగర్లు అడ్డదారుల్లో వెళుతుండగా చివరకు అప్పినపల్లి గ్రామస్తులు పట్టుకోవాల్సి వచ్చింది.

అఖిల భారత సర్వీసులతో పాటు గ్రూప్-1 వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాల కోసం విద్యార్థులు ఒకప్పుడు బీఏ, బీకాం, బీఎస్సీ వంటి కోర్సుల్లోనే ఎక్కువగా అడ్మిషన్లు పొందేవారు. హిస్టరీ, పొలిటికల్ సైన్సెస్, ఆంత్రోపాలజీ, ఫిజిక్స్, జువాలజీ, కామర్స్ వంటి సబ్జెక్టులను ఆప్షన్లుగా ఎంచుకుని అభ్యర్థులు ఉద్యోగాల వేటలో విజయం సాధించేవారు. ఇలాంటి సంప్రదాయ డిగ్రీ కోర్సులకు రానురాను ఆదరణ కరువవుతోంది.

డిగ్రీ ఢమాల్

30 శాతం సీట్లు మాత్రమే భర్తీ

- పీజీలో 10 శాతం మాత్రమే అడ్మిషన్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో సర్కార్ నిర్లక్ష్యం
- కళాశాలల నిర్వహణ కష్టమంటున్న యాజమాన్యాలు

అనంతపురం: చంద్రబాబు పాలనలో ఉన్నత విద్య అధోగతి పాలైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించకపోవడంతో పాటు డిగ్రీలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా రూ.90 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.30 కోట్లు మాత్రమే చెల్లించింది. దీంతో డిగ్రీ కళాశాలలను నిర్వహించడం కష్టమవుతోందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మూసివేస్తామని ఇప్పటికే ప్రభుత్వానికి నోటీసులు సైతం ఇచ్చారు. ఫ్యాకల్టీకి జీతాలు చెల్లించకపోతే కళాశాలలు నిర్వహించడం కష్టం. జీతాలు ఇవ్వాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాలల నిర్వహణపై ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు సైతం విద్యార్థులను తమ కళాశాలలో చేరాలని పట్టుబట్టడం లేదు. ఫలితంగా డిగ్రీ అడ్మిషన్లు నిరాశాజనకంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే డిగ్రీ అడ్మిషన్లు భారీగా పడిపోయాయని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంప రిధిలోని కళాశాలల్లో పీజీలో 10 శాతం, డిగ్రీలో 30 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంత ఘోరంగా అడ్మిషన్లు కావడం ఇదే తొలిసారి.

ఎస్కేయూ ప్రధాన ద్వారం

అధునాతన డిగ్రీ కోర్సుల అమలేదీ?

డిగ్రీ కోర్సుల ట్రెండ్ మారింది. ఏ కోర్సులోనైనా కంప్యూటర్ అనుసంధాన సబ్జెక్టులు ఉంటేనే డిగ్రీకి విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ డిగ్రీ స్వరూపమే మారిపోతోంది. బీఏలో గతంలో ఐదారు రకాల కోర్సులు మాత్రమే ఉండగా.. ప్రస్తుతం 68 రకాల కోర్సులు ఉన్నాయి. బీఎస్సీలో 73 రకాలు, బీకాంలో 13 రకాల కాంబినేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా బీబీఎం, బీబీఏ, బీసీఏ, బ్యాచిలర్ ఆఫ్ సోషల్ వర్క్, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషన్ (బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, హాస్పిటాలిటీ, టూరిజం, పరిపాలన) వంటి కోర్సులు విస్తరించాయి. బీకాంలో మారిన ట్రెండ్‌కు అనుగుణంగా అప్లికేషన్ కోర్సులు ఉన్నాయి. యూజీసీ అనుమతించిన ఈ కోర్సులను అమలు చేయకుండా సంప్రదాయ కోర్సులు మాత్రమే అమలు చేస్తుండడంతో విద్యార్థులు వీటిపై ఆసక్తి చూపడం లేదు.

అడ్మిషన్లపై సర్కారు నిర్లక్ష్యం

మరో వైపు డిగ్రీ అడ్మిషన్లు తగ్గితే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే అవసరం ఉండదనే భావనలో చంద్రబాబు ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే అడ్మిషన్లు పెరగకుండా నీరుగారుస్తోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అడ్మిషన్లు దారుణంగా పడిపోవడం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ఫ్యాకల్టీకి జీతాలు ఎలా చెల్లించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నాయి.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో...

డిగ్రీ కళాశాలలు	75
మొత్తం సీట్లు	33,650
భర్తీ అయిన సీట్లు	9 వేలు

‘వేప’కే విపత్తు..!

ఇటీవల ఎండుతున్న వేపచెట్లు | రసం పీల్చుతున్న ‘టీ మస్కిటో బగ్’ | ఎండిపోతున్న సుడి భాగం

అనంతపురం అగ్రికల్చర్: వేయి లాభాల చెట్టు వేపకే విపత్తు సంభవిస్తోంది. వేపచెట్టు నుంచి లభించే ఆకు, బెరడు, కాయలు, పిండి, చెక్క, నూనె తదితర ఉత్పత్తులు సర్వరోగ నివారిణిగా పేరున్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో కీటకనాశినిగా, వివిధ రకాల ఔషధాలు, చర్మసౌందర్య ఉత్పత్తుల తయారీలో వేపకు అత్యంత ప్రాధాన్యత ఉందని చెబుతారు. ఉగాది పండుగ రోజు వేప పూతతో తయారు చేసే పచ్చడిని పరమ పవిత్రంగా భావిస్తారు. ఇన్ని సుగుణాలు ఉన్న ‘వేపచెట్టు’ను ఐక్య రాజ్యసమితి 21వ శతాబ్దపు చెట్టుగా గుర్తించి చరిత్రలో స్థానం కల్పించింది. దీన్ని హెర్బల్ ఇండియన్ డాక్టర్‌గా పిలుస్తున్నారు. ఇంతటి విశిష్టత కలిగిన వేపకు ఇప్పుడు విపత్తు రావడం చూస్తున్నాం. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇటీవల వందలాది వేపచెట్లు ఎండుముఖం పడుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో కూడా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైన విషయం తెలిసిందే. గత నాలుగైదేళ్లుగా కనిపించని విపత్తు ఈసారి మళ్లీ మొదలైంది. అటవీశాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 10 లక్షలకు పైగా వేపచెట్లు ఉన్నట్లు అంచనా. అందులో చాలా వరకు ఎండుముఖం పట్టినట్లు చెబుతున్నారు.



పశుశాఖ జేడీ కార్యాలయ ఆవరణలో ఎండిన వేపచెట్టు (ఇన్‌సెట్) టీ మస్కిటో బగ్ కీటకం

‘టీ మస్కిటో బగ్’ కారణం!

టీ మస్కిటో బగ్ అనే కీటకం ఆశించడం వల్ల వేపచెట్లు ఎండుతున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఏఆర్ఎస్), కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ‘టీ మస్కిటో బగ్’ అనే పురుగు ఆశించడం వల్ల సుడి భాగం, క్రమంగా రెమ్మలు, కొమ్మలు, కాండం ఎండిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. నాలుగైదు సంవత్సరాలకు ఒకసారి ఇలా జరుగుతూ ఉంటుందని తెలిపారు. 22 రోజుల సగటు జీవితకాలం కలిగిన టీ మస్కిటో బగ్ పురుగు ఉదయం, సాయంత్రం వేపచెట్లను ఆశించి రసం పీల్చడం వల్ల ఎండుతుందని చెబుతున్నారు. పగటి సమయం ఎక్కడైనా పొదల్లో దాక్కుని ఉంటుందని తెలిపారు. అధిక వర్షాలు కురిసినపుడు, చలి ఎక్కువగా ఉన్న కాలాల్లో ఇలా జరుగుతుందని వెల్లడిస్తున్నారు. నల్లటి తల, ఎర్రటి గోధుమ (రెడిష్ బ్రౌన్) రంగులో పురుగు ఉంటుందన్నారు. ఇది చాలా రాష్ట్రాల్లో రకరకాల పంటలను ఆశిస్తుందని తెలిపారు. వేసవిలో మళ్లీ పూర్తిగా చెట్లు కోలుకుంటాయని చెబుతున్నారు.

ఆందోళన అవసరం లేదు

టీ మస్కిటో బగ్ ఆశించడం వల్ల వేపచెట్లు ఎండుతుండటంపై రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. లేత చిగుర్లను రసం పీల్చడం వల్ల కాలిపోయినట్లు కనిపిస్తుంది. అలా చెట్లు క్రమంగా ఎండిపోతాయి. ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే 10 శాతం లోపు చెట్లు చనిపోవచ్చు. లేదంటే చలికాలం తగ్గిన తర్వాత అన్ని చెట్లు తిరిగి కొత్తచిగుర్లతో కోలుకుంటాయి. గతంలో ఇలాంటి పరిస్థితులు చూశాం. పురుగు నివారణకు 2 మి.లీ ప్రొపినోఫాస్ లేదా 0.2 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 2 మి.లీ డయోమిథోయేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. అధిక వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల కూడా ఇలా సంభవిస్తుంది.

– డాక్టర్ ఎం.విజయ శంకరబాబు, ప్రధాన శాస్త్రవేత్త, ఏఆర్ఎస్ (రేకులకుంట)

కరువు నేలలో ఖరీదైన లోహం

టంగ్‌స్టన్ ముడి ఖనిజం కోసం తవ్వకాలు జరపనున్న బాలేపాళ్యం పరిసరాలు

- బాలేపాళ్యం పరిసరాల్లో టంగ్‌స్టన్ నిక్షేపాలు
- తవ్వకాలకు హిందూస్థాన్ జింక్ సంస్థకు అనుమతి
- తొలి దశలో 308.30 హెక్టార్లలో తవ్వకాలు

కనగానపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరో విలువైన లోహ నిక్షేపాలు బయటపడ్డాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఇనుము, బంగారు, వజ్రాల అన్వేషణ కోసం తవ్వకాలు జరుగుతుండగా, తాజాగా టంగ్‌స్టన్ అనే విలువైన, అరుదైన లోహ ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. కనగానపల్లి మండలం బాలేపాళ్యం గ్రామ పరిసరాల్లో ఈ లోహం ముడి ఖనిజం ఉన్నట్లు తేలింది. ఖనిజ అన్వేషణ, తవ్వకాల కోసం కేంద్ర గనుల శాఖ నుంచి హిందూస్థాన్ జింక్ సంస్థ అనుమతులు పొందింది. కేంద్ర మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా నాలుగు రోజుల క్రితం తవ్వకాల కోసం ఆ సంస్థకు అనుమతులిచ్చింది.

విలువైన, అరుదైన లోహం

టంగ్‌స్టన్ అత్యంత అరుదుగా దొరికే విలువైన లోహమని ఖనిజ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇనుము కన్నా ఎంతో దృఢమైన ఈ లోహాన్ని పారిశ్రామిక యంత్రాలు, ఎలక్ట్రిక్ విభాగాల తయారీలో ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇది ఎక్కువ వేడిమిని తట్టుకోగలదు. కావున విద్యుత్ బల్బుల్లో ఫిలమెంట్, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు వాడే పరికరాల్లో ఉపయోగిస్తారు. ఈ లోహం ముడి ఖనిజం విలువే టన్నుకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని సమాచారం. ఈ ఖనిజం మనదేశంలో అరుదుగా లభిస్తుండటంతో ఈ లోహంతో తయారయ్యే పరికరాలను చాలావరకు మనం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ మధ్యనే తమిళనాడులో ఈ ముడి ఖనిజాన్ని గుర్తించినప్పటికీ అక్కడి ప్రజల వ్యతిరేకతతో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు.

టంగ్‌స్టన్ లోహంతో రూపొందించిన పలు ఉపకరణాలు

తొలి దశలో 308.30 హెక్టార్లలో తవ్వకాలు

టంగ్‌స్టన్ ముడి ఖనిజం కోసం మొదట శాటిలైట్, విమానాల ద్వారా సర్వే చేసిన భూగర్భ గనులు, ఖనిజ శాఖ వారు బాలేపాళ్యం గ్రామ పరిసరాల్లో ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో హంద్రీ–నీవా కాలువ కోసం తీసిన టన్నెల్ వద్ద బయట పడిన రాళ్లు, మట్టిని కూడా పరిశీలించి.. టంగ్‌స్టన్ ఆనవాళ్లను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలోని 308.30 హెక్టార్లలో తొలి దశలో తవ్వకాలు నిర్వహించాలని కేంద్ర గనుల శాఖ టెండర్ నిర్వహించగా, హిందూస్థాన్ జింక్ సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ త్వరలోనే ఇక్కడ తవ్వకాలు చేపట్టే అవకాశం ఉంది.

విశాఖ గో మాంసం నిల్వల వెనుక ఎవరున్నారు ?

సాక్షి, అమరావతి: విశాఖ గో మాంసం అక్రమ నిల్వ చేసిన ముఠాల అసలు మూలాలు గుర్తించాలని పవన్‌కళ్యాణ్ విశాఖ పోలీసులకు సూచించారని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. విశాఖలో భారీగా గో మాంసం నిల్వలు పట్టుబడిన వ్యవహారంపై ఈ సందర్భంగా విశాఖ పోలీస్ కమిషర్ నుంచి వివరాలను తెలుసుకున్నారని పేర్కొంది. ‘అంత పెద్ద ఎత్తున గో మాంసం ఒకే చోట ఎలా నిల్వ చేయగలిగారు? ఎక్కడి నుంచి తెచ్చారు.. నిల్వ ఉంచిన మాంసాన్ని ఎక్కడికి తరలిస్తున్నారు? దీని వెనుక ఎవరు ఉన్నారు? అనే అంశాలపై పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డి.ఆర్.ఐ) అధికారులు మిత్ర కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన 1.89 లక్షల కేజీల గో మాంసాన్ని పట్టుకుని, కేసును పోలీస్ శాఖకు అప్పగించినట్టు పవన్‌కళ్యాణ్‌కు విశాఖ కమిషనర్ తెలిపారు. విచారణ కొనసాగుతుందన్నారు’ అంటూ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.

బేసిల్ ఉడ్స్ స్కూల్స్‌తో ప్రభుత్వం ఎంవోయూ

మంగళగిరి టౌన్: అమరావతిలో బేసిల్ ఉడ్స్ స్కూల్స్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచస్థాయి పాఠశాలల స్థాపన కోసం ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం నాలుగు ఎకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు మంత్రి నారాయణ నుంచి టచ్‌స్టోన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వంశీధర్ దాస ఎంవోయూ పత్రాలను శనివారం స్వీకరించారు.

ఫ్యామిలీ స్టార్స్!

● నయనతార, చిరంజీవి

● వెంకటేశ్

● రవితేజ

కుటుంబ కథా చిత్రాలకు ఎప్పుడూ తిరుగు ఉండదు. మంచి కథ, క్యాస్టింగ్, డైరెక్టర్ కుదిరితే ఆ ఫ్యామిలీ మూవీ సూపర్ హిట్ అవుతుంది. ఈ ఏడాది సంక్రాంతికి పండక్కి విడుదలైన ఫ్యామిలీ డ్రామా సినిమా పెద్ద చిత్రాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం', చిన్న చిత్రాల్లో వేసవిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కోర్టు' వంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఈ తరుణంలో ఫ్యామిలీ డ్రామా సినిమాలపై, కుటుంబ భావోద్వేగాలపై కొందరు స్టార్ హీరోలు ఫోకస్ పెట్టారు. మరి... ప్రస్తుతం కుటుంబ కథా చిత్రాలు చేస్తున్న టాలీవుడ్ ఫ్యామిలీ స్టార్స్‌పై మీరూ ఓ లుక్ వేయండి.


● ప్రభాస్, సంజయ్ దత్

రాజీ పడదామే... మాజీ ఇల్లాలా!

శంకర వరప్రసాద్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్. ఫుల్లీ వర్క్ మైండెడ్. దీంతో పర్సనల్ లైఫ్‌కి, వర్కింగ్ లైఫ్‌కి మధ్య బ్యాలెన్స్ తప్పిందట. మరి... ఈ రెంటినీ మళ్లీ శంకరవరప్రసాద్ ఎలా బ్యాలెన్స్ చేశాడు? అన్నది 'మన శంకరవరప్రసాద్' లో చూడొచ్చట. చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇన్వెస్టిగేషన్ డ్రామా, ఫ్యామిలీ ఎమోషన్స్ మిళితమైన సినిమాగా 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమా ఉండబోతోందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాలో చిరంజీవి, నయనతార భార్యాభర్తలుగా నటిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం నుంచి 'మీసాల పిల్ల' అనే పాట విడుదలైంది. ఇందులో 'రాజీ పడదామే మాజీ ఇల్లాలా' అనే లిరిక్స్ ఉన్నాయి. దీన్ని బట్టి, ఈ చిత్రంలో భార్యాభర్తలుగా చిరంజీవి–నయనతారల మధ్య ఫ్యామిలీ గొడవలు, అలకలు ఉంటాయని అర్థం అవుతోంది. ఈ సన్నివేశాలు థియేటర్స్‌లో ఆడియన్స్‌కు వినోదాన్ని పంచుతాయని ఊహించవచ్చు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో వెంకటేశ్, క్యాథరీన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మితా కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతి సందర్భంగా రిలీజ్ కానుంది. ఈ సినిమా సంగతి ఇలా ఉంచితే... చిరంజీవి హీరోగా నటించిన మరో సినిమా 'విశ్వంభర'. ఈ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ మోతాదు కాస్త ఎక్కువగానే ఉంటుందని సమాచారం. ఈ సినిమాలో చిరంజీవికి ఐదుగురు సిస్టర్స్ ఉంటారని, ఇషా చావ్లా, రమ్య పసుపులేటి వంటి హీరోయిన్స్ చిరంజీవికి సిస్టర్స్‌గా నటించారని తెలిసింది. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ కానున్నట్లుగా చిత్రయూనిట్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అబ్బాయిగారు 60 ప్లస్

'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' చిత్రాలు వెంకటేశ్ కెరీర్‌లో ఎంతటి బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అప్పట్లో ఈ రెండు సినిమాలకు రైటర్‌గా పని చేశారు ఇప్పటి స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్. ఇప్పుడు త్రివిక్రమ్ డైరెక్షన్‌లోనే వెంకటేశ్ హీరోగా ఓ సినిమా రానుంది. ఆల్రెడీ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. వెంకటేశ్ కెరీర్‌లోని ఈ 77వ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో మరో హీరోయిన్‌కు చాన్స్ ఉందని, త్వరలోనే ఈ హీరోయిన్ పేరు కూడా మేకర్స్ రివీల్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' చిత్రాల కథలు వైజాగ్ నేపథ్యంలో మొదలై, హైదరాబాద్‌కు షిఫ్ట్ అవుతాయి. వెంకటేశ్–త్రివిక్రమ్ తాజా చిత్రం కూడా వైజాగ్ నేపథ్యంలోనే ఉంటుందనే టాక్ తెరపైకి వచ్చింది. ఇంకా ఈ సినిమాకు 'వెంకటరమణ, ఆనంద నిలయం, వెంకటరమణ కేరాఫ్ ఆనంద నిలయం, అబ్బాయిగారు 60 ప్లస్' అనే టైటిల్స్ కూడా తెరపైకి వచ్చాయి. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుందని, టైటిల్‌ను కూడా అతి త్వరలోనే రిలీజ్ చేసే ఆలోచనలో చిత్రయూనిట్ ఉందని ఫిల్మ్‌నగర్ సమాచారం. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మించనున్న ఈ ఫ్యామిలీ డ్రామా వచ్చే వేసవిలో రిలీజ్ కానుంది. మరోవైపు ఇంటెన్స్ క్రైమ్ డ్రామా, ఫ్యామిలీ ఎమోషన్స్ మిక్స్ అయిన 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి ఇప్పటికే 'దృశ్యం, దృశ్యం 2' చిత్రాలు రాగా, ఈ రెండు చిత్రాల్లోనూ వెంకటేశ్ హీరోగా నటించిన విషయం తెలిసిందే. అయితే ఈ 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి ముచ్చటగా 'దృశ్యం 3' కూడా రానుందని ఇటీవల జరిగిన ఓ వేడుకలో వెంకటేశ్ కన్ఫార్మ్ చేశారు. అలాగే తాను, మీనా హీరో హీరోయిన్లుగా నటించనున్న విషయాన్ని కూడా వెంకటేశ్ చెప్పారు. ఇక 'దృశ్యం 3' మూవీ షూటింగ్ వచ్చే ఏడాది ఆరంభం కానున్నట్లుగా తెలిసింది.

రామసత్యనారాయణ విజ్ఞప్తి!

'నా జీవితంలోని ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్... ఏఐ... జెమిని..చాట్‌జీపీటీ.. ఇలా అన్నింటినీ అడిగాను. మే బీ వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా కన్ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్ళని.., ముఖ్యంగా మొగుళ్ళని అడిగాను. ఆశ్చర్యపోయారే తప్ప ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని, పెళ్లయిన వాళ్ళకి నాలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటూ... మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏమిటంటే.. భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి డైలాగ్స్ రవితేజ కొత్త చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంలోనివి. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు పెద్ద పీట వేసే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రామసత్యనారాయణగా హీరో రవితేజ నటిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇటీవల ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టైటిల్ గ్లింప్స్‌లోనే పైన పేర్కొన్న సంభాషణలు ఉన్నాయి. ఈ డైలాగ్స్‌ని బట్టి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా పూర్తి స్థాయి ఫ్యామిలీ డ్రామాగా ఉండబోతోందని తెలుస్తోంది. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా రిలీజ్ కానుంది.

● కిరణ్ అబ్బవరం

● శర్వానంద్, మాళవిక

తాత-మనవడి కథ

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రాల్లో 'ది రాజా సాబ్' సినిమా ఒకటి. సోషియో ఫ్యాంటసీ హారర్ కామెడీ జానర్‌లో ప్రభాస్ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం ఇది. ఇందులో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్దీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంజయ్ దత్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, సంజయ్‌దత్ తాత–మనవడి పాత్రల్లో కనిపిస్తారని సమాచారం. అంతేకాదు...ఈ సినిమాలో కామెడీ, హారర్ ఎలిమెంట్స్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ బలంగానే ఉంటాయట. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌లో బలమైన ఫ్యామిలీ ఎమోషనల్ సీన్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారట ఈ చిత్రదర్శకుడు మారుతి. ఇంకా... ఈ సినిమాలో ఓ ఘోస్ట్‌గా సంజయ్ దత్ కనిపిస్తారు. సెకండాఫ్‌లో ప్రభాస్ పాత్రను సంజయ్ దత్ ఆత్మ ఆవహిస్తుందని, ఈ సీన్స్ థియేటర్స్‌లో అదిరిపోతాయని టాక్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'ది రాజాసాబ్' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 9న రిలీజ్ కానుంది.

విశ్వనాథన్ అండ్ సన్స్

'రంగ్ దే, లక్కీ భాస్కర్' వంటి సూపర్‌హిట్ కుటుంబ కథా చిత్రాలకు దర్శకత్వం వహించిన వెంకీ అట్లూరి తాజాగా తనదైన మార్క్‌తో ఈ జానర్‌లోనే మరో మూవీ తీస్తున్నారు. ఈ చిత్రంలో సూర్య హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి ఫ్యామిలీ డ్రామా సినిమా ఇది. మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే యూరప్‌లో ఈ సినిమాకు సంబంధించిన ఓ భారీ షూటింగ్ షెడ్యూల్‌ను జరిపారు మేకర్స్. అంతేకాదు... ఈ సినిమాకు 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, త్వరలోనే ఈ సినిమా టైటిల్ గురించి అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే వేసవిలో విడుదల కానుంది.

మూడు తరాల కథ

మోటర్ రేసింగ్ స్పోర్ట్స్ నేపథ్యంలో సాగే మల్టీ జనరేషన్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్'. 1990– 2000 మధ్య కాలంలో సాగే ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో శర్వానంద్ హీరోగా నటించారు. ఈ సినిమా కథకు రేసింగ్ బ్యాక్‌డ్రాప్ ఉన్నప్పటికీ, మూడు తరాల ఫ్యామిలీ కథగా 'బైకర్' మూవీ ఉంటుంది. ఈ చిత్రంలో శర్వానంద్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని తెలిసింది. ఇందులో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటించగా, రాజశేఖర్, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ 'బైకర్' చిత్రం డిసెంబరు 6న రిలీజ్ కానుంది. మరోవైపు ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలోనే శర్వానంద్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్‌నేషనల్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. లవ్, ఫ్యామిలీ డ్రామా ప్రధాన అంశాలుగా ఈ చిత్రకథనం సాగుతుంది. వచ్చే సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

● అఖిల్

● సూర్య

లెనిన్

అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళీ కిశోర్ దర్శకత్వం వహిస్తున్నారు. అక్కినేని నాగార్జున, నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ కూడా మొదలైంది. సగానికి పైగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లుగా తెలిసింది. రాయలసీమ నేపథ్యంలో సాగే 'లెనిన్' సినిమాలో లవ్‌స్టోరీతో పాటు బలమైన ఫ్యామిలీ భావోద్వేగాలు ఉండబోతున్నట్లుగా తెలిసింది. తండ్రీ–కొడుకుల భావోద్వేగంతో కూడిన ఓ ఎపిసోడ్ కూడా ఈ సినిమాలో ఉందని, ఈ సీన్స్ ఈ సినిమాకు హైలైట్‌గా ఉంటాయని టాక్. అయితే ఈ సినిమాలోని తండ్రి పాత్రలో ఎవరు యాక్ట్ చేస్తున్నారనే విషయంపై ఇంకా క్లారిటీ రాలేదు. ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రీలీల కన్ఫార్మ్ అయ్యారు. కానీ కాల్షీట్స్ కేటాయింపుల్లో ఇబ్బందులు తలెత్తడం వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి శ్రీలీల తప్పుకున్నారని, ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

ఫ్యామిలీ కథ

వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు హీరో కిరణ్ అబ్బవరం. కిరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' రిలీజ్‌కు రెడీ అవుతోంది. కాగా, కుటుంబ కథా చిత్రాలను చక్కగా తెరకెక్కించే దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల, ఇటీవల ఓ ఫ్యామిలీ స్టోరీని కిరణ్‌కు వినిపించారని, కథ నచ్చడంతో ఈ యువ హీరో కూడా ఈ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌కు శ్రీను వైట్ల మరిన్ని మెరుగులు దిద్దుతున్నారని, త్వరలోనే ఈ మూవీపై మేకర్స్ నుంచి ఓ ప్రకటన రానుందని తెలిసింది.

ఇలా కుటుంబ కథలతో సినిమాలు చేస్తున్న తెలుగు హీరోలు మరి కొంతమంది ఉన్నారు. ఇంకొంతమంది హీరోలు ఈ ఫ్యామిలీ జానర్ సినిమాలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

- ముసిమి శివాంజనేయులు

● ప్రభాస్

నాటు నాటు కొరియోగ్రాఫర్‌కి సై?

● ప్రేమ్ రక్షిత్

డ్యాన్స్ మాస్టర్స్... డైరెక్టర్స్‌గా మారడం కొత్తేం కాదు. ఇప్పటి వరకూ ప్రభుదేవా, లారెన్స్ వంటి కొరియోగ్రాఫర్లు డైరెక్టర్లుగా మారి, విజయాలు అందుకున్నారు. ఇప్పుడు మరో కొరియోగ్రాఫర్, 'నాటు నాటు...' పాటతో ఆస్కార్ అవార్డు సాధించిన ప్రేమ్ రక్షిత్ డైరెక్టర్‌గా మారనున్నారనే టాక్ వినిపిస్తోంది. అది కూడా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమాకి దర్శకత్వం వహించే చాన్స్ దక్కిందని సమాచారం. ఇటీవల ప్రభాస్‌కి ప్రేమ్ రక్షిత్ ఓ కథ వినిపించడం.. కథ ఆయని నచ్చడంతో 'సై' అన్నారని భోగట్టా. ప్రభాస్ 'ఛత్రపతి, డార్లింగ్, బాహుబలి' వంటి చిత్రాలకు ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రాఫర్‌గా చేశారు. అది మాత్రమే కాదు... 'బాహుబలి'లో ప్రభాస్–అనుష్క కాంబినేషన్‌లో వచ్చే ఫైట్‌ని డిజైన్ చేశారు ప్రేమ్ రక్షిత్. ఆ విధంగా తనలో మంచి ఫైట్ మాస్టర్ ఉన్న విషయాన్ని కూడా నిరూపించుకున్నారు. మరి... ఇప్పుడు డైరెక్టర్‌గానూ నిరూపించుకోవడానికి రెడీ అయ్యారా? వార్తల్లో ఉన్నట్లు ప్రభాస్–ప్రేమ్ రక్షిత్ కాంబినేషన్‌లో సినిమాకి ప్లాన్ జరుగుతోందా? అనే ప్రశ్నలకు సమాధానం కావాలంటే వేచి చూడక తప్పదు.

మంచి కంటెంట్‌కి మేం సహాయపడతాం

- వి. సముద్ర

''టీబీడీ' అనే ఓటీటీ యాప్ దుబాయ్ బేస్డ్‌గా ఉన్నప్పటికీ ప్రపంచమంతా పనిచేస్తుంది. సౌత్ ఇండియాలో ఈ యాప్ లాంచ్‌కి మన తెలుగు పరిశ్రమను తొలిగా ఎంచుకున్నందుకు గుప్తా గారికి, సునీల్ గారికి థ్యాంక్స్. ఓటీటీ బిజినెస్ విషయంలో నిర్మాతలు ఇప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వాటన్నింటికీ చక్కని పరిష్కారం మా 'టీబీడీ'. నేను, డీయస్ రావుగారు అందరికీ అందుబాటులో ఉంటాం. మంచి కంటెంట్ తయారు చేయండి.. మేం మీకు సహాయపడతాం'' అని డైరెక్టర్, 'టీబీడీ' ఓటీటీ సౌత్ సీఈఓల్లో ఒకరైన వి.సముద్ర తెలిపారు. దుబాయ్‌కి చెందిన రాయల్ ర్యాప్పీ వారి 'టీబీడీ' ఓటీటీ దక్షిణాదిలో అడుగు పెడుతోంది. హైదరాబాద్‌లో జరిగిన 'టీబీడీ' ఓటీటీ లోగో లాంచ్ కార్యక్రమానికి సంస్థ ఫౌండర్, ఎండీ ధరమ్ గుప్తా, సీఈఓ సునీల్ భోజ్వానీ, సౌత్ ఇండియా సీఈఓలు డి.యస్.రావు, వి. సముద్రతో పాటు దర్శకులు వి.యన్. ఆదిత్య, చంద్రమహేష్, ఇ. సత్తిబాబు, శివనాగు, డిజిక్వెస్ట్ అధినేత బసిరెడ్డి, 'సంతోషం' అధినేత సురేష్ కొండేటి, నటుడు దాసన్న హాజరయ్యారు.

● 'టి.బి.డి' ఓటీటీ లాంచ్‌లో సముద్ర, ఆదిత్య, రాధామోహన్, డి.యస్. రావు తదితరులు

నిర్మాత కె.కె. రాధామోహన్ చేతుల మీదుగా 'టీబీడీ' యాప్‌ని లాంచ్ చేశారు. టీబీడీ ఫౌండర్, ఎండీ ధరమ్‌గుప్తా మాట్లాడుతూ–''టీబీడీ' ని భారతీయ మూలాలకు విస్తరించాలనేది మా ఆకాంక్ష. ఇందులో మన దేశీ కంటెంట్ మాత్రమే ఉంటుంది. చిన్న నిర్మాతలకు పెద్ద పీట వేస్తాం'' అన్నారు. ''ఓటీటీ బిజినెస్ విషయంలో చిన్న నిర్మాతలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న సినిమాలకు మా ఓటీటీ చక్కని వేదిక అవుతుంది'' అని డి.యస్. రావు పేర్కొన్నారు.

బిజినెస్ రీల్

17 నుంచి ఐసీఎల్ ఫిన్‌కార్ప్ ఎన్‌సీడీ ఇష్యూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ ఐసీఎల్ ఫిన్‌కార్ప్ తాజాగా నాన్–కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) ద్వారా నిధులను సమీకరించనుంది. ఇందుకు సంబంధించిన ఇష్యూ నవంబర్ 17న ప్రారంభమవుతుందని సంస్థ సీఎండీ కె.జి. అనిల్ కుమార్ తెలిపారు. 13 నుంచి 70 నెలల వరకు కాలవ్యవధికి జారీ చేసే ఈ ఎన్‌సీడీలపై ఈల్డ్ (రాబడి) 10.50 శాతం నుంచి 12.62 శాతం వరకు ఉంటుందని చెప్పారు. ఒక్కో ఎన్‌సీడీ ముఖ విలువ రూ. 1,000గా ఉండగా, కనీస దరఖాస్తు మొత్తం రూ. 10,000గా ఉంటుంది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను వ్యాపార విస్తరణకు కంపెనీ వినియోగించుకోనుంది.

వచ్చే నెలలో నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి సర్వీసులు

ముంబై: కొత్తగా నిర్మించిన నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఎన్‌ఎంఐఏ) నుంచి వచ్చే నెల (డిసెంబర్) 25 నుంచి సర్వీసులు ప్రారంభించనున్నట్లు ఇండిగో, ఆకాశ ఎయిర్ వెల్లడించాయి. ముందుగా హైదరాబాద్ సహా 10 నగరాలకు సేవలు మొదలుపెట్టనున్నట్లు ఇండిగో తెలిపింది. మరోవైపు, కొత్త విమానాశ్రయం నుంచి తొలుత నాలుగు నగరాలకు సేవలు ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ వెల్లడించింది. దాదాపు రూ. 19,650 కోట్లతో నిర్మించిన ఎన్‌ఎంఐఏని అక్టోబర్ 8న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.

వేల్ ట్యాంక్ సదస్సుకు 80 స్టార్టప్‌ల దరఖాస్తులు

హైదరాబాద్: డీప్‌టెక్ స్టార్టప్‌లకు నిధులను సమకూర్చే లక్ష్యంతో వేల్‌ట్యాంక్ (డబ్ల్యూటీ) బయోక్యాటలిస్ట్స్ నిర్వహించిన మూడో వార్షిక సదస్సులో హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ తదితర రంగాల అంకుర సంస్థల నుంచి 80 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 73 స్టార్టప్‌లు షార్ట్‌లిస్ట్ అయ్యాయి. బయోటెక్నాలజీ ఇండస్ట్రీ అడ్వైజరీ కౌన్సిల్ బీఐఆర్‌ఏసీ సహకారంతో ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) నిర్వహించిన ఈ సదస్సులో 46 మంది ఇన్వెస్టర్లు పాల్గొన్నారు. గత రెండు సదస్సుల్లో 100కు పైగా అంకురాలకు ఇన్వెస్టర్లు నిధులను సమకూర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నెక్సాస్వీట్ ఉత్పత్తిని ఆవిష్కరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-11-2025

విశాఖ	605–00
చిత్తూరు	653–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620–00
విజయవాడ	625–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	610–00
వరంగల్	612–00
రిటైల్ ధర	6.70

ఆసియా పసిఫిక్‌లో కీలకంగా భారత్

విమానయాన వృద్ధిలో చైనాది కూడా ప్రధాన పాత్ర

తొలి 9 నెలల్లో ప్రాంతీయంగా 10% పెరిగిన ఎయిర్ ట్రాఫిక్ ● ఏపీఏపీ వెల్లడి

బ్యాంకాక్: ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో విమానయాన రంగ వృద్ధికి భారత్, చైనా కీలకంగా నిలుస్తున్నాయని అసోసియేషన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ ఎయిర్‌లైన్స్ (ఏఏపీఏ) వెల్లడించింది. ప్యాసింజర్, కార్గోలకు డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో 2026లో కూడా పరిశ్రమ వృద్ధి సానుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నట్లు ఏఏపీఏ డైరెక్టర్ జనరల్ సుభాష్ మీనన్ తెలిపారు. ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల్లో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఎయిర్ ట్రాఫిక్ 10 శాతం పెరిగిందని వివరించారు. 2025 తొలి ఆరు నెలల్లో భారత్ నుంచి విదేశాలకు వెళ్లే, వచ్చే ప్రయాణికుల సంఖ్య 16 శాతం వృద్ధి చెందిందని 69వ అసెంబ్లీ ఆఫ్ ప్రెసిడెంట్స్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దేశీ మార్కెట్ విస్తరించేందుకు భారీగా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. చారిత్రకంగా చూస్తే భారతీయ విమానయాన దిగ్గజం ఎయిరిండియా చాలా కీలకమైనదని, అది నిలదొక్కుకోవడానికి కాస్త సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని మీనన్ చెప్పారు. సరఫరా వ్యవస్థపరంగా అంతరాయాలు ఎదుర్కొంటున్నప్పటికీ ఆసియా పసిఫిక్ ఎయిర్‌లైన్స్ డిమాండ్‌కి తగ్గ స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఏపీఏలో ఎయిరిండియా సహా 18 విమానయాన సంస్థలకు సభ్యత్వం ఉంది.

నాలుగు తీర్మానాల ఆమోదం..

సదస్సు సందర్భంగా ఏఏపీఏ నాలుగు తీర్మానాలను ఆమోదించింది. సరఫరా వ్యవస్థపరమైన

సవాళ్లను అధిగమించడం, విమానాల్లో లిథియం బ్యాటరీలను తీసుకెళ్లడం, పన్నులు..చార్జీలు, పర్యావరణహితమైన విధంగా ఏవియేషన్ కార్యకలాపాలు సాగించడంలాంటి అంశాలు వీటిలో ఉన్నాయి. ప్రాంతీయంగా ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) కార్యకలాపాలు పెరిగేలా నియంత్రణ సంస్థలు చర్యలు తీసుకోవడం, తయారీ సామర్థ్యాలు పెంచుకునేందుకు ఊతమివ్వడం, నిర్దిష్ట పెట్టుబడులకు ప్రోత్సాహకాలివ్వడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని ఏఏపీఏ కోరింది. అలాగే పునర్వినియోగానికి పనికొచ్చే ఎయిర్‌క్రాఫ్ట్ మెటీరియల్స్‌ను రీసైకిల్ చేసేలా సర్క్యులర్ ఎకానమీ విధానాలను అమల్లోకి తేవాచ్చని పేర్కొంది.

కొత్తతరం విమానాలతో 25 శాతం ఇంధనం ఆదా..

తమ కొత్త తరం వైడ్–బాడీ విమానాలు 25 శాతం మేర ఇంధనాన్ని ఆదా చేస్తాయని, కర్బన ఉద్గారాలను కూడా ఆ మేరకు తగ్గిస్తాయని ఎయిర్‌బస్ తెలిపింది. ఏఏపీఏ సదస్సు సందర్భంగా ఎయిర్‌బస్ వెల్లడించిన అంచనాల ప్రకారం ఆసియా పసిఫిక్‌లో వచ్చే రెండు దశాబ్దాల్లో 3,500 పెద్ద విమానాలు అవసరం కానున్నాయి. ఇది అంతర్జాతీయంగా పెద్ద విమానాలకున్న డిమాండ్‌లో సుమారు 43 శాతం. మరోవైపు, ప్రాంతీయంగా 16,100 చిన్న విమానాలు కావాల్సి ఉంటుంది. గ్లోబల్ డిమాండ్‌లో దాదాపు 47 శాతం. దాదాపు 32 శాతం విమానాలు పాత మోడల్స్ స్థానాన్ని భర్తీ చేయనుండగా, మిగతావి ఫ్లీట్ విస్తరణకు ఉపయోగపడనున్నాయి.

ఎయిర్‌లైన్స్‌కి అండగా ఉండాలి: ఐఏటీఏ

సరఫరా వ్యవస్థపరమైన సవాళ్లతో విమానాల డెలివరీలకు అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఎయిర్‌లైన్స్‌కి విమానయాన పరిశ్రమలోని వివిధ విభాగాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. టారిఫ్‌లు, ఇతరత్రా అంశాల కారణగా విమానాల తయారీ సంస్థలు (ఓఈఎం) ధరలు పెంచే యోచనలో ఉన్నట్లు వస్తున్న వార్తలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిర్‌లైన్స్ మార్జిన్లు చాలా తక్కువగా ఉంటాయని, మరోవైపు ఓఈఎంల మార్జిన్లు అధిక స్థాయిలో ఉంటాయని వాల్ష్ తెలిపారు. మిగతా వర్గాలు లాభాలార్జించడంపై తమకే అభ్యంతరం లేదు కానీ పరిశ్రమలో సమతౌల్యత అవసరమని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సరఫరా వ్యవస్థపై టారిఫ్‌లు ప్రతికూల ప్రభావం చూపుతాయని సుభాష్ మీనన్ చెప్పారు. వీటి వల్ల విమానయాన సంస్థల ఇంధనేతర వ్యయాలు కూడా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. టారిఫ్‌ల వల్ల ఇటు సరఫరా, అటు డిమాండ్ మీద ప్రభావం పడుతుందన్నారు. కన్సల్టింగ్ సంస్థ ఆలివర్ వైమాన్‌తో కలిసి ఐఏటీఏ నిర్వహించిన అధ్యయనం ప్రకారం సరఫరా వ్యవస్థ సవాళ్ల కారణంగా 2025లో అంతర్జాతీయంగా ఎయిర్‌లైన్స్ పరిశ్రమపై 11 బిలియన్ డాలర్ల మేర ప్రతికూల ప్రభావం పడనుంది. అక్టోబర్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం ఇంధనం అధికంగా వాడాల్సి రావడం, అదనపు మెయింటెనెన్స్, మరింత ఎక్కువగా ఇంజిన్లను లీజుకు తీసుకోవడంలాంటి అంశాలపై విమానయాన సంస్థలు గణనీయంగా వెచ్చించాల్సి రానుంది.

20 ఏళ్లలో 19,560 విమానాలు అవసరం: ఎయిర్‌బస్ అంచనాలు

వచ్చే 20 ఏళ్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 19,560 చిన్న, పెద్ద విమానాలు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ వెల్లడించింది. అంతర్జాతీయంగా 20 ఏళ్లలో 42,520 విమానాలు అవసరం కానుండగా, ఇది అందులో దాదాపు సగమని వివరించింది. భారత్, చైనాలో విమానయానానికి డిమాండ్ పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణమని ఎయిర్‌బస్ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీ చెప్పారు. ప్రాంతీయంగా ప్యాసింజర్ల సంఖ్య ఏటా 4.4 శాతం వృద్ధి చెందనుందని, ఇది అంతర్జాతీయ సగటు 3.6 శాతం కన్నా అధికమని వివరించారు. ఆసియా–పసిఫిక్‌లో సరికొత్త వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని స్టాన్లీ పేర్కొన్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుదల, నెట్‌వర్క్ విస్తరణ, చౌక విమానయాన సంస్థల రాక, మౌలిక సదుపాయాలు మెరుగుపడటం మొదలైనవి విమానయాన వృద్ధికి దోహదపడే అంశాలని చెప్పారు.

పెన్షన్ ప్లాన్‌లపై యువతలో అవగాహన పెరగాలి

పీఎఫ్‌ఆర్‌డీఏ చైర్‌పర్సన్ రామన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సాధారణంగా 25–40 ఏళ్ల వయస్సు వారు పెన్షన్ అనే మాట వినడానికి పెద్దగా ఇష్టపడకపోయినప్పటికీ, పదవీ విరమణ అనంతరం ఆర్థికంగా ఎంతగానో ఉపయోగకరంగా ఉండే దీని ప్రాధాన్యత గురించి యువత కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పీఎఫ్ఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎస్.రామన్ తెలిపారు. ప్రస్తుతం 55 కోట్ల మంది పైగా వర్క్‌ఫోర్స్ ఉండగా, కేవలం 10 కోట్ల మందే సంఘటిత రంగంలో ఉన్నారని శుక్రవారమిక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. మిగతా 30–40 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉంటున్నారని, వారందరినీ కూడా పెన్షన్ ఫండ్ పరిధిలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత నెలకొందని ఆయన పేర్కొన్నారు. పెన్షన్ ఫండ్లు గణనీయంగా రాబడులు అందిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో

ఆర్థిక భద్రతకు అధిక రాబడుల కోసం పోంజీ స్కీముల్లాంటి వాటి వలలో పడకుండా సురక్షితమైన పెన్షన్ ఫండ్‌ను ఎంచుకోవడం శ్రేయస్కరమని వివరించారు. మరోవైపు గిగ్ వర్కర్లకు కూడా సామాజిక భద్రతను కల్పించే విధంగా చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు.

సరికొత్త టాటా సియెరా ..

ముంబై: వాహనాల తయారీ దిగ్గజం టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్, ఉత్పత్తి కోసం సిద్ధం చేసిన సరికొత్త సియెరాను ప్రదర్శించింది. నవంబర్ 25న దీన్ని అధికారికంగా ఆవిష్కరించనున్నట్లు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో, 1991లో తొలిసారిగా ప్రవేశపెట్టిన సియెరా ప్రస్థానాన్ని ప్రదర్శించారు. కొత్త తరం అభిరుచులకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

అగ్రిటెక్నికా టాప్ 5లో టఫే ట్రాక్టర్స్ ఈవీ

న్యూఢిల్లీ: జర్మనీలో నిర్వహించిన అగ్రిటెక్నికా 2025లో 'ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్ టాప్ 5 ఫైనలిస్టుల జాబితాలో తమ ఈవీ28 ఎలక్ట్రిక్ ట్రాక్టర్ చోటు దక్కించుకుందని టఫే ట్రాక్టర్స్ వెల్లడించింది. పర్యావరణహిత ట్రాక్టర్ల కేటగిరీలో ఈ గుర్తింపు దక్కించుకున్నట్లు వివరించింది. ఈ సందర్భంగా తమ కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ ఈవీఎక్స్75 సహా మూడు ఉత్పత్తులను టఫే ప్రదర్శించింది. యూరోపియన్ రైతుల వైవిధ్యమైన అవసరాలకు ఇవి అనుగుణంగా ఉంటాయని సంస్థ వైస్ చైర్మన్ లక్ష్మీ వేణు తెలిపారు. వీటితో కేవలం ట్రాక్టర్ల తయారీ నుంచి అన్ని రకాల వ్యవసాయ సాధనాలను అందించే సమగ్ర సంస్థగా ఎదిగినట్లవుతుందని వివరించారు. సబ్–100 హెచ్‌పీ సెగ్మెంట్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చైర్మన్ మల్లికా శ్రీనివాసన్ చెప్పారు. స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తూ ప్రెసిషన్ అగ్‌టెక్, స్మార్ట్ ఫార్మింగ్, ఆటోమేషన్ మొదలైనవాటిపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని వివరించారు.

అల్ట్రావయొలెట్ యూవీ స్పేస్ స్టేషన్ విస్తరణ

బెంగళూరు: ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్ తయారీ సంస్థ అల్ట్రా వయొలెట్ తమ కొత్త యూవీ స్పేస్ స్టేషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఇందులో ఎక్స్–47, ఎఫ్77 మాక్ 2, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్ తదితర వాహనాలు అందుబాటులో ఉంటాయి. ఉత్పత్తిని బట్టి ఇవి 2.8 సెకన్లలో గంటకు 60 కి.మీ. వేగాన్ని అందుకోగలవు. ఒక్కసారి చార్జి చేస్తే 323 కి.మీ. వరకు రేంజి ఉంటుంది.

క్యూ2 ఫలితాలు

మారికో మిశ్రమ పనితీరు

ఆదాయంలో 31 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ మారికో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. రూ.432 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.433 కోట్లుగా ఉండడం గమనార్హం. కానీ, ఆదాయం మాత్రం ఇదే కాలంలో 31 శాతం జంప్ చేసి రూ.3,482 కోట్లకు చేరింది. అమ్మకాలు (పరిమాణం పరంగా) 7 శాతం పెరిగాయి. అంతర్జాతీయ వ్యాపారం స్థిర కరెన్సీ మారకంలో 20 శాతం వృద్ధి చెందింది. క్రితం ఏడాది ఇదే కాలంలో అధిక బేస్ (లోగడ గరిష్ట స్థాయిలో రావడం) ఉండడం, కీలక ముడి సరుకుల పరంగా ద్రవ్యోల్బణం ఉండడంతో స్థూల మార్జిన్ 8.1 శాతం తగ్గినట్టు కంపెనీ తెలిపింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ పోర్ట్‌ఫోలియో వైవిధ్యం కోసం దీర్ఘకాల దృష్టితో పెట్టుబడులు కొనసాగించినట్టు వెల్లడించింది. మార్జిన్ 16.1 శాతంగా వచ్చింది. సఫోలా, పారాచ్యూట్ తదితర ప్రముఖ బ్రాండ్లను ఈ సంస్థ విక్రయిస్తుంటుంది. దేశీ మార్కెట్ ఆదాయం 35 శాతం వృద్ధితో రూ.2,667 కోట్లుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 19 శాతం అధికంగా రూ.815 కోట్ల ఆదాయం వచ్చింది. ఆహారోత్పత్తుల విభాగం ఆదాయం 12 శాతం పెరిగి రూ.1,100 కోట్లకు చేరింది. జీఎస్‌టీ రేట్లు మారే తరుణంలోనూ స్థిరమైన డిమాండ్ కనిపించినట్టు కంపెనీ తెలిపింది.

నిరాశపరిచిన ఎక్సైడ్ ఇండస్ట్రీస్

తగ్గిన లాభం, ఆదాయం

కోల్‌కతా: బ్యాటరీ తయారీ సంస్థ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ సెప్టెంబర్ త్రైమాసికంలో పనితీరు పరంగా ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 26 శాతం తగ్గి రూ.174 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.233 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం ఈ కాలంలో 2 శాతం తగ్గి రూ.4,364 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో లాభం రూ.448 కోట్లుగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో లాభం రూ.454 కోట్లతో పోల్చి చూస్తే ఒక శాతం తగ్గింది. జీఎస్‌టీ రేట్ల మార్పు ప్రభావం సెప్టెంబర్ త్రైమాసికం పనితీరుపై ప్రభావం చూపించినట్టు కంపెనీ తెలిపింది. బ్యాటరీలపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 28 శాతానికి తగ్గించడాన్ని గుర్తు చేసింది. రేట్లు తగ్గిన తర్వాత కొత్త స్టాక్‌ను తెప్పించుకుందామని భాగస్వాములు భావించడంతో డిమాండ్ స్తబ్దుగా ఉన్నట్టు వివరించింది. లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్ నిర్మాణం ఆశించిన విధంగా పురోగతిలో ఉన్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో అవిక్‌రాయ్ తెలిపారు.

ఐనాక్స్ విండ్ లాభం జూమ్

రూ. 121 కోట్లు

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ ఐనాక్స్ విండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 121 కోట్లను తాకింది. ఆదాయంలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 84 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 744 కోట్ల నుంచి రూ. 1,162 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో ఆర్డర్ల ఎగ్జిక్యూషన్ 202 మెగావాట్లకు చేరగా.. ఆర్డర్ బుక్ 3.2 గిగావాట్లుగా నమోదైంది. ప్రస్తుత, కొత్త కస్టమర్ల నుంచి 400 మెగావాట్ల ఆర్డర్లు పొందింది. అహ్మదాబాద్(గుజరాత్)లోని కళ్యాణ్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన కొత్త తయారీ ప్లాంటు కార్యకలాపాలు ఊపందుకున్నట్లు కంపెనీ పేర్కొంది.

సీమెన్స్ లాభం రూ.485 కోట్లు

న్యూఢిల్లీ: సీమెన్స్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.485 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన రూ.523 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 7% తక్కువ. అయితే నిర్వహణ ఆదాయం 16% వృద్ధి చెంది రూ.4,457 కోట్ల నుంచి రూ.5,171 కోట్లకు పెరిగింది. ''క్యూ2లో అత్యుత్తమ ప్రదర్శన సాధించాం. మొబిలిటీ, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారాల మెరుగైన పనితీరుతో ఆదాయం గణనీయంగా పెరిగింది. అయితే గతేడాది నుంచి ఆర్డర్లు తగ్గడం, ప్రయివేటు రంగ క్యాపెక్స్ మందగమనంతో డిజిటల్ ఇండస్ట్రీస్ వాల్యూమ్స్ ప్రభావితం అయ్యాయి'' అని కంపెనీ సీఈవో సునీల్ మాథుర్ తెలిపారు. 2024 క్యూ4లో ఆస్తి విక్రయం ద్వారా సమకూరిన రూ.69 కోట్ల లబ్ధి (వన్‌టైమ్ గెయిన్) ఈ క్వార్టర్ నికరలాభాన్ని ప్రభావితం చేసినట్లు పేర్కొన్నారు. కాగా, కంపెనీ ఆర్థిక సంవత్సరాన్ని అక్టోబర్–సెప్టెంబర్ నుంచి ఏప్రిల్–మార్చ్‌కి మార్చేందుకు 2025 ఆగస్టు 8న బోర్డు ఆమోదం తెలిపింది.

మౌంజారో జోరు..

భారీ స్థాయిలో ఔషధ విక్రయాలు

- ఏడు నెలల్లోనే రూ. 333 కోట్ల అమ్మకాలు
- స్థూలకాయాన్ని తగ్గించుకోవడంపై పెరుగుతున్న ఆసక్తే కారణం

సాక్షి, బిజినెస్ డెస్క్: భారత్‌లో మధుమేహం, స్థూలకాయం సమస్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీటి చికిత్సలో ఉపయోగించే ఔషధాలు అమ్మకాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఈ మధ్యే మార్కెట్లోకి వచ్చిన మౌంజారో (టిర్జెపటైడ్) విక్రయాలు రికార్డు స్థాయిలో ఉంటున్నాయి. అత్యధికంగా అమ్ముడయ్యే యాంటీబయోటిక్ ఆగ్మెంటిన్‌ని మించి ఇది అక్టోబర్‌లో ఏకంగా రూ. 100 కోట్ల అమ్మకాలు సాధించింది. ఫార్మా దిగ్గజం ఎలీ లిలీ ఈ ఏడాది మార్చిలో దీన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి అక్టోబర్ నాటికి సుమారు ఏడు నెలల్లో ఏకంగా రూ. 333 కోట్ల అమ్మకాలు సాధించినట్లు ఫార్మార్యాక్ డేటాలో వెల్లడైంది. ఒబెసిటీ సెంటర్లు మొదలైనవి కూడా దీన్ని నేరుగా డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు చేస్తుండటంతో ఇది సుమారు రూ. 450 కోట్ల స్థాయిలో ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో దీనికి పోటీగా నోవో నార్డిస్క్ జూన్‌లో ప్రవేశపెట్టిన అమ్మకాలు రూ. 28 కోట్లుగా మాత్రమే నమోదయ్యాయి. జనరిక్ ఔషధమైన టిర్జెపటైడ్‌ను ఎలీ లిలీ అంతర్జాతీయంగా మౌంజారో (టైప్ 2 డయాబెటిస్‌కి), జెప్‌బౌండ్ (స్థూలకాయ నియంత్రణకి) పేరిట రెండు బ్రాండ్స్‌గా విక్రయిస్తోంది. అంతర్జాతీయంగా దీని విక్రయాలు ఇప్పటివరకు 24.8 బిలియన్ డాలర్ల స్థాయికి చేరాయి. ఫార్మా దిగ్గజం మెర్క్ చెందిన క్యాన్సర్ ఔషధం కీట్రూడాని కూడా (23.3 బిలియన్ డాలర్లు) మించిపోయాయి. స్థూలకాయం, మధుమేహం కేసులు భారీగా పెరిగిపోతున్న నేపథ్యంలో మౌంజారో బాగా విజయవంతం అవుతుందనే అంచనాలు నెలకొన్నప్పటికీ ఈ స్థాయిలో విక్రయాలు ఉంటాయని ఎవరూ ఊహించలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ఇండియా కోసం ప్రత్యేక వ్యూహం..

మౌంజారోను క్విక్‌పెన్, వయాల్స్ రూపంలో ఎలీ లిలీ అంతర్జాతీయంగా విక్రయిస్తోంది. నెలరోజులకు సరిపడే నాలుగు వారాల డోస్‌ల కింద క్విక్ పెన్ రేటు వయాల్స్‌తో పోలిస్తే అధికంగా ఉంటోంది. ప్రస్తుతం దేశీయంగా డోసేజీని బట్టి వయాల్స్ (వారానికి సరిపడే సింగిల్ డోస్) ధర సుమారు రూ. 3,281 నుంచి ప్రారంభమవుతుండగా, నాలుగు డోస్‌ల ప్యాక్‌గా ఉండే క్విక్‌పెన్ రేటు రూ. 13,125 నుంచి మొదలవుతోంది. సింగిల్ డోస్ రేటు ఒకే రకంగా ఉన్నప్పటికీ క్విక్‌పెన్‌ను ప్యాక్‌గా కొనుక్కోవాల్సి రావడమనేది, కొత్తగా ప్రయత్నించి చూద్దాం అనుకునే వారికి కాస్త భారంగా అనిపించవచ్చు. పైగా సైడ్ ఎఫెక్ట్స్ ఏవైనా వస్తే మిగతా ప్యాక్ మొత్తాన్ని పక్కన పెట్టాల్సి వస్తుందనే ఉద్దేశంతో దీన్ని జోలికి వెళ్లకపోయే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా పెన్స్ కొరత కూడా నెలకొనడంతో వాటి కోసం వేచి చూస్తూ కూర్చోకుండా ఎలీ లిలీ ముందుగా భారత్‌లో వయాల్స్‌ని ప్రవేశపెట్టింది. అనుకోకుండా ఈ వ్యూహమే భారీగా సక్సెస్ అయ్యింది. మొదటిసారిగా ప్రయత్నిద్దామనుకునే వారితో పాటు వైద్యులు కూడా ఒకసారి ప్రయోగాత్మకంగా ప్రిస్క్రైబ్ చేసేందుకు అందుబాటు ధరలో లభిస్తుండటం, అటు పోటీ ఔషధం వెగోవీ కేవలం ఖరీదైన పెన్స్ రూపంలోనే (డోసేజీని బట్టి సుమారు రూ. 17,345 నుంచి ఉంటుంది) మౌంజారోకి కలిసి వస్తోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

కీలకంగా భారత్ మార్కెట్...

స్థూలకాయాన్ని తీవ్రమైన వ్యాధిగా గుర్తించాల్సిన ఆవశ్యకత గురించి ప్రభుత్వాలు, హెల్త్‌కేర్ సంస్థలతో కలిసి పని చేస్తున్నట్లు ఎలీ లిలీ అండ్ కంపెనీ ఇండియా ప్రెసిడెంట్ విన్‌స్లో టకర్ ఇటీవల తెలిపారు. భారత్ తమకు కీలక మార్కెట్‌గా ఉందని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా మరిన్ని వినూత్న ఔషధాలను ప్రవేశపెట్టడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు. యూర్‌పీక్ అనే మరో బ్రాండ్ పేరిట భారత్‌లో టిర్జెపటైడ్ లభ్యతను మరింతగా పెంచే దిశగా దేశీ ఫార్మా దిగ్గజం సిప్లాతో మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ కోసం ఎలీ లిలీ చేతులు కలిపింది. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్లతో రిటైల్ అమ్మకాలకు కాస్మెటాలజిస్టులు, ఒబెసిటీ సెంటర్లు సైతం నేరుగా డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోళ్లు చేస్తుండటం సైతం మౌంజారో భారీ విక్రయాలకు కారణంగా నిలుస్తోంది.

ఫైజర్ 10 బిలియన్ డాలర్ల డీల్..

స్థూలకాయ నియంత్రణ ఔషధాలకి భారీగా డిమాండ్ నెలకొనడంతో ఈ విభాగంలో డీల్స్ కూడా భారీ స్థాయిలో ఉంటున్నాయి. వెయిట్–లాస్ ఔషధాల పోటీలో కాస్త వెనుకబడిన ఫార్మా దిగ్గజం ఫైజర్ కూడా పరుగు ప్రారంభించింది. తాజాగా ప్రత్యర్థి సంస్థ నోవో నార్డిస్క్‌తో పోటీ పడి మరీ మెట్‌సెరా అనే స్టార్టప్ సంస్థను కొనుగోలు రేసులో విజేతగా నిల్చింది. ఒబెసిటీ ఔషధాలను తయారు చేస్తున్న మెట్‌సెరా కొనుగోలు కోసం ఏకంగా 10 బిలియన్ డాలర్లు వెచ్చిస్తోంది. ప్రస్తుతం మెట్‌సెరా ఔషధాలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ ఫైజర్ ఇంత భారీ మొత్తాన్ని వెచ్చిస్తుండటమనేది ఈ విభాగంలో ఉత్పత్తులకు నెలకొన్న డిమాండ్‌ని సూచిస్తోందని విశ్లేషకులు తెలిపారు.

ఫ్రాంచైజీలు విడుదల చేసిన ఆటగాళ్ల జాబితా

చెన్నై: రవీంద్ర జడేజా, ఆండ్రీ సిద్ధార్థ్, దీపక్ హుడా, కాన్వే, రచిన్ రవీంద్ర, పతిరణ, స్యామ్ కరన్, కమలేశ్ నాగర కోటి, రాహుల్ త్రిపాఠి, షేక్ రషీద్, వంశ్ బేడీ, విజయ్ శంకర్.

ఢిల్లీ: డొనోవాన్ ఫెరీరా, దర్శన్, డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్, మన్వంత్, మోహిత్ శర్మ, సిద్దీఖుల్లా.

గుజరాత్: రూథర్‌ఫర్డ్, షనక, కొయెట్జీ, కరీమ్, కుల్వంత్, మహిపాల్ లామ్రోర్.

కోల్‌కతా: రసెల్, వెంకటేశ్ అయ్యర్, నోర్జే, చేతన్ సకారియా, సిసోడియా, మొయిన్ అలీ, డికాక్, గుర్బాజ్, జాన్సన్.

లక్నో: శార్దుల్ ఠాకూర్, డేవిడ్ మిల్లర్, రవి బిష్ణోయ్, ఆకాశ్‌దీప్, షామర్ జోసెఫ్, ఆర్యన్, యువరాజ్, రాజ్యవర్ధన్.

ముంబై: అర్జున్ టెండూల్కర్, జాకబ్స్, కరణ్ శర్మ, లిజాద్, ముజీబుర్ రహ్మాన్, టోప్లీ, శ్రీజిత్, సత్యనారాయణ రాజు, విఘ్నేశ్.

పంజాబ్: మ్యాక్స్‌వెల్, ఇన్‌గ్లిస్, ఆరోన్, జేమీసన్, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే.

రాజస్తాన్: సామ్సన్, నితీశ్ రాణా, ఆకాశ్, అశోక్, ఫజల్‌హక్, కార్తీకేయ, కునాల్ రాథోడ్, తీక్షణ, హసరంగ.

బెంగళూరు: లివింగ్‌స్టోన్, ఇన్‌గిడి, మయాంక్ అగర్వాల్, మనోజ్, స్వస్తిక్ చికారా, మోహిత్ రాఠి.

హైదరాబాద్: షమీ, అథర్వ, సచిన్ బేబీ, అభినవ్ మనోహర్, ముల్డర్, ఆడమ్ జంపా, సిమర్‌జీత్, రాహుల్ చహర్.

జడేజా జెర్సీ మారింది

- వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టుకు ఆడనున్న భారత స్టార్ ఆల్‌రౌండర్
- రూ. 14 కోట్లకు రాజస్తాన్ రాయల్స్‌కు బదిలీ చేసిన చెన్నై సూపర్ కింగ్స్
- చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులోకి సంజూ సామ్సన్
- రసెల్, వెంకటేశ్ అయ్యర్‌లను వదులుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్


రసెల్

వెంకటేశ్ అయ్యర్

సంజూ సామ్సన్

ముంబై: ఐపీఎల్ 'ఫైవ్ స్టార్' చాంపియన్‌లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) పెనుమార్పే చేసింది. గత రెండు సీజన్లుగా చెత్త ప్రదర్శనతో చతికిలబడిన ఈ జట్టు వచ్చే సీజన్‌కు ముందు పతాక శీర్షికలకెక్కే నిర్ణయం తీసుకుంది. అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను అనూహ్యంగా బదిలీ చేసేసింది. సీఎస్‌కే దిగ్గజ కెప్టెన్ ధోని స్వయంగా 'సర్ రవీంద్ర జడేజా' అంటూ నెత్తిన పెట్టుకున్న సహచరుణ్ని... టాపార్డర్ డాషింగ్ బ్యాటర్ సంజూ సామ్సన్ కోసం రాజస్తాన్ రాయల్స్‌కు ట్రేడ్ ట్రాన్స్‌ఫర్ చేసింది. రాయల్స్ జడేజాను తీసుకోగా, సామ్సన్ చెన్నై చెంత చేరాడు. మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) తమ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్‌ను విడుదల చేసింది. రెండుసార్లు రిటెయిన్ చేసుకున్న ఫ్రాంచైజీ ఎట్టకేలకు కరీబియన్ ఆల్‌రౌండర్‌తో 11 ఏళ్ల బంధాన్ని తెంచుకుంది. రూ.23.75 కోట్లు వేలంలో పాడి మరీ కొనుక్కొన్న వెంకటేశ్ అయ్యర్‌ను వెంటనే ఒక సీజన్‌కే సాగనంపింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) వెటరన్ సీమర్ మొహమ్మద్ షమీని లక్నో సూపర్ జెయింట్స్ ట్రేడ్‌లో తీసుకుంది. మొత్తం పది ఫ్రాంచైజీల్లో అత్యధిక పర్స్ మొత్తం కోల్‌కతా వద్దే ఉంది. కేకేఆర్ పర్స్‌లో రూ. 64.30 కోట్లుండగా, 6 విదేశీ ఆటగాళ్లు సహా 13 మందిని వేలంలో కొనాలి. అత్యల్ప పర్స్ ముంబై జట్టులో ఉంది. ముంబై ఇండియన్స్ వద్ద కనీసం మూడు కోట్లయినా లేవు. చేతిలో ఉన్న రూ.2.75 కోట్లతో ఒక విదేశీ ప్లేయర్ సహా ఐదు మందిని కొనుగోలు చేయాలి.

చెప్పకోదగ్గ మార్పులు

చెన్నై ఒక్క జడేజాతో సరిపెట్టలేదు. విదేశీ స్టార్లు డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, స్యామ్ కరన్‌లాంటి హిట్టర్‌లతో పాటు 'యార్కర్ స్పెషలిస్ట్' పతిరణను వదులుకుంది. కేకేఆర్ రసెల్, అయ్యర్, డికాక్, మొయిన్ అలీలాంటి బ్యాటర్లతో పాటు సఫారీ పేసర్ నోర్జెని సాగనంపింది. పంజాబ్ కింగ్స్ మేటి విదేశీ హిట్టర్లను విడుదల చేసింది. మ్యాక్స్‌వెల్, ఇన్‌గ్లిస్‌లను వదిలేసుకుంది. తొలి సీజన్ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ తమ తురుపుముక్క, నాలుగు సీజన్లు జట్టును నడిపించిన సంజూ సామ్సన్‌నే కాదు హసరంగ, తీక్షణ, నితీశ్ రాణాలను వద్దనుకుంది. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్‌ను వేలంలో ఏ జట్టు కన్నెత్తి చూడకపోయినా ప్రాథమిక ధరకే కొనుగోలు చేసిన ముంబై ఇండియన్స్ ఈసారి అర్జున్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ట్రేడింగ్‌లో కొనేందుకు సమ్మతించింది.

పాత గూటికి...

సీఎస్‌కేతో జడేజా బంధం సుదీర్ఘమైందే కానీ... మొదలైంది మాత్రం రాజస్తాన్ రాయల్స్ తోనే! లీగ్ మొదలైన ఏడాదే (2008) తొలి చాంపియన్‌గా నిలిచిన రాయల్స్ జట్టు సభ్యుడు జడేజా ఆ మరుసటి ఏడాది కూడా రాజస్తాన్‌తోనే ఉన్నాడు. కానీ కాంట్రాక్టు ఒప్పందం ఉల్లంఘన కారణంతో 2010లో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అతనిపై ఏడాది నిషేధం విధించింది. 2011లో కొత్తగా వచ్చిన ఫ్రాంచైజీ కొచ్చి టస్కర్స్ కేరళ (ఇప్పుడు లేదు)కు ఆడాడు. 2012 నుంచి ఈ సీజన్ వరకు మధ్యలో రెండేళ్లు (2016, 2017లో సీఎస్‌కేపై నిషేధం కారణంగా గుజరాత్ లయన్స్) తప్ప సూపర్‌కింగ్స్‌లో విజయవంతమైన ఆల్‌రౌండర్‌గా ఉన్నాడు.

ఎవరికెన్ని ఖాళీలు... మిగిలిన మొత్తమెంత!

జట్టు	మిగిలిన మొత్తం	మొత్తం ఖాళీలు	విదేశీ ఆటగాళ్లు
కోల్‌కతా నైట్‌రైడర్స్	రూ. 64 కోట్ల 30 లక్షలు	13	6
చెన్నై సూపర్ కింగ్స్	రూ. 43 కోట్ల 40 లక్షలు	9	4
సన్‌రైజర్స్ హైదరాబాద్	రూ. 25 కోట్ల 50 లక్షలు	10	2
లక్నో సూపర్ జెయింట్స్	రూ. 22 కోట్ల 95 లక్షలు	6	4
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	రూ. 16 కోట్ల 40 లక్షలు	8	2
ఢిల్లీ క్యాపిటల్స్	రూ. 21 కోట్ల 80 లక్షలు	8	5
రాజస్తాన్ రాయల్స్	రూ. 16 కోట్ల 5 లక్షలు	9	1
గుజరాత్ టైటాన్స్	రూ. 12 కోట్ల 90 లక్షలు	5	4
పంజాబ్ కింగ్స్	రూ. 11 కోట్ల 50 లక్షలు	4	2
ముంబై ఇండియన్స్	రూ. 2 కోట్ల 75 లక్షలు	5	1

ఫైనల్లో సినెర్

ట్యూరిన్: పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సినెర్ 7–5, 6–2తో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. డిమినార్‌పై సినెర్‌కిది వరుసగా 13వ విజయం కావడం విశేషం. 1 గంట 52 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సినెర్ ఏడు ఏస్‌లు సంధించాడు. తొలి సర్వీస్‌లో 44 పాయింట్లకుగాను 37 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 15 పాయింట్లకుగాను ఏడు పాయింట్లు సాధించాడు. నాలుగుసార్లు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్న సినెర్... ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

ధ్రువ్‌కు ఐఎం హోదా

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తూ తెలంగాణకు చెందిన యువ చెస్ ప్లేయర్ ధ్రువ్ తోట ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) టైటిల్‌ను సాధించాడు. తెలంగాణ నుంచి ఈ ఘనత సాధించిన 13వ ప్లేయర్‌గా 16 ఏళ్ల ధ్రువ్ తోట గుర్తింపు పొందాడు. సెర్బియాలో ఇటీవల జరిగిన రుడార్ ఐఎం నార్మ్ రౌండ్ రాబిన్ టోర్నీలో ధ్రువ్ 7.5 పాయింట్లతో విజేతగా నిలిచాడు. అంతేకాకుండా నాలుగో ఐఎం నార్మ్‌ను కైవసం చేసుకున్నాడు. అంతకుముందు అక్టోబర్‌లో ఫ్రాన్స్‌లో జరిగిన అనెమాసి ఓపెన్ టోర్నీలో ధ్రువ్ ఐఎం మూడో నార్మ్‌ను సాధించాడు. 2023లో హంగేరిలో జరిగిన టోర్నీలో తొలి ఐఎం నార్మ్ దక్కించుకున్న ధ్రువ్... అదే ఏడాది స్పెయిన్‌లో జరిగిన సన్‌వేస్ సిట్‌గెస్ అంతర్జాతీయ టోర్నీలో రెండో ఐఎం నార్మ్ సంపాదించాడు. వివిధ వయో విభాగాల్లో తెలంగాణ రాష్ట్ర చాంపియన్‌గా నిలిచిన ధ్రువ్ ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. భవిష్యత్‌లో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా సంపాదించాలన్నదే తన లక్ష్యమని... అయితే జీఎం హోదా రావాలంటే క్రమం తప్పకుండా అంతర్జాతీయ టోర్నీల్లో ఆడాల్సి ఉంటుంది. తన కెరీర్ లక్ష్యాన్ని అందుకునే క్రమంలో ప్రభుత్వం నుంచి, కార్పొరేట్ కంపెనీల నుంచి ఆర్థిక సహాయం కావాలని ధ్రువ్ అభ్యర్థిస్తున్నాడు.

తడబడిన భారత షూటర్లు

కైరో: ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత షూటర్లు తడబడ్డారు. పురుషుల, మహిళల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లలో ఒక్కరు కూడా ఫైనల్ చేరలేకపోయారు. పురుషుల విభాగంలో గుర్‌ప్రీత్ సింగ్ 571 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచి త్రుటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయాడు. భారత్‌కే చెందిన ఉదయ్‌వీర్ సిద్ధూ 561 పాయింట్లతో 23వ స్థానంలో, రాజ్‌కన్వర్ సింగ్ సంధూ 559 పాయింట్లతో 24వ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో పరీషా గుప్తా 556 పాయింట్లతో పదో స్థానంలో నిలువగా.. శిఖా చౌదరీ 555 పాయింట్లతో 12వ స్థానాన్ని, ఆగమ్ గ్రెవాల్ 547 పాయింట్లతో 10వ స్థానాన్ని దక్కించుకున్నారు.

రియాన్ విలియమ్స్

భారత ఫుట్‌బాల్ జట్టులో ఆస్ట్రేలియా ప్లేయర్

న్యూఢిల్లీ: ఆసియా కప్–2027 టోర్నీ క్వాలిఫయర్స్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఆస్ట్రేలియాకు చెందిన ఫార్వర్డ్ రియాన్ విలియమ్స్‌కు భారత జట్టులో చోటు కల్పించారు. ఆస్ట్రేలియాలో పుట్టి పెరిగిన 32 ఏళ్ల రియాన్ విలియమ్స్ ఇటీవల భారత పాస్‌పోర్టును పొందాడు. అయితే బంగ్లాదేశ్‌తో ఈనెల 18న ఢాకాలో జరిగే మ్యాచ్‌లో రియాన్ విలియమ్స్ బరిలోకి దిగేది అనుమానమే. ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ సమాఖ్య, అంతర్జాతీయ, ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్యల నుంచి నిరభ్యంతర పత్రం లభిస్తేనే రియాన్ విలియమ్స్ భారత తుది జట్టుకు ఆడతాడు. రియాన్ విలియమ్స్ ఆస్ట్రేలియా సీనియర్ జట్టుకు ఒక మ్యాచ్‌లో ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్‌లో అతను బెంగళూరు క్లబ్‌కు ఆడతున్నాడు.

సాయికార్తీక్ రెడ్డికి ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) కౌలాలంపూర్ ఎం–15 ఓపెన్ పురుషుల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డి డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో శనివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో సాయికార్తీక్ రెడ్డి (భారత్)–థాన్‌టుబ్ సుక్‌సుమ్‌రాన్ (థాయ్‌లాండ్) జోడీ 7–6 (8/6), 4–6, 12–10తో 'సూపర్ టైబ్రేక్'లో కార్బన్ క్రౌతెర్ (న్యూజిలాండ్)–ఫాన్స్ వాన్ సామ్‌బీక్ (నెదర్లాండ్స్) జంటపై విజయం సాధించింది. ఈ సీజన్‌లో 25 ఏళ్ల సాయికార్తీక్ రెడ్డికిది రెండో ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్. ఓవరాల్‌గా సాయికార్తీక్ రెడ్డి కెరీర్‌లో తొమ్మిది ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్స్ సాధించాడు. సాయికార్తీక్ 2022లో రెండు టైటిల్స్... 2023లో నాలుగు టైటిల్స్.. 2024లో ఒక టైటిల్ గెల్చుకున్నాడు.

క్రొయేషియా ఏడోసారి...

- ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు అర్హత పొందిన మాజీ రన్నరప్ జట్టు
- యూరోపియన్ క్వాలిఫయర్స్‌లో గ్రూప్ 'ఎల్' విజేత హోదాలో ముందంజ

రిజెకా: పూర్తి ఆధిపత్యం చలాయిస్తూ ఆరో విజయం సాధించిన క్రొయేషియా జట్టు... వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత పొందింది. యూరోపియన్ క్వాలిఫయింగ్‌లో భాగంగా గ్రూప్ 'ఎల్'లో ఫారో ఐలాండ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో క్రొయేషియా 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. క్రొయేషియా తరఫున గ్వార్డియోల్ (23వ నిమిషంలో), మూసా (57వ నిమిషంలో), వ్లాసిక్ (70వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... ఫారో ఐలాండ్స్ జట్టుకు టూరి (16వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఐదు జట్లున్న గ్రూప్ 'ఎల్'లో ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న క్రొయేషియా ఆరు విజయాలు నమోదు చేసి, ఒక మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. 19 పాయింట్లతో గ్రూప్ విజేతగా అవతరించింది. 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న చెక్ రిపబ్లిక్ జట్టు ప్లే ఆఫ్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. 1998లో తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడిన క్రొయేషియా మూడో స్థానం సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత 2002, 2006 ప్రపంచకప్‌లలో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టింది. 2010 ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందడంలో విఫలమైన క్రొయేషియా 2014లో గ్రూప్ దశలో నిష్క్రమించింది. 2018 ప్రపంచకప్‌లో తొలిసారి ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచిన క్రొయేషియా, 2022 ప్రపంచకప్‌లో మూడో స్థానాన్ని సంపాదించింది.

ఇప్పటికి 30 జట్లు...

అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు ఉమ్మడిగా నిర్వహించే 2026 ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి 48 దేశాలు పోటీపడతాయి. ఆతిథ్య దేశాల హోదాలో అమెరికా, మెక్సికో, కెనడా జట్లు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఆడకుండానే నేరుగా అర్హత పొందాయి. ఇప్పటి వరకు మొత్తం 30 జట్లు ప్రపంచకప్ టోర్నీ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. ఆఫ్రికా నుంచి అల్జీరియా, కెపె వెర్డె, ఈజిప్ట్, ఘనా, ఐవరీ కోస్ట్, మొరాకో సెనెగల్, దక్షిణాఫ్రికా, ట్యూనిషియా... ఆసియా నుంచి ఆస్ట్రేలియా, ఇరాన్, జపాన్, జోర్డాన్, ఖతర్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్... యూరోప్ నుంచి ఇంగ్లండ్, ఫ్రాన్స్, క్రొయేషియా... ఓసియానియా నుంచి న్యూజిలాండ్... దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా, బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, పరాగ్వే, ఉరుగ్వే దేశాలు అర్హత సాధించాయి.

టెహ్రాన్‌లో ప్రదర్శనకు ఉంచిన ఇరాన్ తయారీ క్షిపణి వార్ హెడ్‌పై కూర్చున్న ఓ చిన్నారి

బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరుగుతున్న ఐరాస వాతావరణ సమిట్ కాప్ 30 సందర్భంగా పికాచూ కాస్ట్యూమ్‌తో ఓ ఉద్యమకారుడి నిరసన

అర్జెంటీనాలోని ఎజీజా పారిశ్రామిక పార్కులో శనివారం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంతో చెలరేగిన మంటలు, దట్టంగా అలుముకున్న పొగలు

13 ఒక పరీక్ష.. గంటలు

ప్రతి నవంబర్‌లో.. దక్షిణ కొరియా నేలంతా ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంటుంది. ఆ రోజు దేశం ఊపిరి బిగబట్టి నిల్చుంటుంది. కారణం.. ఆ రోజు పిల్లల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత ప్రతిష్ఠాత్మక కాలేజ్ ప్రవేశ పరీక్ష 'సునుంగ్' జరుగుతుంది. ఆ రోజు ఆకాశంలో విమానాలు ఆలస్యమవుతాయి, వీధుల్లో వాహనాల శబ్దం తగ్గుతుంది. దుకాణాలు సైతం మూతపడతాయి. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించే ఈ మహాపరీక్ష కోసం సిద్ధమవుతారు. ఈ పరీక్షలో విజయం యూనివర్సిటీ ప్రవేశాన్ని మాత్రమే కాదు.. విద్యార్థుల ఉద్యోగం, ఆదాయం, నివాసం, వివాహ బంధాన్ని సైతం ప్రభావితం చేస్తుంది.

సాధారణంగా విద్యార్థులందరికీ ఇది ఉదయం 8.40 గంటలకు మొదలై సాయంత్రం 5.40 గంటలకు ముగిసే 8 గంటల మారథాన్. పరీక్ష ముగిశాక విద్యార్థులంతా అలసటతో స్కూలు గేటు దాటి బయటికి వస్తారు. అక్కడ తమ కోసం నిరీక్షిస్తున్న తల్లిదండ్రుల ఆనందభాష్పాల ఆలింగనంతో కష్టాన్ని మరిచిపోతారు. కానీ కొందరు విద్యార్థులకు కన్నీరు కార్చేందుకు కూడా సమయం దొరకదు. చీకట్లో ఆశల వెలుగును వెతుక్కుంటారు. పరీక్ష కేంద్రం గదిలోనే మిగిలిపోతారు. రాత్రి 10 గంటల వరకు కూడా వారి పోరాటం కొనసాగుతుంది. వారంతా తీవ్ర దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులు. ఆ క్షణమే వారి అసలు కన్నీటి కథకు అంకురార్పణ!

సుదీర్ఘ పోరాటమే..

సాధారణ విద్యార్థులకంటే 1.7 రెట్లు ఎక్కువ సమయం.. వారికి కేటాయించినా, ఈ సునుంగ్ పరీక్ష దాదాపు 13 గంటల సుదీర్ఘ పోరాటమే. అదనపు విదేశీ భాషా విభాగాన్ని తీసుకుంటే.. ఈ పరీక్ష రాత్రి 9.48 గంటల వరకు సాగుతుంది. సునుంగ్ మధ్యాహ్న భోజన విరామం మాత్రమే ఉంటుంది. రాత్రి భోజనానికి విరామం లేదు. పరీక్ష నిరాటంకంగా కొనసాగుతుంది. 13 గంటలు.. అంటే ఒక రోజులో దాదాపు సగం సమయం కేవలం పరీక్ష కోసం కేటాయించాలి.

నొప్పిని భరిస్తూ.. చేతులే కళ్లుగా

దీనికి కారణం బ్రెయిలీ పరీక్ష పత్రాల బరువు. ప్రతి ఒక్క వాక్యం, చిహ్నం, పటం బ్రెయిలీలోకి మారినప్పుడు,



ఒక్కొక్క ప్రశ్నపత్రం సాధారణ ప్రశ్నపత్రం కంటే 6 నుంచి 9 రెట్లు మందంగా మారుతుంది. సియోల్ హన్బిట్ స్కూల్ ఫర్ ద బ్లైండ్ విద్యార్థి అయిన 18 ఏళ్ల హాన్ డోంగ్‌హ్యున్ ఈ ఏడాది సుదీర్ఘ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల్లో ఒకడు. పుట్టుకతోనే పూర్తిగా చూపుకోల్పోయిన డోంగ్‌హ్యున్ కాంతిని కూడా గుర్తించలేడు. 'సుదీర్ఘ పరీక్ష కఠినంగా ఉంటుంది. శరీరాన్ని నిజంగా అలసిపోతాను. తప్పించుకునేందుకు ప్రత్యేక చిట్కాలేమీ నాకు తెలియవు. నా స్టడీ షెడ్యూల్‌ను అనుసరిస్తాను. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాను. అదే ఏకైక మార్గం'.. అన్నాడు డోంగ్‌హ్యున్.

సెల్యూట్ చేయకుండా ఉండలేం

అంధ విద్యార్థులకు సునుంగ్ అనేది కేవలం కాలేజీ ప్రవేశ పరీక్ష మాత్రమే కాదు.. బతుకు ప్రయాణంలో ఎన్నో ఏళ్ల సహనానికి.. పట్టుదలకు నిదర్శనం! 'బ్రెయిలీ చదవడం అంటే వేలికొనతో ఉబ్బెత్తు చుక్కలను తాకడం. నిరంతర ఘర్షణ వల్ల వారి చేతులు చాలా నొప్పి పెడతాయి. కానీ వారు దానిని గంటల తరబడి చేస్తారు. అంధ విద్యార్థులు అనుభవించే శారీరక, మానసిక శ్రమకు సెల్యూట్ చేయకుండా ఉండలేం'.. అని విద్యార్థుల గురువైన కాంగ్ సియోక్-జు కొనియాడారు. 'సునుంగ్ కాలేజ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ డే ఇన్ సౌత్ కొరియా'.. అనే వీడియో, దక్షిణ కొరియాలో సునుంగ్ పరీక్ష రోజు దేశం యావత్తు ఎలా నిలిచిపోతుందో.. ఈ పరీక్ష ప్రాధాన్యం, ఒత్తిడిని వివరిస్తుంది. నవంబర్ 13న దక్షిణ కొరియా దేశవ్యాప్తంగా 1310 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 5,54,174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను డిసెంబర్ 5న వెల్లడిస్తారు.

ఆత్మ విశ్వాసమే ఆలంబన

సుమారు 16 పేజీలుండే కొరియన్ భాషా విభాగానికి సంబంధించిన బ్రెయిలీ పుస్తకం దాదాపు 100 పేజీలు ఉంటుంది. డోంగ్‌హ్యున్ ఈ వేళ్లతో బ్రెయిలీని చదువుతున్నంత వేగంగానే, జ్ఞాపకశక్తితో వివరాలను నిక్షిప్తం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'మధ్యాహ్న భోజనం వరకు సర్దుబాటు చేసుకోవచ్చు. కానీ సాయంత్రం 4 లేదా 5 గంటల సమయంలో, [illegible] అప్పుడు నిజంగా చాలా కష్టంగా ఉంటుంది. మాకు రాత్రి భోజన విరామం లేదు. భోజనం చేయాల్సిన సమయంలో పరీక్షకు [illegible]'.. అన్నాడు 18 ఏళ్ల జియాంగ్-వోన్. అయినా, 'చివరికి ఒక గొప్ప విజయం ఉంటుందనే భావనే నన్ను ముందుకు నడిపిస్తుంది'.. అని గొప్ప ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశాడు.

ఆలస్యంగా మెటీరియల్

అంధ విద్యార్థులకు పరీక్ష వ్యవధి, సుదీర్ఘ అధ్యయన గంటలు కష్టం అనిపించదు. వారంతా దున్న అతిపెద్ద సవాలు ఏమిటంటే.. అధ్యయన సామగ్రిని పొందడం! సాధారణ విద్యార్థులు ఆధారపడే ప్రముఖ పాఠ్యపుస్తకాలు, ఆన్‌లైన్ ఉపన్యాసాలు వీరికి అందుబాటులో ఉండవు. బ్రెయిలీ వెర్షన్లు చాలా తక్కువ. జాతీయ పరీక్షకు సంబంధించిన ఈబీఎస్ (ఎడ్యుకేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ సిస్టమ్) తయారీ పుస్తకాలు వీరికి [illegible]. 'సాధారణ విద్యార్థులు తమ ఈబీఎస్ పుస్తకాలను జనవరి-మార్చి మధ్య తీసుకుని ఏడాది పొడవునా చదువుతుంటారు. మాకు బ్రెయిలీ ఫైల్స్ పరీక్షకు కొన్ని నెలల ముందు ఆగస్టు లేదా సెప్టెంబర్ నెల్లో మాత్రమే అందుతాయి'.. అని జియాంగ్-వోన్ వాపోయాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్

నితీశ్ కుమార్‌తో చిరాగ్ పాశ్వాన్

బిహార్ నూతన ప్రభుత్వంలో చేరుతాం

- సీఎంగా నితీశ్ కొనసాగాలని కోరుకుంటున్నా
- సీఎం నితీశ్‌తో భేటీ అనంతరం చిరాగ్ పాశ్వాన్

పట్నా: బిహార్‌లో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వంలో తామూ చేరాలనుకుంటున్నట్లు లోక్ జనశక్తి పార్టీ(రాం విలాస్) చీఫ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ కొనసాగాలని తాను కోరుకుంటున్నట్లు వెల్లడించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీ చేసిన 28 సీట్లలో 19 చోట్ల విజయం సాధించింది. శనివారం చిరాగ్ పట్నాలో తన పార్టీ నూతన ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తామంతా సీఎం నితీశ్‌ను కలిసి ఘన విజయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలిపామన్నారు. అదేవిధంగా, నూతన ప్రభుత్వంలో తాము కూడా చేరుతామని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎంలు ఎవరనేది శాసనసభ్యులే నిర్ణయిస్తారన్నారు. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ కొనసాగాలని వ్యక్తిగతంగా భావిస్తున్నానన్నారు. నితీశ్ సారథ్యంలోని జేడీయూకు బీజేపీ కంటే నాలుగు తక్కువగా 85 సీట్లు దక్కాయి. 2020 ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమి పక్షమైన బీజేపీ కంటే తక్కువ సీట్లే లభించాయి. నితీశ్ తనకు విభేదాలున్నట్లు ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శాసనసభలో ఒక్క సీటు కూడా తమకు లేకున్నా 29 స్థానాలను కేటాయించిన తమ కూటమి కేంద్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆధార్ పౌరసత్వ రుజువు కాదు!

ఫారం-6 వివాదంపై ఎన్నికల కమిషన్
- ఒకరికి ఒకే ఓటు.. చట్ట సవరణ ఉద్దేశమిదే
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఓటరు జాబితాలో పేరు నమోదు ప్రక్రియలో ఆధార్ వినియోగంపై తలెత్తిన సందిగ్ధానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తెరదించింది. ఆధార్‌ను పౌరసత్వానికి రుజువుగా ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణించడం లేదని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఆధార్ చట్టం, కోర్టు తీర్పుల మేరకే నడుచుకుంటున్నామని, అది కేవలం గుర్తింపు ధ్రువీకరణ పత్రం మాత్రమేనని పేర్కొంది. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించిన ఫారం-6లో పుట్టిన తేదీకి రుజువుగా ఆధార్ కార్డును ఉపయోగించడాన్ని నిరోధించాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ వేసిన పిటిషన్‌కు ఈసీ ఈ మేరకు తన స్పందనను తెలిపింది.

ఈసీ అఫిడవిట్‌లో ముఖ్యాంశాలు

కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి సంతోష్ కుమార్ దూబే దాఖలు చేసిన ఈ అఫిడవిట్‌లో పలు కీలక చట్టపరమైన అంశాలున్నాయి. ఎన్నికల (సవరణ) చట్టం– 2021 ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టం– 1950లోని సెక్షన్ 23కు సవరణలు చేశామని ఈసీ గుర్తు చేసింది. ఈ సవరణ ముఖ్య ఉద్దేశం ఒకే వ్యక్తి వేర్వేరు ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకోవడాన్ని అరికట్టడమేనని స్పష్టం చేసింది. ఈ సవరణ ఆధారంగానే 2022 జూన్ 17 నుంచి ఫారం-6లో మార్పు లు చేసినట్లు తెలిపింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ప్రకారం, ఆధార్‌ను కేవలం గుర్తింపు రుజువుగా మాత్రమే పరిగణిస్తున్నామంది.

యూఐడీఏఐ స్పష్టత

ఆధార్ అనేది పౌరసత్వం, నివాసం లేదా పుట్టిన తేదీకి రుజువు కాదని యూఐడీఏఐ స్వయంగా 2023 ఆగస్టు 22న జారీ చేసిన కార్యాలయ మెమోరాండంలో స్పష్టం చేసిందని ఈసీ కోర్టు దృష్టికి తెచ్చింది. 2016 నాటి ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 కూడా ఆధార్ నంబర్‌ను పౌరసత్వానికి లేదా నివాసానికి రుజువుగా భావించరాదని స్పష్టంగా చెబుతోందని వివరించింది.

కోర్టు తీర్పుల ప్రస్తావన

ఆధార్‌ను పుట్టిన తేదీకి రుజువుగా పరిగణించలేమని చెబుతూ ఈసీ పలు న్యాయస్థానాల తీర్పులను కూడా ప్రస్తావించింది. అందులో 2022 బాంబే హైకోర్టు, 2024, 2025లో సుప్రీంకోర్టులో జరిగిన వేరువేరు విచారణలు ఉన్నాయి. ముఖ్యంగా సుప్రీం ఆదేశాల మేరకు, 2025 సెప్టెంబర్ 9నే అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని ఈసీ తెలిపింది. 'బిహార్ రాష్ట్ర సవరించిన ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపుల కోసం ఆధార్ చట్టం-2016లోని సెక్షన్ 9, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 23(4) ప్రకారం ఆధార్ కార్డును కేవలం గుర్తింపు రుజువుగా మాత్రమే వాడాలి, పౌరసత్వ రుజువుగా పరిగణించరాదు'అని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసినట్లు పేర్కొంది. ఫారం-6లో ఆధార్ వినియోగాన్ని పుట్టిన తేదీ రుజువుగా నిరోధించాలన్న పిటిషనర్ అభ్యర్థనపై ఈసీ స్పందిస్తూ... ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనలు ఆధార్ వినియోగాన్ని కేవలం గుర్తింపు ప్రయోజనాలకే పరిమితం చేశాయని, తమ సూచనలు కూడా ఈ చట్టాలకు పూర్తిగా అనుగుణంగానే ఉన్నాయని తేల్చి చెప్పింది. కాగా, గత వారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెల్సింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ఆధార్‌ను గుర్తింపు రుజువుగా అనుమతించినంత కాలం, ఫారం-6లో దాని వినియోగాన్ని పూర్తిగా నిరోధించలేమని, యూఐడీఏఐ జారీ చేసిన నోటిఫికేషన్ చట్టబద్ధమైన నిబంధనను అధిగమించలేదని కోర్టు అభిప్రాయపడినట్లు సమాచారం.

జంగిల్‌రాజ్ భయంతో మా ఓటర్లు ఎన్డీయేకి ఓటేశారు: ప్రశాంత్ కిశోర్

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన మాజీ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ఎన్డీయే గెలుపుపై తనదైన విశ్లేషణ చేశారు. ఆర్జేడీ సారథ్యంలోని మహాగఠ్ బంధన్ అధికారంలోకి వచ్చిన పక్షంలో జంగిల్ రాజ్ మళ్లీ వస్తుందనే భయంతో తమ పార్టీ ఓటర్లు కొందరు ఎన్డీయే పక్షాల అభ్యర్థులకు ఓటు వేశారని వివరించారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనతో సీమాంచల్ ప్రాంతంలోని ఓట్లన్నీ ఒకే పక్షానికి గంపగుత్తగా పడ్డాయని ఆ పార్టీ నేత ఉదయ్ సింగ్ చెప్పారు. వీరిద్దరూ శనివారం పట్నాలో మీడియాతో మాట్లాడారు. జంగిల్ రాజ్ ఉందని తాను చెప్పలేనన్న ప్రశాంత్ కిశోర్..తమ పార్టీ ఓటర్లు మాత్రం ఆ భయం వల్లే ఎన్డీయేకు ఓటేశారన్నారు. కాంగ్రెస్‌తోగానీ, మహాగఠ్ బంధన్‌లోని ఏ ఇతర పార్టీతోనూ లేని ఇబ్బంది ఆర్జేడీతో ఉన్నట్లుగా ప్రజలు భావించారని తెలిపారు. ముస్లిం వర్గం తమను ఇంకా పూర్తిగా నమ్మలేదంటూ ఆయన..దీర్ఘకాలంలో వారి మద్దతుల భిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.40 వేల కోట్లను ఎన్డీయే ప్రభుత్వం వెదజల్లిందన్నారు. ప్రపంచబ్యాంకు నుంచి రుణంగా తెచ్చిన రూ.14 వేల కోట్లను సైతం ఉచితాల మళ్లించారని ఆరోపించారు.

'ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్'ను తిరస్కరించారు

బిహార్ ప్రజలు బుద్ధి చెప్పారు
- కుల రాజకీయాలను తిప్పికొట్టారు
- దేశానికి ఇది శుభసూచకం
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



సూరత్: ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్ గా మారిన కాంగ్రెస్ పార్టీని బిహార్ ప్రజలు పూర్తిగా తిరస్కరించారని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. కులవాదం అనే విషాన్ని చిమ్మిన ప్రతిపక్షానికి కర్రుకాల్చి వాత పెట్టారని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శనివారం బిహారీలు నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. బిహార్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్డీయే విజయం సాధించినందుకు బిహారీలు మోదీని ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ) చర్యలను చూసి ఆ పార్టీలోని సీనియర్ నాయకులు బాధపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు దశాబ్దకాలంగా ఎన్నికల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ నాయకత్వానికి సూచించారు. కాంగ్రెస్‌ను కాపాడుకోవడం ఇక కష్టమేనని పార్టీ నాయకులే అంటున్నారని గుర్తుచేశారు. దాదాపు 60 ఏళ్లు దేశాన్ని పాలించిన పార్టీకి ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని చెప్పారు.

అక్రమాలను అడ్డుకోవడానికే వక్ఫ్ చట్టం

బిహార్‌లో ఎన్డీయే ఘన విజయానికి ఎం.వై.(మహిళలు, యువత) అంశమే కారణమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. నేరాలు చేసి, జైలుకు వెళ్లి బయటకు వచ్చిన కొందరు నేతలు కుల రాజకీయాలతో ఎన్నికల్లో నెగ్గాలని ఆరాటపడ్డారని విమర్శించారు. వారి ఆటలు సాగలేదని, జనం వారి కుట్రలను తిప్పికొట్టారని ప్రశంసించారు. దేశానికి ఇదొక శుభసూచకమని పేర్కొన్నారు. బిహార్‌లో అన్ని వర్గాల ప్రజలూ ఎన్డీయేకు అండగా నిలిచారని తెలిపారు. అధికార, విపక్ష కూటముల మధ్య 10 శాతం ఓట్ల తేడా ఉందన్నారు. బిహార్‌లో 38 నియోజకవర్గాల్లో దళితుల ప్రాబల్యం అధికంగా ఉండగా, అందులో 34 స్థానాలు ఎన్డీయే గెల్చుకుందని వివరించారు. దళితులు విపక్షాన్ని తిరస్కరించారని చెప్పారు. బిహార్‌లో భూములను, ఇళ్లను చట్టవిరుద్ధంగా ఆక్రమించి అవి వక్ఫ్ ఆస్తులు అంటున్నారని ప్రధానమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. తమిళనాడులో వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన గ్రామాలు వక్ఫ్ ఆస్తులు ఎలా అవుతాయో చెప్పాలని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికే వక్ఫ్ చట్టం తీసుకొచ్చామని వివరించారు. అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని అమలు కానివ్వబోమని ప్రతిపక్షాలు ప్రకటించాయని, అయినా బిహార్ ఓటర్లు పట్టించుకోలేదని అన్నారు. బిహార్‌లో ఓటమికి కారణాలు చెప్పలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలపై, ఎన్నికల సంఘంపై నిందలు వేస్తోందని ధ్వజమెత్తారు. ఇలాంటి నిందలతో ఎక్కువ రోజులు కార్యకర్తలను మభ్యపెట్టలేరని హితవు పలికారు.

పర్యాటకురాలిగా వెళ్లి.. అక్కడే పెళ్లాడి..

- పాక్‌లో అదృశ్యమైన భారతీయ మహిళ
- మతం, పేరు మార్చుకుని పాకిస్తానీతో పెళ్లి

లాహోర్/చండీగఢ్: పాకిస్తాన్‌లో గురునానక్ జయంతి వేడుకల్లో పాల్గొనే వంకతో వాఘా సరిహద్దు గుండా దయాదిదేశంలో అడుగుపెట్టిన 48 ఏళ్ల భారతీయురాలు మరుసటి రోజే కనిపించకుండాపోయారు. పాకిస్తానీ పోలీసుల దర్యాప్తుతో ఆమె స్థానిక పాకిస్తానీయుడిని పెళ్లాడినట్లు వెల్లడైంది. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం అయిన పాక్ జాతీయుడిని పేరు, మతం మార్చుకుని వివాహంచేసుకుని అతడితో కలిసి ఎటో వెళ్లిపోయినట్లు లాహోర్‌లోని పాక్ పోలీసులు శనివారం తెలిపారు. ఆమె జాడ కోసం తాము కూడా వెతుకుతున్నామని చెప్పారు. పంజాబ్‌లోని కపుర్తలా జిల్లా అమేనీపూర్ గ్రామానికి చెందిన సరబ్‌జీత్ కౌర్ నవంబర్ మూడో తేదీన 2,000 మంది సిక్కు పర్యాటకులతో కలిసి పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు వెళ్లారు. తర్వాతి రోజే ఫరూఖాబాద్ పరిధిలోని షేఖూపురాకు చెందిన నసీర్ హుస్సేన్‌ను ఆమె పెళ్లాడారు. కౌర్ పేరును నూర్‌గా మార్చుకున్నారు. కౌర్‌కు ఇప్పటికే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త కొన్నేళ్లుగా విదేశాల్లో ఉంటున్నారు.

క్షమాపణ చెప్పినా బీబీసీని వదలని ట్రంప్

లండన్: గతేడాది బీబీసీలో ప్రసారమైన డాక్యుమెంటరీలో ట్రంప్ ప్రసంగాన్ని ఎడిట్ చేయడంతో తలెత్తిన వివాదం సమసిపోయేలా కనిపించడం లేదు. ఈ వ్యవహారంపై బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ హెడ్ డెబోరా టర్నెస్ రాజీనామా చేశారు. బీబీసీ చైర్మన్ సమీర్ షా కూడా చెప్పారు. అయినప్పటికీ చట్టపరమైన చర్యల కోసం కోర్టు కెక్కనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. కనీసం కోటి నుంచి 5 కోట్ల డాలర్ల వరకు తాము పరిహారం కోరే అవకాశముందని ఆయన తెలిపారు. 'మోసానికి పాల్పడినట్టు బీబీసీయే ఒప్పుకుంది. కానీ, క్షమాపణలను చెప్పాల్సిన విధంగా చెప్పలేదు. వాళ్లు మోసం చేశారు. నేను చెప్పిన మాటలను చెప్పనట్లుగా డాక్యుమెంటరీలో ప్రసారం చేశార'ని ట్రంప్ ఆరోపించారు. 2021 జనవరి 6వ తేదీన ట్రంప్ చేసిన ప్రసంగాన్ని ఎడిట్ చేయడంలో పొరపాటు జరిగిందని, తామలా ఉద్దేశపూర్వకంగా చేయలేదని గురువారం బీబీసీ వివరణ ఇచ్చుకుంది. అయితే, పరిహారం చెల్లించేది లేదని తెలపడంపై ట్రంప్ గుర్రుగా ఉన్నారు. తాము మరోసారి ఇలాంటి తప్పిదం చేయమంటూ బీబీసీ ఇచ్చిన వివరణను సైతం ఆయన తప్పుబట్టారు. 'మీరు చేయకపోవచ్చు, ఇతరులు చేస్తే మాత్రం ఆపరు..ఇదే కదా మీ ఉద్దేశం'అంటూ బీబీసీపై కారాలు మిరియాలు నూరారు. దావా వేయాలని తాము అనుకోవడం లేదన్న ఆయన, అలా చేయక తప్పడం లేదని వ్యాఖ్యానించారు.

పాక్‌లో బడిబయట 2.5 కోట్ల బాలలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ వ్యాప్తంగా కనీసం 2.5 కోట్ల మంది బాలలు బడిబయటే ఉన్నారు. వీరిలో కనీసం 2 కోట్ల మంది బడి ముఖమే ఎరుగరు. ఏ విద్య సంస్థలోనూ పేరు నమోదు చేయించుకోని 1,084 మంది ట్రాన్స్ జెండర్ బాలలు సైతం వీరిలో ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(పీఐఈ) విడుదల చేసిన నివేదిక మీడియాలో ప్రసారమవుతోంది. అందరికీ విద్య అందుబాటులో లేదనే విషయం ఈ నివేదికతో స్పష్టమవుతోందని సామాజికవేత్తలు అంటున్నారు. స్కూలుకు వెళ్లని బాలలు అత్యధికంగా 96 లక్షల మంది పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్నారు. ఆ తర్వాత సింధ్‌లో 78 లక్షలు, ఖైబర్ ప్రావిన్స్‌లో 49 లక్షలు, బలూచిస్తాన్‌లో 29 లక్షలమంది బాలలు అక్షరజ్ఞానానికి నోచుకోవడం లేదని నివేదిక తెలిపింది. సాక్షాత్తూ దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో 6–16 ఏళ్ల మధ్యనున్న కనీసం 89 వేల మంది బాలలు బడి బయటే గడుపుతున్నట్లు పీఐఈ తెలిపింది. దేశంలో ఇటువంటి వారి సంఖ్య ఏడాదికి 20వేల చొప్పున పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది.

యూపీలో ఇద్దరు బ్రిటిషర్ల అరెస్ట్

బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్ జిల్లాలో నేపాల్ నుంచి చట్టవిరుద్ధంగా భారత్‌లోకి ప్రవేశించిన బ్రిటిష్ పాస్‌పోర్టు కలిగిన ఇద్దరు వ్యక్తులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. పాక్ సంతతికి చెందిన డాక్టర్ హస్సన్ అమ్మన్ సలీం(35), అదేవిధంగా కేరళలోని ఉడిపికి చెందిన డాక్టర్ సుమిత్రా షకీల్ ఒలివియా(61)గా వీరిని గుర్తించారు. హస్సన్ యూకేలోని మాంఛెస్టర్‌లో, సుమిత్ర యూకేలోని గ్లాసెస్టర్‌లోఉంటున్నట్లు వీరివద్ద లభించిన పత్రాల ఆధారంగా తెలిసింది. దీంతో వీరిద్దరినీ రుపైదేహా పోలీసులకు అప్పగించారు. పాస్‌పోర్టు చట్టం–1967 కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఎర్రకోట వద్ద పేలుడు ఘటన నేపథ్యంలో సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) చేపట్టిన తనిఖీల సమయంలో శనివారం ఉదయం వీరు పట్టుబడ్డారు. వీరి వద్ద భారత వీసాలు లేవు. నేపాల్‌లోని నేపాల్‌గంజ్‌లో ఉన్న ఓ ఆస్పత్రి ఆహ్వానంపై వచ్చిన వీరు భారత్‌లోకి ఎందుకు ప్రవేశించారని ప్రశ్నించగా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదని అధికారులు తెలిపారు.

బాలికపై టీచర్ అత్యాచారం.. జీవిత ఖైదు

కన్నూర్(కేరళ): పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడొకరికి కేరళ కోర్టు జీవిత ఖైదు విధించింది. తలస్సెరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి ఎంటీ జలజారాణి ఈ మేరకు శనివారం తీర్పు వెలువరించారు. కడవత్తూర్‌కు చెందిన పద్మరాజన్ అలియాస్ పప్పెన్ మాస్టర్(48) పలతాయిలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు 2020 జనవరి–ఫిబ్రవరి నెలల్లో బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. దర్యాప్తు జరిపిన పోలీసులు ఏప్రిల్‌లో అరెస్ట్ చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పద్మరాజన్‌కు జీవిత కాల జైలు శిక్షతోపాటు రూ.1.50 లక్షల జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని బాధితురాలికి చెల్లించాలని సూచించారు. సమగ్ర విచారణ జరిపి సరైన పరిహారం నిర్ణయించాల్సిందిగా జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థను ఆదేశించారు.

కాంగోలో 17 మందిని చంపిన ఐఎస్

గోమా: కాంగోలోని ఓ ఆస్పత్రిపై దాడి చేసిన ఇస్లామిక్ స్టేట్ అనుబంధ అలైడ్ డెమోక్రాటిక్ ఫోర్సెస్(ఏడీఎఫ్) రెబల్స్ 17 మందిని దారుణంగా చంపారు. నార్త్ కివు ప్రావిన్స్‌లోని బ్యామ్‌వే గ్రామంలో శుక్రవారం రాత్రి ఈదారుణం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. ఆస్పత్రి బెడ్లపై బిడ్డలకు పాలిస్తున్న తల్లులను సైతం కనికరం లేకుండా గొంతు కోసి చంపేశారన్నారు. మృతుల్లో 11 మంది మహిళలున్నారు. రువాండా సరిహద్దుల్లో ఎం23 రెబల్స్, ఉగాండా సరిహద్దుల్లో ఏడీఎఫ్ రెబల్స్ కాంగో ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పాక్‌తో లింకులు.. డ్రగ్స్ రాకెట్ బట్టబయలు

జమ్మూ: పాకిస్తాన్‌తో సంబంధాలున్న భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టును జమ్మూకశ్మీర్ పోలీసులు బట్టబయలు చేశారు. ఇద్దరు పెడ్లర్లను అదుపులోకితీసుకుని రూ.15 కోట్ల విలువైన మూడు కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శాస్త్రినగర్‌లోని ఓ శ్మశానవాటిక వద్ద వీరిని పట్టుకున్నట్లు జమ్మూ ఎస్ఎస్‌పీ జోగిందర్ సింగ్ చెప్పారు. మాదకద్రవ్యాల స్మగ్లర్లకు ఇది కోలుకోలేని దెబ్బగా పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌లోని మరో ఏడుగురిని గుర్తించామని, వాళ్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పాకిస్తాన్ నుంచి డ్రోన్ల ద్వారా పంజాబ్‌కు, అక్కడి నుంచి కొరియర్ల ద్వారా జమ్మూకు డ్రగ్స్ చేరుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే 22 మంది పెడ్లర్లను అరెస్ట్ చేశామన్నారు. పూంఛ్ జిల్లాలో డ్రగ్స్ దందాతో సంబంధాలున్న డజన్ల కొద్దీ బ్యాంకు అకౌంట్లను అధికారులు సీజ్ చేశారు.

ఆలస్యంగా వచ్చినందుకు 100 గుంజీలు

ప్రాణాలు కోల్పోయిన ఆరో తరగతి బాలిక

పాల్ఘార్: స్కూలుకు ఆలస్యంగా వచ్చిందనే కారణంతో టీచర్లు ఆరో తరగతి బాలికతో వంద గుంజీళ్లు తీయించారు. తీవ్ర అనారోగ్యానికి గురైన బాలిక వారం తర్వాత చనిపోయింది. మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ దారుణంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. వసాయ్ ప్రాంతంలోని సతివలికి చెందిన అన్షిక గౌడ్, మరో నలుగురు ఈ నెల 8న స్కూలుకు ఆలస్యంగా వెళ్లారు. ఇందుకు శిక్షగా స్కూల్ టీచర్, బ్యాగు సహా తలా 100 గుంజీలు తీయించింది. తీవ్ర అనారోగ్యానికి గురైన అన్షిక ముంబైలోని ఓ ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచింది. టీచర్ విధించిన అమానవీయ శిక్షే తన బిడ్డ ప్రాణాలు తీసిందని ఆమె తల్లి ఆరోపించింది. తీవ్రమైన మెడ, వీపు నొప్పితో ఆమె అల్లాడిందని ఆవేదన చెందింది. ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. టీచర్ విధించిన శిక్ష బాలిక ప్రాణాలు తీసిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టామని, బాధ్యులని తేలితే చర్యలు తీప్పవని బీడీవో పాండురంగ్ తెలిపారు.

నేటి నుంచి భారత్, ఫ్రాన్స్ 'గరుడ' విన్యాసాలు

న్యూఢిల్లీ: ఆకాశమార్గాన యుద్ధవ్యూహాలకు మరింత పదునుపెడుతూ భారత్, ఫ్రాన్స్ ఫైటర్‌జెట్ విమానాలు నేటి నుంచి సంయుక్తంగా గగనతల విన్యాసాలు చేయనున్నాయి. గరుడ పేరిట జరగబోయే ఈ విన్యాసాలకు ఫ్రాన్స్‌లోని మోంటే డీ మార్సన్ ప్రిఫెక్చర్‌లోని గగనతలం వేదికకానుంది. ఇరుదేశాల భిన్న గగనతల ఆయుధ వ్యవస్థలు, యుద్ధవిమానాల మధ్య మరింత సమన్వయం సాధనే లక్ష్యంగా ఈ ఎక్సర్‌సైజ్ చేయబోతున్నట్లు భారతవాయుసేన శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. గగనతలం నుంచి గగనతలంలోకి గురి, గగనతల రక్షణ, సంయుక్త దాడి వ్యూహాలను ఇరుదేశాల యుద్ధవిమానాలు ఉమ్మడిగా ప్రదర్శించనున్నాయి. ఈ విన్యాసాల్లో భారత సుఖోయ్–30ఎంకేఐతోపాటు ఫ్రెంచ్ మల్టీరోలర్ యుద్ధవిమానాలు పాల్గొననున్నాయి. ఎక్కువసేపు విమానాలు గాల్లో ఉండేందుకు గాల్లోనే ఇంధనం నింపే ఐఎల్–78 ఎయిర్–టు–ఎయిర్ రీఫ్యూయల్ ట్యాంక విమానాలు సైతం ఈ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొనబోతున్నాయి.

ఆదేశిక సూత్రాలు ఎక్కడ ఆవిర్భవించాయి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



ఆదేశిక సూత్రాలు

భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను 4వ భాగంలో చేర్చారు. వీటి గురించి ఆర్టికల్ 36 నుంచి 51 వరకు తెలియజేస్తాయి. ఇవి మధ్యయుగ కాలంలో రోమ్‌లో ఆవిర్భవించాయి. రోమ్ నుంచి స్పెయిన్ అక్కడి నుంచి ఐర్లాండ్, అక్కడి నుంచి ఇండియా, ఇండియా నుంచి చైనా గ్రహించాయి. ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలను రాజ్యాంగం ఆదేశిస్తుంది. వీటి అమలు ద్వారా సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం తోపాటు ఆర్థిక న్యాయాన్ని, ఆర్థిక సమానత్వాన్ని సాధించొచ్చు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ సిద్ధాంతాలకు అతీతంగా వీటిని అమలు చేయాలి.

ఆదేశిక సూత్రాలను రూపొందించడంలో 1928 నెహ్రూ కమిటీ రిపోర్టు, 1931 కరాచీ కాంగ్రెస్ తీర్మానం, 1945 సప్రూ కమిటీ రిపోర్టు బాగా తోడ్పడ్డాయి. అధికంగా కరాచీ తీర్మానం తోడ్పడింది. కానీ సప్రూ కమిటీ నివేదిక ఆధారంగా వీటిని చేర్చారు.

ఆదేశిక సూత్రాలు - లక్షణాలు

- ఆదేశిక సూత్రాలకు న్యాయస్థానాల ద్వారా రక్షణ లేదు. వీటిని అమలు చేయాలని ప్రభుత్వాలను న్యాయస్థానాలు ఆజ్ఞాపించే అవకాశం లేదు.
- ఇవి శ్రేయోరాజ్య స్థాపనకు తోడ్పడతాయి.
- వీటి అమలు ద్వారా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించొచ్చు.
- ఇవి ప్రభుత్వ విధులు, బాధ్యతలను తెలుపుతాయి. కాబట్టి సకారాత్మకమైనవి.
- రాజ్య కార్యకలాపాల పరిధిని విస్తృతం చేస్తాయి.

రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలకు సంబంధించిన ప్రకరణలు

ప్రకరణ-36- రాజ్య నిర్వచనం: రాజ్యం అంటే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు, వివిధ సంస్థలు.
ప్రకరణ-37-ఆదేశిక సూత్రాల అమలు: వీటిని అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అమలులో వైఫల్యం చెందితే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం లేదు. కానీ అమలు కోసం న్యాయస్థానాలు సూచనలు, సలహాలు మాత్రం ఇవ్వగలవు. వీటి అమలు.. ఆర్థిక వనరుల లభ్యత, ప్రభుత్వ అంకితభావం, సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.

ఆదేశిక సూత్రాల స్వభావాన్ని బట్టి ప్రముఖ పరిపాలనా శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎంపీ శర్మ వాటిని మూడు రకాలుగా విభజించారు. అవి..
1) సామ్యవాద 2) గాంధేయ
3) ఉదారవాద సూత్రాలు

సామ్యవాద సూత్రాలు

ఆర్టికల్ 38, 39, 41, 42, 43(ఎ).
ఆర్టికల్ 38: భారతదేశం ఒక సంక్షేమ రాజ్యం కాబట్టి ప్రజలందరికీ ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని అందించాలి.
ఆర్టికల్ 39: ప్రభుత్వ విధాన రూపకల్పనలో ఆదేశిక సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి.
39(ఎ): స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి.
39(బి): భౌతిక సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయాలి.
39(సి): సంపదను వికేంద్రీకరించాలి.
39(డి): స్త్రీ, పురుషులకు సమాన జీత భత్యాలను చెల్లించాలి.
39(ఇ): శ్రామికులకు పనికి తగిన వేతనాన్ని చెల్లించాలి. శ్రమ దోపిడీకి గురి చేయకూడదు.
39(ఎఫ్): బాలబాలికల అభివృద్ధికి కృషి చేయాలి.
స్త్రీ, పురుషుల సమానత్వానికి 1955లో హిందూ వివాహ చట్టం, 1961లో వరకట్న నిషేధ చట్టం రూపొందించారు. సంపద వికేంద్రీకరణకు 1950లో ప్రణాళికా సంఘం ఏర్పాటు, 1951లో భూ సంస్కరణల చట్టం, 1969లో బ్యాంకుల జాతీయీకరణ మొదలైనవి చేపట్టారు.
ఆర్టికల్ 41: పనిహక్కు. అందరికీ ఉపాధి కల్పించాలి. ఉపాధి లేనివారికి నిరుద్యోగ భృతి చెల్లించాలి. యువతను దుర్వ్యసనాలకు లోను కాకుండా నియంత్రించాలి. వృద్ధులకు, అనాథలకు చేయూత నివ్వాలి. వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
ఇందులో భాగంగా 2006లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు.
ఆర్టికల్ 42: కార్మికులు పనిచేసేందుకు మానవీయ పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలు కల్పించాలి.
1961లో మాతృత్వ ప్రయోజన చట్టం, 2007లో పితృత్వ ప్రయోజన చట్టాన్ని రూపొందించారు.
ఆర్టికల్ 43(ఎ): పారిశ్రామిక యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించాలి.

గాంధేయ సూత్రాలు

ఆర్టికల్ 40, 43, 43(బి), 46, 47, 48, 48(ఎ), 49.
ఆర్టికల్ 40: రామరాజ్య ఏర్పాటుకు, గ్రామ స్వరాజ్యానికి స్థానిక ప్రభుత్వాలను స్థాపించాలి. 1952 అక్టోబర్ 2న సమాజ అభివృద్ధి పథకాన్ని, 1953 అక్టోబర్ 2న జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టారు. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సు మేరకు స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. ఎల్ఎం సింఘ్వీ కమిటీ సిఫార్సు మేరకు 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా వీటికి రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు.
ఆర్టికల్ 43: గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. వీటి అభివృద్ధికి అఖిల భారత హ్యాండ్లూమ్ బోర్డు, అఖిల భారత ఖాదీ కమిషన్, అఖిల భారత సిల్క్ బోర్డ్ మొదలైనవి ఏర్పాటయ్యాయి.
ఆర్టికల్ 43(బి): సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా కల్పించాలి. దీన్ని 2011లో 97వ సవరణ ద్వారా చేర్చి, 12 జనవరి 2012న అమల్లోకి తీసుకొచ్చారు.
ఆర్టికల్ 46: బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వీరికోసం ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి.
ఆర్టికల్ 47: ప్రజారోగ్యాన్ని సంరక్షించాలి. మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలను నిషేధించాలి. మద్య నిషేధాన్ని గుజరాత్, బిహార్‌లు అమలు చేస్తున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో 1954లో, ఆంధ్రప్రదేశ్‌లో 1994లో మద్యపాన నిషేధం విధించారు.
ఆర్టికల్ 48: వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలి. పశుపోషణను పెంపొందించాలి. గోవధను నిషేధించాలి. ఉత్పాదకతను పెంచేందుకు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి. ఎరువులు, విత్తనాలను పంపిణీ చేయాలి.
ఆర్టికల్ 48(ఎ): వన్యమృగాలను, అడవులను సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలి. 1974లో కాలుష్య నియంత్రణ చట్టాన్ని, 1980లో అడవుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు.
ఆర్టికల్ 49: భారతదేశ ఉన్నత సంస్కృతిని, వారసత్వాన్ని, చారిత్రక ప్రదేశాలను సంరక్షించాలి. చారిత్రక ప్రదేశాల పరిరక్షణ చట్టాన్ని 1958లో రూపొందించారు. కేంద్ర సంగీత, సాహిత్య అకాడమీలను ఏర్పాటు చేశారు.

ఉదారవాద సూత్రాలు

ఆర్టికల్ 44, 45, 50, 51
ఆర్టికల్ 44: భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రైస్తవులందరికీ ఒకే రకమైన.. అంటే ఉమ్మడి పౌరస్మృతిని ఏర్పాటు చేయాలి. దీన్ని అమలు చేయాలని 1952, 1985, 1995, 1997, 2004లో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆజ్ఞాపించింది. కానీ అమలు జరగలేదు. దీన్ని అమలు పరుస్తున్న ఏకైక రాష్ట్రం గోవా. సరళాముద్గల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1995) కేసులో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు తీసుకున్న చర్యలకు సంబంధించి 'అఫిడవిట్' దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆజ్ఞాపించింది.
ఆర్టికల్ 45: ఆరేళ్లలోపు బాలబాలికలకు పౌష్టికాహారం అందించాలి. శిశు, పూర్వ శిశు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దీన్ని 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
ఆర్టికల్ 50: న్యాయశాఖ ప్రతిపత్తిని కాపాడేందుకు కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలి.
ఆర్టికల్ 51: అంతర్జాతీయ శాంతి సంరక్షణకు కృషి చేయాలి.
51(ఎ): అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించాలి.
51(బి): ఇతర దేశాలతో గౌరవప్రదమైన సత్సంబంధాలను కొనసాగించాలి.
51(సి): అంతర్జాతీయ న్యాయసూత్రాలను, అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించేలా చూడాలి.
51(డి): అంతర్జాతీయ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలి.
ప్రపంచ శాంతి స్థాపనకు 30-10-1945న ఐక్యరాజ్య సమితిలో 52వ సభ్యదేశంగా, 1949లో కామన్వెల్త్‌లో భారత్ చేరింది. ప్రచ్ఛన్న యుద్ధం నుంచి ప్రపంచాన్ని విముక్తం చేసేందుకు 1961 అలీన విధానంలో కీలకపాత్ర పోషించింది. దక్షిణ మధ్య ఆసియా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు 1985లో సార్క్ ఏర్పాటుకు చొరవ చూపింది.

ఆదేశిక సూత్రాల్లో చేర్చిన అదనపు అంశాలు

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 39(ఎ), 43(ఎ), 48(ఎ) చేర్చారు.
2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉచిత నిర్బంధ విద్యను తొలగించి, ఆర్టికల్ 45లో ఆరేళ్లలోపు బాల బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలి అనే అంశాన్ని చేర్చారు. 2011లో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా 43(బి) చేర్చి సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా కల్పించారు.

రాజ్యాంగంలోని ఇతర భాగాల్లో గల ఆదేశిక సూత్రాలు

4వ భాగంలోనే కాకుండా ఇతర భాగాల్లో మరికొన్ని ఆదేశిక సూత్రాలను చేర్చారు. 16వ భాగంలోని ఆర్టికల్ 335 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించాలి. 17వ భాగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అందించాలి. 17వ భాగంలోని ఆర్టికల్ 351 ప్రకారం హిందీని జాతీయభాషగా గుర్తించి అమలు చేయాలి.

ఆదేశిక సూత్రాలపై ప్రముఖుల వ్యాఖ్యలు

- ఆదేశిక సూత్రాలు సక్రమంగా అమలైతే భారతదేశం అనతి కాలంలోనే భూతలస్వర్గం అవుతుంది. - ఎంసీ చాగ్లా
- ఆదేశిక సూత్రాలు ఒక బ్యాంకు తనకు అనుగుణంగా చెల్లించే చెక్కు వంటివి. - ప్రొ. కేటీ షా
- అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడమే ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం. - పీబీ గజేంద్ర గడ్కర్
- ఆదేశిక సూత్రాలు వైవిధ్య సెంటిమెంట్లతో కూడి న ఒక చెత్తబుట్ట వంటివి. - టీటీ కృష్ణమాచారి
- ఆదేశిక సూత్రాలు ఆర్థిక ప్రజాస్వామ్యానికి మంచి మార్గం. - డాక్టర్ బీఆర్ అంబేద్కర్
- నిర్దేశిక నియమాలు ప్రతి కొత్త సంవత్సరం ప్రారంభం రోజున చేసుకునే తీర్మానాల వంటివి. అవి జనవరి 2వ తేదీనే భంగమవుతాయి. - నసీరుద్దీన్ షా
- నిర్దేశిక నియమాలు నైతిక ప్రవచనాలు. అధికారులు, ప్రభుత్వం వీటిని గౌరవించాలి. - బీఎన్ రావు

డిఫ్తీరియా వ్యాధి పొదిగే కాలం ఎంత?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. బొద్దింకలో శ్వాసక్రియ దేని ద్వారా జరుగుతుంది?
ఎ) ట్రాఖియా బి) గిల్స్
సి) లంగ్స్ డి) చర్మం
2. మానవుడిలో మాస్టర్‌గ్లాండ్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైరాయిడ్ బి) పిట్యూటరీ
సి) పాంక్రియాస్ డి) గోనాడ్స్
3. విటమిన్లు అన్నీ కిందివాటిలో ఏ రకానికి చెందుతాయి?
ఎ) కార్బోహైడ్రేట్లు బి) కొవ్వులు
సి) ప్రొటీన్లు డి) పాలిశాఖరైడ్లు
4. పాలలో ఉండే చక్కెర ఏది?
ఎ) సుక్రోస్ బి) ఫ్రక్టోస్
సి) లాక్టోస్ డి) గాలక్టోస్
5. కొవ్వులను కొవ్వు ఆమ్లాలుగా మార్చే ఎంజైమ్ ఏది?
ఎ) లైపేజ్ బి) అమిలాప్సిన్
సి) ఇరిప్సిన్ డి) ట్రిప్సిన్
6. 'మార్సూపియం' ఏ జీవిలో కనిపిస్తుంది?
ఎ) చింపాంజి బి) జింక
సి) ప్లాటిపస్ డి) కంగారు
7. వానపాములు ఏ వర్గానికి చెందుతాయి?
ఎ) ఆర్థ్రోపొడా బి) అనిలిడా
సి) మొలస్కా డి) ఎఖైనోడెర్మెట
8. గర్భావధి కాలం వేటిలో ఉంటుంది?
ఎ) చేపలు బి) క్షీరదాలు
సి) ఉభయచరాలు డి) పక్షులు
9. పుట్టగొడుగులు అనేవి ....?
ఎ) శైవలాలు బి) శిలీంద్రాలు
సి) లైకెన్లు డి) ఏదీకాదు
10. కిణ్వన ప్రక్రియలో తోడ్పడే శిలీంధ్రం ఏది?
ఎ) రైజోపస్ బి) అల్బుగో
సి) శాఖరోమైసిస్ డి) పక్సీనియా
11. మొక్కల్లో ఫలం దేని నుంచి ఏర్పడుతుంది?
ఎ) అండం బి) అండాశయం
సి) కీలాగ్రం డి) కేసరావళి
12. పుష్పాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) జెరంటాలజీ బి) స్పెర్మటాలజీ
సి) ఆంథాలజీ డి) సిరాలజీ
13. వేరుశనగలో ఫలం ఏ రకానికి చెందింది?
ఎ) కార్సురూలస్ బి) జియోకార్ప్
సి) హెస్పరీడియం డి) పోమ్
14. అతిపెద్ద పుష్పం ఏది?
ఎ) లిమ్నా బి) లొడేసియా
సి) రఫ్లీషియా డి) అరటి
15. సారవంతమైన నేలలేవి?
ఎ) ఇసుక నేలలు బి) నల్లటి నేలలు
సి) లోమ్ నేలలు డి) ఎర్ర నేలలు
16. కిందివాటిలో మొక్కలకు ఆవశ్యకమైన మూలకం కానిది ఏది?
ఎ) Na బి) N సి) Mg డి) K
17. కిందివాటిలో వేటిని ఇసుక మొక్కలు అంటారు?
ఎ) క్రయోఫైట్స్ బి) సమ్మోఫైట్స్
సి) జీరోఫైట్స్ డి) హాలోఫైట్స్
18. గొర్రెల్లో స్క్రేపీ వ్యాధి వేటి వల్ల కలుగుతుంది?
ఎ) వైరాయిడ్స్ బి) ప్రియాన్స్
సి) వైరస్ డి) బ్యాక్టీరియా
19. వేరుశనగలో టిక్కా తెగులును కలిగించేది?
ఎ) కొలిటోట్రైఖం బి) పైరిక్యులేరియా
సి) సెర్కోస్పొరా డి) ఫైటాఫ్‌థొరా
20. పత్ర సంబంధ మొగ్గలు వేటిలో కనిపిస్తాయి?
ఎ) బ్రయోఫిల్లం బి) కరివేపాకు
సి) పిస్టియా డి) గన్నేరు
21. 'మలకబలం' ఏ జీవిలో కనిపిస్తుంది?
ఎ) ఏనుగు బి) కంగారు
సి) కుందేలు డి) ఎలుగుబంటి
22. మానవుడి దంతాల్లో అగ్రచర్వణకాలు ఎన్ని ఉంటాయి?
ఎ) 4 బి) 8 సి) 12 డి) 2
23. హెర్మాఫ్రొడైట్ (ఉభయలైంగికత) దేనిలో కనిపిస్తుంది?
ఎ) ఏనుగు బి) బల్లి
సి) వానపాము డి) పిల్లి
24. తులసి మొక్కలో లభ్యమయ్యే ఔషధం?
ఎ) కాంపర్ బి) క్వినైన్
సి) ఓపియం డి) ఏదీకాదు
25. 'కటిల్ ఫిష్' ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) పొరిఫెరా బి) సీలెంటరేటా
సి) మొలస్కా డి) ఎఖైనోడెర్మెట
26. చేపల్లో శ్వాసక్రియ వేటి ద్వారా జరుగుతుంది?
ఎ) ఊపిరితిత్తులు బి) మొప్పలు
సి) చర్మం డి) పైవన్నీ
27. సాలీడులో ఎన్ని జతల కాళ్లు ఉంటాయి?
ఎ) 4 బి) 3 సి) 8 డి) 16
28. ఊపిరితిత్తుల చుట్టూ ఉండే పొర ఏది?
ఎ) పెరికార్డియం బి) ప్లూరా
సి) మెనింజస్ డి) ఏదీకాదు
29. 'పైరిథ్రిన్'ను దేని నుంచి తయారుచేస్తారు?
ఎ) అలోవెరా బి) క్రిసాంథియం
సి) అకేసియా డి) కేసియా
30. తెలంగాణ రాష్ట్ర పుష్పం ఏది?
ఎ) తామర బి) జమ్మి
సి) తంగేడు డి) వేప
31. వానపాముల పెంపకాన్ని ఏమంటారు?
ఎ) సెరికల్చర్ బి) పిసికల్చర్
సి) వర్మికల్చర్ డి) ఆక్వాకల్చర్
32. వేగంగా ఎగిరే పక్షి ఏది?
ఎ) కివీ బి) పెంగ్విన్
సి) హమ్మింగ్ బర్డ్ డి) స్విఫ్ట్
33. స్కేబిస్ అనే చర్మ వ్యాధి ముఖ్య లక్షణం?
ఎ) చర్మం పొరలు, పొరలుగా రాలిపోవడం
బి) చర్మంలో బొరియలు పడటం
సి) చర్మంలోని స్వేదగ్రంథులు పనిచేయక పోవడం
డి) చర్మం నల్లబారడం
34. గజ్జి దేని వల్ల వస్తుంది?
ఎ) కీటకాలు బి) ఫంగస్
సి) బ్యాక్టీరియా డి) వైరస్
35. గజికర్ణ (తామర వ్యాధి)కి కారణం ఏది?
ఎ) బ్యాక్టీరియా బి) వైరస్
సి) ఫంగస్ డి) ప్రోటోజోవా
36. చర్మంపై ఉండే వెంట్రుకలు నల్లగా ఉండటానికి కారణమేమిటి?
ఎ) అధిక కెరాటిన్ బి) అధిక మెలనిన్
సి) తక్కువ మెలనిన్
డి) ఏదీకాదు
37. వెంట్రుకల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) ట్రైకాలజీ బి) డెర్మటాలజీ
సి) హెమటాలజీ డి) జెరంటాలజీ
38. 'ఎఖిని' ఏ రకమైన వ్యాధి?
ఎ) కాలేయ సంబంధ వ్యాధి
బి) గుండె సంబంధ వ్యాధి
సి) చర్మ సంబంధ వ్యాధి
డి) ఎముకల సంబంధ వ్యాధి
39. వ్యాధులు-వాటి వల్ల ప్రభావితమయ్యే అవయవాలను సరైన క్రమంలో జతపరచండి.
1. డెర్మటైటిస్ A. కండరాలు
2. టెటానస్ B. కన్ను
3. పయోరియా C. పన్ను
4. గ్లకోమా D. చెవి
E. చర్మం
ఎ) 1-E, 2-B, 3-C, 4-A
బి) 1-E, 2-A, 3-C, 4-B
సి) 1-E, 2-A, 3-B, 4-C
డి) 1-E, 2-A, 3-C, 4-B
40. 'కీళ్లవాతం'ను నయం చేయడానికి దేని విషాన్ని ఔషధంగా తయారుచేస్తారు?
ఎ) పాము బి) తేలు
సి) తేనెటీగలు డి) కందిరీగ
41. ఏ మొక్క నుంచి లభించే ఔషధాన్ని గుండె జబ్బులను నయం చేయడానికి ఉపయోగిస్తారు?
ఎ) యూకలిప్టస్ బి) సింకోనా
సి) వేప డి) డిజిటాలిస్
42. లావెండర్ మొక్కకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
ఎ) సుగంధ ద్రవ్యాన్ని ఇస్తుంది
బి) సువాసన ఇస్తుంది
సి) ఔషధ మొక్క
డి) వంటనూనెను ఇచ్చే మొక్క
43. ప్రపంచంలో అతి పురాతనమైన నార ఏది?
ఎ) జనుము బి) గోగునార
సి) కిత్తనార డి) పత్తి
44. ఏ జాతి గొర్రెల నుంచి శ్రేష్ఠమైన తోలు లభిస్తుంది?
ఎ) కోరిడేల్ బి) మెరినో
సి) కారాకుల్
డి) దక్కను జాతి గొర్రెలు
45. ఇండియన్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) కోల్‌కతా
సి) కటక్ డి) పుణే
46. కిందివాటిలో కూరగాయలను నిల్వ ఉంచే పద్ధతి ఏది?
ఎ) వడబోయడం బి) నిర్జలీకరణం
సి) పొగబెట్టడం డి) ఘనీభవించడం
47. బోల్‌గార్డ్ పత్తి విత్తనాల తయారీలో ఉపయోగించే బ్యాక్టీరియా ఏది?
ఎ) బాసిల్లస్ బి) కోకస్
సి) స్పైరిల్లం డి) విబ్రియో
48. అమీబియాసిస్ వ్యాధిని కలిగించేది ఏది?
ఎ) అస్కారిస్ లుంబ్రికాయిడిస్
బి) పెంటిమా పోస్టుమా
సి) ఎంటమీబా హిస్టారిటికా
డి) ఉచరేరియా బ్రాంకాఫ్టి
49. O.R.S. ద్రావణంలో చక్కెర, ఉప్పు మిశ్రమాల నిష్పత్తి?
ఎ) 3 : 1 బి) 1 : 3
సి) 1 : 1 డి) 3 : 3
50. టెటానస్ (ధనుర్వాతం) ఏ రకమైన వ్యాధి?
ఎ) ఎయిర్ బోర్న్ బి) వాటర్ బోర్న్
సి) సాయిల్ బోర్న్ డి) ఏదీకాదు
51. డిఫ్తీరియా వ్యాధి పొదిగే కాలం ఎంత?
ఎ) 2-10 రోజులు బి) 2-5 రోజులు
సి) 5-15 రోజులు డి) 11-20 రోజులు
52. కిందివాటిలో వైరస్ వ్యాధి కానిది ఏది?
ఎ) పోలియో బి) జలుబు
సి) కోరింతదగ్గు డి) హైడ్రోఫోబియా

సమాధానాలు

1) ఎ	2) బి	3) సి	4) సి	5) ఎ
6) డి	7) బి	8) బి	9) బి	10) సి
11) బి	12) సి	13) బి	14) సి	15) సి
16) ఎ	17) బి	18) బి	19) సి	20) ఎ
21) సి	22) బి	23) సి	24) ఎ	25) సి
26) బి	27) ఎ	28) బి	29) బి	30) సి
31) సి	32) డి	33) బి	34) ఎ	35) సి
36) బి	37) ఎ	38) సి	39) డి	40) సి
41) డి	42) బి	43) డి	44) సి	45) సి
46) బి	47) ఎ	48) సి	49) ఎ	50) సి
51) బి	52) సి			

విద్య, ఉద్యోగ సమాచారం

టిస్, ముంబైలో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-01, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30.09.2025 నాటికి పోస్టును అనుసరించి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు రూ.35,000, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌కు రూ.25,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.11.2025
» **వెబ్‌సైట్:** http://https/tiss.ac.in

డిజిటల్ ఇండియా కార్పొరేషన్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన ఫుల్‌స్టాక్ డెవలపర్(ఏఐ-వెబ్ అప్లికేషన్స్), బిజినెస్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** ఫుల్ స్టాక్ డెవలపర్(ఏఐ-వెబ్ అప్లికేషన్స్)-02, బిజినెస్ అనలిస్ట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ/బీఈ/బీటెక్/ఎంబీఏలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.11.2025
» **వెబ్‌సైట్:** https://dic.gov.in

డిజిటల్ ఇండియా కార్పొరేషన్, న్యూఢిల్లీలో డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన డిప్యూటీ జనరల్ మేనేజర్-స్టార్టప్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, పీజీ(బిజినెస్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2025
» **వెబ్‌సైట్:** https://dic.gov.in

నిట్ పాట్నాలో జేఆర్ఎఫ్‌లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) పాట్నాలో ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్‌ఫెలో(జేఆర్ఎఫ్)లు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీటెక్, ఎంటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి. గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2025
» **వెబ్‌సైట్:** https://www.nitp.ac.in

ఐఐటీ మద్రాస్‌లో అడ్మినిస్ట్రేటివ్-ఐటీ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) మద్రాస్ ఒప్పంద ప్రాతిపదికన అడ్మినిస్ట్రేటివ్-ఐటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.75,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.11.2025
» **వెబ్‌సైట్:** https://icsrstaff.iitm.ac.in

జిప్‌మర్‌లో ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1 పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్)..ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25.11.2025 నాటికి 35ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.67,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.11.2025
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

దేశంలోని ప్రధాన పారిశ్రామిక మండలాలు

పారిశ్రామిక మండలాలు

ఒక భౌగోళిక ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న పారిశ్రామిక వస్తువుల విలువ, వసూలవుతున్న కార్పొరేట్ సుంకాల విలువ, వినియోగమవుతున్న విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక ఉపాధి పరిమాణం మొదలైన సూచికల ఆధారంగా పారిశ్రామిక మండలాలను గుర్తించవచ్చు. భారతదేశంలో ఆరు ప్రధాన పారిశ్రామిక మండలాలు ఉన్నాయి. అవి:

- ముంబై-పుణె మండలం
- హుగ్లీ బేసిన్ మండలం
- చోటా నాగపూర్ మండలం
- ఢిల్లీ-ఆగ్రా-మధుర మండలం
- అహ్మదాబాద్-వడోదర మండలం
- చెన్నై-మధురై-కోయంబత్తూరు మండలం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

ముంబై-పుణె మండలం

ముంబై-పుణె, హుగ్లీ బేసిన్ మండలాలు స్వాతంత్ర్యానికి ముందే అభివృద్ధి చెందాయి. మిగతా నాలుగు మండలాలు ప్రధానంగా స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెందాయి. మహారాష్ట్రలో విస్తరించిన ముంబై-పుణె మండలం దేశంలోకెల్లా అతిపెద్ద, అత్యాధునిక పారిశ్రామిక మండలం. స్వాతంత్ర్యానికి పూర్వమే నూలు వస్త్ర పరిశ్రమ స్థాపనతో ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. ఇప్పటికీ నూలు వస్త్ర పరిశ్రమను ఈ మండలానికి వెన్నుముకగా పేర్కొనవచ్చు.

స్వాతంత్ర్యం తర్వాత ఈ మండలంలో పారిశ్రామిక వైవిధ్యం సంభవించింది. ఆటోమొబైల్, చమురు శుద్ధి, కాగితం, ఇంజనీరింగ్, రసాయనాలు తదితర పరిశ్రమలు ఇక్కడ అభివృద్ధి చెందాయి. ముంబై మెట్రోపాలిటన్ నగరం ఈ పారిశ్రామిక మండల కేంద్రం. కళ్యాణ్, పుణె, కొల్హాపూర్, ఉలాస్‌పూర్, థానే, నాగాథానే, ట్రాంబే మొదలైన పారిశ్రామిక పట్టణాలు ఈ మండలం కిందకు వస్తాయి.

ముంబై రేవుపట్టణం, సహ్యాద్రి కొండల్లోని జలవిద్యుచ్ఛక్తి సామర్థ్యం, పటిష్టమైన రవాణా వ్యవస్థ, బ్యాంకింగ్ రంగం, స్థానిక పెట్టుబడి సామర్థ్యత, రాష్ట్ర ప్రభుత్వ ఉదారవాద విధానాలు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి దోహదం చేస్తున్న అనుకూలాంశాలు. విపరీతంగా పెరుగుతున్న భూమి ధరలు, కాలుష్యం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి.

హుగ్లీ బేసిన్ మండలం

స్వాతంత్ర్యానికి పూర్వమే కలకత్తా నగర పరిసర ప్రాంతాల్లో హుగ్లీ బేసిన్ పారిశ్రామిక మండలం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. కలకత్తా నదీరేవు పట్టణం కావడం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధి ప్రాథమిక దశలో కీలక పాత్ర పోషించింది.

మొదట జనపనార పరిశ్రమ అభివృద్ధితో ప్రారంభమై క్రమంగా ఆటోమొబైల్, భారీ యంత్ర పరికరాలు, వినిమయ వస్తువులు, రసాయనాలు, కాగితం, పెట్రో రసాయన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. హౌరా, డమ్‌డమ్, సాల్ట్ లేక్ సిటీ, రిస్రా, ఆగర్‌పారా, సెరామ్‌పూర్, చందర్ నాగోర్, ఫోర్ట్‌గ్లాస్టర్, లీలూ, బడ్జ్ బడ్జ్ ఆసన్‌సోల్, హల్దియా మొదలైనవి ఈ బేసిన్‌లో ముఖ్య పారిశ్రామిక పట్టణాలు.

దేశంలో మొదటి జనపనార కర్మాగారాన్ని రిస్రాలో స్థాపించారు. సమీపంలోని ఝరియా, రాణిగంజ్ బొగ్గు క్షేత్రాలు, జల రవాణా వ్యవస్థలు, అధిక జనసాంద్రత, కలకత్తా రేవుపట్టణం ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి దోహదం చేశాయి. రేవులో పూడిక సమస్య, తీవ్రమైన పారిశ్రామిక వివాదాలు, అతివాద ట్రేడ్ యూనియన్ ధోరణులు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధికి ఇటీవల ప్రధాన అడ్డంకులుగా మారాయి. దీంతో ఈ పారిశ్రామిక మండల అభివృద్ధి కుంటుపడింది.

చోటానాగపూర్ మండలం

ఇది దేశంలోని ఏకైక ఖనిజాధారిత పారిశ్రామిక మండలం. చోటానాగపూర్ పీఠభూమిలో పరిశ్రమలకు అవసరమైన ఖనిజ నిల్వలు విస్తారంగా ఉన్నాయి. దామోదర్ నదీలోయలోని బొగ్గు క్షేత్రాలు (బొకారో, గిర్డి, ఝరియా), హజారీబాగ్-సింగ్‌భమ్ ప్రాంతాల్లోని ఇనుము, బాక్సైట్, రాగి మొదలైన లోహ ఖనిజాలు పరిశ్రమలను ఆకర్షించాయి. గనుల తవ్వకం ఈ మండలంలో పెద్ద పరిశ్రమగా రూపొందింది. భారత ప్రభుత్వం స్థాపించిన వివిధ భారీ ప్రభుత్వ రంగ కర్మాగారాలు ఈ పారిశ్రామిక మండల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాయి. రాంచీలోని హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (HEC), సింద్రీలోని ఎరువుల కర్మాగారం (FCI), బరేనీలోని చమురు శుద్ధి కర్మాగారాలను ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇవేకాకుండా సిమెంట్ కర్మాగారాలు (చేబాసా), ఇనుము- ఉక్కు కర్మాగారాలు (బొకారో, జంషెడ్‌పూర్) ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందాయి. పటిష్టమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థలు లేకపోవడం ఈ మండలం అభివృద్ధికి ప్రధాన ఆటంకం. ఈ పారిశ్రామిక మండలంలోని భారీ ప్రభుత్వ రంగ సంస్థలకు అనుసంధానాలు లేకపోవడం వల్ల స్థానిక పారిశ్రామిక పట్టణాలు సమగ్ర ప్రాంతీయాభివృద్ధికి ఉపకరించడంలో విఫలమయ్యాయి. పారిశ్రామికాభివృద్ధి స్థానికులకు ఉపాధి చూపలేకపోయింది.

ఢిల్లీ-ఆగ్రా-మధుర మండలం

ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరం కేంద్రంగా 1970వ దశకం నుంచి పారిశ్రామికాభివృద్ధి ప్రారంభమైందని చెప్పవచ్చు. ప్రధాన రైలు మార్గాలు, జాతీయ రహదారులు ఢిల్లీ నగరంలో అభిసరణం చెందడం, విస్తార స్థానిక మార్కెట్, సమీపంలోని సారవంతమైన వ్యవసాయ ప్రాంతం ఈ మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. వ్యవసాయాధార పరిశ్రమలైన చక్కెర, నూలు వస్త్రాల తయారీతో ప్రారంభమై క్రమంగా పారిశ్రామిక వైవిధ్యం ఏర్పడింది. ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరంలో కాల్కా, షాదారా, నోయిడా, గుర్గావ్ ప్రాంతాల్లో ఆటోమొబైల్, ఇంజనీరింగ్, వినిమయ వస్తువుల తయారీ కేంద్రీకృతమైంది. ఆగ్రా, మధుర, ఘజియాబాద్, యమునానగర్ మొదలైనవి ఇతర పారిశ్రామిక కేంద్రాలు.

అహ్మదాబాద్-వడోదర మండలం

గుజరాత్‌లోని అహ్మదాబాద్-వడోదర మండలంలో పారిశ్రామికాభివృద్ధి 1970వ దశకం నుంచి వేగం పుంజుకుంది. అహ్మదాబాద్, వడోదర, సూరత్, రాజ్‌కోట్, జామ్‌నగర్, వల్సాస్, ఆనంద్, భరోచ్ ఈ ప్రాంతంలోని పారిశ్రామిక పట్టణాలు. నూలు వస్త్రాలు, చమురు శుద్ధి, పెట్రో రసాయనాలు, ఇంజనీరింగ్, సిమెంట్ మొదలైన పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. 'వడోదర'ను భారతదేశ పెట్రో రసాయనాల రాజధానిగా అభివర్ణిస్తారు. కంబత్ సింధు శాఖలో బయల్పడిన చమురు, సహజ వాయు నిక్షేపాలు, సారవంతమైన కథియావాడ్ వ్యవసాయ ప్రాంతం, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఈ మండల అభివృద్ధికి దోహదం చేశాయి.

చెన్నై - మధురై - కోయంబత్తూరు మండలం

తమిళనాడులో పారిశ్రామికాభివృద్ధి మొదట చెన్నై పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. దీనికి చెన్నై రేవుపట్టణం ఉపయోగపడింది. మెట్టూరు, శివ సముద్రాల్లో జలవిద్యుచ్ఛక్తి, రవాణా సౌకర్యాల అభివృద్ధి, నైపుణ్యం ఉన్న శ్రామికుల లభ్యత ఈ మండలానికి అనుకూలించే అంశాలు. కోయంబత్తూరులో నూలు వస్త్ర పరిశ్రమలు కేంద్రీకృతమవడంతో ఈ నగరం 'దక్షిణ భారత మాంచెస్టర్'గా అవతరించింది. ఇక్కడ ఇంజనీరింగ్, సిమెంటు పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాయి. మధురై, ఈరోడ్, తిరుప్పూర్, సేలం మొదలైనవి ఇతర పారిశ్రామిక పట్టణాలు

దేశంలో దుర్భిక్షానికి 3 కారణాలు!

దేశంలో ప్రధానంగా మూడు రకాల కారణాల వల్ల దుర్భిక్షం ఏర్పడే అవకాశాలున్నాయి.

అవి

1. శీతోష్ణస్థితి సంబంధ కారణాలు
2. హైడ్రోలాజికల్ కారణాలు
3. మానవ జోక్యం

శీతోష్ణస్థితి సంబంధ కారణాలు

శీతోష్ణస్థితి పరంగా దుర్భిక్షానికి కారణాలు..

ఎ) నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించడం

బి) నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయం కంటే ముందే తిరోగమించడం

సి) నైరుతి రుతుపవనాల్లో అంతరాయం

సాధారణంగా జూన్ ఒకటో తేదీకల్లా నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకి జూలై 15కల్లా దేశమంతటా విస్తరిస్తాయి. కానీ కొన్నిసార్లు రుతుపవనాలు ఆలస్యంగా రావడం, నెమ్మదిగా విస్తరించడం వల్ల వర్షపాత పరిమాణం తగ్గి దుర్భిక్షం ఏర్పడుతుంది. కొన్ని సందర్భాల్లో నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయానికే చేరినప్పటికీ, మధ్యలో అంతరాయం ఏర్పడుతుంది. రుతుపవనాలు క్రియాశీలకంగా ఉండని దశ 15-20 రోజుల కంటే ఎక్కువగా ఉంటే దుర్భిక్షానికి దారితీస్తుంది. ముఖ్యంగా జూలైలో రుతుపవనాలు క్రియాశీలకంగా లేకపోవడం లేదా అంతరాయం సంభవిస్తే ఖరీఫ్‌లో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఇది 'వ్యవసాయ దుర్భిక్షానికి' దారి తీస్తుంది.

సాధారణంగా అక్టోబర్ రెండో వారంకల్లా నైరుతి రుతుపవనాలు దేశం నుంచి తిరోగమిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఇవి సెప్టెంబర్ మొదటి వారానికే తిరోగమిస్తాయి. దీంతో వర్షపాత పరిమాణం తగ్గి దుర్భిక్షం సంభవిస్తుంది. అనేక సంక్లిష్ట అంశాల వల్ల రుతుపవనాల్లో అనిశ్చితి ఏర్పడుతుంది. ఎల్‌నినో, ఈక్వినూ లాంటి దృగ్విషయాలతో పాటు అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో స్థానికంగా ఏర్పడే అధిక పీడన మండలాలు, హిమాలయాల్లోని మంచు, గ్లోబల్ వార్మింగ్ లాంటి అంశాలు నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుండటంతో దుర్భిక్షం తలెత్తుతోంది.

హైడ్రోలాజికల్ కారణాలు

కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం సరిపడా ఉన్నప్పటికీ హైడ్రోలాజికల్ కారణాల వల్ల అనావృష్టి ఏర్పడవచ్చు. ఉదాహరణకు చోటా నాగపూర్ పీఠభూమికి చెందిన జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో 100 సెం.మీ.కు పైగా వర్షం కురుస్తుంది. కానీ పురూలియా, పలమావు, బొలంగీర్, కాళహంది ప్రాంతాల్లో తరచుగా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కురిసిన వర్షపు నీటిని ఉపరితలంపై నిల్వ ఉంచే భూస్వరూపాలు లేకపోవడంతో వర్షపు నీరు వృథాగా సముద్రంలోకి చేరుతోంది. నైసర్గిక స్వరూపం కఠిన శిలలతో కూడి ఉండటం వల్ల వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకిపోవడం చాలా తక్కువ. దీంతో భూగర్భ జలాలు కూడా ఎక్కువ లోతులో ఉండి అనావృష్టి ప్రభావం తీవ్రమవుతోంది.

మానవ జోక్యం

ఇటీవల దుర్భిక్ష ప్రాంతాల సంఖ్య మరింతగా పెరుగుతోంది. దుర్భిక్షం తరచుగా సంభవిస్తోంది. కరవు తీవ్రత కూడా అధికమవుతోంది. పర్యావరణంలో మానవ జోక్యమే దీనికి కారణమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధునాతన పద్ధతిలో భారీ యంత్రాలను విరివిగా ఉపయోగించి వ్యవసాయ, నిర్మాణ కార్యకలాపాలను చేపడుతుండటం వల్ల ఉపరితల ప్రవాహ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది. దీంతో ఉపరితల జలవనరులు కుచించుకుపోయి అనావృష్టి సమస్య అధికమవుతోంది. అడవులను విచక్షణారహితంగా నరికివేయడంతో జలాలు ఇంకిపోయే రేటు తగ్గి భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. కరవు పీడిత ప్రాంతాల్లో అధిక నీటి వసతి అవసరమయ్యే పంటల సాగు వల్ల కూడా అనావృష్టి సంభవిస్తోంది. గత రెండు దశాబ్దాల నుంచి సంభవిస్తోన్న దుర్భిక్షం ప్రధానంగా మానవ ప్రేరేపితమైందని శాస్త్రవేత్తల అభిప్రాయం.

దేశంలో సుమారు 40 శాతం భౌగోళిక ప్రాంతాన్ని దుర్భిక్ష పీడిత ప్రాంతంగా వర్గీకరించారు. ఇరిగేషన్ కమిషన్ మొదటిసారిగా దుర్భిక్షాన్ని నిర్వచించి, దుర్భిక్ష పీడిత ప్రాంతాలను గుర్తించింది. 50 సెం.మీ. కంటే తక్కువ సగటు వార్షిక వర్షపాతాన్ని పొందుతూ వర్షపాత పరిమాణంలో 50 శాతం కంటే ఎక్కువ విచలనం ఉన్న ప్రాంతాలను కరవు పీడిత ప్రాంతాలుగా గుర్తించారు. అయితే ఇటీవల దుర్భిక్ష పీడిత ప్రాంతాలను గుర్తించడానికి పంటల దిగుబడుల్లో క్షీణత, సాగు భూమి విస్తీర్ణంలో క్షీణతలనూ ప్రాతిపదికగా తీసుకుంటున్నారు.

పశ్చిమ రాజస్థాన్, ఉత్తర గుజరాత్‌లోని కచ్ ప్రాంతాలను నిరంతర అనావృష్టి పీడిత ప్రాంతాలుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతాల్లో సగటు వార్షిక వర్షపాతం 30 సెం.మీ. కంటే తక్కువగా ఉంటుంది. విచలనం 70 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. సహ్యాద్రి పర్వత వర్షచ్ఛాయా ప్రాంతం తీవ్ర దుర్భిక్ష పీడిత మండలం కిందకు వస్తుంది. మరాట్వాడా, విదర్భ (మహారాష్ట్ర), ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమలు ఈ మండలం కిందకు వస్తాయి. జార్ఖండ్‌లోని పలమావు, పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా, ఒడిశాలోని బొలంగీర్, కాళహంది, మధ్యప్రదేశ్‌లోని జబువా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బుందేల్‌ఖండ్ ప్రాంతాలను ఓ మోస్తరు అనావృష్టి పీడిత ప్రాంతాలుగా గుర్తించారు.

Rising rental rates force the middle class..

Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. As more and much people invest their money in savings certificates or money-market funds (1)/ in order to earn higher interest, (2)/ they are abandoning traditional low-interest investment havens (3)/ such as passbook accounts and life insurance policies. (4)/ No error. (5)
2. Rising rental rates force the middle class to use (1)/ far more than the standard 25 percent of their incomes (2)/ for housing, leaving them with know equity (3)/ or tax write-offs to offset the expenditures. (4)/ No error. (5)
3. Astronomers studying(1)/ the newly discovered star (2)/ said that it provides clues about (3)/ our galaxy's origin. (4)/ No error. (5)
4. According to some economists, (1)/ the June decrease in unemployment suggest (2)/ that the gradual improvement (3)/ in the job market is continuing. (4)/ No error (5)
5. The qualities of a great leader are (1)/ coolness in the face of danger, (2)/ an excellent sense of strategy, (3)/ and a ability to plan in minute detail. (4)/ No error. (5)

Directions: (Q. No. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given **bold** in the sentence to make it grammatically correct? Mark (5) "No correction required" as your answer, If there is no error.

6. Aging **is a property** of all animals that reach a fixed size at maturity.
   1) was a property
   2) had been a property
   3) was being a property
   4) is being a property
   5) No correction required
7. All-terrain vehicles have allowed vacationers to reach many previously inaccessible areas, but they **have been blamed** for causing hundreds of deaths.
   1) have also been blamed
   2) have been also blamed
   3) have been blamed also
   4) have been blaming
   5) No correction required
8. Although fruit can no longer grow once it is picked, it continues for some time to respire, **taking in oxygen and giving often** carbon dioxide.
   1) taking in oxygen and giving of
   2) taking in oxygen and giving always
   3) taking in oxygen and giving off
   4) taking out oxygen and giving off
   5) No correction required
9. Amateur astronomers with good telescopes **should been able to** see the comet within the next few weeks.
   1) should be able
   2) would be abled
   3) should being able
   4) should belonging
   5) No correction required
10. As the price of oil rises, the prices of bread and livestock feed **sure to increases.**
    1) are sure to increased
    2) are sure to increasing
    3) are sure to be increase
    4) are sure to increase
    5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The coordination of monetary policy can help ____ the orderly financing of _____imbalances.
    1) facilitate; existing

BANK EXAMS

GENERAL ENGLISH

    2) felicitate; exciting
    3) fend; many
    4) fetch; permanent
    5) promote; promotional
12. __ the objects found in the excavated temple ___ small terra-cotta effigies left by supplicants.
    1) Below; wear
    2) Amongst; where
    3) Between; below
    4) Among; were
    5) Above; was
13. An array of tax incentives ___ to a boom in the construction of new buildings.
    1) have lead 2) has led
    3) have been lead
    4) has been leading 5) had leads
14. The yellow jacket can sting ____ without dying and ___ potent venom that can cause intense pain.
    1) repeatedly; carries
    2) repetition; carried
    3) repeat; carry
    4) repeats; carrier
    5) repeating; career
15. As envisioned by researchers, commercial farming ____ lobsters will enable fisheries to sell the shellfish year _____.
    1) from; threw 2) of; round
    3) off; through 4) with; around
    5) among; always

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. The purpose was twofold: political control and religious communication. Experts believe that there were three types of human sacrifice practiced by the Shang.

B. Finally, in internment sacrifices, young girls were sacrificed. Unlike the first two, they were buried in the standard burial position and their bodies were kept intact.

C. In pit sacrifices, young men were sacrificed. Their bodies were dismembered and they were buried without their personal possessions. In foundation sacrifices, children and babies were used.

D. The practice of human sacrifice was very common in ancient China, particularly during the Shang Dynasty-the first Chinese dynasty with written records.

E. Archaeological evidences show that these human sacrifices experienced violent deaths, and they too were buried without possessions.

F. In fact, archaeological evidence suggests that human sacrifice was practiced on a grand scale during the Shang dynasty.

16. What is the FIRST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) C
18. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Dwarf planet Ceres continues to ___ (21) scientists as NASA's Dawn spacecraft gets closer to being captured into orbit around the object. The ___ (22) images from Dawn, taken nearly 29,000 miles (46,000 kilometers) from Ceres, reveal that a bright spot that stands out in previous images ____ (23) close to yet another bright area. As scientists receive better and _____ (24) views of the dwarf planet over the next 16 months, they hope to gain a deeper understanding of its origin and evolution _____ (25) studying its surface. The intriguing bright spots and other _____ (26) features of this captivating world will come into _____ (27) focus. Dawn visited the giant asteroid Vesta _____ (28) 2011 to 2012, delivering more than 30,000 images of the body along with many other measurements, and providing insights about its composition and geological history. Vesta has an average diameter of 326 miles (525 kilometers), while Ceres has an average diameter of 590 miles (950 kilometers). Vesta and Ceres are the ___ (29) most massive bodies in the asteroid belt, located _____ (30) Mars and Jupiter.

21. 1) puzzle 2) question 3) answer 4) doubt 5) propose
22. 1) later 2) latest 3) recently 4) frequently 5) presently
23. 1) lay 2) lain 3) lies 4) lays 5) laid
24. 1) batter 2) good 3) best 4) better 5) bought
25. 1) for 2) from 3) with 4) among 5) by
26. 1) interesting 2) annoying 3) disturbing 4) distributing 5) presently
27. 1) sharer 2) sharper 3) shaver 4) sharp 5) severe
28. 1) with 2) by 3) from 4) for 5) above
29. 1) to 2) too 3) toe 4) two 5) type
30. 1) beyond besides 3) in front of 4) in addition to 5) between

Directions (Q. No. 31-35): Choose the word which is wrongly spelt from the five options given.

31. 1) misanthrope 2) misogynism 3) misappropriation 4) mismatch 5) mistake
32. 1) commission 2) apportion 3) succession 4) concession 5) profession
33. 1) adjudicite 2) judicious 3) combat 4) demur 5) elope
34. 1) flamboyant 2) genuine 3) hinderance 4) innocuous 5) germane
35. 1) kiosk 2) lacerate 3) mirege 4) nocturnal 5) opulent

Directions (Q. No. 36-37): From the five options given in each question a set of words are either synonyms or antonyms, choose that set as your option and mark your answer.

36. 1) promiscuous; preposterous
    2) oblivious; unaware
    3) procrastinate; prominent
    4) ponder; pamper
    5) None of these
37. 1) drunk; sober
    2) freeze; full
    3) transparent; triumph
    4) wax; vague 5) wealth; defeat

Directions (Q. No. 38-40): Each sentence given below has four parts, certain words in each part are given in bold to identify the mistake, and the mistake can be in the spelling or in usage. Identify the mistake and mark your answer. Mark (5) as your answer, if there is 'No error'.

38. **Alright** the stunt man (1)/ **had broken** both his legs, (2)/ he refused to **abandon his** ambulatory manner, (3)/ even if it meant he **had to crawl**. (4)
39. Nuclear power plants **have been knowing** (1)/ to emit **noxious** gases into the atmosphere; (2)/ those living in close **proximity** (3)/ may exhibit deleterious side-effects in **later** life. (4)
40. She **was amazed** to see (1)/ the hectic **hustle and bustle** (2)/ of the day **fade into** the dormant (3)/ **quite of** the night. (4)

Answers

1) 1; 2) 3; 3) 3; 4) 2; 5) 4;
6) 5; 7) 1; 8) 3; 9) 1; 10) 4;
11) 1; 12) 4; 13) 2; 14) 1; 15) 2;
16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 5;
21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5;
26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5;
31) 2; 32) 3; 33) 1; 34) 3; 35) 3;
36) 2; 37) 1; 38) 1; 39) 1; 40) 4.